www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

మంగళవారం | 25-3-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 22 సంచిక (Issue) : 356 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, ఫాల్గుణమాసం, బహుళపక్షం; తిథి: ఏకాదశి తె.3.46 తదుపరి ద్వాదశి; నక్షత్రం: శ్రవణం తె.3.49 తదుపరి ధనిష్ఠ వర్జ్యం: ఉ.8.20-9.54; అమృతఘడియలు: సా.5.41-7.14; దుర్ముహూర్తం: ఉ.8.43-9.32, రా.10.17-11.03; రాహుకాలం: మ.3.00-4.30; సూర్యోదయం: 6.18, సూర్యాస్తమయం: 6.23 | వరంగల్

Warangal | Hyderabad | Mahaboobnagar | Vijayawada | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

ఎంఎంటీఎస్‌లో అత్యాచార యత్నం

- ఒంటరి యువతిపై దుండగుడి దాష్టీకం
- భయంతో రైలు నుంచి దూకిన యువతి
- గాంధీ ఆస్పత్రికి తరలించిన రైల్వే సిబ్బంది
- బండి సంజయ్ చొరవతో యశోదా ఆస్పత్రికి
- పరారీలో నిందితుడు.. అతడి ఫొటో గుర్తింపు

3



కొలువు కష్టాలు

అమెరికా పొమ్మంటోంది..

భారత్‌లో భరోసా లేదు!

- అమెరికా నుంచి తిరిగొస్తున్నవారికి ఇక్కడ ఉద్యోగాలు రావడం కష్టంగా మారిన వైనం
- ఐటీ సంబంధిత రంగాల్లో కాస్తంత మెరుగు
- మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్‌లో కష్టమే!
- ఉద్యోగం వచ్చినా.. జీతం తక్కువని ఆవేదన
- కొలువులున్నాయి గానీ.. వారే డాలర్ల లెక్కలో జీతాలు ఆశిస్తున్నారు: హెచ్‌ఆర్ మేనేజర్లు

హైదరాబాద్ సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక మాంద్యం కారణంగా అమెరికాలో కొలువుల కోతతో రెండేళ్లగా కుదేలవుతున్న మనోళ్లకు.. ట్రంప్ రాకతో మరింత గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి! అక్కడ ఉంటే ఏ క్షణంలో ఉద్యోగం పోతుందో తెలియక.. అలాగని ధైర్యం చేసి భారత్‌కు రాలేక అక్కడే సర్దుకుపోతున్నవారు కొందరు! ధైర్యం చేసి ఇక్కడికి వచ్చి.. ఎన్ని ప్రయత్నాలు చేసినా ఉద్యోగం రావట్లేదని వాపోతున్నవారు మరికొందరు!! ఉద్యోగం కోల్పోయి తప్పనిసరి పరిస్థితుల్లో భారత్‌కు వచ్చి ఉద్యోగాల వేట మొదలుపెడుతున్నవారు ఇంకొందరు!! ఉదాహరణకు.. తెలుగు రాష్ట్రాలకు చెందిన రాజ్ (పేరు మార్పు) ఎంఎస్ చేయడానికి ఏడేళ్ల క్రితం అమెరికాకు వెళ్లాడు. మాస్టర్స్ డిగ్రీ పూర్తయిన వెంటనే ఓ కంపెనీలో ఉద్యోగం కూడా చేరాడు. అతడి నెల సంపాదన మన భారతీయ కరెన్సీలో చెప్పాలంటే ఆరు లక్షల రూపాయలకు పై మాటే! కానీ, ఆర్థిక మాంద్యం కారణంగా గత ఏడాది అతడి

మిగతా 2వ పేజీలో...





కలల చదువుకు కత్తెర

- అమెరికా ఎఫ్1 వీసాల్లో భారీగా కోత
- 2023-24లో 41% దరఖాస్తులు తిరస్కరణ
- దశాబ్ద కాలంలో ఇదే అత్యధికం
- భారత విద్యార్థుల వీసాల్లోనూ పెరిగిన కోతలు
- బైడెన్ హయాంలోనే మొదలైన చర్యలు

2

వారంలో విస్తరణ!



రాష్ట్ర మంత్రివర్గంలోకి నలుగురికి అవకాశం

- రేసులో సుదర్శన్‌రెడ్డి, రాజగోపాల్, వివేక్, వాకిటి శ్రీహరి
- పలువురి శాఖల్లోనూ భారీగా మార్పులు!
- ఏఐసీసీ పెద్దలతో రేవంత్, భట్టి, మహేశ్, ఉత్తమ్ భేటీ
- ఖర్గే, రాహుల్, వేణుగోపాల్‌తో 2 గంటల పాటు చర్చలు
- క్యాబినెట్‌పై ఇదే చివరి భేటీ అంటున్న మహేశ్ కుమార్
- లంబాడాల నుంచి ఒకరికి డిప్యూటీ స్పీకర్ అవకాశం?


సుదర్శన్‌రెడ్డి


రాజగోపాల్‌రెడ్డి


వివేక్


శ్రీహరి

న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ మంత్రివర్గ విస్తరణ ఎట్టకేలకు కొలిక్కి వచ్చినట్టు తెలుస్తోంది. ఈ నెలాఖరులోగా మంత్రివర్గ కూర్పు పూర్తయ్యే అవకాశముందని కాంగ్రెస్ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. సోమవారం ఢిల్లీలోని ఏఐసీసీ ప్రధాన కార్యాలయంలో కాంగ్రెస్ అగ్రనేతలు మల్లికార్జున ఖర్గే, రాహుల్‌గాంధీ, కేసీ వేణుగోపాల్‌తో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ సుదీర్ఘంగా భేటీ అయ్యారు. సాయంత్రం 6.30 గంటలకు మహేశ్ కుమార్ గౌడ్ ఏఐసీసీ కార్యాలయానికి వెళ్లగా, 7 గంటల సమయంలో ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఒకేసారి అక్కడికి చేరుకున్నారు. ఉత్తమ్ ఆలస్యంగా వెళ్లి, అందరి కంటే ముందే బయటికి వచ్చేశారు. రెండు గంటలకు పైగా జరిగిన ఈ సమావేశంలో ఎప్పటి నుంచో వాయిదా పడుతూ వస్తున్న మంత్రివర్గ విస్తరణ కొలిక్కి వచ్చినట్టు తెలిసింది. అసెంబ్లీ సమావేశాల తర్వాత జరిగేది మంత్రివర్గ పునర్ వ్యవస్థీకరణ అని పార్టీ వర్గాలు చెబుతున్నాయి. మంత్రివర్గంలో నలుగురికి అవకాశం కల్పించడంతో పాటు పలువురు మంత్రుల శాఖల్లో మార్పులు జరిగే చాన్స్ ఉన్నట్టు అభిప్రాయపడుతున్నాయి.

ఆ నలుగురేనా?

ఎన్నికలకు ముందు పార్టీలో చేరిన కొంతమంది కీలక నేతలకు ఇచ్చిన హామీలను నిలబెట్టుకునే అంశంపై సమావేశంలో కీలకంగా చర్చించినట్టు తెలిసింది. ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన చెన్నూర్ ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామిలకు అవకాశం ఇవ్వాలనే అంశంపై చర్చ జరిగినట్టు సమాచారం. మహబూబ్‌నగర్ జిల్లా నుంచి ముదిరాజ్ సామాజిక

మిగతా 13వ పేజీలో...

కేసీఆర్ శాసనసభ్యత్వం రద్దుపై దృష్టి పెడతాం

- మల్లన్నసాగర్ ప్రాజెక్టు నిర్వాసితులను ఆదుకుంటాం
- గజ్వేల్ కాంగ్రెస్ నేతలతో సీఎం
- కేసీఆర్‌ను బర్తరఫ్ చేయాలి
- సిద్దిపేట నుంచి రాజ్‌భవన్‌కు పాదయాత్రగా నేతలు
- రేవంత్‌తో పాటు గవర్నర్‌కు వినతిపత్రాల అందజేత

13

జస్టిస్ వర్మ ఇచ్చిన తీర్పులన్నీ

తిరగదోడాల్సిందే

ఈడీ, సీబీఐతో దర్యాప్తు జరిపించాలి

అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ తీర్మానం



- ఆయన్ను ఇంకా న్యాయమూర్తిగా కొనసాగిస్తే ప్రజాస్వామ్యానికే ప్రమాదం అంటూ ఆందోళన
- నేటి నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్లు ప్రకటన
- జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలుకు ఆదేశించాలని సుప్రీం కోర్టులో సీనియర్ న్యాయవాది వ్యాజ్యం
- జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని కేంద్రానికి కొలీజియం సిఫారసు
- ఆయనకు కేటాయించిన న్యాయపరమైన విధుల్ని ఉపసంహరిస్తూ ఢిల్లీ హైకోర్టు ఉత్తర్వులు

న్యూఢిల్లీ, మార్చి 24: స్టోర్‌రూమ్‌లో నోట్ల కట్టల వ్యవహారానికి సంబంధించి తీవ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ఢిల్లీ హైకోర్టు జడ్జి జస్టిస్ వర్మకు అన్ని వైపుల నుంచీ గడ్డు పరిస్థితులు ఎదురవుతున్నాయి. ఆయన్ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేయాలని సుప్రీంకోర్టు కొలీజియం సోమవారం కేంద్రానికి అధికారికంగా సిఫారసు చేయగా.. ఢిల్లీ హైకోర్టు ఆయనకు కేటాయించిన న్యాయపరమైన విధులన్నింటినీ ఉపసంహరించుకుంటూ సర్క్యులర్ జారీ చేసింది. మరోవైపు.. జస్టిస్ వర్మ ఇప్పటిదాకా ఇచ్చిన తీర్పులన్నింటినీ తిరగదోడాలని, ఆయనపై అభిశంసనకు ప్రభుత్వాన్ని ఆదేశించాలని సీజేఐను కోరుతూ అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ సోమవారం ఒక తీర్మానం చేసింది. ఆయనపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్, సీబీఐతో దర్యాప్తు జరిపించాలని.. ఎఫ్ఐఆర్ నమోదుకు వెంటనే అనుమతించాలని, అవసరమైతే ఆయన్ను కస్టడీలోకి తీసుకుని ప్రశ్నించడానికి కూడా అనుమతించాలని అందులో కోరింది. ఆయన్ను ఇంకా న్యాయమూర్తిగా కొనసాగించడం ప్రజాస్వామ్యానికే ప్రమాదమని, న్యాయవ్యవస్థకు ఉన్న ఏకైక శక్తి ప్రజా విశ్వాసమేనని.. ఒక్కసారి అది పోతే దేశం కుప్పకూలుతుందని ఆందోళన వెలిబుచ్చింది. ఆయన్ను అలహాబాద్ హైకోర్టుకు బదిలీ చేస్తూ సుప్రీం కొలీజియం తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ.. మంగళవారం నుంచి నిరవధిక సమ్మెకు దిగనున్నట్టు బార్ అసోసియేషన్ ప్రకటించింది. "ఒక్క న్యాయమూర్తిని కాపాడడానికి మొత్తం ప్రజాస్వామ్యాన్నీ పణంగా పెడుతున్నారు. ప్రభుత్వం ఈ విషయంలో జోక్యం చేసుకోవాలి. జస్టిస్ వర్మ బదిలీని వ్యతిరేకిస్తూ మాకు 22 సంస్థలు మద్దతు లేఖలు

మిగతా 2వ పేజీలో...

ఎంపీల వేతనాలు 24% పెంపు

- రూ.లక్ష నుంచి రూ.1.24 లక్షలకు పెరిగిన నెల జీతం
- రూ.25 వేల నుంచి 31 వేలకు చేరిన పెన్షన్
- నోటిఫికేషన్ ఇచ్చిన కేంద్రం

2



న్యాయవాది దారుణ హత్య

- ప్రియురాలి చిరునామా చెప్పడం లేదని ఘాతుకం
- అదరాబా చూస్తుండగానే కత్తితో దాడిచేసిన నిందితుడు
- హైదరాబాద్‌లోని ఐఎస్ సదన్‌లో ఘటన
- మృతుడు ఇజ్రాయెల్.. మహేశ్వరం కాంగ్రెస్ నేత

3

మిస్ వరల్డ్ పోటీలు మేలో

- 10న గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభం.. 31న ఫినాలే
- అధికారిక షెడ్యూల్ విడుదల
- 120 దేశాల నుంచి పోటీదార్లు

13

స్పీకర్ తేల్చాకే..!

- అప్పటిదాకా న్యాయస్థానాల జోక్యం కుదరదు
- ఇందుకు అనుగుణంగా అనేక తీర్పులున్నాయి
- అనర్హత కేసులో చట్టాన్ని పాటిస్తున్న స్పీకర్
- పిటిషనర్లే దురుద్దేశంతో వ్యవహరిస్తున్నారు
- స్పీకర్‌ను ఆశ్రయించిన వెంటనే కోర్టుకెక్కారు
- వారి స్పెషల్ లీవ్ పిటిషన్లను కొట్టేయండి
- అసెంబ్లీ కార్యదర్శి కౌంటర్ దాఖలు
- అనర్హత పిటిషన్‌పై నేడు సుప్రీం విచారణ



న్యూఢిల్లీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): పది మంది ఎమ్మెల్యేల పార్టీ ఫిరాయింపునకు సంబంధించి తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ సకాలంలో నిర్ణయం తీసుకోలేదన్న వాదన సరైంది కాదని, అనర్హత పిటిషన్లపై చట్టంలో పేర్కొన్న పద్ధతిని ఆయన అనుసరిస్తున్నారని శాసనసభ కార్యదర్శి సుప్రీంకోర్టుకు నివేదించారు. ఈ మేరకు సోమవారం సర్వోన్నత న్యాయస్థానంలో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. ఈ విషయంలో దాఖలైన స్పెషల్ లీవ్ పిటిషన్‌లలో పస లేదని, వాటిని తిరస్కరించాలని అభ్యర్థించారు. స్పీకర్ ఉద్దేశ పూర్వకంగా ఆలస్యం చేశారనడానికి ఎలాంటి కారణాలు లేవని చెప్పారు. స్పీకర్‌కు పిటిషన్లు పెట్టుకున్న 20 రోజులకే బీఆర్ఎస్ నేతలు కోర్టును ఆశ్రయించారని ప్రస్తావించారు. స్పీకర్‌పై వారు చేసిన ఆరోపణలు

మిగతా 14వ పేజీలో...

భూముల విలువలు పెరుగుతాయ్



- భూ భారతి అమల్లోకి వచ్చాక పెంచుతాం
- సాదా బైనామాల కొత్త దరఖాస్తులు తీసుకోం
- ఎల్ఆర్ఎస్ రాయితీ గడువు పొడిగింపు ఉండదు
- విలేకరులతో ఇష్టాగోష్ఠిలో మంత్రి పొంగులేటి
- ఏటా భూముల విలువ పెంపు!
- అప్పుడే ఎక్కువ లావాదేవీలున్న చోట అదనపు రాబడికి చాన్స్
- మహారాష్ట్రలో ఇదే విధానం.. థర్డ్‌పార్టీ నివేదికలో ప్రతిపాదనలు

13



మరో ఎమ్మెల్సీ ఎన్నిక

- హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూలు విడుదల చేసిన ఈసీ
- ఏప్రిల్ 23న పోలింగ్.. 25న ఓట్ల లెక్కింపు
- ఎమ్మెల్సీ స్థానం పరిధిలో 115 మంది ఓటర్లు?
- అసెంబ్లీ నుంచి వివరాలు సేకరిస్తున్న బల్దియా
- కొత్త ఎమ్మెల్సీల సమాచారం తెలిశాక స్పష్టత

13



బెట్టింగ్ యాప్స్ కేసులో.. శ్యామలకు ప్రశ్నలు

- 4 గంటల పాటు విచారించిన పోలీసులు
- విదేశాలకు ఇమ్రాన్‌ఖాన్, హర్ష సాయి!
- యాప్ నిర్వాహకులకూ త్వరలో నోటీసులు
- మెట్రో రైల్లో బెట్టింగ్ యాడ్స్‌పై సర్కారును నిలదీస్తున్న నెటిజన్లు
- షారుఖ్, సచిన్, కోహ్లీపైనా కేసు పెట్టాలని హైదరాబాద్ గ్రీన్స్ అధ్యక్షుడి ఫిర్యాదు

12

జస్టిస్ వర్మ ఇచ్చిన తీర్పులన్నీ తిరగదోడాల్సిందే

(మొదటి పేజీ తరువాయి)

పంపాయి. ఈ విషయంలో మేము తుదికంటా పోరాడుతాం. సుప్రీం కోర్టుకు న్యాయాధికారాలు ఉంటే, మాకు ప్రజా మద్దతు ఉంది" అని అలహాబాద్ హైకోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అనిల్ తివారీ పేర్కొన్నారు. జస్టిస్ వర్మ బదిలీ విషయంలో సుప్రీం కోర్టు తన నిర్ణయాన్ని ఉపసంహరించుకున్నాకే.. తాము విధుల్లోకి దిగుతామని ఆయన స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థ సంరక్షణకు తమ ప్రాణాలు త్యాగం చేయడానికైనా సిద్ధంగా ఉన్నామని తేల్చిచెప్పారు. జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయాలంటూ సర్వోన్నత న్యాయస్థానంలో సీనియర్ న్యాయవాది మాథ్యూస్ నెడుంపర ఒక ప్రజాహిత వ్యాజ్యాన్ని దాఖలు చేశారు. అందులో ఆయన ఈ వ్యవహారానికి సంబంధించి పలు కీలక ప్రశ్నలు లేవనెత్తారు. కాలిన నోట్ల కట్టల వీడియో, ఫొటోలతో సహా 25 పేజీల డాక్యుమెంట్‌ను సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయడం.. న్యాయవ్యవస్థపై ప్రజల నమ్మకాన్ని పునరుద్ధరించడానికి కొంతమేరకు తోడ్పడినప్పటికీ, జస్టిస్ వర్మపై ఇప్పటికీ ఎఫ్ఐఆర్ ఎందుకు దాఖలు చేయలేదని సామాన్యప్రజలు, మీడియా ప్రశ్నిస్తున్నట్లు ఆయన తన పిటిషన్‌లో పేర్కొన్నారు. "మార్చి 14నే ఆయనపై ఎఫ్ఐఆర్ ఎందుకు దాఖలు చేయలేదు? ఎటువంటి అరెస్టులూ ఆరోజే ఎందుకు జరగలేదు? అక్కడ దొరికిన డబ్బును (సగం కాలిన నోట్లను) ఎందుకు స్వాధీనం చేసుకోలేదు? ఎటువంటి మహజరూ (జప్తు, సోదాలకు సంబంధించిన నివేదిక) ఎందుకు రూపొందించలేదు? క్రిమినల్ లాను ఎందుకు వర్తింపజేయలేదు? అసలు ఈ స్కాండల్ గురించి ప్రజలకు తెలియడానికి దాదాపు వారం రోజులు ఎందుకు ఆలస్యమైంది?" అని ఆయన తన పిటిషన్‌లో పలు ప్రశ్నలు సంధించారు. జస్టిస్ వర్మపై ఎఫ్ఐఆర్ దాఖలు చేయడం ద్వారా క్రిమినల్ ప్రొసీజర్‌ను అనుసరించడానికి బదులుగా.. సుప్రీంకోర్టు త్రిసభ్య కమిటీతో అంతర్గత విచారణకు ఆదేశించడం వల్ల ప్రజా ప్రయోజనాలకు విఘాతం కలిగిందన్నారు. ఈ వ్యవహారంపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసి, అర్థవంతమైన దర్యాప్తు చేయాల్సిందిగా ఢిల్లీ పోలీసులకు ఆదేశాలు జారీ చేయాలని మాథ్యూస్ నెడుంపర తన పిటిషన్‌లో అభ్యర్థించారు. మరోవైపు, జస్టిస్ వర్మ వ్యవహారంపై సుప్రీం సీజే జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పందించిన తీరును రాజ్యసభ ఛైర్మన్, ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ కొనియాడారు. ఆయన తనకు అందుబాటులో ఉన్న మొత్తం సమాచారాన్నీ ప్రజల ముందు పెట్టారని.. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ఒక సీజేఐ ఇలా పారదర్శకంగా, జవాబుదారీతనంతో వ్యవహరించడం ఇదే మొదటిసారని ప్రశంసల జల్లు కురిపించారు.

రాహుల్ పౌరసత్వంపై సమాధానం ఇవ్వండి

ప్రయాగ్‌రాజ్, మార్చి 24: ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ పౌరసత్వ వివాదంపై నాలుగు వారాల్లో సమాధానం ఇవ్వాలని కేంద్ర హోంశాఖను సోమవారం అలహాబాద్ హైకోర్టు ఆదేశించింది. ఆ వివాదంపై ఏప్రిల్ 21న నాటికి నిర్ణయం తీసుకోవాలని సూచించింది. రాహుల్‌కు బ్రిటిష్ పౌరసత్వం కూడా ఉందని, దీనిపై సీబీఐతో దర్యాప్తు చేయించాలని కోరుతూ కర్ణాటకకు చెందిన బీజేపీ కార్యకర్త శిశిర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది.


ఏఐసీసీ భేటీల ముసాయిదా కమిటీలో భట్టి



న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో ఏప్రిల్ 8, 9 తేదీల్లో నిర్వహించబోయే ఏఐసీసీ సమావేశాలకు కాంగ్రెస్ అధిష్ఠానం ముసాయిదా కమిటీని నియమించింది. 15 మంది సీనియర్ నేతలతో కూడిన ఈ కమిటీలో.. సభ్యుడిగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు అధిష్ఠానం అవకాశం కల్పించింది. కమిటీకి కన్వీనర్‌గా రన్‌దీప్ సింగ్ సూర్జేవాలా.. సభ్యులుగా జైరాం రమేశ్, తారీఖ్ అన్వర్, దీపా దాస్‌మున్షీ, భూపేశ్ భగల్, సచిన్ పైలట్, రజనీ పాటిల్, పీఎల్ పునియా, బీకే హరిప్రసాద్, గౌరవ్ గొగొయ్, మనీష్ తివారి, విజయ్, బెన్ని బెహనన్, విక్రాంత్ భూరియా ఉన్నారు.

కొలువు కష్టాలు

(మొదటి పేజీ తరువాయి)



ఉద్యోగం పోయింది. ఇండియాకు తిరిగి రావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఇక్కడికి వచ్చాక.. గత ఆరు నెలలుగా అతడు హైదరాబాద్, బెంగళూరు, గుర్‌గావ్ లాంటి ప్రాంతాలలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కానీ, ఇప్పటిదాకా అతణ్ని ఇంటర్వ్యూకు పిలిచిన వారి సంఖ్య కేవలం ఐదు లోపే. ఆ ఇంటర్వ్యూలకు వెళ్లినా ఉద్యోగం రాలేదు. నెలకు రూ.లక్ష ఇచ్చినా చాలంటున్నా తనకు ఉద్యోగం ఇచ్చేవారే కరవయ్యారని అతడు వాపోతున్నాడు. ఇలాంటి వారు ప్రస్తుతం మన దేశంలో చాలా మందే ఉన్నారు. "యూఎస్‌లో ఎంఎస్ చేశాం. ఫలానా దిగ్గజ సంస్థలో అమెరికాలో ఉద్యోగం చేశాం" అని రెజ్యూమ్‌లో ఉంటే, వారిని అసలు ఇంటర్వ్యూకే పిలవని పరిస్థితి ఉంది. అలాగే.. ఉద్యోగంలో భాగంగా ఇక్కణ్నుంచీ మనోళ్లను అమెరికాకు తీసుకెళ్లిన సంస్థలు.. హెచ్1బీ వీసా గడువు ముగిసిన వారిని అక్కడ కొనసాగించడానికి ఇష్టపడట్లేదు. దీనితో తప్పనిసరి పరిస్థితిల్లో ఇండియాకు వచ్చిన వారు అదే కంపెనీ భారతీయ శాఖలో కొనసాగడం ఇష్టం లేకపోతే ఇతర కంపెనీల వైపు దృష్టి సారిస్తున్నారు. అలాంటి వారందరికీ ఇప్పుడు సమస్యలు ఎదురవుతున్నాయంటున్నారు హెచ్‌ఆర్ మేనేజర్లు. ఈ సమస్యను ఎదుర్కొంటున్న వందలాది మంది.. రెడిట్, లింక్డిన్ లాంటి వెబ్‌సైట్లలో ఏకరువు పెడుతున్న కష్టాలే ఇందుకు నిదర్శనం.

డాలర్లలో అడిగితే ఎలా?


ఇండియాస్ గ్రాడ్యుయేట్ స్కిల్స్ ఇండెక్స్ 2025 నివేదిక ప్రకారం.. మన పట్టభద్రుల్లో కేవలం 42.6శాతం మంది మాత్రమే ఉద్యోగార్హత (అంటే డిగ్రీతోపాటు.. ఆ ఉద్యోగానికి కావాల్సిన అన్ని నైపుణ్యాలూ కలిగి ఉండడం) కలిగి ఉన్నారు. ఏఐ, డేటా ఎనలిటిక్స్ వంటి అంశాల్లో నైపుణ్యం సంపాదించినవారికి ఇప్పుడు డిమాండ్ అధికంగా ఉన్నప్పటికీ, వాటిని కలిగి ఉన్న వారి సంఖ్య తక్కువగానే ఉంది. దీనికి తోడు.. సమస్యలను నేర్పుగా పరిష్కరించే సామర్థ్యం, సృజనాత్మకత వంటి విషయాల్లో కూడా మనవాళ్లు వెనకబడి ఉంటున్నారని హెచ్‌ఆర్ మేనేజర్లు చెబుతున్నారు. విదేశాల నుంచి వస్తున్నవారిలోనూ ఈ నైపుణ్యాల కొరత ఉంటోందని.. వారికి అధిక జీతాలిచ్చే బదులు ఇక్కడి ఔత్సాహికులకు అందులో 50% జీతం ఇచ్చి, తగిన శిక్షణ ఇస్తే వారితో సమర్థంగా పనిచేయించుకోవచ్చని అభిప్రాయపడుతున్నారు. "విదేశాల నుంచి వచ్చేవారు.. భారతీయ కంపెనీలకు ఏం కావాలో అర్థం చేసుకోవాలి. అలాగే తాము పనిచేయాలనుకుంటున్న రంగం గురించి కొంత పరిశోధన చేస్తే తమకు ఉన్న అవకాశాలు, తమ నైపుణ్యం, అనుభవానికి తగిన ఉద్యోగం లభిస్తుంది. దురదృష్టవశాత్తు చాలా మంది ఇవేవీ చేయట్లేదు. అందుకే వారికి ఉద్యోగం లభించడం కాస్త కష్టంగా మారుతోంది" అని మాదాపూర్‌లోని ఓ సాఫ్ట్‌వేర్ సంస్థకు చెందిన హెచ్‌ఆర్ మేనేజర్ దినేష్ సూచించారు. అయితే ఆ వాదనలో వాస్తవం కొంత మేర మాత్రమే ఉందంటున్నారు ఉద్యోగార్థులు. ఉదాహరణకు.. బయోటెక్నాలజీ రంగానికి సంబంధించి యూఎస్, ఆస్ట్రేలియా దేశాల్లో పలు పరిశోధనలు చేసిన తాను ఆ రంగంలో హైదరాబాద్ దూసుకుపోతున్న నేపథ్యంలో అమెరికా నుంచి ఇక్కడికి వచ్చానని, ఇక్కడ పేరొందిన కేంద్ర ప్రభుత్వ పరిశోధన సంస్థల్లో శిక్షణ కూడా పొందానని.. కానీ ఇక్కడ తనకు సరైన అవకాశాలే రాలేదని, జీతం కూడా చాలా తక్కువగా ఆఫర్ చేశారని అను (పేరు మార్చాం) అనే యువతి వివరించారు. అయితే.. ఇలా విదేశాల నుంచి వచ్చేవారు డాలర్ల లెక్కలు వేసి, ఆ స్థాయిలో జీతం కావాలని కోరుకుంటారని.. అందుకే వారికి ఉద్యోగాలు రావడం కష్టమవుతోందని.. ఒక ఫార్మా కంపెనీలో సీనియర్ లెవల్ మేనేజర్‌గా పని చేస్తున్న నారాయణ వివరించారు. ఐటీ, బీటీ (బయోటెక్నాలజీ) పరిస్థితి ఇలా ఉంటే.. మెకానికల్, కెమికల్ ఇంజనీరింగ్ వంటి రంగాల్లో అయితే అసలు అవకాశాలే తక్కువగా ఉన్నాయని మరికొందరు వాపోతున్నారు. ఉదాహరణకు.. మెకానికల్ ఇంజనీరింగ్‌తోపాటు పీహెచ్‌డీ కూడా పూర్తి చేసి అమెరికాలో ఎనిమిదేళ్లు ఉద్యోగం చేసిన ఒక వ్యక్తి.. భారత్‌లో ఐఐటీలు సహా పలు సంస్థలలో ఉద్యోగం కోసం దరఖాస్తు చేసినా ఆయన్ను పట్టించుకున్న వారే లేరు.

నెట్‌వర్క్ పెంచుకోవాలి

ఐటీ సంబంధిత రంగాల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ, సైబర్ సెక్యూరిటీ తదితర నైపుణ్యాలు కలిగి ఉండాలని కంపెనీలు కోరుకుంటున్నాయి. కాబట్టి అభ్యర్థులు తమ నైపుణ్యాలకు పదును పెట్టాలి. డిమాండ్‌లో ఉన్న నైపుణ్యాలను పొందడానికి ప్రయత్నించాలి.

- చాలావరకూ ఉద్యోగాలు మనం పెంచుకునే నెట్‌వర్క్ ద్వారానే వస్తాయి. మరీ ముఖ్యంగా ఐటీ, బయోటెక్నాలజీ వంటి రంగాల్లో పరిచయాలు బాగా పనిచేస్తాయి. కాబట్టి ఆ దిశగా దృష్టి సారించడం మంచిది.
- ప్రత్యేకంగా ఎన్‌ఆర్‌ఐల కోసమే కొన్ని ఉద్యోగ వెబ్‌సైట్లు అందుబాటులో ఉన్నాయి. వాటి ద్వారా ప్రయత్నించాలి. అలాగే రిక్రూట్‌మెంట్ ఏజెన్సీల ద్వారా ప్రయత్నించవచ్చు.
- ఇండియాలో స్టార్టప్ సంస్కృతి పెరుగుతోంది. ఈ నేపథ్యంలో.. విదేశాల్లో అపార అనుభవం సంపాదించి ఇక్కడికి వచ్చిన వారు ఉద్యోగాలకు ప్రయత్నించేబదులు స్టార్టప్ ఆలోచనలు చేయాలని ఆర్థిక నిపుణులు సూచిస్తున్నారు.

లోకం తీరు



కలల చదువుకు కత్తెర

ఎఫ్1 వీసాల్లో అమెరికా భారీగా కోత

2023-24లో 41% దరఖాస్తులు తిరస్కరణ

న్యూఢిల్లీ, మార్చి 24: అమెరికాలో చదువుకోవాలనే విదేశీ విద్యార్థుల కలలకు కళ్లెం పడుతోంది. విద్యార్థుల కోసం జారీ చేసే ఎఫ్1 వీసాల్లో గత కొంత కాలంగా అగ్రరాజ్యం భారీగా కోత పెడుతోంది. దశాబ్ద కాలంగా అన్ని దేశాల నుంచి వస్తున్న ఎఫ్1 వీసా దరఖాస్తులను పెద్దఎత్తున తిరస్కరిస్తోంది. అలా తిరస్కరణకు గురైన దరఖాస్తులు గత ఆర్థిక సంవత్సరంలో (అక్టోబరు 2023 నుంచి సెప్టెంబరు 2024) 41 శాతానికి చేరాయి. దీంతో దశాబ్ద కాలంలోనే ఎక్కువగా దరఖాస్తులు తిరస్కరణకు గురైన సంవత్సరాల్లో గతేడాది అగ్రస్థానంలో నిలిచింది. 2023-24లో వివిధ దేశాల నుంచి ఎఫ్1 వీసా కోసం మొత్తం 6.79 లక్షల దరఖాస్తులు రాగా, వాటిలో 2.79 (41 శాతం) లక్షలను అమెరికా తిరస్కరించిందని ఆ దేశ విదేశాంగ శాఖ నివేదిక వెల్లడించింది. ఆ నివేదిక ప్రకారం.. 2014లో 77.48 శాతంగా ఉన్న ఆమోదం రేటు, 2023-24 సంవత్సరానికి 58.9 శాతానికి పడిపోయింది. భారతీయ విద్యార్థులకు కూడా అమెరికా వీసాలు తగ్గిపోతున్నాయని ఓపెన్ డోర్స్ నివేదిక- 2023-24 వెల్లడించింది. 2018-23 మధ్య భారతీయ విద్యార్థులకు ఎఫ్1 వీసాల ఆమోదం రేటు.. 65.03 శాతం నుంచి 63.74 శాతానికి పడిపోయిందని ఆ సంస్థ తెలిపింది. ఇక తిరస్కరణ రేటు 34.97 శాతం నుంచి 36.26 శాతానికి పెరిగిందని పేర్కొంది. డొనాల్డ్ ట్రంప్ అధికారం చేపట్టకముందే ఈ కోతలు మొదలయ్యాయి. మాజీ అధ్యక్షుడు బైడెన్ హయాంలోనే ఎఫ్1 వీసాలను భారీగా తగ్గించడం మొదలు పెట్టారు. ఇకపై మరిన్ని కోతలు ఉంటాయని నిపుణులు భావిస్తున్నారు.

అమెరికా వాణిజ్య ప్రతినిధి భారత పర్యటన నేటి నుంచి

న్యూఢిల్లీ, మార్చి24: భారత్‌లో నేటి నుంచి అమెరికా వాణిజ్య ప్రతినిధి బ్రెండన్ లించ్ పర్యటించనున్నారు. ఈ నెల 29 వరకు కొనసాగే పర్యటనలో ఆయన భారత వాణిజ్య మంత్రి పీయుష్ గోయల్‌తో సమావేశమై చర్చలు జరుపుతారు. ఏప్రిల్ 2 నుంచి ప్రతీకార సుంకాలపై అమెరికా అధ్యక్షుడు ట్రంప్ పట్టుపడుతున్న నేపథ్యంలో లించ్ పర్యటనకు ప్రాధాన్యత ఏర్పడింది. పరస్పర సుంకాలపై నిర్ణయాన్ని తాత్కాలికంగా వాయిదా వేసుకోవాలని భారత్ ఆయన్ను కోరే అవకాశముంది. మరోవైపు, వెనెజువెలా నుంచి చమురు, గ్యాస్ కొనుగోలు చేసే దేశాలు తమకు 25% సుంకాలు చెల్లించాలని ట్రంప్ హెచ్చరించారు. వెనెజువెలా నుంచి గతేడాది భారత్ అత్యధికంగా క్రూడ్ ఆయిల్ కొనుగోలు చేసింది.

గోల్డ్ కార్డుల కోసం క్యూ

వాషింగ్టన్, మార్చి 24: అమెరికాలో శాశ్వత నివాసం కోసం అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రవేశపెట్టిన గోల్డ్ కార్డ్ (గోల్డెన్ వీసా)లకు మంచి ఆదరణ లభిస్తోందని వాణిజ్య కార్యదర్శి హోవార్డ్ లట్నిక్ తెలిపారు. ఎవరైనా అయిదు మిలియన్ డాలర్లు (సుమారు రూ.43 కోట్లు) చెల్లించి అమెరికాలో శాశ్వతంగా నివాసం ఉండొచ్చు. అమెరికా పౌరసత్వం తీసుకోవాలా, వద్దా అన్నది వారి ఇష్టాయిష్టాలపై ఆధారపడి ఉంటుంది. శాశ్వత పౌరసత్వం తీసుకున్నా మధ్యలో రద్దు చేసుకునే వెసులుబాటు కూడా ఉంది. ఈ గోల్డెన్ వీసా పొందడానికి చాలా మంది లైనులో ఉన్నారని లట్నిక్ చెప్పారు. కేవలం ఒక్క రోజులోనే 1,000 కార్డులు విక్రయించామని తెలిపారు. ఈ పథకాన్ని రెండు వారాల్లో అధికారికంగా ప్రకటిస్తామని చెప్పారు. ఇందుకు సంబంధించిన సాఫ్ట్‌వేర్‌ను ఎలాన్ మస్క్ రూపొందిస్తున్నారని తెలిపారు.

శిందేను ద్రోహి అన్నందుకు స్టాండప్ కామెడీ వేదిక కూల్చివేత



హ్యాబిటెట్ స్టూడియోలో శిందే మద్దతుదారుల వీరంగం

- కునాల్ కామ్రా వ్యాఖ్యలపై మహారాష్ట్ర సర్కారు ప్రతీకారం



కునాల్ కామ్రా

న్యూఢిల్లీ, మార్చి 24: స్టాండప్ కామెడీ ఆర్టిస్ట్ కునాల్ కామ్రా మరోసారి వివాదంలో చిక్కుకున్నారు. ఆదివారం ముంబైలో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రస్తుత డిప్యూటీ ముఖ్యమంత్రి ఏక్‌నాథ్ శిందేను ఆయన ద్రోహిగా అభివర్ణించారు. ఈ వ్యాఖ్య శివసేన శిందే వర్గం కార్యకర్తలకు ఆగ్రహం తెప్పించింది. వారంతా యూనికాంటినెంటల్ హోటల్‌లో కునాల్ కామ్రా కామెడీ షో నిర్వహించిన వేదిక హ్యాబిటెట్ స్టూడియో మీద ఆదివారం రాత్రే దాడి చేసి, ధ్వంసం చేశారు. ఈ సంఘటనకు సంబంధించి పోలీసులు 12 మందిని అరెస్టు చేశారు. సోమవారం ఉదయమే బృహన్ ముంబై కార్పొరేషన్‌కు చెందిన సిబ్బంది వచ్చి హ్యాబిటెట్ స్టూడియో అక్రమ నిర్మాణమంటూ కూల్చివేత చేపట్టారు. నిజానికి హోటల్ యజమాని సోమవారం ఉదయమే హ్యాబినెట్ స్టూడియోను కొన్నాళ్లు మూసేస్తున్నట్లు ప్రకటించారు. కళాకారుల అభిప్రాయాలతో తమకు సంబంధం ఉండదని చెప్పారు. ఇదే వేదిక మీద కొద్ది నెలల క్రితం ప్రముఖ యూట్యూబర్ రణ్‌వీర్ అలహాబాదియా అభ్యంతరకర వ్యాఖ్యలు చేసి పలు కేసుల్లో ఇరుక్కున్నారు. కునాల్ కామ్రా ఆదివారం తన షోలో 'దిల్ తో పాగల్ హై' సినిమాలోని ఒక పాట ట్యూన్‌లో పాడుతూ మహారాష్ట్ర ప్రస్తుత రాజకీయాలను అపహాస్యం చేశారు. శివసేన, ఎన్‌సీపీలు ముక్కలైన తీరును హాస్యభరితంగా చెప్పారు. నా కళ్లతో చూడు ద్రోహి కనిపిస్తాడు.... అని అర్థం వచ్చేలా శిందేను ఉద్దేశించి పాడారు. ద్రోహి వ్యాఖ్యలపై శివసేన ఎమ్మెల్యే ఫిర్యాదు మేరకు కునాల్ కామ్రా మీద మహారాష్ట్ర పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. మరోపక్క శివసేన శిందే వర్గం నేతలు కునాల్ కామ్రా రెండు రోజుల్లో క్షమాపణ చెప్పాలని హెచ్చరిక జారీ చేశారు. క్షమాపణ చెప్పకపోతే ఆయన ఎక్కడ కనిపించినా మొహం మీద నల్లరంగు పులుముతామని ప్రకటించారు. ఆయన్ను దేశంలో ఎక్కడా తిరగనీయబోమన్నారు. కునాల్ కామ్రా కిరాయి కమెడియన్ అని వ్యాఖ్యానించారు. ఉద్ధవ్ ఠాక్రేకు ఆయన తరపున మాట్లాడటానికి నాయకులెవరూ లేకపోవడంతో కిరాయి కమెడియన్‌ను అద్దెకు తెచ్చుకున్నారని అన్నారు. ఆదిత్య ఠాక్రే కునాల్ కామ్రాకు మద్దతు పలికారు. హోటల్‌పై దాడిని ఖండించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు లేకుండా పోయాయని మండిపడ్డారు. శిందే ద్రోహి మాత్రమే కాదని, దొంగ కూడా అని చెప్పారు. కునాల్ కామ్రా నిజమే చెప్పాడని, శిందే ద్రోహేనని ఉద్ధవ్ ఠాక్రే వ్యాఖ్యానించారు. ఉప ముఖ్యమంత్రిని కించపరిచేలా చౌకబారు కామెడీకి పాల్పడిన కునాల్ కామ్రా క్షమాపణలు చెప్పాలని అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ డిమాండ్ చేశారు. ద్రోహి వ్యాఖ్యలు చేసినందుకు తాను చింతించడం లేదని కునాల్ కామ్రా ప్రకటించారు. తన వ్యాఖ్యలు తప్పని కోర్టులు చెబితే క్షమాపణ చెప్పేందుకు సిద్ధమన్నారు. తనకు మహారాష్ట్ర రాజకీయాల మీద వ్యాఖ్యలు చేసిందుకు ఎవరూ డబ్బులు ఇవ్వలేదని, తన బ్యాంకు ఖాతాలను అన్నింటినీ తనిఖీ చేసుకోవచ్చని కునాల్ కామ్రా పోలీసులకు చెప్పారు.

కర్ణాటక హనీట్రాప్‌పై సుప్రీంలో పిల్

బెంగళూరు, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కర్ణాటకలో ఇద్దరు మంత్రులు సహా వివిధ పార్టీలకు చెందిన 48 మంది ఎమ్మెల్యేలతో పాటు న్యాయమూర్తులు, కేంద్ర నాయకులపై హనీట్రాప్ జరిగిందంటున్న అంశంపై స్వతంత్రంగా విచారణ జరిపించాలని సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. జార్ఖండ్‌లోని ధన్‌బాద్ నివాసి వినయ్‌కుమార్ దీన్ని దాఖలు చేశారు. తనపై హనీట్రాప్ జరిగిందని కర్ణాటక మంత్రి రాజణ్ణ శాసనసభలో స్వయంగా ప్రస్తావించడం, మీడియాలో వచ్చిన కథనాలను ఉటంకించారు. దీనిని అత్యవసరమైనదిగా భావించి, విచారణ జరపాలని కోరారు. స్పందించిన సీజేఐ జస్టిస్ ఖన్నా ధర్మాసనం ఒకట్రెండు రోజుల్లోనే విచారణ చేపడతామని తెలిపింది.

ఆరోగ్య, జీవిత బీమాలపై జీఎస్టీ 5శాతానికి తగ్గింపు?

- మంత్రుల బృందం ప్రతిపాదన!

న్యూఢిల్లీ, మార్చి 24: ఆరోగ్య, జీవిత బీమా ప్రీమియంపై జీఎస్టీని 18% నుంచి 5శాతానికి తగ్గించాలని కేంద్రం నియమించిన మంత్రుల బృందం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ మేరకు ఆ కమిటీలోని ఇద్దరు సభ్యులను ఉటంకిస్తూ.. ఓ ఆంగ్ల పత్రిక కథనాన్ని ప్రచురించింది. నిజానికి ఆరోగ్య, జీవిత బీమాపై జీఎస్టీ తగ్గింపు డిమాండ్ కొత్తదేమీ కాదు. గతంలో జరిగిన జీఎస్టీ కౌన్సిల్ సమావేశాల్లోనూ ఈ అంశం చర్చకు వచ్చినా.. రాష్ట్రాలు ఏకాభిప్రాయానికి వచ్చినా.. ఎలాంటి నిర్ణయం తీసుకోలేదు. బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి మంత్రుల బృందానికి నేతృత్వం వహిస్తుండగా.. ఇద్దరు సభ్యులు కమిటీ నిర్ణయాన్ని వెల్లడించారు. కాగా.. ఏప్రిల్ లేదా మే నెలలో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం జరిగే అవకాశాలున్నాయి.

ఏసర్ ఇండియాలో మహిళా ఉద్యోగులకు నెలసరి సెలవు

న్యూఢిల్లీ, మార్చి 24: మహిళా ఉద్యోగుల ఆరోగ్య పరిరక్షణ పట్ల ఎల్ అండ్ టీ, జొమాటో, స్విగ్గీ, ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంక్ తదితర సంస్థల బాటలో ప్రముఖ టెక్ దిగ్గజం ఏసర్ ఇండియా ప్రయాణించనున్నది. తమ సంస్థలోని మహిళా ఉద్యోగులకు ప్రతి నెలలో ఒకరోజు వేతనంతో కూడిన నెలసరి సెలవు మంజూరు చేయనున్నట్లు ఏసర్ ఇండియా సోమవారం తెలిపింది. 'మాతృక' అనే పేరుతో నెలసరి సెలవు విధానాన్ని సంస్థలో ప్రవేశ పెట్టినట్లు పేర్కొంది. తద్వారా తాము ఉద్యోగుల సంక్షేమం, లింగ సమానత్వంపై ముందు చూపుతో ఆలోచిస్తామని వెల్లడించింది.



నాగ్‌పూర్ అల్లర్ల ప్రధాన నిందితుడి ఇంటిపైకి బుల్డోజర్

నాగపూర్, మార్చి 24: మహారాష్ట్రలోని నాగపూర్ గత కొద్ది రోజులుగా అల్లర్లతో అట్టుడుకుతున్న విషయం తెలిసిందే. ఈ అల్లర్లకు ప్రధాన కారకుడిగా భావిస్తున్న ఫహీమ్ ఖాన్ ఇంటిని స్థానిక మునిసిపల్ అధికారులు కూల్చివేశారు. ఖాన్ రెండంతస్థుల ఇంటిని సోమవారం ఉదయం బుల్డోజర్ సాయంతో నేలమట్టం చేశారు. నిబంధనలు అతిక్రమించి నిర్మించినందునే కూల్చివేశామని అధికారులు తెలిపారు. ఇదే ఘటనకు సంబంధించి ఆరోపణలు ఎదుర్కొంటున్న మరో నిందితుడు యూసుఫ్ షేక్ ఇంటి పోర్షన్‌ను సైతం అధికారులు కూల్చివేశారు. మహల్ ప్రాంతంలో ఉంటున్న యూసుఫ్.. నిబంధనలు అతిక్రమించి చేపట్టిన ఇంటిని కూడా నేలమట్టం చేశామని తెలిపారు. ఇదిలా ఉండగా, భారత్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారంటూ.. ఓ వ్యక్తి కుటుంబంపై కేసు నమోదు చేసి, వారి ఇంటిని కూల్చివేసిన ఘటనలో మహారాష్ట్రలోని సింధుదుర్గ్ జిల్లా అధికారులకు సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది. ఈ ఘటనపై 'కోర్టు ధిక్కరణ' కింద కేసు ఎందుకు పెట్ట కూడదో వివరణ ఇవ్వాలని పేర్కొంది.

ముస్లిం రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్నే మార్చాలంటారా?

కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే వ్యాఖ్యలపై బీజేపీ ఆగ్రహం

- చర్యలు తీసుకుంటారో లేదో కాంగ్రెస్ స్పష్టం చేయాలన్న కేంద్ర మంత్రి రిజిజు
- పార్లమెంటు ఉభయసభల్లో రచ్చ

న్యూఢిల్లీ/బెంగళూరు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): మతపరమైన రిజర్వేషన్లు కల్పించేందుకు రాజ్యాంగాన్ని మార్చాలని కర్ణాటక ఉప ముఖ్యమంత్రి డీకే శివకుమార్ వ్యాఖ్యానించారంటూ బీజేపీ సభ్యులు ఆందోళనకు దిగడంతో లోక్‌సభ, రాజ్యసభ అట్టుడికిపోయాయి. పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు సోమవారం ఉభయసభల్లో ఈ అంశాన్ని లేవనెత్తారు. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న ఓ వ్యక్తి ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం కోసం రాజ్యాంగాన్ని మారుస్తామని ప్రకటన చేశారని, అది ఏ మాత్రం ఆమోదయోగ్యం కాదని స్పష్టం చేశారు. కర్ణాటకలో కాంట్రాక్టుల్లో ముస్లింలకు 4% రిజర్వేషన్ కల్పిస్తూ సిద్దరామయ్య సర్కారు చట్టం చేసిన సంగతి తెలిసిందే. ఇదే క్రమంలో మతపరమైన రిజర్వేషన్ల కోసం రాజ్యాంగ సవరణ చేయాలని కర్ణాటక డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ వ్యాఖ్యానించారంటూ బీజేపీ ఆందోళనకు దిగింది. అంబేడ్కర్ ఫొటో పట్టుకొని తిరగడంతోపాటు రాజ్యాంగ ప్రతిని జేబులో పెట్టుకొని తిరిగే కాంగ్రెస్ నేతలు ముస్లింలకు రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని మార్చాలంటారా? దీనిపై ఆ పార్టీ వివరణ ఇవ్వాల్సిందేనని, అతనిపై చర్యలు తీసుకుంటారో లేదో స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై కాంగ్రెస్ సభ్యులు నిరసన తెలిపారు. అదే సమయంలో రాజ్యసభాపక్ష నేత జేపీ నడ్డా మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ రాజ్యాంగాన్ని ముక్కలు చేయాలని చూస్తోందని ఆరోపించారు. కర్ణాటకలో ముస్లింల రిజర్వేషన్ కోసం చేసిన చట్టాలను, నిబంధనలను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మరోవైపు, భారత్‌ను ముక్కలు చేయాలని చూస్తున్నదే బీజేపీ అని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే ఆరోపించారు. రాజ్యాంగాన్ని మార్చాలని డీకే అనలేదన్నారు. జడ్జి ఇంట్లో నోట్ల కట్టల కేసును మరుగున పడేసేందుకే బీజేపీ ఈ అంశాన్ని తెరపైకి తెచ్చిందని ధ్వజమెత్తారు. ఈ వ్యాఖ్యలపై స్పందించిన నడ్డా.. ముస్లింలకు రిజర్వేషన్ల కోసం కాంగ్రెస్ కేవలం కర్ణాటకలోనే కాదని, తెలంగాణలోనూ చట్టం చేసిందని ఆరోపించారు. ముస్లింలను ఓబీసీలుగా పేర్కొంటూ దొడ్డిదారిన వారికి రిజర్వేషన్లు కల్పిస్తోందని విమర్శించారు. ఇక రాజ్యసభలో కాంగ్రెస్ చీఫ్ విప్ జైరాం రమేశ్ కేంద్ర మంత్రి రిజిజుపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసు ఇచ్చారు.



ఏపీ గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో పార్లమెంటులో అరకు కాఫీ స్టాళ్లను ఏర్పాటు చేశారు. లోక్‌సభ క్యాంటీన్‌లో స్టాల్‌ను కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు, రాజ్యసభ క్యాంటీన్‌లో స్టాల్‌ను కేంద్ర మంత్రి గోయల్ సోమవారం ప్రారంభించారు.

ఎంపీల వేతనాలు 24% పెంపు

న్యూఢిల్లీ, మార్చి 24: పార్లమెంటు సభ్యుల వేతనాలను 24% మేర పెంచుతూ కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ సోమవారం నోటిఫికేషన్ జారీ చేసింది. భత్యాలు, పెన్షన్లను కూడా పెంచింది. ఈ నిర్ణయం 2023 ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి వర్తిస్తుందని పేర్కొంది. దీని ప్రకారం ఎంపీల నెలవారీ వేతనం రూ.లక్ష నుంచి రూ.1.24 లక్షలకు, దినసరి భత్యం రూ.2,000 నుంచి రూ.2,500లకు పెరిగింది. మాజీ ఎంపీలకు ప్రస్తుతం నెలకు రూ.25,000 పెన్షన్ వస్తుండగా దాన్ని రూ.31వేలకు పెంచింది. అయిదేళ్ల కన్నా ఎక్కువ కాలం పాటు ఎంపీగా పనిచేస్తే ప్రతి అదనపు సంవత్సరానికీ అధిక పెన్షన్ లభిస్తుంది. దానిని కూడా ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం పెంచింది. అలాంటి వారికి ప్రస్తుతం నెలకు అదనంగా రూ.2,000 ఇస్తుండగా, ఇకపై రూ.2,500 ఇవ్వనుంది.

తన వ్యాఖ్యలు వక్రీకరించారన్న డీకే

డీకే శివకుమార్‌పై ఆరోపణలతో కాంగ్రెస్ అధిష్ఠానం అప్రమత్తమైంది. ఈ విషయమై వివరాలు తెలుసుకోవాలని పార్టీ అగ్రనేత చిదంబరాన్ని ఆదేశించింది. ఆయన డీకే శివకుమార్‌కు ఫోన్ చేశారు. తన వ్యాఖ్యలను వక్రీకరించారని డీకే వివరణ ఇచ్చినట్లు తెలిసింది. బీజేపీ నాయకుల కుట్ర అని చెప్పినట్లు సమాచారం. కోర్టు తీర్పులకు అనుగుణంగా సవరణలు చేసే వీలుందనే చెప్పానని, రాజ్యాంగాన్ని మార్చాలని అనలేదని చెప్పినట్లు తెలిసింది.

విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు టాస్క్‌ఫోర్స్

- జస్టిస్ భట్ ఛైర్మన్‌గా ఏర్పాటు చేసిన సుప్రీం





రవీంద్ర భట్

న్యూఢిల్లీ, మార్చి 24: ఉన్నత విద్యాసంస్థల్లో తరచుగా విద్యార్థులు ఆత్మహత్యకు పాల్పడుతుండటంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. విద్యార్థుల మానసిక ఆరోగ్య సమస్యల పరిష్కారానికి, ఆత్మహత్యల నివారణకు జాతీయ స్థాయి టాస్క్‌ఫోర్స్(ఎన్‌టీఎఫ్)ను ఏర్పాటు చేసింది. సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ ఎస్.రవీంద్ర భట్‌ను ఎన్‌టీఎఫ్‌కు ఛైర్మన్‌గా నియమించింది. ఉన్నత విద్య, సామాజిక న్యాయం-సాధికారిత, మహిళా శిశు అభివృద్ధి, న్యాయ శాఖల కార్యదర్శులు ఎన్‌టీఎఫ్‌లో ఎక్స్ అఫిషియో సభ్యులుగా ఉంటారని తెలిపింది. విద్యార్థుల ఆత్మహత్యకు కారణాలు గుర్తించడం, ప్రస్తుతం ఉన్న నిబంధనలను విశ్లేషించడం, వారి రక్షణను బలోపేతం చేసేందుకు సిఫారసులు సహా సమగ్ర నివేదికను ఎన్‌టీఎఫ్ రూపొందిస్తుందని ధర్మాసనం తెలిపింది. దీనికోసం ఏ ఉన్నతవిద్యా సంస్థనైనా ఆకస్మికంగా తనిఖీ చేసే అధికారం ఎన్‌టీఎఫ్‌కు ఉందని తెలిపింది. నాలుగు నెలల వ్యవధిలో మధ్యంతర నివేదికను, ఎనిమిది నెలల వ్యవధిలో తుది నివేదికను ఎన్‌టీఎఫ్ అందజేయాలని నిర్దేశించింది. 2023 జూలై 8న ఆయుష్ అష్న, సెప్టెంబరు 1న అనిల్ కుమార్ అనే దళిత విద్యార్థులు ఐఐటీ-ఢిల్లీలోని హాస్టల్ గదుల్లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే, అవి హత్యలేనని వారి తల్లిదండ్రులు ఆరోపించారు. కుల వివక్ష పట్ల తమ పిల్లలు ఆందోళన చెందారని తెలిపారు. ఘటనలపై ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని పోలీసులను ఆదేశించాలని కోరుతూ చేసిన అభ్యర్థనలను ఢిల్లీ హైకోర్టు తోసిపుచ్చిన నేపథ్యంలో వారి తల్లిదండ్రులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. వారి అభ్యర్థనను సుప్రీంకోర్టు మన్నించింది.

ర్యాగింగ్‌తో మూడేళ్లలో 51 మంది మృతి

విద్యా సంస్థల్లో ర్యాగింగ్ కారణంగా మూడేళ్ల వ్యవధిలో 51 మంది ప్రాణాలు కోల్పోయారు. అదే సమయంలో పరీక్షల ఒత్తిడి కారణంగా కోచింగ్ సెంటర్ల కేంద్రమైన రాజస్థాన్‌లోని కోటాలో 57 మంది ఆత్మహత్య చేసుకున్నారు. సొసైటీ ఎగనెస్ట్ వయలెన్స్ ఇన్ ఎడ్యుకేషన్ (సేవ్) సంస్థ 2022-24సంవత్సరాల మధ్య కాలానికి జరిపిన అధ్యయనంలో ఈ విషయం వెల్లడైంది. అధ్యయనంలో భాగంగా సేవ్ సంస్థ ర్యాగింగ్ హెల్ప్‌లైన్‌కు వచ్చిన 3,156ఫిర్యాదులను విశ్లేషించింది. ర్యాగింగ్ సమస్య వైద్య కళాశాలల్లో ఎక్కువున్నట్లు తేలింది.

చంపేస్తాం.. సస్పెండ్ చేయిస్తాం!

- ఆస్తిపన్ను వసూలుకు వెళ్లే సిబ్బందికి మొండి బకాయిదారుల బెదిరింపులు
- పదేళ్లుగా పన్ను కట్టని ప్రైవేటు స్కూలు
- రూ.3.03 లక్షలకు చేరిన బకాయిలు
- బాలాపూర్‌లో ఆ స్కూల్ వద్ద మునిసిపల్ సిబ్బంది బైఠాయింపు

సరూర్‌నగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): సంవత్సరాల తరబడి ఆస్తి పన్ను చెల్లించని కొందరు మొండి బకాయిదారులు.. మునిసిపల్ అధికారులు, సిబ్బంది పట్ల బెదిరింపులకు దిగుతున్నారు. ఏకంగా చంపేస్తా.. సస్పెండ్ చేయిస్తా.. అని హెచ్చరిస్తున్నారు. దీంతో ఆస్తి పన్ను వసూళ్లకు వెళ్లాలంటే.. మునిసిపల్ అధికారులు, సిబ్బంది భయాందోళనకు గురవుతున్నారు. ఈ తరుణంలో పోలీసుల సహకారం తీసుకోవాలని వారు భావిస్తున్నారు. నాలుగేళ్లుగా రూ.2.50 లక్షల ఆస్తిపన్ను బకాయి ఉన్న బడంగ్‌పేట్ ప్రధాన రహదారిలోని ఓ భవనానికి ఇటీవల అధికారులు జప్తు నోటీసు జారీ చేశారు. దీంతో ఆ భవనం యజమాని.. 'నా భవనం మీద చేయి వేస్తే (సీజ్‌చేస్తే) చంపేస్తా' అని మునిసిపల్ సిబ్బందిని బెదిరించాడు. అలాగే, బాలాపూర్‌లోని జాన్ మిల్టన్ స్కూల్ యాజమాన్యం పదేళ్లుగా ఆస్తి పన్ను చెల్లించకపోవడంతో మొత్తం బకాయి రూ.3.03 లక్షలకు చేరింది. ఎన్నిసార్లు నోటీసులిచ్చినా యాజమాన్యం స్పందించకపోవడంతో 15 రోజుల క్రితం బడంగ్‌పేట్ మునిసిపల్ కార్పొరేషన్ అధికారులు జప్తు నోటీసు జారీ చేశారు. దీంతో స్కూల్ యజమాన్య ప్రతినిధి ఒకరు మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి.. 'మేం ప్రభుత్వం నుంచి మినహాయింపు తెచ్చుకుంటాం.. అప్పటి వరకు మా జోలికి వస్తే సస్పెండ్ చేయిస్తాం' అని హెచ్చరించి వెళ్లినట్టు అధికారులు తెలిపారు. దాంతో సోమవారం మధ్యాహ్నం అదనపు కమిషనర్ (ఏఎంసీ) శ్యాంసుందర్ సహా అధికారులు, సిబ్బంది.. తరగతుల నిర్వహణ సమయం ముగియగానే స్కూల్‌కు వెళ్లి సీజ్ చేయడానికి ప్రయత్నించారు. స్కూలు సిబ్బందిని బయటకు రమ్మన్నా వారు మొండికేశారు. పైగా 'ఏం చేసుకుంటారో.. చేస్కోండి' అంటూ యాజమాన్యం బెదిరింపులకు దిగడంతో చివరికి 20 మంది మునిసిపల్ సిబ్బంది, అధికారులు స్కూల్ ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. మంగళవారంలోగా పన్ను చెల్లించకపోతే భవనం సీజ్ చేయకతప్పదని ఏఎంసీ శ్యాంసుందర్ స్కూలు యాజమాన్యానికి స్పష్టం చేశారు.


బాలాపూర్‌లోని జాన్ మిల్టన్ స్కూల్ ముందు బైఠాయించిన మునిసిపల్ సిబ్బంది

అడవిలో చిక్కిపోయాడు.. అక్కడే ప్రాణాలు వదిలాడు

- తిండి లేక, నీరు దొరక్క అలమటిస్తూ మృతి
- మేడారం మినీ జాతరకు వచ్చి మిస్సింగ్
- నెల రోజుల తర్వాత మృతదేహం లభ్యం



తాడ్వాయి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ములుగు జిల్లా తాడ్వాయి మండలంలో గత నెల మేడారం మినీ జాతరలో తప్పిపోయిన వ్యక్తి మృతదేహం అడవి ప్రాంతంలో సోమవారం లభ్యమైంది. జాతరకు వచ్చిన అతడు అడవి ప్రాంతానికి వెళ్లి దారి దొరక్క చిక్కిపోయాడని, తిండి దొరక్క, నీరు లభించక అలమటిస్తూ నిస్సహాయ స్థితిలో అక్కడే ప్రాణాలు వదిలాడని తెలుస్తోంది. ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం..

వరంగల్ జిల్లా ఖానాపురం మండల కేంద్రానికి చెందిన జబ్బ సారంగం (60) వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగించేవాడు. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారంలో ఫిబ్రవరి 13న జరిగిన మినీ జాతరకు కుటుంబ సమేతంగా అతడు హాజరయ్యాడు. ఈ క్రమంలో ఉన్నట్టుండి సారంగం కనిపించకుండా పోయాడు. దీంతో జాతరలో కుటుంబ సభ్యులు వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో చివరకు వారు పోలీసులను ఆశ్రయించగా మిస్సింగ్ కేసు నమోదైంది. ఈ క్రమంలో ఫారెస్టు బీట్ ఆఫీసర్ సుమన్‌కు సోమవారం మేడారం అటవీ ప్రాంతంలో మృతదేహం కనిపించింది. దీనిపై ఆయన పోలీసులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ఆ మృతదేహం సారంగందిగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహం కుళ్లిపోయి ఉండటంతో తరలించడం సాధ్యం కాక అడవిలోనే ఖననం చేసినట్టు ఎస్సై తెలిపారు. దీనికి ముందుకు సంఘటన స్థలంలోనే పోస్టుమార్టం నిర్వహించగా అడవిలో తిండి లేక, నీరు దొరక్క సారంగం మృతి చెంది ఉంటాడని వైద్యాధికారి నిర్ధారించారు.

కుమారుడి అవయవాలు దానం చేసిన తల్లిదండ్రులు

ఇబ్రహీంపట్నం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీలోని కృష్ణా జిల్లా నందిగామకు చెందిన టి.ప్రమీలరాణి, శివశంకర్ ప్రభుత్వ ఉపాధ్యాయులు. వారి కుమారుడు అసిలేష్(20)రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నంలోని గురునానక్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నికల్ క్యాంపస్‌లో కంప్యూటర్ సైన్స్ చివరి సంవత్సరం చదువుతూ ఎల్బీ నగర్‌లోని ఓ ప్రైవేట్ హాస్టల్‌లో ఉంటున్నాడు. కాగా శనివారం అనారోగ్యంతో ఉన్న అతడిని తోటి హాస్టల్ విద్యార్థులు ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు పెద్దాసుపత్రికి తీసుకెళ్లాల్సిందిగా సూచించారు. అసిలేష్ తల్లిదండ్రుల సూచనతో కిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించారు. అదే రోజు రాత్రి బ్రెయిన్‌డెడ్‌గా వైద్యులు నిర్ధారించారు. అనంతరం తల్లిదండ్రులు ప్రమీలారాణి, శివశంకర్ వైద్యుల సలహా మేరకు అవయవ దానం చేశారు.వ

ఫోన్ ట్యాపింగ్ కేసు.. సుప్రీంలో శ్రవణ్‌రావుకు ఊరట

- మధ్యంతర రక్షణ కల్పిస్తూ ఆదేశాలు

న్యూఢిల్లీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో ఆరో నిందితుడు, ఓ మీడియా సంస్థ ఎండీ శ్రవణ్‌రావుకు సుప్రీంకోర్టులో ఊరట లభించింది. ఆయనకు మధ్యంతర రక్షణ కల్పిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఆదేశాలిచ్చింది. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ శ్రవణ్ హైకోర్టును ఆశ్రయించగా, ఈ నెల 2న ఆ పిటిషన్ తిరస్కరణకు గురైంది. దాంతో శ్రవణ్‌రావు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీనిపై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ సతీశ్‌చంద్ర శర్మతో కూడిన ద్విసభ్య ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. శ్రవణ్‌రావు తరఫున సీనియర్ న్యాయవాది దామా శేషాద్రి నాయుడు వాదనలను వినిపించారు. తన క్లైంట్ విచారణకు సహకరిస్తారని, అందుబాటులో ఉంటారని ధర్మాసనం దృష్టికి తీసుకెళ్లారు. దర్యాప్తు అధికారులు ఇప్పటి వరకు తన క్లైంట్‌ను విచారించేందుకు ఎలాంటి నోటీసులివ్వలేదని గుర్తుచేశారు. ఈ కారణంగా.. మధ్యంతర రక్షణ కల్పించాలని విజ్ఞప్తిచేశారు. ప్రభుత్వం తరఫు న్యాయవాది దీనికి అభ్యంతరం తెలిపారు. శ్రవణ్‌రావు పరారీలో ఉన్నారని, ఆయనపై రెడ్ కార్నర్ నోటీసు సైతం జారీ అయ్యిందని వివరించారు. ఏడాది కాలంగా ఆయన అమెరికాలో ఉన్నారని తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులో శ్రవణ్ కీలకపాత్ర పోషించారని ఆరోపించారు. ఆయనను విచారిస్తే.. కీలక సాక్ష్యాధారాలు వెలుగులోకి వచ్చే అవకాశముందని అభిప్రాయపడ్డారు. మధ్యలో కల్పించుకున్న జస్టిస్ నాగరత్న.. "శ్రవణ్‌రావును ఈరోజు అరెస్టు చేస్తున్నారా?" అని శ్రవణ్ తరఫు న్యాయవాదిని ప్రశ్నించారు. దానికి న్యాయవాది సమాధానమిస్తూ.. ప్రస్తుతం తన క్లయింట్ అమెరికాలో ఉన్నందున అరెస్టు చేయలేదని చెప్పారు. మధ్యంతర రక్షణ కల్పిస్తే. 48 గంటల్లో భారత్‌కు వస్తారని వివరించారు. ధర్మాసనం కల్పించుకుంటూ.. మధ్యంతర రక్షణ కల్పించకపోతే శ్రవణ్ దేశానికి రారని, తొలుత ఆయనను రప్పించాలని అభిప్రాయపడింది. శ్రవణ్‌కుమార్‌పై కఠిన చర్యలు తీసుకోకూడదని పేర్కొంటూ.. మధ్యంతర రక్షణ కల్పించింది. పోలీసు విచారణకు సహకరించాలని ఆదేశించింది. వచ్చేనెల 28న ఈ కేసు మరోమారు విచారణకు వచ్చే అవకాశముంది.

ఎంఎంటీఎస్‌లో అత్యాచార యత్నం

ఒంటరి యువతిపై దుండగుడి దాష్టీకం.. రైలు నుంచి దూకిన యువతి.. ఆస్పత్రికి తరలింపు

- పరారీలో నిందితుడు.. అతడి ఫొటో గుర్తింపు


నిందితుడు మహేశ్

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్/అడ్డగుట్ట/హైదరాబాద్ సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైలులో దారుణం జరిగింది. మహిళా బోగీలో ఒంటరిగా ఉన్న యువతిపై గుర్తు తెలియని వ్యక్తి లైంగిక దాడికి యత్నించాడు. దీంతో ఆమె భయపడి రైలు నుంచి దూకింది. బాధితురాలిని రైల్వే సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏపీలోని అనంతపురం జిల్లాకు చెందిన యువతి(23) స్విగ్గీలో పనిచేసుకుంటూ మేడ్చల్‌లోని ఓ హాస్టల్‌లో ఉంటోంది. ఈ నెల 22న సెల్‌ఫోన్ రిపేర్ కోసం సికింద్రాబాద్‌కు వచ్చింది. తిరిగి హాస్టల్‌కు వెళ్లేందుకు రాత్రి 7 గంటల సమయంలో తెల్లాపూర్ నుంచి మేడ్చల్ వైపు వెళ్లే ఎంఎంటీఎస్‌లోని మహిళల బోగీలోకి ఎక్కింది. ఆమెతోపాటు ఉన్న మరో ఇద్దరు మహిళలు అల్వాల్ స్టేషన్‌లో దిగిపోవడంతో బాధితురాలు ఒంటరిగా ఉంది. యువతి సెల్‌ఫోన్ చూసుకుంటుండగా గుర్తు తెలియని యువకుడు(23) బోగీలోకి ప్రవేశించాడు. ఒంటరిగా ఉన్న ఆమె పట్ల అసభ్యం గా ప్రవర్తించాడు. బలవంతం చేసే ప్రయత్నం చేయడంతో భయపడిన యువతి కదులుతున్న రైలు నుంచి దూకేసింది. గాయాలతో ఉన్న ఆమెను గుర్తించిన స్థానికులు.. పోలీసులు, 108కు సమాచారం అందించారు. దీంతో జీఆర్పీ సిబ్బంది అక్కడికి చేరుకుని బాధితురాలిని గాంధీ ఆస్పత్రికి తరలించారు. కాగా, ఆస్పత్రికి వెళ్లిన రైల్వే ఎస్పీ చందనా దీప్తి బాధితురాలిని పరామర్శించారు. నిందితుడిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. ప్రస్తుతం యువతి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని చెప్పారు. మాట్లాడలేని స్థితిలో ఉన్న ఆమె నుంచి అతికష్టం మీద వివరాలను సేకరించామని తెలిపారు. కాగా, అత్యాచార యత్నం చేసింది మేడ్చల్ సమీపంలోని గౌడవల్లికి చెందిన మహేశ్‌గా పోలీసులు గుర్తించారు. నిందితుడిగా అనుమానిస్తున్న ఒకరి ఫొటోను బాధితురాలికి చూపించగా.. ఆమె అతడేనని నిర్ధారించింది. మహేశ్‌పై నగరంలోని పలు పోలీస్‌స్టేషన్లలో చాలా కేసులు ఉన్నాయి.


బాధితురాలిని పరామర్శిస్తున్న రైల్వే ఎస్పీ చందనా దీప్తి

బండి సంజయ్ చొరవతో యశోదాకు..


రాష్ట్రంలో మహిళలకు భద్రత లేదని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆస్పత్రిలో ఉన్న బాధితురాలిని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌తో కలిసి ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా సబిత మాట్లాడారు. బాధితురాలిని ప్రభుత్వం అన్ని విధాలా ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అందాల పోటీలు కాదు, మహిళలకు భద్రత కల్పించాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు శిల్పారెడ్డి గాంధీ ఆస్పత్రిలో బాధితురాలిని పరామర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ సూచన మేరకు బాధితురాలిని యశోద ఆస్పత్రికి తరలించారు. యువతి కుటుంబ సభ్యులతో బండి సంజయ్ ఫోన్‌లో మాట్లాడారు. అధైర్యపడొద్దని అండగా ఉంటామని భరోసా ఇచ్చా రు. నిందితులపై కఠిన చర్యలు తీసుకునేలా ప్రభు త్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు. బీజేపీ ఎమ్మెల్యేలు పాయల్ శంకర్, హరీష్ బాబుతోపాటు పలువురు బీజేపీ నేతలు ఆస్పత్రిలో బాధితురాలిని పరామర్శించారు. ఇంత దుర్మార్గం జరిగినా నిందితుడి అరెస్టులో జాప్యం చేయడం సరికాదన్నారు.

ఇదేనా ఇందిరమ్మ రాజ్యం: హరీశ్‌రావు

రైలులో యువతిపై అత్యాచారయత్నం ఘటన తెలంగాణ సమాజాన్ని కలచివేసిందని, రాజధానిలోనే ఇలాంటి దారుణాలు జరుగుతుంటే ప్రభుత్వం, పోలీసు, రైల్వే యంత్రాంగం ఏం చేస్తోందని మాజీ మంత్రి హరీశ్‌రావు ఎక్స్ వేదికగా ప్రశ్నించారు. రాష్ట్రంలో శాంతి భద్రతలు దిగజారిపోవడానికి హోంమంత్రిగా ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతగాని పాలనే కారణమని మండిపడ్డారు. ఇందిరమ్మ రాజ్యంలో మహిళల భద్రత ప్రశ్నార్థకంగా మారడం సిగ్గుచేటన్నారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాదిలో అత్యాచార కేసులు 29 శాతం పెరిగాయని డీజీపీ ప్రకటించారని తెలిపారు. కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేస్తామని ప్రగల్భాలు పలకడం కాదని.. ముందు మహిళల ప్రాణాలకు భద్రత కల్పించాలని హరీశ్ రావు విమర్శించారు.

శ్రీవారి ఆస్తుల పరిరక్షణకు ప్రత్యేక కమిటీ

- రూ.5,258.68 కోట్ల అంచనాతో టీటీడీ వార్షిక బడ్జెట్
- టీటీడీలో ఉద్యోగులంతా హిందువులే అయి ఉండాలి
- కొండ అంచు భూమి ఇక దేవస్థానం పరిధిలోకే.. ఆగమ సలహా మండలి రద్దు.. త్వరలో కొత్త సలహా మండలి
- దేశ, విదేశాల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణానికి కొత్తగా ట్రస్టు
- టీటీడీ తీర్మానాలు వెల్లడించిన చైర్మన్ బీఆర్ నాయుడు



తిరుమల, మార్చి 24(ఆంధ్రజ్యోతి): శ్రీవారికి దేశవ్యాప్తంగా ఉన్న ఆస్తులు పరిరక్షించడం, సద్వినియోగపరచడం లక్ష్యంగా ఓ కమిటీని ఏర్పాటు చేస్తున్నామని తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ) చైర్మన్ బీఆర్ నాయుడు చెప్పారు. శ్రీవారి పవిత్రమైన భూమిలో ఒక్క అంగుళం కూడా అన్యాక్రాంతం కాకూడదని నిర్ణయం తీసుకున్నట్లు వివరించారు. న్యాయస్థానాల్లో ఉన్న స్వామి ఆస్తుల వివాదాల విచారణ ప్రక్రియ వేగవంతం చేసేందుకు కృషి చేస్తామని తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి టీటీడీ వార్షిక బడ్జెట్ రూ.5,258.68 కోట్ల అంచనాలతో ఆమోదించినట్లు వెల్లడించారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో సోమవారం టీటీడీ ధర్మకర్తల మండలి సమావేశం జరిగింది. అనంతరం ఈవో శ్యామలరావు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, మరికొంతమంది సభ్యులతో కలిసి బీఆర్ నాయుడు మీడియాకు వివరాలు వెల్లడించారు. టీటీడీ ఆదాయాల్లో అత్యధికం హుండీ ద్వారానే సమకూరుతోందని తెలిపారు. 2025-26లో హుండీ ద్వారా రూ.1,729 కోట్లు రావచ్చని బడ్జెట్‌లో అంచనా వేశామన్నారు. అలాగే పెట్టుబడులపై వడ్డీ ద్వారా రూ.1,310 కోట్లు రావచ్చని పేర్కొన్నారు. ప్రసాదాల అమ్మకాలపై రూ.600కోట్లు, దర్శన టికెట్ల విక్రయం ద్వారా రూ.310కోట్లు, తలనీలాల విక్రయం ద్వారా రూ.176.50కోట్లు, ఆర్జితసేవల నుంచి రూ.130కోట్లు, అద్దె గదులు, కల్యాణ మండపాలు ద్వారా రూ.157కోట్ల ఆదాయం వస్తుందని అంచనా వేసినట్టు చైర్మన్ వివరించారు. ఇక ఖర్చుల్లో ప్రధానంగా.. ఇంజినీరింగ్ పనులకు రూ.350 కోట్లు, మెటీరియల్ కొనుగోళ్లకు రూ.768.50 కోట్లు, కార్పస్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్స్‌కు రూ.800 కోట్ల అంచనా వేశామని చైర్మన్ వివరించారు. కాగా, శ్రీవారి దర్శన సమయాన్ని తగ్గించే అంశంపై ఏఐ సేవలు అందించేందుకు గూగుల్ సంస్థ ముందుకు వచ్చిందని బీఆర్ నాయుడు తెలిపారు. వారి సహకారంతో ఫిజికల్ క్యూలైన్‌ను తగ్గించడం, వివిధ విభాగాల్లో ముఖ ఆధారిత గుర్తింపు వ్యవస్థను అమలు చేయడం వంటివి చేయాలని బోర్డు నిర్ణయించిందని చెప్పారు.

నిర్ణయాలు..

- కొడంగల్, కరీంనగర్, ఉపమాక, అనకాపల్లి, కర్నూల్, ధర్మవరం, తలకోన, తిరుపతి గంగమ్మ ఆలయాల పునఃనిర్మాణానికి ఆర్థిక సాయం అందించేందుకు ఆమోదం.
- తిరుపతిలో సైన్స్ సిటీ, మ్యూజియంలకు గతంలో కేటాయించిన 20 ఎకరాల భూమి అనుమతులు రద్దు.
- వృద్ధులు, దివ్యాంగులకు ఆఫ్‌లైన్‌లోనూ శ్రీవారి దర్శనం కల్పించేలా సాధాసాధ్యాలను పరిశీలించాలని నిర్ణయం.
- ప్రస్తుతం 10 గంటలకు మొదలవుతున్న వీవీపీ బ్రేక్ దర్శనాన్ని ఉదయం 5.30 గంటలకు మార్చే అంశం పరిశీలనకు నిర్ణయం.
- రాష్ట్రంలోని చిన్న పట్టణాలు, గ్రామాలు, దళితవాడల్లో ఆర్థిక సమస్యలతో ఆగిపోయిన దేవాలయాలనూ, శిథిలావస్థకు చేరిన దేవాలయాల జీర్ణోద్ధరణకు నిర్ణయం. నూతన ఆలయాల నిర్మాణానికి శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆర్థిక సాయం.
- టీటీడీ శాశ్వత ఉద్యోగుల సిఫారసు లేఖలపై మూడునెలలకోసారి సుపథం ద్వారా ప్రత్యేక ప్రవేశ దర్శనం.

టీవీ నటిపై లైంగిక దాడికి యత్నం

- షాప్ ఓపెనింగ్‌కు పిలిచి దారుణం
- దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు
- పోలీసుల అదుపులో నటి స్నేహితుడు

మంగళ్‌హాట్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): బంజారాహిల్స్ ప్రాంతంలో ముంబై టీవీ నటిని బంధించి వేధింపులకు గురిచేయడమే కాకుండా నిలువు దోపిడి చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. పశ్చిమబెంగాల్‌కు చెందిన నటి(30) గత 4 సంవత్సరాలుగా ముంబైలో ఉంటున్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన గాయత్రి అనే మహిళ హైదరాబాద్ నగరంలో ఓ దుకాణం ప్రారంభోత్సవానికి ఎవరైనా నటిని పంపించాలని ముంబైలో ఉంటున్న తన స్నేహితుడు పంకజ్‌ని కోరింది. దీంతో పంకజ్ తనకు తెలిసిన టీవీ నటిని ఈ నెల 18న హైదరాబాద్ నగరానికి పంపించాడు. గాయత్రితో పాటు మరో స్నేహితురాలితో కలిసి నటికి మాసబ్ ట్యాంక్ శ్యామ్‌నగర్ కాలనీలోని ఓ ఆపార్ట్‌మెంట్‌లో బస ఏర్పాటు చేశారు. ఈ నెల 21న ముగ్గురు యువకులు వస్తారని వారి కోరిక తీర్చాలని నటికి గాయత్రి చెప్పింది. నటి గదిలోకి ప్రవేశించిన ముగ్గురు వ్యక్తులు తమ కోరిక తీర్చాలన్నారు. ఆమె నిరాకరించడంతో దాడి చేశారు. రక్షణ కోసం నటి అరవడంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. ఇలా ఉండగా గదిలో ఉన్న మరో ఇద్దరు యువతులు నటిని బంధించి నగదు, బంగారంతో అక్కడి నుంచి ఉడాయించారు. నటి తేరుకుని 100 నెంబరుకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వడంతో మాసబ్ ట్యాంక్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు. ఆపార్ట్‌మెంట్‌లోని సీసీ కెమెరాల ఫుటేజీలతో పాటు గత 4 రోజులుగా కొత్త వ్యక్తుల రాకపోకలపై ఆరా తీశారు. పోలీసులు ముంబైకి వెళ్లి నటి స్నేహితుడు పంకజ్‌ను అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.


కంచ గచ్చిబౌలిలోని 400 ఎకరాలను వేలం వేయొద్దు

- అది అటవీ ప్రాంతం.. అందులో నేషనల్ పార్కు అభివృద్ధి చేయండి
- బదలాయింపు జీవో 54ను కొట్టేయండి
- హైకోర్టులో 'వట ఫౌండేషన్' పిల్ .. ప్రభుత్వానికి నోటీసులు జారీ

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కంచ గచ్చిబౌలిలో రాష్ట్ర ప్రభుత్వం వేలానికి పెట్టిన 400 ఎకరాలు అటవీ భూమి అని, దానిని విక్రయించడం చట్టవిరుద్ధమని పేర్కొంటూ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. లాభాపేక్ష రహిత పర్యావరణ స్వచ్ఛంద సంస్థ 'వట ఫౌండేషన్' ఈ పిల్ దాఖలు చేసింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలం కంచ గచ్చిబౌలి గ్రామం సర్వే నెంబర్ 25లో ఉన్న 400 ఎకరాల భూమిని తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టీజీఐఐసీ)కి బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది జూన్ 26న జీవో 54 జారీచేసింది. ఐటీ కంపెనీలు, మౌలిక సదుపాయాల కోసం ఇంటర్నేషనల్ మాస్టర్ ప్లాన్ లేఅవుట్ సిద్ధం చేయాలని సూచించింది. మార్కెట్ విలువ ప్రకారం దాదాపు రూ.75 కోట్లకు ఎకరం చొప్పున విక్రయించాలని లక్ష్యంగా నిర్దేశించుకుంది. ఈ భూమిని దశలవారీగా విక్రయించేందుకుగానూ ఇంటర్నేషనల్ మాస్టర్ ప్లాన్ లేఅవుట్ సిద్ధం చేయడానికి టీజీఐఐసీ ఈ ఏడాది ఫిబ్రవరి 28న బిడ్లు ఆహ్వానించింది. ఈ ప్రక్రియను అడ్డుకోవడంతోపాటు అటవీ భూమిని విక్రయించకుండా నిలువరించాలని వట సంస్థ కోరింది. ఈ పిటిషన్‌పై సోమవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజోయ్‌పాల్, జస్టిస్ రేణుక ధర్మాసనం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎస్ నిరంజన్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. అటవీ సంరక్షణ చట్టం - 1980కి విరుద్ధంగా ప్రభుత్వం అటవీభూమిని విక్రయించడానికి సిద్ధమైందని పేర్కొన్నారు. ఆ 400 ఎకరాలతోపాటు చుట్టుపక్కల ప్రాంతాలు ఎకోలాజికల్ సెన్సిటివ్ జోన్ కిందికి వస్తాయని.. అక్కడ చక్కటి జీవవైవిధ్యం ఉందని తెలిపారు. వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ 1972 సెక్షన్ 35 ప్రకారం ఆ ప్రాంతాన్ని జాతీయ పార్కుగా నోటిఫై చేయాలని కోరారు. భూమి బదలాయింపు జీవోను కొట్టివేయాలని కోరారు. వాదనలు విన్న ధర్మాసనం.. కౌంటర్లు దాఖలు చేయాలని పేర్కొంటూ ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. భూమి వేలం ప్రక్రియ ముందుకు సాగకుండా తక్షణం మధ్యంతర ఉత్తర్వులు జారీచేయాలని పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కోరారు. అయితే ప్రభుత్వ స్పందన తెలుసుకోకుండా ఉత్తర్వులు ఇవ్వడానికి ధర్మాసనం నిరాకరించింది. ఈ విషయమై రాష్ట్ర ప్రభుత్వానికి కనీసం పది రోజులైన సమయం ఇవ్వాలని అభిప్రాయపడింది. తదుపరి విచారణను ఏప్రిల్ 7వ తేదీకి వాయిదా వేసింది.

చంపాపేటలో న్యాయవాది దారుణహత్య

- మృతుడు రంగారెడ్డి జిల్లా మహేశ్వరం కాంగ్రెస్ నేత కూడా


ఇజ్రాయెల్ (ఫైల్)

మహేశ్వరం/ సైదాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రియురాలి చిరునామా చెప్పడంలేదని ఓ న్యాయవాదిని దారుణంగా చంపాడో దుండగుడు. ఈ ఘటన సోమవారం హైదరాబాద్‌లోని ఐఎస్ సదన్‌లో జరిగింది. రంగారెడ్డి జిల్లా మహేశ్వరం మండలం తుమ్మలూరు గ్రామానికి చెందిన న్యాయవాది, కాంగ్రెస్ సీనియర్ నేత ఇజ్రాయెల్ కుటుంబసభ్యులతో కలిసి ఐఎస్ సదన్ పరిధిలోని చంపాపేటలో నివాసముంటూ.. తన ఇంటికి సమీపంలోని ఓ అపార్ట్‌మెంటులో కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఆ అపార్ట్‌మెంట్‌లోని వాచ్‌మెన్ భార్యతో అదే ప్రాంతంలో ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్న దస్తగిరి అనే వ్యక్తికి వివాహేతర సంబంధం ఏర్పడింది. దాంతో ఇరు కుటుంబాల మధ్య గొడవలు జరుగుతుండగా ఇజ్రాయెల్ వారికి రాజీ కుదిర్చాలని ప్రయత్నం చేశారు. ఈ క్రమంలో అపార్ట్‌మెంట్ వాసులు వాచ్‌మెన్ కుటుంబాన్ని పనుల నుంచి తొలగించగా, వారు తమ స్వస్థలానికి వెళ్లిపోయారు. ఇదిలా ఉండగా ఆమెను హైదరాబాద్‌కు పిలిపించాలని దస్తగిరి పలుమార్లు ఇజ్రాయెల్‌ను కోరాడు. తాను లాయర్‌నని బ్రోకర్‌ను కాదని ఇజ్రాయెల్ దస్తగిరిపై తీవ్ర ఆగ్రహాన్ని వ్యక్తం చేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దాంతో వారు దస్తగిరిని పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి పంపారు. వాచ్‌మెన్ భార్య తనకు దూరం కావడానికి ఇజ్రాయెలే కారణమని భావించిన దస్తగిరి, ఆయన వల్లే పోలీసులు తనకు కౌన్సిలింగ్ ఇవ్వడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. దాంతో ఇజ్రాయెల్‌పై పగ పెంచుకుని చంపాలని పథకం పన్నాడు. ఈ క్రమంలో సోమవారం ఉదయం ఇజ్రాయెల్ వాకింగ్‌కు వెళ్లి వస్తున్న సమయంలో దస్తగిరి కాపుకాసి ఆయనపై కత్తితో అందరూ చూస్తుండగానే విచక్షణారహితంగా దాడి చేశాడు. స్థానికులు ఇజ్రాయెల్‌ను ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందారు.

నేడు హైకోర్టులో విధుల బహిష్కరణ

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎర్రబాపు ఇజ్రాయెల్ అనే న్యాయవాదిని ప్రత్యర్థి కక్షిదారు హత్య చేసిన ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు హైకోర్టు బార్ అసోసియేషన్ సోమవారం పేర్కొంది. ఇందుకు నిరసనగా మంగళవారం హైకోర్టులో విధులు బహిష్కరిస్తున్నట్లు పేర్కొంది. అయితే హైకోర్టు బార్ అసోసియేషన్ ఎన్నికల ప్రక్రియ యథావిధిగా కొనసాగుతుందని పేర్కొంది.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

కొలీజియంకు కొత్తపరీక్ష

ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మను అలహాబాద్ హైకోర్టుకు పంపేయాలని సుప్రీంకోర్టు కొలీజియం నిర్ణయించడం ఆశ్చర్యం. వెనక్కుపంపేయాలని నాలుగు రోజుల క్రితం సుప్రీంకోర్టు అనుకున్నప్పుడే అక్కడి బార్ అసోసియేషన్ తీవ్రంగా తప్పుబట్టి, ఇదేమీ చెత్తకుండీ కాదు, అవినీతి ఆరోపణలు వచ్చిన వ్యక్తిని మా నెత్తినరుద్దవద్దంటూ అభ్యంతరం చెప్పింది. అవినీతి ఆరోపణలకు, ఈ బదిలీకి సంబంధం లేదని సుప్రీంకోర్టు అన్నంతమాత్రాన ఏ పరిణామాల నేపథ్యంలో ఈ నిర్ణయం జరిగిందో తెలియనిదేమీ కాదు. మిగతా సందర్భాల్లో న్యాయమూర్తుల బదిలీల్లో ఆయా రాష్ట్రాల బార్ అసోసియేషన్ల అభ్యంతరాలనో, ఆక్షేపణలనో పట్టించుకోకపోవడం వేరు, ఇప్పటి నేపథ్యం వేరు. యశ్వంత్ వర్మను వెనక్కుపంపవద్దని న్యాయవాదుల అసోసియేషన్ శుక్రవారం తొలిగా అభ్యంతరపెట్టినప్పటినుంచి సోమవారం తిరిగి అదే నిర్ణయం తీసుకొనే వరకూ చాలా పరిణామాలు జరిగాయి. ఈ స్వల్పకాలంలో సుప్రీంకోర్టు చూపిన చొరవ, త్వరితగతిన తీసుకున్న నిర్ణయాలు ప్రశంసనీయమైనవి. అవన్నీ కూడా వర్మమీద వచ్చిన ఆరోపణలను మరింత లోతుగా దర్యాప్తు చేయాల్సిన, నిజాన్ని నిగ్గుతేల్చాల్సిన అవసరాన్ని చాటిచెబుతున్నాయి. కానీ, ఇంతలోనే మళ్ళీ ఆయనను అలహాబాద్ పంపాలన్న నిర్ణయానికే సుప్రీంకోర్టు వచ్చిన కారణంగా అక్కడకు సదరు బార్ అసోసియేషన్ అవినీతికి వ్యతిరేకంగా పోరాడుతున్నట్టు, సర్వోన్నత న్యాయస్థానం ఈ కేసులో ఏదో రాజీపడిపోయినట్టు సామాన్యజనానికి అనిపించే ప్రమాదం లేకపోలేదు.

తృణమూల్ ఎంపీ మొహువా మొయిత్రా సోమవారం పార్లమెంట్‌లో యశ్వంత్ వర్మ అంశాన్ని ప్రస్తావిస్తూ, ఒక న్యాయమూర్తిమీద అవినీతి ఆరోపణలు వచ్చిన ఈ ఉదంతాన్ని అస్త్రంగా చేసుకొని, కొలీజియం వ్యవస్థను కుప్పకూల్చే దిశగా ప్రభుత్వం కుట్రకు తెరదీస్తోందని ఓ ఆరోపణచేశారు. రాసిపెట్టుకోండి, ప్రభుత్వమూ, గోదీ మీడియా కలసి కొలీజియం వ్యవస్థను అప్రదిష్టపాల్జేసి, తాము ఎంతోకాలంగా అనుకుంటున్న విధానాన్ని తేవడానికి వీలుగా పరిస్థితులను, వాతావరణాన్ని, కార్యక్షేత్రాన్ని సిద్ధం చేస్తున్నాయి అని వ్యాఖ్యానించారామె. నరేంద్రమోదీ తొలివిడత పాలన తొలి ఏడాది తొలిమాసాలలోనే నేషనల్ జుడీషియల్ అపాయింట్‌మెంట్స్ కమిషన్ (ఎన్‌జెఎసి) ఏర్పాటుకోసం ఓ ప్రయత్నం చేయడం, సుప్రీంకోర్టు మరుసటి ఏడాది దానిని కొట్టివేసి, కొలీజియంను నిలబెట్టుకోవడం తెలిసిందే. సర్వోన్నతన్యాయస్థానంమీద ఆగ్రహమో, అక్కసో వచ్చినప్పుడల్లా బీజేపీ పెద్దలు, న్యాయశాఖమంత్రులు తాము నిలబెట్టుకోలేని ఈ చట్టాన్ని ప్రస్తావిస్తూనే ఉన్నారు. రాజ్యసభ ఉపాధ్యక్షుడు జగ్‌దీప్ ధన్‌ఖడ్ గతంలో దీనిని ఏకంగా ఎంపీల చేతకానితనానికి ప్రతీకగా అభివర్ణించిన సందర్భమూ ఉంది. యశ్వంత్ వర్మ ఉదంతం సందర్భంగా ఆయన దీనిని మళ్ళీ ముందుకు తేవడం, న్యాయవ్యవస్థలో అవినీతిని రూపుమాపే వజ్రాయుధంగా బీజేపీ నాయకులు, కొన్ని మీడియా సంస్థలు చర్చిస్తూండటం గమనార్హం. న్యాయమూర్తుల నియామకాలమీద ప్రభుత్వం నియంత్రణే ఉండే ఈ వ్యవస్థను తెచ్చుకోవడానికి తక్షణమే పాలకులు రంగంలోకి దిగకపోయినప్పటికీ, ఈ వివాదం ఎంతకాలం కొనసాగితే వారికి అంత ఉపకారం జరుగుతుంది. యశ్వంత్ వర్మ అవినీతిని చూపి, తమ ప్రత్యామ్నాయ వ్యవస్థ పరిశుద్ధమైనదన్న వాదనకు ప్రభుత్వం మరింత విలువ సమకూర్చుకోగలదు. సీజేఐ నియమించిన త్రిసభ్యకమిటీ నివేదిక వచ్చేదాకా వేచివుండాలని నిర్ణయించామని అంటూనే, సోమవారం స్వపక్ష, విపక్ష అధినేతలతో ధన్‌ఖడ్ న్యాయవ్యవస్థ మంచిచెడుల గురించి చర్చలు జరపడం గమనార్హం. ఎన్‌జెఎసిని సమర్థించనిపక్షంలో న్యాయస్థానాల్లో అవినీతిని బలపరచిన అప్రదిష్ఠ తమకు వస్తుందేమోనని ప్రతిపక్షాలు సైతం భయపడే పరిస్థితులు ఏర్పడవచ్చు.

వర్మ వ్యవహారంలో చీఫ్ జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పందించిన తీరు ప్రశంసనీయమైంది. ఢిల్లీ హైకోర్టు చీఫ్‌జస్టిస్ నివేదిక, డబ్బుకట్టల చిత్రాలు, వీడియోలతో సహా అందుబాటులో ఉన్న సమస్త సమాచారాన్ని ఆయన ప్రజాక్షేత్రంలో ఉంచారు. ఢిల్లీ హైకోర్టు యశ్వంత్ వర్మకు కేటాయించిన విధులన్నింటినీ రద్దుచేసింది. నామమాత్రంగా జడ్జిగా మిగిలిన ఆయనను కదల్చకుండా వదిలివేసి ఉంటే సరిపోయేది. అలహాబాద్‌కు తిరిగి పంపేయాలన్న కొలీజియం నిర్ణయం ఈ ఉదంతాన్ని మరికొంతకాలం వివాదాస్పదంగా కొనసాగించడానికి ఊతమిస్తున్నది. న్యాయవ్యవస్థను అతివేగంగా తలెత్తుకొనేట్టుగా చేయాల్సిన బాధ్యత ఖన్నా మీద ఉంది.

'పెట్టుబడి సేవ'లో సైన్స్!

'కృత్రిమ మేధ' గురించి నేను రాసిన దానిమీద, మామిడి నారాయణ గారి విమర్శ 'సిద్ధాంతం వేరూ, సైన్స్ వేరూ!' (మార్చి 1, ఆంధ్ర జ్యోతి) చూశాను. దానికి క్లుప్తంగా నా జవాబు.

(1) నా వ్యాసంలో నేను 'తడబడ్డా'నని నారాయణ అనుకున్నట్టు నేను ఎక్కడా 'తడబడ'లేదు. నా వ్యాసంలో, నేను అన్నది ఏమిటీ? "మంచి టెక్నాలజీని వద్దనడం లేదు. అది సమాజంలో మానవులందరికీ మంచిదై వుండాలి! దానిని పెట్టుబడిదారీ పద్ధతుల్లో వాడడం వల్ల, శ్రమ దోపిడీ విపరీతంగా జరుగుతున్న విషయాన్ని గుర్తించాలి" అని నేను స్పష్టంగా చెపితే, దానిలో తడబాటేముంది?

(2) 'రంగనాయకమ్మ కోణంలో చూద్దాం' అంటూ, నేను ప్రస్తావించని, చర్చించని, ఇద్దరు పెట్టుబడిదారీ ఆర్థికవేత్తల పేర్లు తీసుకొచ్చి, వాళ్ళ అభిప్రాయాల్ని అసందర్భంగా చెప్పుకొచ్చారు నారాయణ. ఉదాహరణకి, నారాయణ ప్రస్తావించిన వారిలో ఒకరైన 'సే' అనే ఫ్రాన్స్ దేశపు ఆర్థికవేత్త అవగాహన ఎంత అర్థరహితమో 'కాపిటల్'లో మార్క్స్ ఏనాడో వివరించాడు. అలాంటి ఆర్థికవేత్తని, ఈ చర్చలోకి తీసుకురావడం, అతనితోనూ, ఇంకొక పెట్టుబడిదారీ ఆర్థికవేత్తతోనూ మార్క్సుని కలిపి, వారి సిద్ధాంతాలే కాకుండా, మార్క్సు సిద్ధాంతం కూడా "విఫలం" అయిందనడం, పరమ అసందర్భ వ్యాఖ్యానం!



'కృత్రిమ మేధ వల్ల పెట్టుబడిదారులకు విపరీత లాభాలు వస్తాయనేది ఒక భ్రమ' అని మందలిస్తున్నారు నారాయణ. అదే భ్రమ అయితే, కృత్రిమ మేధ కంపెనీలు అన్నేసి లక్షల కోట్లు పెట్టుబడులు ఎందుకు పెడుతున్నాయి? ఒక పక్క విపరీత లాభాలు రావడం 'భ్రమ' అంటూనే, ఇంకో పక్క 'పెట్టుబడి పెట్టేవారు లాభం తప్పక ఆశిస్తారు' అనడం ఎందుకు? 'ఆశే లేకపోతే ప్రగతికి ఆస్కారం వుండద'ని, ఇంకో ఉవాచ! దేనిలో 'ప్రగతి'? లాభాల్లోనా ప్రగతి?

(3) 'మార్క్సు చెప్పినట్టు, ఎక్కడా కార్మికులు తిరుగుబాటు చెయ్యలేదు'- కాబట్టి మార్క్సు సిద్ధాంతం 'విఫలం' అయిందని నారాయణ తీర్పు చెప్పేశారు! ఈ రకం వాదననే ఇంకో ఆయన కిందటి సంవత్సరం, ఇదే పత్రికలో (ఆంధ్రజ్యోతి, 3-2-24) చేస్తే, దానికి నేను ఇచ్చిన జవాబునే తిరిగి ఇక్కడ చెప్పక తప్పదు. "అవి (వర్గపోరాటాలు) జరగలేదంటే, అది మార్క్సిజంలో లోపం కాదు. వర్గ పోరాటాలు అనేవి, పగలూ-రాత్రీలా, అమావాస్యా-పౌర్ణమీలా, ప్రకృతి సహజంగా జరగవు! వర్గ పోరాటాలకోసం, శ్రామికవర్గ పార్టీలైన కమ్యూనిస్టు పార్టీలకు, మార్క్సిస్టు సిద్ధాంత గ్నానంతో, నడిచే సామర్థ్యాలు బలహీన పడి ఉండవచ్చు! అందుకే, అలా జరగలేదు."

(4) నేను నా వ్యాసంలో, ముఖ్యంగా చెప్పింది, టెక్నాలజీని లాభాల కోసం పెట్టుబడిదారీ పద్ధతుల్లో ఉపయోగించడం వల్ల, ఉద్యోగాలు పోతాయని! అంతే చెప్పాను. కానీ, నారాయణ ప్రస్తావించిన 'ఆర్థిక మాంద్యం' గురించి, నా వ్యాసంలో ఎక్కడా నేను మాట్లాడనే లేదు. కానీ, నారాయణ మాత్రం, 'కీన్స్' అనే పెట్టుబడిదారీ ఆర్థికవేత్త, ఆర్థిక మాంద్యం విషయమై చెప్పిన చిట్కాలని ప్రస్తావించారు. ఆ చిట్కాలనే, ఒక 'ప్రత్యామ్నాయ సిద్ధాంతం'గా, ప్రశంసించారు కూడా! పెట్టుబడిదారీ ఆర్థికవేత్తలు చెప్పే చిట్కాలు, ఆర్థిక మాంద్యానికి అసలు కారణమైన "అమితోత్పత్తి అనే అంటురోగాన్ని" ఎలా నయం చెయ్యలేవో, 'కాపిటల్'లో, మార్క్సు వివరంగానే రాశాడు. అవేవీ పట్టించుకోకుండా, చిట్కాలనే గొప్ప సిద్ధాంతంగా కీర్తిస్తున్నారు నారాయణ!

(5) 'ట్రాక్టర్ లాంటి యంత్రాల వినియోగం లేకపోతే, సగం జనాభా ఆకలితో చచ్చిపోయేవారే'- అని ఒక విచిత్ర వాదన చేశారు నారాయణ. దేశం మొత్తం మీద అన్ని రాష్ట్రాలలోనూ కలిపి, 2022 నాటికి, దాదాపు కోటి ట్రాక్టర్లున్నాయని ఒక లెక్క! పైగా ప్రతీ సంవత్సరమూ, వాటి అమ్మకాలు పెరుగుతున్నాయి కూడానట! మరి, 'ఐక్యరాజ్యసమితికి చెందిన ఆహార, వ్యవసాయ సంస్థ' గానీ, 'ప్రపంచ ఆకలి సూచిక' గానీ, ప్రపంచవ్యాప్తంగా ఆకలి చావుల గురించి ఏమి చెబుతున్నాయి? ఆకలి చావుల్లో, భారతదేశం పరిస్థితి, "సీరియస్"గా వుందని, తాజా వార్త! 'ఆకలి' సమస్యని చూడవలిసింది, ఆహార ఉత్పత్తి ట్రాక్టర్లతో జరుగుతోందా, ఇంకో రకంగానా అని కాదు. ఉత్పత్తి అయిన ఆహార సరుకులు జనాభాలో ఏ వర్గాలకు, ఎంతెంత అందుతున్నాయి? ఎంతమంది కొనగలుగుతున్నారు?- అన్నవి అసలు ప్రశ్నలు!

(6) 'యాంత్రీకరణను వ్యతిరేకిస్తూ, శ్రామికులకు పనిలేదని వాపోయేవారు', ఒక విషయం చూడాలట! 'తెలంగాణా పల్లెలకు ఇతర రాష్ట్రాలనించీ వచ్చే వ్యవసాయ కూలీల్ని చూడమని' ఒక హాస్యాస్పదమైన వాదన చేశారు నారాయణ! అసలు, వ్యవసాయ కూలీలు, తమ ప్రాంతాలనించీ దూర ప్రాంతాలకు ఎందుకు వలస పోతారు? తామున్న చోట పనులు దొరకకే కదా? పైగా నారాయణ చెప్పిన రాష్ట్రాలలో, ఆయన ముచ్చటపడే ట్రాక్టర్లకు కొదవ లేదు. ఉదాహరణకి, 2022లో, జనవరికీ-జులైకీ మధ్య, ఉత్తరప్రదేశ్‌లో అమ్ముడైన ట్రాక్టర్లు 75,817. అసలు దేశం మొత్తంలోనే, ఉత్తరప్రదేశ్‌లో వున్నన్ని ట్రాక్టర్లు ఎక్కడా లేవని వ్యవసాయరంగ సమాచారం!

(7) మహారాష్ట్రలో, బారామతిలో జరుగుతున్న కృత్రిమ మేధ పరిశోధనల గురించి, చాలా పొంగిపోతూ వర్ణించారు నారాయణ. కానీ, ఆ మహారాష్ట్రలోనే 2022లో, 4,248 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారు. మరి, మహారాష్ట్రలో కూడా, అనేక రకాల వ్యవసాయం పనులకు ఉపయోగించే ట్రాక్టర్లు వేల సంఖ్యలో ప్రతీ యేటా కొత్తగా అమ్ముడవుతున్నాయని లెక్కలున్నాయి.

(8) 'కృత్రిమ మేధ వల్ల పెట్టుబడిదారులకు విపరీత లాభాలు వస్తాయనేది ఒక భ్రమ' అని మందలిస్తున్నారు నారాయణ! అదే భ్రమ అయితే, కృత్రిమ మేధ కంపెనీలు, అన్నేసి లక్షల కోట్లు పెట్టుబడులు ఎందుకు పెడుతున్నాయి? ఒక పక్క విపరీత లాభాలు రావడం 'భ్రమ' అంటూనే, ఇంకో పక్క 'పెట్టుబడి పెట్టేవారు లాభం తప్పక ఆశిస్తారు' అనడం ఎందుకు? 'ఆశే లేకపోతే ప్రగతికి ఆస్కారం వుండద'ని, ఇంకో ఉవాచ! దేనిలో 'ప్రగతి'? లాభాల్లోనా ప్రగతి?

(9) 'సైన్సు ఏదో ఒక వర్గ ప్రయోజనాలకు ఉపయోగపడుతుందని భావించడం అర్థరహితం'- అంటున్నారు నారాయణ. సైన్స్ "ప్రస్తుత సమాజంలో", ఏ వర్గం చేతిలో ఆస్తిగా వుంది? సైంటిస్టులూ, ఇంజినీర్లూ వంటి మేధా శ్రామికుల్ని, పనిలో పెడుతున్నది ఏ వర్గం? ప్రస్తుత సమాజంలో, సైన్సు పెట్టుబడికి సేవచేస్తోంది. ఏ రంగంలోనైనా, పెట్టుబడి లక్ష్యం ఏమిటి? లాభార్జనే! దానికోసం ఎంతటి విధ్వంసానికైనా పాల్పడుతుంది. ఉదాహరణకి, వ్యవసాయ రంగంలో అదేమి చేస్తుందో, మార్క్సు మాటల్లో చూడండి: "పెట్టుబడిదారీ విధానం, సమస్త సంపదలకూ మూలాలైన భూమినీ, కార్మికుల్నీ సర్వనాశనం చెయ్యడం ద్వారా మాత్రమే, తన సాంకేతిక పరిగ్నానాన్నీ (టెక్నాలజీనీ) సామాజిక ఉత్పత్తిక్రమాల సమ్మేళనాన్నీ అభివృద్ధిపరుస్తుంది." ('కాపిటల్'లో, 'ఆధునిక పరిశ్రమలూ, వ్యవసాయమూ' అనే చోట).

(10) చివరిగా, ప్రస్తుత సమాజంలో, సైన్సు ఏ వర్గానికి ఉపయోగపడుతోంది- అనే విషయంలో నా అవగహనను "అర్థరహితం"గా కొట్టిపారేసిన, నారాయణగారికి ఒక అర్థవంతమైన సలహా! మీ పేరుకింద వున్న మీ సంస్థ పేరుని, "సెంటర్ ఫర్ బెటర్ కాపిటలిస్టిక్ ఇండియా రీసెర్చ్ ఫౌండేషన్" అని మార్చుకుంటే, మీ అవగాహనకు తగ్గట్టు వుంటుంది!

• రంగనాయకమ్మ

అభివృద్ధే దక్షిణాదికి శాపమైందనుకోవాలా?

ఏ దేశానికైనా రాష్ట్రాల సాధికారత చాలా ముఖ్యం. కేంద్రం కింద నలిగిపోకుండా, రాష్ట్రాల మధ్య సమానతను తెచ్చే వ్యవస్థనే సమాఖ్య అంటాము. సమాఖ్య వ్యవస్థలో కేంద్ర ప్రభుత్వం రాష్ట్రాలకు తగినంత అధికారాలు, నిధులు సమకూర్చాల్సిన బాధ్యతను కలిగి ఉంటుంది. భారతదేశం కేంద్రీకృత సమాఖ్య రూపంతో పుట్టింది. దేశ సమైక్యతను, సమగ్రతను కాపాడడానికి రాష్ట్రాలన్నిటికీ కేంద్రం చేసిన చట్టాలకు లోబడి పనిచేయాల్సిన అవసరం కల్పించారు. కాలక్రమేణా 1980ల తర్వాత జాతీయ పార్టీల మీద అసంతృప్తితో ప్రాంతీయ పార్టీలు అధికారంలోకి వచ్చాయి. అవి వేగవంతమైన అభివృద్ధి కోసం తమదైన నమూనాలు తెచ్చాయి. దరిమిలా, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాల్లో అభివృద్ధి వేగవంతమైంది. అభివృద్ధి పెరిగిన కొద్దీ ప్రభుత్వాల మీద ఇంకా బాధ్యత పెరుగుతుందని జర్మన్ ఆర్థికవేత్త అడాల్ఫ్ వాగ్నర్ చెప్పినట్టు, ప్రభుత్వాల బడ్జెట్లు కూడా పెరిగాయి. ఈ పరిస్థితిలో రాష్ట్రాలకు నిధుల కొరత సమస్యగా మారింది. ప్రధానంగా, సమాఖ్య నిబంధనల ప్రకారం, దక్షిణాది రాష్ట్రాల నుంచి వచ్చిన పన్ను ఆదాయం దేశంలో ఉన్న వెనుకబడిన రాష్ట్రాలకు తరలిపోవడం వివాదాలకు కారణం అయింది. డిలిమిటేషన్ ప్రమాదం కూడా ముందుకు రావడంతో సమాఖ్య వివాదాలు ఇప్పుడు ప్రముఖంగా ముందుకొచ్చాయి.

మొదటి యాభై ఏళ్ళు దేశంలోని మొత్తం రాబడిలో కేంద్రానికి 70శాతం, అన్ని రాష్ట్రాలకూ కలిపి కేవలం 30 శాతం నిధులు వెళ్ళే లాగా మొదటి 10 ఆర్థిక సంఘాలు నిర్ణయించాయి. అయితే, రాష్ట్రాలకు వినోదం, ఎక్సయిజ్, ప్రాపర్టీ, రిజిస్ట్రేషన్ పన్నులు లాంటి కొన్ని సొంత పన్నులు విధించుకునే అధికారం ఉండేది. ఇవి కాక కేంద్రానికి వెళ్లిన 70శాతం ఆదాయంలో, ఆర్థిక సంఘం నిర్ణయంతో కొన్ని నిధులూ, కేంద్రం తన ప్లానింగ్ కమిషన్ సూచనల ఆధారంగా కొన్ని నిధులు వెనక్కి వచ్చేవి. 1990ల్లో రాష్ట్రాలు ఈ 30 శాతం చాలట్లేదని పోట్లాడాయి. 25 ఏళ్ళ పోరాటం తర్వాత 14వ ఆర్థిక సంఘం దీన్ని 40 శాతానికి పెంచాలని సిఫార్సు చేసింది. 2014లో అధికారంలోకి వచ్చిన బీజేపీ ఇదిగో చేస్తున్నామని చెప్పింది. తీరా చూస్తే, ఆదాయ పన్నుల మీద, పెట్రోలు మీద 10శాతం సెస్సు, సర్‌చార్జి వాసులు చేసి, దాని వాటా మళ్ళీ 70 శాతానికి తెచ్చుకుంది. జీఎస్టీ విధానం వల్ల రాష్ట్రాలు సొంతంగా పన్నులు నిర్ణయించుకునే అధికారాన్ని కోల్పోయాయి. కేంద్రం ఉచ్చులో బిగుసుకున్నాయి. ఇది సమాఖ్య స్ఫూర్తికి పూర్తిగా విరుద్ధం. దీని మీద 15వ సంఘం చేసిన సిఫార్సులు దక్షిణాది రాష్ట్రాలకు శరాఘాతం అయ్యాయి. ఈ సిఫార్సులు రాష్ట్రాల మధ్య నిధులను పంచే ప్రాతిపదికను మార్చాయి. జనాభా, విస్తీర్ణం, వెనుకబాటుతనం, పన్నుల రాబడి పెంచినందుకు ఇన్సెంటివ్, అటవీ భూమి శాతం దామాషాగా రాబడిని రాష్ట్రాలకు పంచుతారు. ఇందులో జనాభా లెక్కకు ప్రాతిపదికగా ఇదివరలో 1991 జనాభా లెక్కలు ఉండగా, దాన్ని 2021 జనాభా లెక్కలకి మార్చారు. దీనితో జనాభాని కంట్రోల్ చేసుకున్న దక్షిణాది రాష్ట్రాలకు భారీ కోత, జనాభా నియంత్రణని గాలికొదిలేసిన రాజస్థాన్, యూపీ, బీహార్, మధ్యప్రదేశ్‌లకు విపరీతంగా నిధుల కేటాయింపు పెరిగింది. ఆయా రాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఉండడం వల్ల ఆశ్రిత రాష్ట్రాలకు లాభం చేకూరేలా ఇది చేస్తున్నారని దక్షిణాది రాష్ట్రాల ఆరోపణ. 24 ఉత్తరాది రాష్ట్రాలన్నీ కలిపి 64 శాతం పన్నుల రాబడిని జెనరేట్ చేస్తే, కేవలం 5 దక్షిణాది రాష్ట్రాలు 36 శాతం పన్నులను సేకరిస్తున్నాయి. కానీ కేవలం 18.6 శాతాన్ని మాత్రమే దక్షిణాది రాష్ట్రాలకు తిరిగి ఇస్తున్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలు తాము ఇచ్చేదానికి సుమారుగా రెట్టింపు మొత్తాన్ని వెనక్కు పొందుతున్నాయి.



24 ఉత్తరాది రాష్ట్రాలన్నీ కలిపి 64 శాతం పన్నుల రాబడిని చూపిస్తే, కేవలం 5 దక్షిణాది రాష్ట్రాలు 36 శాతం పన్నులను సేకరిస్తున్నాయి. కానీ 18.6 శాతాన్ని మాత్రమే దక్షిణాది రాష్ట్రాలకు తిరిగి ఇస్తున్నారు. యూపీ, బిహార్, రాజస్థాన్, మధ్య ప్రదేశ్ వంటి రాష్ట్రాలు తాము ఇచ్చేదానికి సుమారుగా రెట్టింపు మొత్తాన్ని వెనక్కు పొందుతున్నాయి.

ఇక్కడ పలు ప్రశ్నలు వస్తాయి: బలహీనమైన రాష్ట్రాలకు సహాయం చెయ్యడం బాగానే ఉన్నా, వాళ్ళు ఎన్నటికీ ఇదే బలహీనతను ప్రదర్శిస్తారా? ఈ సహాయం వల్ల వారిలో అలసత్వం పెరిగి అభివృద్ధి మీద దృష్టి పెట్టకుండా ఉంటున్నారా? ఈ సహాయానికి ఒక కాలపరిమితి అంటూ లేకపోతే, దక్షిణాది రాష్ట్రాల వాటా మీద ఆధారపడి బతకడం మనకు ఒక అలవాటు ఐపోదా? దక్షిణాది రాష్ట్రాలు అభివృద్ధి ద్వారా పెంచుకున్న పన్నుల రాబడిని ఉత్తరాది రాష్ట్రాలు తన్నుకుపోతే, ఇక్కడి ఆర్థిక ప్రగతి కుంటుపడదా? సమాఖ్య స్ఫూర్తి కోసం దక్షిణాది రాష్ట్రాలు ఎంత కాలమని ఎంత వరకూ త్యాగం చేయాలి?

ఇదిగాక, గ్రాంట్ల కేటాయింపులో కూడా అన్యాయం జరుగుతోందని దక్షిణాది రాష్ట్రాల ఆరోపణ. ఇందులో వాస్తవం లేకపోలేదు. ఉదాహరణకు, ఆయుష్మాన్ భారత్ అనే కేంద్రం నిశ్చయించిన ఆరోగ్య బీమా పథకం కంటే ముందే ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో ఉన్న బీమా పథకాలు ఎక్కువ కవరేజ్ కలిగి ఉన్నవి. కానీ, మా పాలసీ తీసుకుంటేనే ఈ గ్రాంటు ఇస్తామని కేంద్రం షరతుపెట్టింది. అది చెయ్యని పక్షాన తెలంగాణకి రూ.2 వేల కోట్లు తిరస్కరించారు. అలాగే జాతీయ విద్యా విధానం అమలు చెయ్యని కారణంగా తమిళనాడుకి సర్వశిక్ష అభియాన్ స్కీము కింద రూ.2.6 వేల కోట్లు నిరాకరించారు. షరతులతో కూడిన గ్రాంట్లు ఇవ్వడం, తిరస్కరించడం ద్వారా కేంద్రం సమాఖ్య స్ఫూర్తిని ప్రదర్శించకుండా పెద్దన్నలా అధికారాన్ని రుద్దుతున్నది. అసలు ఈ సెంట్రల్ గ్రాంటులంటూ ఎందుకు, ఈ డబ్బంతా నేరుగా ఇచ్చేయమని రాష్ట్రాలు అడుగుతున్నాయి. ఆ విధంగా రాష్ట్రాల వాటా 50 శాతానికి పైగా పెంచవచ్చు. కానీ కేంద్ర ప్రభుత్వం అధిక రాబడిని చేతిలో పెట్టుకుని రాష్ట్రాల మీద పెత్తనం చెలాయిస్తోంది.

సరే, ఇక పెరిగే ఖర్చులకు, రాబడి ఎపుడూ వెనుకబడే ఉండడం భారతదేశంలో రాజ్యానికి తప్పని పరిస్థితి. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల ద్రవ్య లోటుని, అప్పులని నియంత్రించే FRBM చట్టాన్ని 2003లో తెచ్చారు. ఇందులో కేంద్రం తన సాలీనా ద్రవ్య లోటు 3 శాతంగా, రాష్ట్రాల లోటు 3 శాతంగా, బ్యాంకుల నుంచి తెచ్చుకునే అప్పు మీద పరిమితులను విధించారు. రాష్ట్రాలు రెవెన్యూ లోటును (అంటే, సొంత ఖర్చులకు సొంత ఆదాయానికి మధ్య లోటును) జీరోగా మెయింటైన్ చెయ్యాలని, మిగతా 3శాతం తన రాష్ట్ర ఆదాయంలో 3శాతం మించకుండా రిజర్వు బ్యాంకు అప్పు ఇచ్చే పద్ధతిని మొదలు పెట్టారు. రాష్ట్రాలు, ఈ పరిమితులని పాటించాయి కానీ కేంద్ర ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా ఉల్లంఘించింది. తను ఉల్లంఘిస్తూనే రాష్ట్రాలను మాత్రం కట్టడి చేస్తోంది. కేరళ, పంజాబ్, యూపీ, తమిళనాడు, బిహార్ లాంటి రాష్ట్రాలు రెవెన్యూ అప్పులు చేయకుండా ఉండలేకపోయాయి. తెలంగాణలోని బీఆర్ఎస్, ఆంధ్రప్రదేశ్‌లోని వైసీపీ ప్రభుత్వాలు రెవెన్యూ లోటు జీరోగా చూపించి, ఏకంగా బడ్జెట్లో చూపని రహస్య అప్పులు విపరీతంగా చేశాయి. కేంద్రమైతే, పెట్రోల్ పన్నులోంచి ఈ ద్రవ్య లోటును తగ్గించుకుంది. మరి రాష్ట్రాలకు అలాంటి ఆధారం లేదు. కాబట్టి FRBM పరిమితిని 4 శాతానికి పెంచమని అడుగుతున్నారు. ఇది సాధ్యమే అయినా, రెండు సమస్యలు ఉన్నాయి. అప్పుతెచ్చిన నిధులను సద్వినియోగం చేసుకున్నప్పుడే అది సమర్థనీయం. సంక్షేమ పథకాలకోసం తాహతుకి మించి అప్పు తెచ్చి ఇస్తే, కిస్తీలు కట్టలేని పరిస్థితి వస్తుంది. రీపేమెంట్ ఖర్చు ఇప్పటికే బడ్జెట్లో 35 శాతానికి చేరుకుంది. కాబట్టి, అప్పు పరిమితి పెంచితే రాష్ట్రాలు ఉద్యోగుల జీతాలు కూడా ఇవ్వలేని పరిస్థితి వస్తుందని ఒక వాదన. అప్పు తెచ్చుకోకపోతే అభివృద్ధి సాధించలేని పరిస్థితి మరొక వైపు. ఈ విష వలయాన్ని ఛేదించాల్సిన అవసరం ఉంది.

ఈ సమస్యలకి కొన్ని పరిష్కారాలు కనుక్కోటం అవసరం. మొదటిగా, ఈ కేంద్ర ప్రాయోజిత నిధులను (CSS) కన్సాలిడేటెడ్ ఫండ్‌లో కలిపేసి రాష్ట్రాల భాగాన్ని పెంచాలి. రెండవది, రాష్ట్రాల మధ్య ఉన్న దామాషాలో జనాభా వెయిటేజీని తగ్గించి, రాష్ట్రాల పన్నుల రాబడి వెయిటేజీని పెంచాలి. ఈ రెంటిని మనం 16 ఆర్థిక సంఘాన్ని డిమాండ్ చెయాలి. మూడవది, ప్రస్తుతం దేశంలో 20 శాతంగా ఉన్న పన్ను – జీడీపీ నిష్పత్తిని 30 శాతానికి దశాబ్ద కాలంలో పెంచాలి. దీనికి కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ టాక్స్, ఆస్తి పన్ను, వారసత్వ పన్నులు వసూలు చెయ్యాలి. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలు గృహ పన్నులను పెంచుకుని సొంత రాబడిపై దృష్టి పెట్టాలి. ప్రభుత్వ మొత్తం రాబడిని పెంచితేనే ఈ కష్టాలు, కొట్లాటలూ తేలే అవకాశం ఉంది. కనీసం ఒక దశాబ్దం టార్గెట్‌గా పెట్టుకుని దీన్ని అమలు చేయాలి.

■ ప్రొ. ఆర్.వి. రమణమూర్తి
సెంట్రల్ యూనివర్సిటీ

గోర్–బోలికి రాజ్యాంగ హోదా ఏదీ?

శాస్త్ర, సాంకేతిక రంగాల్లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మన దేశంలో మాతృభాషల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతోంది. ప్రపంచీకరణ, సరళీకృత ఆర్థిక విధానాలు కూడా తోడై మాతృభాషలు కనుమరుగవక తప్పని పరిస్థితి దాపురించింది. ఆంగ్లభాష అంతర్జాతీయ భాషగా రూపాంతరం చెందడంతో ప్రపంచవ్యాప్తంగా వేల సంఖ్యలో మాతృభాషలు అంతరించిపోతున్నాయి. అంతరించిపోతున్న భాషల్లో బంజారాలు మాట్లాడే గోర్-బోలి ఒకటి. ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో తెలుగు భాషను ఆంగ్ల భాష అధిగమించినట్లు, గిరిజన భాషలను తెలుగు అధిగమిస్తోంది. లంబాడీ(బంజారా) గిరిజన భాషకు గుర్తింపు లేదు, లిపి లేదు. గిరిజనుల భాషలు మౌఖికమైనవి కావడం మూలాన నిరాదరణకు గురవుతున్నాయి.

భారత రాజ్యాంగంలోని 5, 6 షెడ్యూళ్లలో పేర్కొన్న గిరిజన రాష్ట్రాల్లో 698 తెగలకు చెందిన 10 కోట్ల మంది జనాభా ఉంది. మన దేశంలో మొత్తం 1652 భాషలుండగా, గిరిజనులు మాట్లాడే భాషలే సుమారుగా 600 దాకా ఉన్నాయి. భారత రాజ్యాంగంలో 8వ షెడ్యూల్‌లో ఇప్పటికి 22 భాషలు అధికారికంగా గుర్తింపు పొందగా, అందులో గిరిజనులు మాట్లాడే మణిపురి, డోంగ్రీ, బోడో, కొంకిణి, సంథాలీ భాషలకు మాత్రమే చోటు దక్కింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, మధ్యప్రదేశ్ వంటి రాష్ట్రాలలోనే కాకుండా, దేశవ్యాప్తంగా దాదాపుగా 20 రాష్ట్రాలలో నివసిస్తున్న బంజారాలు, హిందీ తరువాత అత్యధికంగా తమ సంప్రదాయ భాష గోర్-బోలిను మాట్లాడుతున్నారు. కానీ అతి పెద్ద సమూహం కలిగిన లంబాడీ భాషకు రాజ్యాంగబద్ధ గుర్తింపు విషయంలో ప్రభుత్వాలు నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. బంజారాలు మాట్లాడే భాష అంతరించే దశలో ఉంది. భాష ద్వారానే బంజారాలు తమ సంస్కృతీ సాంప్రదాయాలు, ఆచారాలను కాపాడుకుంటున్నారు. కాని బంజారాలతో పాటు కొన్ని రకాల తెగల భాషలకు లిపి లేదన్న సాకుతో ఇతర భాషలను పాలకులు వారిపై రుద్దుతున్నారు.

1956లో హైదరాబాద్ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌లో విలీనమై భాషాప్రయుక్త రాష్ట్రంగా అవతరించిన తరువాత ఆదివాసీ, గిరిజన విద్యార్థుల మీద తెలుగు రుద్దారు. ఉమ్మడి రాష్ట్ర ప్రభుత్వం పదేళ్ల క్రితం రాజీవ్ విద్యామిషన్ (ఆర్.వి.ఎం)ద్వారా బంజారా భాషలో తెలుగు లిపితో ఒకటవ తరగతి నుంచి ఐదవ తరగతి వరకు వాచకాలను ముద్రించి ప్రత్యేక పాఠశాలను నెలకొల్పి, ఆయా భాషా సంబంధ బోధకులను కూడా నియమించింది ఇలా కొంత ప్రయత్నం చేసినా, కొన్ని సాంకేతిక లోపాల వల్ల నేడు పాఠశాలలు పని చేయడం లేదు. భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో గోర్-బోలి భాషను చేర్చాలన్న డిమాండ్‌తో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుంచి వివిధ రూపాల్లో పోరాడుతున్నా, సమస్య పరిష్కారం కాలేదు. బంజారా తెగ అస్తిత్వానికి గోర్-బోలి భాష కీలకమైనది. బంజారాల భాషకు రాజ్యాంగ హోదా కల్పించి, తగిన ప్రోత్సాహం అందించాలి.

– జటావత్ హనుము, రిసెర్చ్ స్కాలర్, ఉస్మానియా యూనివర్సిటీ

వ్యాసాలు, ఉత్తరాలు పంపవలసిన చిరునామా
ఎడిటోపేజీ, ఆంధ్రజ్యోతి, ప్లాట్–76, అశ్వినీ లే ఔట్, హుడా హైట్స్,
రోడ్ నంబరు–70, జూబ్లీహిల్స్, హైదరాబాద్–500033.
మెయిల్: editpage@andhrajyothy.com

మన కాకతీయ కొదమ సింహం!


శివాజీ పుత్రుడైన శంభాజీ చరిత్ర 'ఛావా' అనే పేరుతో సినిమా రూపంలో వచ్చింది కనుక మనకు ఆయన గొప్పతనం, త్యాగం, మరాఠీల గొప్పతనం తెలిసింది (ప్రధానంగా నేటి యువతకు). కానీ అంతకు కొన్ని వందల ఏళ్ళ ముందే గొప్ప త్యాగం చేసిన మన కాకతీయ ప్రతాపరుద్రుడి చరిత్ర అజ్ఞాతంగా పుస్తకాల్లో ఉండిపోయింది. ప్రభుత్వాలు కూడా మరిచిపోయాయి. ఇవాళ ఆ చక్రవర్తి పుట్టిన రోజు సందర్భంగానైనా ఆయన్ని తలచుకుందాం!

1303లో ప్రారంభమైన ఢిల్లీ సుల్తానుల దండయాత్రలని 1323 వరకు మొక్కవోని దీక్షతో ఎదుర్కొని వారిని దక్షిణభారతం దేశం వైపు విస్తరించనివ్వకుండా అడ్డుకున్న మహా సాహసి ప్రతాపరుద్రుడు. నాటి కాకతీయ సామ్రాజ్యం చిన్నదేమీ కాదు. దక్షిణ భారతదేశం మొత్తం వ్యాపించి ఉండేది. ఢిల్లీ సింహాసనాన్ని అధిష్ఠించి ఉన్న అల్లావుద్దీన్ ఖిల్జీ తన వట్టిపోయిన ఖజానాను నింపుకోవడం కోసం సుసంపన్న దక్షిణ భారతదేశంపై దృష్టి నిలిపాడు. అతనికి దేవగిరి రాజధానిగా కలిగిన యాదవ రాజ్యం, కాకతీయుల పరిపాలనలో ఉన్న ఓరుగల్లు కనిపించాయి. మొట్టమొదట 1295లో ఖిల్జీ దేవగిరిపై దాడి చేశాడు. ఓటమిపాలైన యాదవ రాజు రామచంద్ర దేవుడు సంధి చేసుకొని అపార ధనరాశులని ఖిల్జీకి కానుకగా సమర్పించుకున్నాడు. సామంతుడిగా మారిపోయాడు.

1303లో ఖిల్జీ అపార సైన్యాన్ని ఓరుగల్లు పైకి దండయాత్రకు పంపించాడు. ఖిల్జీ సైన్యం కదలికలను ప్రతాపరుద్రుడు పసిగట్టాడు. తన సైన్యంతో నేటి కరీంనగర్ జిల్లాలోని హుజురాబాద్ దగ్గర గల ఉప్పరపల్లి వద్ద ఎదురేగి మరీ ఢిల్లీ సైన్యాన్ని ఎదుర్కొన్నాడు. దేవగిరి లాగే ఎంతో సునాయాసంగా కాకతీయులను ఓడించవచ్చునన్న వెర్రి భ్రమలతో కాకతీయులపై యుద్ధానికి దిగిన ఖిల్జీకి ఉప్పరపల్లి వద్ద చేదు అనుభవం ఎదురైంది. ఉప్పరపల్లి యుద్ధభూమిలో ఖిల్జీ సైన్యం చావుదెబ్బ తిన్నది. చచ్చినవాళ్ళు చావగా మిగిలిన వాళ్ళు ఢిల్లీ వైపు పారిపోయారు. భారతదేశాన్ని పాదాక్రాంతం చేసుకున్న ఖిల్జీకి ఓటమి రుచి చూపించాడు ప్రతాపరుద్రుడు.

అల్లావుద్దీన్ ఖిల్జీకి ఎదురైన ఈ గర్వభంగాన్ని వెలుగోటి వారి వంశావళిలోను, ఆ యుద్ధంలో పాల్గొన్న పోతుగంటి మైలి, వెన్నడు, నాగదేవుని శాసనాల్లోనూ నేటికీ చూడవచ్చు. ఇలా ఒక్కసారే కాదు, ఆయన పరిపాలించిన 22 సంవత్సరాల్లో తొమ్మిదిసార్లకు పైగా ఢిల్లీ సుల్తానులు ఓరుగల్లుపై దండయాత్రలు చేశారు. అందులో సింహభాగం ప్రతాపరుద్రుడే గెలిచాడు. ఆ తొమ్మిది యుద్ధాలలో రెండు యుద్ధాల్లో మాత్రమే ఓడిపోయాడు. అవి 1309 నాటి యుద్ధం, 1323 నాటి చివరి యుద్ధం. ఈ ఓటమి కూడా శత్రువు కుయుక్తుల ఫలితమే. 1309లో సుల్తాన్ సైన్యం ఆరు నెలల పాటు పోరాడినప్పటికీ ఓరుగల్లు కోట లొంగకపోయేసరికి ఆ చుట్టుపక్కల ప్రాంతాల ప్రజల్ని పీడించి, హింసించారు. తద్వారా ప్రతాపరుద్రుడిపై మానసిక ఒత్తిడి పెంచి సంధికి అంగీకరించేలా చేశారు!

అటు తర్వాత జరిగిన అధికార మార్పిడిలో ఖిల్జీ తర్వాత ఘియాజుద్దీన్ తుగ్లక్ 1320లో ఢిల్లీ సింహాసనాన్ని అధిష్ఠించాడు. ఆ వెంటనే ఒట్టిపోయిన ఖజానాను నింపుకోవడం కోసం 1323లో ఎంతకు లొంగని ఓరుగల్లు పైకి దండెత్తాడు. ఈ యుద్ధాల గురించిన సమాచారం మనకు ఫెరిస్తా ఇసామీ, బారౌని, ఇమాన్ భతూత లాంటి ముస్లిం చరిత్రకారులు రాసిన పుస్తకాల ద్వారా తెలుసుకోవాల్సి రావడం దురదృష్టకరం. ఎందుకంటే నిజాలు రాసి సుల్తాన్లకు కోపం తెప్పించలేక వారు కాకతీయుల ఘనవిజయాల్ని మసిపూసి మారేడు కాయ చేశారు. ప్రతాపరుద్రుడి చేతిలో పలుమార్లు ఓటమిపాలైనప్పుడల్లా మాకై మేమే వెనుదిరిగామంటూ కాకమ్మ కథలు రాశారు.



శివాజీ పుత్రుడైన శంభాజీ చరిత్ర 'ఛావా' అనే పేరుతో సినిమా రూపంలో వచ్చింది కనుక ఆయన గొప్పతనం, త్యాగం అందరికీ తెలిశాయి. కానీ అంతకు కొన్ని వందల ఏళ్ళ ముందే గొప్ప త్యాగం చేసిన మన కాకతీయ ప్రతాపరుద్రుడి చరిత్ర పుస్తకాల్లోనే ఉండిపోయింది. మన మట్టిలో పుట్టి, ఒకానొక మహా సామ్రాజ్యానికి చక్రవర్తిగా పట్టాభిషిక్తుడై, భారతావనిని శాసించి, మన పూర్వీకుల ఆత్మగౌరవాన్ని నిలపడానికి ప్రాణత్యాగం చేసిన మనిషిని ఏటేటా స్మరించుకోవద్దూ?

చివరి యుద్ధానికి ముందు జరిగిన యుద్ధంలో తుగ్లక్ సైన్యాలు ఓటమిపాలై కాకతీయ సైన్యాలు వెంటపడి తరుముతుంటే పారిపోయి దేవగిరి చేరుకున్నాయి. అక్కడ రామచంద్ర దేవుడి దేవగిరి సైన్యాలను జత చేసుకుని కొన్ని రోజుల వ్యవధిలోనే ఓరుగల్లుపై మళ్ళీ దాడి చేశాయి. ఢిల్లీ సుల్తానులతో ప్రతి యుద్ధం మధ్యా ఎన్నో సంవత్సరాల తేడా ఉండడంతో ఢిల్లీ సైన్యాలు మళ్ళీ ఇప్పుడప్పుడే తమ మీదికి దాడికి రావని భావించిన ప్రతాపరుద్రుడు రైతులుగా ఉన్న తన సైన్యాన్ని వ్యవసాయ పనులకు, వారి సొంత ఇళ్ళకు పంపేశాడు. అతికొద్ది సైన్యం మాత్రమే ఓరుగల్లు కోటలో ఉంది. అంత తక్కువ వ్యవధిలో సుల్తాన్ మళ్ళీ దాడికి దిగుతాడని ఊహించని ప్రతాపరుద్రుడు నిరుత్తరుడయ్యాడు. వెంటనే తేరుకొని అందుబాటులో ఉన్న సైన్యాన్ని పోగేసి శత్రువుపై దాడి మొదలుపెట్టాడు. త్వరలోనే కోటలో ఆహార ధాన్యాలు పూర్తిగా అయిపోయాయి. ఆకలి బాధకు తట్టుకోలేక లెక్కకు మించి పరివారం, సైనికులు పిట్టల్లా రాలిపోసాగారు. మరోపక్క కోట ఎంతకూ లొంగకపోయేసరికి ఢిల్లీ సుల్తాన్ సైన్యాలు అసహనానికి లోనై కోట బయట గల పరిసర ప్రాంత ప్రజల ధన ధాన్యాలు దోచుకుంటూ, ఇండ్లను తగలబెడుతూ, స్త్రీలను చెరబట్టడం మొదలుపెట్టారు. ఎటు చూసినా అసహాయ ఆర్తనాదాలు, ఆకాశాన్నంటే మంటలతో తగలబడుతున్న గ్రామాలు, కూలిపోతున్న గుళ్ళు, యుద్ధంతో సంబంధంలేని నిర్దోషులైన ప్రజలు సైతం శత్రువుల చేతుల్లో హతమారిపోతున్నారు! వేగుల ద్వారా ఈ విషయాల్ని విన్న ప్రతాపరుద్రుడు తట్టుకోలేకపోయాడు. మరిన్ని నెలలు పోరాడే సత్తువ ఉన్నప్పటికీ తన ప్రజల దయనీయ స్థితికి చలించి తన పరివారంతో వెళ్ళి తుగ్లక్ సైన్యాధిపతి ఉలుగ్ ఖాన్ ముందు లొంగిపోయాడు.

తనను పలుమార్లు ఓడించిన ఆ ధిక్కార కణం తన ముందు తలవంచితే చూడాలని అక్కడ ఢిల్లీ సుల్తాన్ ఎదురుచూస్తున్నాడు. కానీ తన ప్రజల మానాభిమానాలకు ప్రతీక అయిన ప్రతాపరుద్రుడు ఢిల్లీకి వెళ్లే మార్గ మధ్యంలో నర్మదా నది తీరం వద్ద ఆత్మార్పణ గావించుకొని సుల్తాన్ కలల్ని కల్లలు చేశాడు. తన ఆత్మార్పణ తన ప్రజల్లో ఆగ్రహావేశాలను రగిలిస్తుందని, వారందరినీ ఏకం చేసి శత్రువును మట్టికరిపిస్తుందని, అత్యంత ఉన్నత స్థాయి నిరసన ఐన ఆత్మత్యాగాన్ని ఎంచుకున్నాడు. ఇచ్ఛా మరణాన్ని ఆహ్వానించాడు. ఆయన ఆశించినట్లుగానే అటు తర్వాత ఆయన సేనా నాయకులైన కొలని రుద్రదేవుడు, రేచర్ల సింగమనేడు, బెండపూడి అన్నయ మంత్రి వీరు ముగ్గురు, కాకతీయుల 72 మంది సామంతులలో ఒకరైన రేఖపల్లి సంస్థానాధీశుడైన ముసునూరి ప్రోలయ నాయకుడి నాయకత్వంలో ప్రజలతో కలిసి తిరుగుబాటు చేశారు. 1336లో ఢిల్లీ సుల్తాన్ల సైన్యాన్ని ఓడించి వారిని తరిమికొట్టి తిరిగి ఓరుగల్లు కోటపై స్వరాజ్య పతాకాన్ని ఎగరవేశారు.

వీర శివాజీకి మహారాష్ట్ర ప్రజల్లోను, మహారాణా ప్రతాప్‌కు రాజస్థాన్ ప్రజల్లోను ఒక పదిలమైన స్థానం ఉంది. కానీ మన ప్రతాపరుద్రుడి విషయంలో ఆ స్థానాన్ని కల్పించడంలో మన ప్రభుత్వాలు విఫలమైనాయి! ఆయన 1254వ సంవత్సరం మార్చి 25న జన్మించాడు ఆ రోజును ప్రతి ఏటా ఒక ఉత్సవంలాగా జరుపుకుంటే ఆ మహనీయుడి త్యాగాన్ని గౌరవించినట్లు అవుతుంది. మన మట్టిలో పుట్టి, ఒకానొక మహా సామ్రాజ్యానికి చక్రవర్తిగా పట్టాభిషిక్తుడై, భారతావనిని శాసించి, మన పూర్వీకుల ఆత్మగౌరవాన్ని నిలపడానికి ప్రాణత్యాగం చేసిన మనిషిని ఏటేటా స్మరించుకోవద్దూ!

◆ డా. అంబటి శ్రీనివాస్‌రాజు
(నేడు ప్రతాపరుద్రుడి జయంతి)



'ఆంధ్రజ్యోతి' కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రాలో ప్రథమ విజేతను ఎంపిక చేస్తున్న వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, అనంతరం విజేతకు ఫోన్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న సీపీ

ప్రథమ విజేత : అడవాల సదానందం, పాకాల రోడ్, నర్సంపేట, వరంగల్ జిల్లా. ఫోన్ : 81870 43818



కూపన్ డ్రా తీసి ద్వితీయ విజేతను ఎంపిక చేస్తున్న వరంగల్ కలెక్టర్ సత్యశారద, అనంతరం విజేతకు ఫోన్‌లో శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్

ద్వితీయ విజేత : వామిక కేరాఫ్ తక్కళ్లపెల్లి సోమేశ్వర్‌రావు, జయశ్రీ టాకీస్ పక్కన, నర్సంపేట, వరంగల్ జిల్లా. ఫోన్ : 93953 50233



లక్కీడ్రాలో తృతీయ విజేత కూపన్ తీస్తున్న బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే, అనంతరం విజేతకు శుభాకాంక్షలు తెలుపుతున్న బల్దియా కమిషనర్

తృతీయ విజేత : దేశగాని అథర్వ కృష్ణ కేరాఫ్ వెంకటయ్య, విజయ మిల్క్ సెంటర్, తొర్రూరు, మహబూబాబాద్ జిల్లా. ఫోన్ : 98497 95972

వ్యవస్థకు, ప్రజలకు.. వారధులు పత్రికలు

దమ్మున్న వార్తలతో ప్రజలపక్షాన నిలుస్తున్న 'ఆంధ్రజ్యోతి'

- కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రాలో సీపీ సన్‌ప్రీత్‌సింగ్
- హాజరైన వరంగల్ కలెక్టర్ సత్యశారద, మునిసిపల్ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- డ్రా తీసి విజేతలను ప్రకటించిన సీపీ, కలెక్టర్, మునిసిపల్ కమిషనర్

మడికొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వ్యవస్థకు, ప్రజల కు మధ్య పత్రికలు వారధుల్లాంటివని, నిత్యం ప్రజలకు వాస్తవాలు చేరవేయాలని, అలా దమ్మున్న వార్తలతో 'ఆంధ్రజ్యోతి' ప్రజల పక్షాన నిలుస్తోందని వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్ కితాబిచ్చారు. 'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు మరింత చేరువయ్యే లా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్ అండ్ బైక్ రేస్ లక్కీ డ్రా కార్యక్రమం సోమవారం సాయంత్రం హనుమ కొండ జిల్లా మడికొండలోని యూనిట్ కార్యాలయంలో సంద డిగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్, వరంగల్ కలెక్టర్ సత్యశారద, వరంగల్ నగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరయ్యారు. ఈ క్రమంలో వారు 'ఆంధ్రజ్యోతి' నాలుగు నెలలుగా నిర్వహించిన వేలాది కూపన్ల నుంచి లక్కీ డ్రా ద్వారా విజేతలను ఎంపిక చేశారు. ఉమ్మడి జిల్లా ప్రథమ, ద్వితీయ, తృతీయ విజేతలకు నేరుగా వారే ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. సీపీ సన్‌ప్రీత్ సింగ్ ఉమ్మడి జిల్లా స్థాయిలో ప్రథమ విజేతను ఎంపిక చేయగా, వరంగల్ కలెక్టర్ సత్యశారద ద్వితీయ విజేతను, బల్దియా కమిషనర్ అశ్వినితానాజీ వాకడే తృతీయ విజేతను ఎంపిక చేశారు. ఇదే క్రమంలో మరో 100మంది కన్సొలేషన్ విజేతలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' వరంగల్ బ్రాంచ్ మేనేజర్ వర్ధినేని రఘుపతిరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీపీ సన్‌ప్రీత్ సింగ్ మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలకు న్యాయం జరిగేలా, వారిని ఆకట్టుకు నేలా 'ఆంధ్రజ్యోతి' దమ్మున్న కథనాలు, వార్తలను ప్రచురి స్తోందన్నారు. కేవ లం వార్తలను ప్రజలకు చేరవేయడమే కాకుండా పాఠకుల కు ఇలా లక్కీడ్రా ద్వారా బహుమతులు అందజేయడం అభినందనీయమన్నారు. వ్యవస్థకు, ప్రజలకు మధ్య వారధి లా పనిచేస్తూ పత్రికలు సమాజంలో మరింత చైతన్యం తీసుకురావాలని ఆకాంక్షించారు.



'ఆంధ్రజ్యోతి' కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రా కార్యక్రమంలో మాట్లాడుతున్న 'ఆంధ్రజ్యోతి' వరంగల్ బ్రాంచ్ మేనేజర్ వర్ధినేని రఘుపతిరావు, వేదికపై సీపీ సన్‌ప్రీత్‌సింగ్, కలెక్టర్ సత్యశారద, బల్దియా కమిషనర్ అశ్వినితానాజీ వాకడే, 'ఆంధ్రజ్యోతి' వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు

వరంగల్ కలెక్టర్ సత్యశారద మాట్లాడుతూ 'ఆంధ్రజ్యోతి' ఇప్పటికే తెలుగు వారి సంప్రదాయ పండుగైన సంక్రాంతికి మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహిస్తోందని, అదే కోవలో పాఠకులందరికీ లక్కీడ్రా ద్వారా బహుమతులను అందజేయ డం గొప్ప విషయమన్నారు. పాఠకుల నుంచి వచ్చిన వేలాది లక్కీ కూపన్ ఎంట్రీలే ఈ పత్రికపై ఉన్న ఆదరణకు నిదర్శన మని కొనియాడారు. నగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ రోజూ కథనాలు, వార్తలను ప్రచురిస్తూ ప్రపంచ విజ్ఞానాన్ని అందించడమే కాకుండా విలువైన బహుమతులతో పాఠకులను పట్టాభిషిక్తులను చేయడం అభినందనీయమన్నారు.

'ఆంధ్రజ్యోతి' వరంగల్ బ్రాంచ్ మేనేజర్ రఘుపతిరావు మాట్లాడుతూ తమ యాజమాన్యం లాభాపేక్ష లేకుండా పాఠకుల శ్రేయస్సుకే పెద్దపీట వేస్తోందని, అందులో భాగంగానే మహిళలకు ముగ్గుల పోటీలు, పాఠకులకు విలువైన బహుమతులు అందజేస్తోందన్నారు. లక్కీ డ్రాకు ముందు సీపీ, కలెక్టర్, మునిసిపల్ కమిషనర్ అధునాతన టెక్నాలజీతో నడుస్తున్న 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ప్రింటింగ్, ప్రొడక్షన్, ఎడిటోరియల్ విభాగాలను సందర్శించి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో వరంగల్ డీపీఆర్‌వో ఆయుబ్, మడికొండ ఇన్‌స్పెక్టర్ పుల్యాల కిషన్, 'ఆంధ్రజ్యోతి' వరంగల్ ఎడిషన్ ఇన్‌చార్జ్ కొల్లు రాజేష్, ఉమ్మడి వరంగల్ బ్యూరో ఇన్‌చార్జ్ తడక రాజనారాయణ, 'ఏబీఎన్ ఆంధ్రజ్యోతి' ప్రతినిధి దొంతు నవీన్, ఎలక్ట్రికల్ రిజినల్ మేనేజర్ బైరి అజయ్‌కుమార్, అసిస్టెంట్ సర్క్యులేషన్ మేనేజర్ ఎండీ. షరీఫ్, ఏడీవిటీ మేనేజర్ మాటేటి రమేష్, సబ్‌ఎడిటర్లు, సిస్టమ్స్ ఇన్ చార్జ్ వెంద్ర చక్రధర్, ప్రొడక్షన్ సూపర్‌వైజర్ కట్ట విజయ్, అకౌంటెంట్ సాయిని వెంకటేష్, ఎడిటోరియల్ అసిస్టెంట్ పబ్బ రాజేందర్, స్టోర్ ఇన్‌చార్జ్ గుండెబోయిన రవి, నగర విలేకరులు, కార్యాలయ, సర్క్యులేషన్ విభాగం, సెక్యూరిటీ సిబ్బంది పాల్గొన్నారు.

కన్సొలేషన్ విజేతలు వీరే..

వివరాలు 7లో..



ట్రిపుల్ ఐటీ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు (ఫైల్)

ఎల్కతుర్తిలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు

- అధికారులు స్థల పరిశీలన.. అందుబాటులో 88 ఎకరాలు
- 2026-27 విద్యా సంవత్సరం నుంచి తరగతులు ప్రారంభం
- వెయ్యి మందికి ప్రవేశాలు

7

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

- హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

6



మాట్లాడుతున్న హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్య

ఫిర్యాదులు పెండింగ్ లేకుండా చూడండి

- బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే
- ప్రజావాణిలో ఫిర్యాదులు వెల్లువ

వరంగల్ కార్పొరేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : బల్దియా ప్రజావాణిలో ప్రజలు ఇచ్చిన ఫిర్యాదులు పెండింగ్ లేకుండా చూడాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. సోమవారం గ్రేటర్ వరంగల్ మహా నగర పాలక సంస్థ ప్రధాన కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరై ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. నగర ప్రజలకు అందించాల్సిన సదుపాయాలపై అధికారులు చొరవ చూపాలని అన్నారు. టౌన్‌ప్లానింగ్‌పై చాలా ఫిర్యాదులు అందుతున్నాయని అధికారులు సమస్యలపై శ్రద్ధ వహించాలని అన్నారు. రానున్న వేసవిలో మంచి నీటి సమస్య రాకుండా ఇంజనీరింగ్ అధికారులు ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు జరిగిన గ్రీవెన్స్‌లో 103 ఫిర్యాదులు స్వీకరించినట్లు కమిషనర్ వెల్లడించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్, డీఎఫ్‌వో శంకర్ లింగం, ఇంచార్జి సీపీ రవీంద్ర రాడేకర్, హార్టికల్చర్ అధికారి రమేష్‌తో పాటు వివిధ విభాగాల వింగ్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

అధికారులు స్వీకరించిన ఫిర్యాదులు ఇంజనీరింగ్ - 16, హెల్త్, శానిటేషన్ - 15, ప్రాపర్టీ ట్యాక్స్, రెవెన్యూ - 20, టౌన్‌ప్లానింగ్ - 45, తాగునీటి సరఫరా - 7 ఇలా మొత్తం 103 దరఖాస్తులు వచ్చినట్లు అధికారులు తెలిపారు.

ఫిర్యాదులు ఇలా..

- కాజీపేట ఎన్ఐటీ సమీపంలోని దేవినగర కాలనీలో తాగు నీటి సరఫరా సరిగా కావడం లేదని ఒక వేల వచ్చినా చిన్న దారతో అరగంట కంటే ఎక్కువ సమయం రావడం లేదని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 55వ డివిజన్ భద్రకాళి నగర్‌లో రోడ్డు పక్కన వ్యవసాయ భూమిలో నిరుపయోగంగా బావి ఉంది. ఈ బావిలో రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయని కాలనీవాసులు ఫిర్యాదు చేశారు.
- వరంగల్ శంభునిపేట రాజేంద్రనగర్‌లో ప్రభుత్వ సూచనల మేరకు 20 ఫీట్ల రోడ్డును వదిలేసి తాము ఇళ్లను నిర్మించుకున్నాం, కానీ ఇటీవల కొందరు భూ కబ్జాదారులు రోడ్డును ఆక్రమించి ఇళ్ల నిర్మాణం చేసుకున్నారని కాలనీవాసులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.
- గ్రేటర్ వరంగల్ 3వ డివిజన్ పైడిపెల్లిలో సర్వే నెంబర్ 704 లో ప్రభుత్వ భూమితో పాటు గొలుసుకట్టు పానాది రోడ్డును కొందరు వ్యక్తులు ఆక్రమించుకుంటున్నారని గ్రామస్తులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

కార్మిక భవన్ కబ్జాపై బహిరంగ చర్చకు సిద్ధమా?

- మాజీ ఎమ్మెల్యేకు ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య సవాల్

వరంగల్‌సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అజంజాహి మిల్లు కార్మికులను మోసం చేసింది కాంగ్రెస్ ప్రభుత్వమేనని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ చేసిన వ్యాఖ్యలపై మాజీమంత్రి, ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్య మండి పడ్డారు. కార్మిక భవన్ కబ్జాపై బహిరంగ చర్చకు సిద్ధమా అంటూ సవాల్ విసిరారు. సోమవారం నగరంలోని రాంకీ సిటీలో 20వ డివిజన్ కార్పొరేటర్ గుండేటి నరేంద్ర కుమార్ నివాసంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అజంజాహీ మిల్లు భూముల కబ్జాపై మాజీ ఎమ్మెల్యే ఇన్నాళ్లకు స్పందించడం హాస్యాస్పదంగా ఉందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలోనే ప్రభుత్వ భూములన్నీ కబ్జాకు గురయ్యాయని ఆరోపించారు. నన్నపునేని నరేందర్ మేయర్‌గా, ఎమ్మెల్యేగా ఉన్న కాలంలోనే మిల్లు స్థలంలో కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణానికి అనుమతులు వచ్చాయన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న బస్వరాజు సారయ్య

మాజీ, ప్రస్తుత ఎమ్మెల్యే కుమ్మక్కయ్యారు..

మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్, ప్రస్తుత ఎమ్మెల్యే కొండా సురేఖ ఇద్దరు కుమ్ముక్కవడం వల్లే కార్మికుల భూమి కబ్జా అయిందని బస్వరాజు సారయ్య ఆరోపించారు. అందువల్లే వారు కార్మికుల పక్షాన పోరాటం చేయడం లేదని అన్నారు. దమ్ము, ధైర్యం ఉంటే వారిద్దరు బహిరంగ చర్చకు రావాలని సవాల్ విసిరారు. భూ కబ్జా విషయంలో ముఖ్యమంత్రికి లేఖ రాసి కార్మికులకు న్యాయం చేయాలని కోరింది.. కౌన్సిల్‌లో మాట్లాడింది.. అనుమతులు రద్దు చేయాలని కోరింది.. దొంగ కాగితాలు సృష్టించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలన్నది తానేనని స్పష్టం చేశారు. కూల్చివేసిన కార్మిక భవనం స్థలంలోనే నూతన భవనం నిర్మించాలని కోరింది కూడా తానేనని, అందుకు తగిన ఆధారాలు ఉన్నాయని సారయ్య చెప్పుకొచ్చారు. చివరకు జర్నలిస్టులకు ఇండ్లు ఇస్తామని మోసం చేసింది కూడా మీరేనని, మోసం చేయడమే లక్ష్యంగా రాజకీయాలు చేస్తున్నది మీరేనని విమర్శించారు. అదే విధంగా ఇటీవల ఖిలా వరంగల్‌లో గొర్రెల సజీవదహనంపై సీపీ, డీజీపీలను కలిసి ప్రత్యేక దర్యాప్తు చేసి నిందితులను పట్టుకోవాలని కోరుతామన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ బస్వరాజు శిరీష, మాజీ కార్పొరేటర్లు దామెర సర్వేశం, బిల్లా శ్రీకాంత్, నాయకులు జన్ను అరుణ్, కురవి పరమేశ్వర్, గోరంటాల రాజు, జన్ను రవి, కరాటే ప్రభాకర్, చాగంటి శ్రీనివాస్, తోట బాలరాజు, పెండ్యాల కొంరయ్య, గజ్జెల లింగమూర్తి, మార్త ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ ఈవో, అర్చకులు

30న రుద్రేశ్వరాలయంలో ఉగాది వేడుకలు

శ్రీరామ నవమి నవరాత్రి వేడుకలు ప్రారంభం

హనుమకొండ కల్చరల్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): చారిత్రక వేయిస్తంభాల రుద్రేశ్వరాలయంలో ఈ నెల 30న ఉగాది నూతన విశ్వావసు నామ సంవత్సర వేడుకలను వైభవంగా నిర్వహిస్తామని ఆలయ ప్రధాన అర్చకులు గంగు ఉపేంద్రశర్మ, ఈవో అనిల్ కుమార్‌లు చెప్పారు. సోమవారం ఆలయ కల్యాణ మండపంలో ఉగాది ఉత్సవాలతోపాటు అదే రోజు నుంచి పది రోజులపాటు జరుపుకునే శ్రీరామనవమి నవరాత్రి ఉత్సవాల ఆహ్వాన పత్రికను ప్రభుత్వ ప్రత్యేక సలహాదారుడు వేం నరేందర్‌రెడ్డి బంధువులు వాసుదేవరెడ్డి, సుజాత దంపతులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఈవో అనిల్ కుమార్, గంగు ఉపేంద్రశర్మ మాట్లాడుతూ.. సాయంత్రం ఆలయ ప్రాంగణంలో 5.30 గంటలకు పంచాంగ శ్రవణంతోపాటు కవి సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. దేవాదాయశాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కవి సమ్మేళనంలో పాల్గొనే కవులకు వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, ఇతర జిల్లా అధికారులు సత్కారం చేస్తారని చెప్పారు. ఉగాది పర్వం నుంచి శ్రీరామనవమి వరకు జరిగే నవరాత్రి ఉత్సవాలు కూడా ఉగాది నుంచి ప్రారంభం అవుతాయని ఇందుకు అనుగుణంగా మహాసుదర్శన హోమం నిర్వహిస్తామన్నారు. శ్రీరామ నవమి కల్యాణంలో కూడా భక్తులుతగిన రుసుము చెల్లించి ఎవరైనాపాల్గొవచ్చని ఈవో తెలిపారు. పది రోజులపాటు వివిధ కార్యక్రమాలను నిర్వహింపజేస్తామన్నారు.

వైభవంగా కళాజాతర

కళాకారులకు అవార్డులు



కళాకారులను సత్కరిస్తున్న నిర్వాహకులు

హనుమకొండ కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హనుమ కొండలోని నేరెళ్ల వేణుమాధవ్ ఆడిటోరియంలో తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సహకారంతో జేడీ కల్చరల్ ఆర్ట్స్ జడల శివ, హరిత ఆధ్వర్యంలో ఆదివారం రాత్రి పొద్దుపోయే వరకు కళాజాతర పేరిట సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా కళాకారులకు ఉగాది పురస్కారాలను జేడీ కల్చరల్ సొసైటీ ప్రదానం చేసింది. కేయూ పాలక మండలి సభ్యులు కె.అనితారెడ్డి, డాక్టర్ రుక్మిణి, విద్యావేత్త ఝాన్సీ, అమ్మ నాన్న చారిటబుల్ ట్రస్ట్ అధినేత సీతా మహాలక్ష్మీ తదితరులు అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిన్నారులు ప్రదర్శించిన జానపద నృత్యాలు, మిమిక్రీ రెండు గంటలపాటు సందడి చేశాయి. దేవులపల్లి శ్రీవిద్య, కీబోర్డు ప్లేయర్ రాజు, తబల అనిల్, మిమిక్రీ శ్రవణ్ తదితర కళాకారులు ఉగాది పురస్కారాలను అందుకున్నా రు. రోజా క్రియేషన్స్ శ్యామ్, మైక్ ప్రసాద్, కీబోర్డు స్వప్న, రంగనాథ్, ప్రముఖ గాయని స్వప్న తదితరులు పాల్గొన్న కార్యక్రమానికి లింగాల ఇమ్మాన్యుయేల్ వ్యాఖ్యతగా వ్యవహరించారు. ప్రతియేటా కళాకారులను ప్రోత్సహించేందుకు తమ జేడీ కల్చరల్ ఉగాది పురస్కారాలను ప్రదానం చేస్తున్నట్లు జడల శివ చెప్పారు.

ప్రజావాణి వినతులు పెండింగ్‌లో ఉండొద్దు

- వినతులు స్వీకరించిన వరంగల్ కలెక్టర్ సత్యశారద, హనుమకొండ అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

వరంగల్ కలెక్టరేట్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రజావాణికి వచ్చిన దరఖాస్తులను పెండింగ్‌లో పెట్టకుండా త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సత్య శారద సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో ఆమె ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దరఖాస్తులను శాఖల వారీగా వెంటనే పరిష్కరించాలని సూచించారు. ప్రజావాణికి మొత్తం 85 వినతులు అందగా వాటిని శాఖల వారీగా ఎండార్స్ చేశారు. అందులో రెవెన్యూ శాఖకు 20, కలెక్టరేట్ సూపరింటెండెంట్ 14, హౌసింగ్ పీడీ 3, జిల్లా సంక్షేమశాఖ 4, ఇరిగేషన్ 2, జీడబ్ల్యూఎంసీ 3, పౌర సరఫరాల శాఖ 2, జిల్లా పంచాయతీ 3, పోలీసు శాఖ 3, నర్సంపేట మునిసిపాలిటీ 2, ఎస్సీ కార్పొరేషన్ 2, విద్యాశాఖ 3, ఎస్సీ డెవలప్‌మెంట్ 2, ఏడీ మైన్స్ 2, ధరణి 3, వ్యవసాయ శాఖ 4, ఎన్‌పీడీసీఎల్‌కు 2 వినతులు అందాయి. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ సంధ్యారాణి, డీఆర్‌వో విజయలక్ష్మీ, జడ్పీ సీఈవో రామిరెడ్డి, డీఆర్‌డీవో కౌసల్యాదేవి, వరంగల్, నర్సంపేట ఆర్డీవోలు సత్యపాల్‌రెడ్డి, ఉమారాణి, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ సురేశ్, వ్యవసాయ శాఖ అధికారి అనురాధ, డీసీవో నీరజ, డీపీవో కల్పన, సివిల్ సప్లయీస్ డీఎం సంధ్యారాణి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలి

హనుమకొండ కలెక్టరేట్ : ప్రజావాణి దరఖాస్తులను అధికారులు త్వరగా పరిష్కరించాలని అదనపు జిల్లా కలెక్టర్ వెంకట్‌రెడ్డి ఆదేశించారు. సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన ప్రజావాణిలో ఆయన వినతులు స్వీకరించారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజల నుంచి వచ్చిన వినతులను అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి స్వీకరించి శాఖల వారిగా పరిష్కరించాలన్నారు. ప్రజావాణి కార్యక్రమంలో వివిధ సమస్యలపై 120 దరఖాస్తులు అందినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి వైవి.గణేష్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి మేన శ్రీను, హనుమకొండ, పరకాల ఆర్డీవోలు రాథోడ్ రమేశ్, డాక్టర్ నారాయణ, ఇతర జిల్లా అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.



వరంగల్‌లో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ సత్యశారద



హనుమకొండలో ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకట్‌రెడ్డి

రైస్ మిల్లులపై చర్యలు తీసుకోవాలి

వర్ధన్నపేట మండలం ఇల్లంద వ్యవసాయ మార్కెట్ పరిధిలో మొత్తం 26 రైస్ మిల్లులు నడుస్తున్నాయి. ఇందులో మూడు మిల్లులకు మాత్రమే అనుమతి ఉండగా మిగతా వాటిని అక్రమంగా నడిపిస్తున్నారు. అనుమతులు లేకుండా ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా నడుపుతున్న రైస్ మిల్లులపై విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో విచారణ చేయించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలి.

- ఈఱెల్లి శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ నాయకుడు, వర్ధన్నపేట

చికెన్ సెంటర్‌ను తరలించాలి

నర్సంపేట మునిసిపాలిటీ పరిధిలో ప్రభుత్వ స్థలంలో జనవాసాల మధ్య చికెన్ సెంటర్ ఏర్పాటు చేయడం మూలంగా చికెన్ వ్యర్థాల దుర్వాసన వెదజల్లుతోంది. పక్కనే గుంతను తవ్వి వ్యర్థాలు, కలుషిత నీటిని అందులో వదులుతున్నారు. దీంతో చుట్టుపక్కల కుటుంబాలు వాంతులు, విరోచనాలతో తీవ్ర అస్వస్థతకు గురవుతున్నారు. ఆ చికెన్ సెంటర్‌ను వేరే ప్రాంతానికి మార్చాలి.

- డి.శశికళ, నర్సంపేట

24 గంటల్లో దేవాదుల నీరు వదలకపోతే ఆందోళనలే..

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు



పంథినిలో మాట్లాడుతున్న మాజీ మంత్రి దయాకర్‌రావు

ఐనవోలు, మార్చి 24(ఆంధ్రజ్యోతి): రానున్న 24 గంటల్లో దేవాదుల నీటిని విడుదల చేయకపోతే రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు హెచ్చరించారు. మండలంలోని పంథినిలో సోమవారం బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ మంత్రి పాల్గొని మాట్లాడారు. దేవాదుల ప్రాజెక్టు ద్వారా వరంగల్ ఉమ్మడిజిల్లా, సిద్దిపేట, సూర్యాపేట, యాదాద్రి భువనగిరి జిల్లాల్లో సుమారు 5 లక్షల 57వేల ఎకరాలకు రెండు పంటలకు సాగు నీరు అందించేలా కేసీఆర్ రూపకల్పన చేశారన్నారు. దేవాదుల మూడో దశ కింద రూ.1,494 కోట్లతో రామప్ప చెరువు నుంచి ఉనికిచెర్లకు టన్నెల్, దేవన్నపేట వద్ద పంపు హౌస్‌ను కేసీఆర్ పూర్తిచేస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం 15 నెలలుగా పనులు ముందుకు సాగనీయకుండా పనులను పెండింగ్‌లో పెట్టిందన్నారు. దేవన్నపేట పంప్ హౌస్ వద్ద ఉన్న భారీ సామర్థ్యం గల మోటర్ల ద్వారా ఎండిపోగా మిగిలిన పంటలకు సాగునీరు ఇస్తామని చెప్పి మంత్రుల పర్యటన కోసం పంపు హౌస్ ఆన్ చేయకుండా నిలుపుతారా అని ప్రశ్నించారు. ఇది ప్రభుత్వానికి మంచిది కాదన్నారు. ట్రయల్ రన్ పూర్తి చేసి నీరు వదులకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా 24గంటల్లో నీటిని విడుదల చేయాలని లేని పక్షంలో ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రైతులతో కలిసి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. అదేవిధంగా ఏప్రిల్ 27న హనుమకొండలో నిర్వహించే బీఆర్ఎస్ సభకు వర్ధన్నపేట నియోజకవర్గం నుంచి 20వేలకు తగ్గకుండా ప్రజలను తరలించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. అదే విధంగా పంథిని మాజీ ఎంపీటీసీ బోయినపల్లి సోమేశ్వర్‌రావు దశదినకర్మ సోమవారం జరిగింది. కార్యక్రమానికి మాజీ ఎంపీ వినోద్‌కుమార్‌తో కలిసి దయాకర్‌రావు పాల్గొని సంతాపం తెలిపి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నీటి పారుదాల శాఖ అధికారులకు ఎర్రబెల్లి వార్నింగ్

హనుమకొండ టౌన్ : నీటి పారుదాల శాఖ అధికారులకు మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు వార్నింగ్ ఇచ్చారు. దేవాదుల ట్రాయల్ రన్ పనులు చేసినా రైతులకు నీళ్ల ఇవ్వకపోవడం దారుణమని ఎర్రబెల్లి దయాకర్‌రావు అధికారులను విమర్శించారు. సోమవారం హనుమకొండ రాంనగర్‌లోని ఎర్రబెల్లి దయాకర్‌రావు నివాసంలో విలేకరులతో మాట్లాడారు. మంత్రుల కోసం నీటి పారుదాల శాఖ అధికారులు ఎదురు చూడొద్దని ఇప్పటికే 80 శాతం పంటలు ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు 24 గంటల్లో నీరు ఇవ్వకుంటే, ఉమ్మడి వరంగల్ జిల్లా రైతులతో కలిసి ధర్నాలు చేస్తామన్నారు. ఏదో మంత్రుల పర్యటన కోసం నీటి పారుదల శాఖ అధికారులు ట్రయల్ రన్ చేసిన మోటార్ల ద్వారా రైతులకు సాగునీరు ఇవ్వకపోవడాన్ని తీవ్రంగా విమర్శించారు. 24 గంటల్లోగా దేవన్నపేట పంప్‌హౌస్ నుంచి నీళ్ల వదలకపోతే రైతులందరినీ ఏకం చేసి ధర్నాలు, రాస్తారోకోలు చేస్తామని హెచ్చరించారు.

కల్వర్టును ఢీకొట్టి కాల్వలో పడి..

- బీటెక్ విద్యార్థి మృతి
- మరొకరికి స్వల్ప గాయాలు



వికాస్ (ఫైల్)

నర్సంపేట టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి మృతి చెందగా, మరొకరికి స్వల్ప గాయాలైన ఘటన నర్సంపేట పట్టణంలోని పాకాలరోడ్డు శివారులో సోమవారం జరిగింది. ఎస్సై అరుణ్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జనగామ జిల్లా చెల్పూర్ గ్రామానికి చెందిన దారం సత్యనారాయణ కుమారుడు వికాస్ (22) నర్సంపేట మండలం మగ్దుంపురం గ్రామంలోని జయముఖి ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. సోమవారం ఉదయం తన మిత్రుడు నెక్కొండ మండలం చంద్రుగొండకు చెందిన ఎర్రబోతుల రాజుతో కలిసి బైక్‌పై పాకాల వెళ్లారు. తిరిగి సాయంత్రం వస్తుండగా రాజు బైక్ నడుపుతుండగా వెనుకాల వికాస్ కూర్చున్నాడు. బైక్ పట్టణంలోని పాకాల రోడ్డు(రాజుపేట శివారు)లోకి రాగానే అదుపు తప్పి కల్వర్టును ఢీకొట్టింది. దీంతో వెనుకాల కూర్చున్న వికాస్ ఎగిరి కల్వర్టు అవతల కాలువలో పడడంతో తీవ్ర గాయాలు కాగా బైక్ నడుపుతున్న రాజుకు స్వల్పగాయాలయ్యాయి. స్థానికులు వారిని వెంటనే నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటికే వికాస్ మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టంనకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై అరుణ్ వివరించారు.

మద్యానికి బానిసై జీవితంపై విరక్తితో..

పురుగుమందు తాగి ఆర్మీ మాజీ ఉద్యోగి మృతి



రజినీకుమార్ (ఫైల్)

దుగ్గొండి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ వ్యక్తి మద్యానికి బానిసగా మారి జీవితంపై విరక్తితో పురుగుమం దు తాగి ఆత్మహత్యాయత్నం చేశాడు. చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై నీలోజు వెంకటేశ్వర్లు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. మండల కేంద్రానికి చెందిన చంద్రగిరి రజినీకుమార్ (42) కొంత కాలంగా మద్యానికి అలవాటు పడ్డాడు.

గతంలో 8 ఏం డ్లు ఆర్మీలో పని చేశాడు. అప్పుడు మద్యానికి బానిసైనందుకు అధికారులు ఉద్యోగం నుంచి తొలగించారు. భార్య విడాకులు తీసుకొని వెళ్లిపోయింది. తల్లిదండ్రులైన చంద్రగిరి సంజీవ, సరోజనతో కలిసి ఉంటున్నాడు. పని చేయకుండా దుబారాగా తిరిగేవాడు. మత్తులో ఈనెల 19న పురుగుల మందు తాగాడు. బంధువులు చికిత్స కోసం ఎంజీఎం దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. మృతుడి తండ్రి సంజీవ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్షయ వ్యాధి నిర్మూలనకు కృషి చేయాలి

కలెక్టర్ పి.ప్రావీణ్య

వరంగల్ మెడికల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : క్షయ వ్యాధి నిర్మూలనకు సకాలంలో క్రమం తప్పకుండా వైద్య చికిత్స పొందడం, మందులు వాడటం ద్వారా వ్యాధిని నివారించవచ్చని హనుమకొండ జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య తెలిపారు. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవాన్ని పురస్కరించుకొని కాకతీయ మెడికల్ కళాశాల సమావేశ మందిరంలో సోమవారం కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ప్రావీణ్య మాట్లాడుతూ ఐదు గ్రామాలను క్షయ వ్యాధి రహిత గ్రామాలుగా ప్రకటించడం జరిగిందని తెలిపారు. క్షయ వ్యాధి నిర్మూలనకు డాక్టర్లు సిఫారసు చేసిన ప్రకారం క్రమం తప్పకుండా మందులు వినియోగించడంతోపాటు సకాలంలో పౌష్టిక ఆహారం అందించడం ద్వారా కూడా వ్యాధిని పూర్తిగా నివారించవచ్చని తెలిపారు. ఈ వ్యాధి ప్రాణాంతకమైన వ్యాధి కాదని, 2025 నాటికి టీబీ రహిత తెలంగాణ, భారతదేశం కోసం కృషి చేయడం జరుగుతుందన్నారు. 2024లో టీబీ లక్షణాలున్న 22770 మందికి గాను 20956 మందికి పరీక్షలు నిర్వహించడం జరిగిందన్నారు. ఈ జనవరి నుంచి ఇప్పటి వరకు 363 కేసులు గుర్తించడం జరిగిందని కలెక్టర్ తెలిపారు. ముందుగా ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా భద్రకాళి ఆలయ ఆర్చి నుంచి కాకతీయ వైద్య కలాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డీఎంహెచ్‌వో డాక్టర్ ఎ.అప్పయ్య, డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ విజయ్ కుమార్, అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ టి.మదన్ మోహన్‌రావు, టీబీ నియంత్రణ అధికారి డాక్టర్ హిమబిందు, డాక్టర్ శ్రీధర్, డాక్టర్ సునీత, డాక్టర్ కె.లలితాదేవి, డాక్టర్ మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

డీసెట్‌కు దరఖాస్తుల ఆహ్వానం

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : డిప్లమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీసెట్)-2025కు దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ప్రభుత్వ డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎండి. అబ్దుల్ హై సోమవారం ఒక ప్రకటనలో కోరారు. మే 15 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా ఆయన పేర్కొన్నారు. మే 25న నిర్వహించే డీసెట్ పరీక్షకు ఇంటర్‌లో 50 శాతం మార్కులు సాధించిన జనరల్, 45 శాతం సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవచ్చునని ఆయన తెలిపారు. పూర్తి వివరాలకు సంబంధిత వెబ్ పోర్టల్‌ను చూడాలని ఆయన సూచించారు.

ఇన్‌చార్జ్ డీటీసీగా పురుషోత్తం బాధ్యతల స్వీకరణ

వరంగల్ క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్‌గా పురుషోత్తం సోమవారం హనుమకొండ కార్యాలయంలో బాధ్య తలు స్వీకరించారు. గతంలో డీటీసీగా పనిచేసిన పుప్పాల శ్రీనువాస్ ఈ ఏడాది ఫిబ్రవరి 7న ఆస్తులకు మిం చిన ఆదాయం కేసులో ఏసీబీ అధికా రులకు పట్టుబడి జైలుకు వెళ్లగా అప్ప టి నుంచి ఈ పోస్టు ఖాళీగా ఉంది. ప్రభుత్వ ఆదేశాలతో గతంలో వరంగ ల్ డీటీసీగా పనిచేసి ప్రస్తుతం కరీంనగర్ డీటీసీగా పనిచేస్తోన్న పురుషోత్తం సోమవారం బాధ్యతలు స్వీకరించగా హనుమకొండ జిల్లా రవాణాశాఖధికారి వేణుగోపాల్, సీనియర్ యంవిఐ రమేశ్ రాథోడ్, సిబ్బంది మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.



డీటీసీ పురుషోత్తంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న డీటీఓ, యంవిఐ



అవార్డు అందుకుంటున్న ఉపేంద్రచారి

ఉత్తమ అవార్డు ప్రదానం

వరంగల్ మెడికల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ టీబీ నియంత్రణ దినోత్సవం సందర్భంగా ఉత్తమ ఆరోగ్య కార్యకర్తగా దొంతోజు ఉపేంద్రచారి ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం జరిగిన ఓ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పి.ప్రావీణ్య చేతులమీదుగా అవార్డును అందుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎ.అప్పయ్య తదితరులు పాల్గొన్నారు.

29న కేయూ అకాడమిక్ సెనెట్ సమావేశం

కేయూ క్యాంపస్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కాకతీయ యూనివర్సి టీ 40వ అకాడమిక్ సెనెట్ సమావేశం మార్చి 29న శనివారం ఉదయం 11 గంటలకు సెనెట్ హాల్‌లో నిర్వహిస్తామని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం తెలిపారు. 2023-24 వార్షిక ఖాతాలు, రివైజ్డ్ బడ్జెట్ అంచనాలు, 2024-25, 2025-26 వార్షిక బడ్జెట్ అంచనా, 2023-24 స్టాండింగ్ కమిటీ మినిట్స్ అప్రూవల్స్ 2023-24 ఏడాది వార్షిక నివేదికతో పాటు ఇతర అంశాలపై అకాడమిక్ సెనెట్ కమిటీ చర్చిస్తోందని పేర్కొన్నారు. సమావేశంలో కేయూ అకాడమిక్ సెనెట్ సభ్యులు, పాలక మండలి సభ్యులు, డీన్లతో పాటు ఇతర విభాగాల అధికారులు పాల్గొంటారని వివరించారు.

వరంగల్ మార్కెట్ ధరలు (రూ. వేలల్లో)

పంట	క్వింటా గరిష్ఠం	క్వింటా కనిష్ఠం
పత్తి	7030	5800
మక్కలు (బిల్టీ రకం)	2131	2100
కందులు	6768	5540
పెసళ్లు	7709	4645
పల్లికాయ (సూక)	7100	6500
పల్లికాయ (పచ్చిది)	4350	3400
పసుపు (కాడి)	-	-
పసుపు (గోల)	-	-
తేజ మిర్చి	13000	9000
వండర్‌హాట్	14500	11500
యూఎస్341	12400	9500
దీపిక	13500	15245
దేశీ	26500	25500
సింగిల్ పట్టి	26000	28000
తాలు మిర్చి	6500	3000

- వరంగల్ వ్యవసాయం

చాలా ఆనందంగా ఉంది



చాలా ఏళ్లుగా ఆంధ్రజ్యోతి పాఠకుడిగా ఉన్నా. ప్రతీ ఏడాది ఆంధ్రజ్యోతి వారు నిర్వహించే కార్ అండ్ బైక్ రేసు లక్కీ డిప్ కూపన్లు పంపుతున్నా. ఈసారి లక్కీడిప్‌లో ఏకంగా ప్రథమ బహుమతి వచ్చిందని వరంగల్ పోలీస్‌కమిషనర్ ఫోన్ చేసి అభినందించడం సంతోషంగా ఉంది. రిటైర్డ్ కోర్టు ఉద్యోగినైన నా దినచర్య ఆంధ్రజ్యోతి చదవడంతోనే మొదలవుతుంది. ఈ ఏడాది లక్కీ డీప్‌లో ప్రథమ బహుమతి రావడం ఆనందంగా ఉంది.

- అడవాల సదానందం, నర్సంపేట ప్రథమ బహుమతి విజేత

తొలినుంచి 'ఆంధ్రజ్యోతి' పాఠకుడిని..



'ఆంధ్రజ్యోతి' కార్ అండ్ బైక్ రేసు లక్కీ డ్రాలో ద్వితీయ బహుమతి విజేతగా నిలిచావని వరంగల్ కలెక్టర్ నుంచి ఫోన్ రాగానే చాలా సంతోషం అనిపించింది. నర్సంపేట పట్టణంలో 30ఏళ్లుగా పవన్ ఫొటో స్టూడియోను నిర్వహిస్తున్నా. ఆంధ్రజ్యోతి పునఃప్రారంభం నుంచి పాఠకుడిగా కొనసాగుతున్నా. ఇందులో ప్రచురితమయ్యే కథనాలు, వార్తలు ఎంతగానో ఆకట్టుకుంటాయి. ప్రతీసారి కూపన్లు పంపుతూనే ఉన్నా. ఈసారి నా మనుమరాలు వామిక పేరుతో వేశా.. ద్వితీయ బహుమతి గెలుచుకోవడం సంతోషంగా ఉంది.

- తక్కళ్లపెల్లి సోమేశ్వర్‌రావు (వామిక తాత), నర్సంపేట, ద్వితీయ బహుమతి విజేత

దమ్మున్న వార్తలు రాసే ఆంధ్రజ్యోతి అంటే ఎంతో ఇష్టం



దమ్మున్న వార్తలు రాసే 'ఆంధ్రజ్యోతి' అంటజే నాకు చాలా ఇష్టం. అలాంటి పత్రిక పాఠకుల కోసం ఏర్పాటు చేసిన డ్రాలో నా మనవడు అధర్వకృష్ణ పేరుతో కూపన్ వేశా. నాకు తృతీయ బహుమతి వచ్చిందని బల్దియా కమిషనర్ ఫోన్ చేసి చెప్పగానే ఎంతో ఆనందం అనిపించింది. 19 ఏళ్లుగా ఆంధ్రజ్యోతి పత్రికను చదువుతున్నా. ఎండీ వేమూరి రాధాకృష్ణ ప్రతి ఆదివారం రాసే కొత్తపలుకు అంటే మరింత ఆసక్తి. 2008లో జరిగిన డ్రాలో 4గ్రాముల బంగారం గెలుచుకున్నా. మళ్లీ ఇన్నేళ్లకు మరోసారి బహుమతి రావడం సంతోషంగా ఉంది. ఆంధ్రజ్యోతి యాజమాన్యానికి కృతజ్ఞతలు.

- దేశగాని వెంకటయ్య (అధర్వకృష్ణ తాత), తొర్రూరు, తృతీయ బహుమతి విజేత



'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ప్రింటింగ్, టెక్నికల్ (సీటీపీ) విభాగాలను పరిశీలిస్తున్న సీపీ, కలెక్టర్, కమిషనర్





మొదటి, రెండో, మూడో విజేతల కూపన్లను చూపుతున్న సీపీ, కలెక్టర్, కమిషనర్, చిత్రంలో 'ఆంధ్రజ్యోతి' బీఎం రఘుపతిరావు, బ్యూరో ఇన్‌చార్జ్ రాజనారాయణ, వివిధ విభాగాల ఇన్‌చార్జ్‌లు, సిబ్బంది, డ్రా కార్యక్రమంలో పాల్గొన్న 'ఆంధ్రజ్యోతి' ఉద్యోగులు



ఉత్సాహంగా ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రా





'ఆంధ్రజ్యోతి' 22వ వార్షికోత్సవం సందర్భంగా పాఠకులకు మరింత చేరువయ్యేలా సంస్థ ఆధ్వర్యంలో కార్ అండ్ బైక్ రేస్ లక్కీడ్రా స్కీంను నిర్వహించింది. సోమవారం సాయంత్రం హనుమకొండ జిల్లా మడికొండలోని యూనిట్ కార్యాలయంలో ఉత్సాహంగా సాగిన లక్కీడ్రా కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వరంగల్ సీపీ సన్‌ప్రీత్ సింగ్, వరంగల్ కలెక్టర్ సత్యశారద, వరంగల్ నగరపాలక సంస్థ కమిషనర్ అశ్విని తానాజీ వాకడే హాజరయ్యారు. నాలుగు నెలలుగా నిర్వహించిన ఈ లక్కీడ్రా స్కీంకు సంబంధించి ఉమ్మడి జిల్లా నుంచి వేలాది కూపన్లు అందగా.. సీపీ సన్‌ప్రీత్ సింగ్ ప్రథమ విజేతను ఎంపిక చేశారు. వరంగల్ కలెక్టర్ సత్యశారద ద్వితీయ విజేతను, బల్దియా కమిషనర్ అశ్వినితానాజీ వాకడే తృతీయ విజేతను ఎంపిక చేశారు. ఇదే క్రమంలో మరో 100మంది కన్సొలేషన్ విజేతలను ఎంపిక చేశారు.

కన్సొలేషన్ విజేతలు వీరే..

01.తోట వెంకటేశ్వర్లు	శివునిపల్లి	9849226558
02.తాడ్వాయి పురుషోత్తంరెడ్డి	కోమటిపల్లి	6201107075
03.మంద సూర్యతేజ	హనుమకొండ	9959876684
04.కే.సీతారత్నం	వెంకటాపురం	7731012750
05.గుర్రాల వెంకట్‌రెడ్డి	మల్కాపూర్	8008889675
06.ఆకుల మురహరి	కాజీపేట	9966261371
07.టీనర్సింహస్వామి	వరంగల్	9395111020
08.పూజరి రమేష్	చిన్నపెండ్యాల	7093346341
09.ఎర్రబెల్లి దేవేంద్ర	మడికొండ	9963336651
10.గుండెబోయిన రాములు		9951092362
11.గట్టు రవి	చిన్నపెండ్యాల	7386659335
12.టి.అపర్ణ	హనుమకొండ	9573331597
13.ఇషాన్	సుబేదారి	9849762965
14.బి.మీనా	నల్లబెల్లి	9959181701
15.జంగం ప్రభాకర్	వరంగల్	9390785865
16.అంబాల శ్రీశాంత్	నెల్లుట్ల	9603532154
17.టి.శివనాగేందర్	మడికొండ	8801054925
18.ఎం.రమేశ్	మహదేవపూర్	9948026774
19.తొగరి తిరుపతి	భూపాలపల్లి	9848624627
20.గాజుల అశోక్	మైలారం	7799461807
21.కోడెపాక వర్షిత్	రాయపర్తి	9618295875
22.సోమరాతి మదన్‌మోహన్	వరంగల్	9010526359
23.పల్లకొండ యాదగిరి	కాశిబుగ్గ	9908247158
24.ఎ.వీణ	కాజీపేట	9866571547
25.పొన్న గౌతమ్	స్టేషన్‌ఘన్‌పూర్	9948923715
26.ఆర్.ఆదర్శ	భూపాలపల్లి	9533066965
27.ఎస్.పూర్ణిమ	కాపులకనిపర్తి	6304771612
28.ఎస్.కరుణశ్రీ	శంభునిపేట	9032819454
29.టి.అనూష్	హనుమకొండ	8686706103
30.పులి రంజిత్‌కుమార్	వనమాలకనపర్తి	8008683280
31.కె.అరుణ	హన్మకొండ	9676033646
32.వి.రిషిత్	వడ్డెపెల్లి	8309651036
33.డి.ఆదర్శ్	మహబూబాబాద్	8096134050
34.శ్రీహిత	హన్మకొండ	9603070700
35.రిత్విక్	వడ్డెపెల్లి	8301651035
36.జె.సుధీర్‌రావు	కాపువాడ	9703015242
37.యు.ఉమామహేశ్వర్‌రావు	చెల్పూర్	9052629502
38.ఎస్.వెంకటేశ్వర్లు	వెంకటేశ్వరకాలనీ	9014812594
39.పెరుమాండ్ల శ్రావణ్	చిన్నకోడెపాక	9490990660
40.ఎస్.సతీష్	బాలసముద్రం	9912381592
41.జి.సబిత	ములుగు	7396913563
42.బి.రాజేందర్	వరంగల్	7995211997
43.జె.అరుణ	మడికొండ	8184826354
44.ఇ.వసంత	హన్మకొండ	8008747505
45.ఎస్.సురేందర్	సిద్దార్థనగర్	7036940515
46.పి.భవాని వర్మ	కాజీపేట	9515005541
47.జి.మధురాబాయి	కనకదుర్గ కాలని	7337260546
48.ముప్పిడి శివకుమార్	కడిపికొండ	9959524014
49.యం.డి.అమాన్	భీమారం	7989475989
50.జె.శాన్వి	వరంగల్	7207115575
51.బొక్క రాములు	వడ్డెపల్లి	9849123819
52.జి.నీరజ	వరంగల్	9281479668
53.కె.వైష్ణవి	హనుమకొండ	9390502002
54.ఎస్.సముద్రిక	వరంగల్	8374867961
55.ఎస్.ఆరుష్ కార్తికేయ	ఏటూరునాగారం	7396191991
56.పి.శృతి	ఆత్మకూరు	9441116732
57.ఎ.ఓంప్రకాష్	హనుమకొండ	8374275560
58.యు.సతీష్‌కుమార్	కాజీపేట	8790991928
59.ఎం.రవి	వరంగల్	9949284224
60.బి.రవి	ఖిలావరంగల్	7989470166
61.పి.కవిత	వరంగల్	9989293286
62.ఆర్.ఎల్లయ్య	స్టేషన్‌ఘన్‌పూర్	9705547318
63.జి.లలిత	ధర్మసాగర్	9912249156
64.ఎస్.ప్రసన్న	వరంగల్	9063668286
65.జి.అవికకృష్ణ	హనుమకొండ	9866926255
66.ఎస్.సుజాత	గార్లపల్లి	8374621413
67.మరుపట్ల హర్షవర్ధన్	కాజీపేట	9440571375
68.యార వీరయ్య	నర్సింహులుపల్లె	9177127638
69.జనగాం శ్రీనివాస్	కాసీంపల్లి	9989414299
70.వెలమజాల కోమల	స్టే.ఘన్‌పూర్	8074437618
71.కందికట్ల హస్విత	ఆత్మకూరు	9849494530
72.సిరిపురం కుమారస్వామి	ఖిలావరంగల్	9618931631
73.మోరె నారాయణ	మహబూబాబాద్	9985652701
74.ఆకోజు ప్రణీత్	వరంగల్	9347953147
75.శ్రీరామోజు శోభాదేవి	నర్సంపేట	9948861136
76.పి.సౌజన్య	సుబేదారి	9963391939
77.ఇరుకుళ్ల వెంకటేశ్వర్లు	హనుమకొండ	9492116654
78.దొంతుల శేఖర్	జనగామ	9247805943
79.తూటి నర్సింహారెడ్డి	పెద్దపెండ్యాల	9618810844
80.మొత్తూరు రవిందర్	హనుమకొండ	9848422235
81.వి.కన్నయ్య	నర్సంపేట	9848228870
82.ఎస్.ఎలీష	హసన్‌పర్తి	9963437567
83.మౌనిక	హన్మకొండ	7981737692
84.కె.హన్వీక	హన్మకొండ	9866572547
85.వి.జాగృతి	హన్మకొండ	9948678767
86.ఎస్. రక్షిత్	మహబూబాబాద్	9491825628
87.టి.రజిత	ఆత్మకూర్	7995530462
88.కె.నిషిక జైస్వాల్	ఆత్మకూర్	9959192226
89.వై.ప్రవీణ్‌కుమార్	మట్టెవాడ, వరంగల్	9848418047
90.ఆర్.స్వరూపరాణి	ఖాజీపేట	8106016221
91.ఎ.శ్రీనివాస్	కమలాపూర్	9959409917
92.కె.శ్రీనివాస్	జనగామ	9959336424
93.ఎస్.బాబురావు	ధర్మసాగర్	9963402468
94.టి.రాణి	జనగామ	7660812857
95.టి.ప్రహల్‌సాయి	కరీమాబాద్	9154400953
96.యం.శ్రీదేవి	దుగ్గొండి	9550808547
97.వి.సాయి విహాన్	ఆత్మకూర్	9000749735
98.డి.దేవి	దుగ్గొండి	9959924807
99.పి.నమ్రత	హనుమకొండ	8341534180
100.డి.హనుమంతరావు	ములుగు	9490002099



కన్సొలేషన్ విజేతల కూపన్లను చూపుతున్న ఎడిటోరియల్ బృందం



అష్టదిక్పాలక పూజ, బలిహరణ అనంతరం అగ్నిగుండాలు దాటడం ప్రారంభిస్తున్న అర్చకులు

మా గండాలు బాపు.. మల్లన్నా..

- కొమురవెల్లిలో ఘనంగా అగ్నిగుండాలు
- నిప్పుల్లో చిందేసిన భక్తులు, శివసత్తులు
- ముగిసిన మల్లికార్జునస్వామి జాతర

చేర్యాల, మార్చి 24 : కొమురవెల్లి మల్లికార్జునస్వామి బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. సోమవారం తెల్లవారు జామున జరిగిన అగ్నిగుండాలను భక్తులు అత్యంత భక్తిప్రపత్తులతో నిర్వహించారు. ఈసందర్భంగా ఆదివారం అర్ధరాత్రి అనంతరం తోట బావి ప్రాంగణంలో ఐదు రకాల వంటచెరుకును అమర్చి అగ్నిగుండాలను తయారుచేశారు. వీరశైవుల జగద్గురు బర్దిపూర్ దత్తగిరి పీఠం మహామండలేశ్వర డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహాస్వామి పర్యవేక్షణలో వీరశైవాగమశాస్త్రం ప్రకారం శాస్త్రోక్తయుక్తంగా, సంప్రదాయబద్ధంగా నిత్యార్చనలు, మహాగణపతి పూజ, ఋత్విగ్వరణం, స్వస్తిపుణ్యాహవాచనం, నాంది సమారాధాన, ఏకాదశ రుద్రపూజ, సప్తమాతృకపూజ, జగద్గురు పంచాచార్య పూజ, వీరభద్ర పళ్లెరం, భద్రకాళి పూజ, ముసలఖడ్గపూజ, సుంకు, అగ్నిప్రతిష్ఠ, సుప్రభాత పూజ, ఇంద్రాది అష్టదిక్పాలకులకు బలిహరణ, అగ్నిగుండార్చన, శాంతిపూజ, అగ్నిగుండప్రవేశం పూజలు జరిపారు. ఆయా దేవతలను స్తుతిస్తూ దండకాలు వేశారు. అష్టదిక్కులా గుమ్మడి కాయలతో బలిహరణ జరిపారు. జగద్గురు సిద్దేశ్వరానందగిరి మహాస్వామి రాక పాదపూజ జరిపారు. అర్చకులు వీరభద్రుడి విజయఖడ్గం తీసుకునివచ్చి ఆవాహనం చేసిన అనంతరం మల్లన్నను కీర్తిస్తూ గుండాలు దాటడాన్ని ప్రారంభించారు. దేవతావా హనంతో శివసత్తులు, భక్తులు, ఆచారవతులు పూనకంతో కణకణరగిలే నిప్పుల అగ్నిగుండాలను దాటి మొక్కులు తీర్చుకున్నారు. గుండాలు దాటాం.. మా గండాపు బా పు.. అంటూ స్వామివారిని దర్శించుకున్నారు. తమను చల్లగా కాపాడాలని వేడుకున్నారు. కాగా మల్లన్న చరిత్రను, అగ్నిగుండాల విశిష్టతను తెలంగాణ రాష్ట్ర ఆగమ వాస్తుసలహా కమిటీ సభ్యులు డాక్టర్ మహంతయ్యస్వామి కనులకు కట్టినట్లుగా భక్తులకు వివరించారు. కోపానికి ప్రతీక అయిన అగ్నిగుండాలు మనిషి తనువు, మనసును శుద్ధి చేసి పునీతం చేస్తాయని తెలిపారు. కార్యక్రమంలో ఈవో రామాంజనేయులు,ధర్మకర్తలు జయప్రకాశ్‌రెడ్డి, లింగంపల్లి శ్రీనివాస్, అంజిరెడ్డి, మోహన్‌రెడ్డి, ఏఈవో బుద్ధి శ్రీనివాస్, సూపరిం టెండెంట్‌లు సురేందర్‌రెడ్డి, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు. చేర్యాల సీఐ శ్రీను ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు. అగ్నిగుండాల కార్యక్రమ నిర్వహణ అనంత రం సోమవారం మల్లన్న ఆలయంలో వీరశైవార్చకులు విజయోత్సవం, ఏకాదశ రుద్రాభిషేకం, జంగమార్చన తదితర పూజా కార్యక్రమాలు ఘ నంగా నిర్వహించారు. చివరివారం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చి మొక్కుబడులు తీర్చుకున్న క్రమం లో శనివారం రూ.6.66లక్షలు, ఆదివారం రూ.54.96లక్షలు, సోమవారం సుమారు రూ.8 లక్షలుమేర బుకింగ్ ఆదాయం సమకూరిందని ఆలయ వర్గాలు తెలిపాయి.

ఎల్కతుర్తిలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటు

స్థలాన్ని పరిశీలించిన అధికారులు

- అందుబాటులో 88 ఎకరాలు
- వెయ్యి మందికి ప్రవేశాలు



బాసర ట్రిపుల్ ఐటీ ప్రాంగణం

హనుమకొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ జిల్లా మెడలో మరో మణిహారం అలంకరణ కాబోతోంది. ప్రతిష్ఠాత్మకమైన త్రిపుల్ ఐటీ ఎల్కతుర్తి మండల కేంద్రంలో ఏర్పాటు కానున్నది. హనుమకొండ ఇప్పటికే ఎడ్యుకేషన్ హబ్‌గా భాసిల్లుతోంది. ప్రతిష్ఠాత్మకమైన జాతీయ సాంకేతిక కళాశాల (ఎన్ఐటీ), కాకతీయ విశ్వవిద్యాలయం, పలు ప్రభుత్వ, ప్రైవేటు ఇంజనీరింగ్ కళాశాలలు ఉన్నాయి. వీటికి ఈ ట్రిపుల్ ఐటీ ప్రాంగణం కూడా తోడుకానున్నది. రాజీవ్ గాంధీ సాంకేతిక వైజ్ఞానిక విశ్వవిద్యాలయం (ఆర్‌జీయూకేటీ)గా అనుబంధంగా తెలంగాణలో మరో రెండు కొత్త ప్రాంగణాలను ప్రారంభించాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఇందులో ఒక దానిని హనుమకొండ జిల్లాలో ఏర్పాటు చేయాలని భావిస్తోంది. ఇందుకు అవసరమైన కసరత్తు చేస్తోంది. ఈ మేరకు నిపుణుల కమిటీ సభ్యులైన బాసర ఆర్‌జీయూకేటీ ఇంచార్జి వీసీ ఆచార్య గోవర్ధన్, జేఎన్‌యూహెచ్ మాజీ రిజిస్ట్రార్ ఆచార్య మంజూర్ హుస్సేన్ ఇటీవల రెవెన్యూ అధికారులతో కలిసి హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి బస్టాండ్‌కు కిలో మీటర్ల దూరంలోని ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలం అన్ని విధాలా అనుకూలంగా ఉన్నట్లు భావిస్తున్నారు. భవిష్యత్ అవసరాలకు మరో 40 ఎకరాలు అవసరమని కమిటీ సూచించినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో నాలుగు కొత్త ట్రిపుల్ ఐటీలను నెలకొల్పుతామని కాంగ్రెస్ పార్టీ గత శాసన సభ ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నది తెలిసిందే. ఈ క్రమంలో గత సెప్టెంబరులో జరిగిన విద్యా సంస్కరణల మంత్రి వర్గం ఉప సంఘం సమావేశంలో రెండు ప్రాంగణాల ఏర్పాటుపై చర్చ జరిగింది. వీటిలో ఒకటి ఎల్కతుర్తిలో ఏర్పాటు చేయాలనే నిర్ణయానికి వచ్చినట్లు సమాచారం. మరోకటి మహబూబ్‌నగర్ , ఖమ్మం లేదా నల్గొండ జిల్లాలో ఏర్పాటు చేసే అవకాశం ఉంది.

అందుబాటులో 88 ఎకరాల స్థలం:

ఎల్కతుర్తి మండల కేంద్రంలో బస్‌స్టాండ్ నుంచి ఒక కిలోమీటర్ దూరంలో సర్వేనెంబర్ 381లో ప్రస్తుతం 88 ఎకరాల ప్రభుత్వ స్థలం అందుబాటులో ఉన్నట్లు తెలుస్తోంది. వాస్తవంగా ఈ సర్వే నెంబరులో 200 ఎకరాల భూమి ఉంది. ఇందులో సుమారు 100 ఎకరాల్లో భూమిలేని నిరుపేదలకు, ఎస్సీలకు పట్టాలు ఇచ్చారు. ఇంకా 100 ఎకరాలు మిగిలి ఉంది. ఇందులోనూ చింతలపల్లి, ఎల్కతుర్తి గ్రామాలకు చెందిన కొందరు రైతులు చాలా కాలంగా సాగు చేసుకుంటున్నారు. భూములను తీసుకుంటే తమ జీవనోపాధి పోతుందనేది రైతుల ఆవేదన.

కుడా వెంచర్

కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) కూడా ఇక్కడ వెంచర్ చేయాలని యోచిస్తోంది. ఈ మేరకు స్థల సేకరణకు ప్రభుత్వానికి లేఖ కూడా రాసింది. వరంగల్ నగర విస్తరణలో భాగంగా దాని చుట్టూర శాటలైట్ సిటీలను పెంపొందించాలనే ప్రణాళికలో భాగంగా కుడా ఎల్కతుర్తిలో ల్యాండ్ పూలింగ్‌కు కసరత్తు చేస్తోంది. రైతులతో సంప్రదింపులను కూడా జరుపుతోంది. వారి అంగీకరిస్తే వెంచర్ చేయడానికి అన్ని ఏర్పాట్లతో కుడా సిద్ధంగా ఉంది. ఈ నేపథ్యంలో ఇక్కడే ట్రిపుల్ ఐటీ ఏర్పాటు ప్రతిపాదన తెరమీదికి వచ్చింది. ట్రిపుల్ ఐటీ ఏర్పాటులో సహకారం అందించేందుకు కుడా కూడా సుముఖంగానే ఉంది. ఇక్కడ తమ వెంచర్లలో ట్రిపుల్ ఐటీకి కావలసిన స్థలం సమకూర్చడానికి సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. దీంతో ఇక్కడ భూముల ధర పెరిగి వెంచర్లో భాగస్వాములైన రైతులకు ఆర్థికంగా మరింత లాభం సమకూరుతుందనేది కుడా ఆలోచన. స్థలం అందుబాటు విషయంలో ఎలాంటి ఇబ్బంది లేనందు వల్ల ట్రిపుల్ ఐటీ ఏర్పాటుకు ఇబ్బందులేమి ఉండబోవని తెలుస్తోంది. కాగా, ఎల్కతుర్తిలో ట్రిపుల్ ఐటీ ఏర్పాటుకు మంత్రి పొన్నం ప్రభాకర్ పట్టుదలతో ఉన్నట్టు తెలుస్తోంది.

కొత్త ప్రాంగణం అవసరం

ప్రస్తుతం బాసర ఆర్‌జీయూకేటిలో ఏటా 1500 మంది ప్రవేశాలు పొందుతున్నారు. ఫలితంగా ఆరేళ్ళ ఇంటిగ్రేటెడ్ కోర్సులోని 9 వేల మందికిపైగా విద్యార్థులతో ఆ ప్రాంగణం కిక్కిరిసిపోతుంది. దీనికితోడు ఇక్కడ కేవలం బీటెక్.. అదీ సాంప్రదాయ ఇంజనీరింగ్ కోర్సులు మాత్రమే ఉన్నాయి. వీటికి అదనంగా బీటెక్ బయో టెక్నాలజీ, బయో మెడికల్, బయోమెటిక్స్, ఫార్మా టెక్నాలజీ లాంటి ఇంజనీరింగ్, బయో సైన్సె రెండింటి సమ్మేళనంతో మల్టీ డిసిప్లినరీ కోర్సులను ప్రవేశపెట్టాలని అధికారులు ప్రతిపాదించారు. ఈ ప్రాంగణం ఏర్పాటుకు రూ. 500 కోట్లు అవసరమవుతాయని తెలుస్తోంది. అయితే ఇటీవల బడ్జెట్‌లో ఆర్‌జీయూకేటీలకు ప్రభుత్వం రూ 35 కోట్లు కేటాయించినప్పటికీ, అనుబంధ ప్రాంగణాల ఏర్పాటుకు అవసరమైన నిధుల విడుదలకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్టు తెలుస్తోంది. కొత్త ప్రాంగణం 2026-27 విద్యా సంవత్సరం నుంచి పని పని చేయడం ప్రారంభించే అవకాశం ఉంది.

ఆరేళ్ల ఇంటిగ్రేటెడ్ కోర్సు

ట్రిపుల్ ఐటీగా సుపరిచితమైన ఆర్‌జీయూకేటీ 2008 సంవత్సరంలో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి చొరవతో ఏర్పాటయింది. ఇందులో ఆరు సంవత్సరాల బ్యాచిలర్ ఆఫ్ టెక్నాలజీ విద్యను అందిస్తారు. ఇంటర్మీడియట్, డిగ్రీకి సమానమైన రెండేళ్ల ప్రీ యూనివర్సిటీ కోర్సుతో పాటు ఇంజనీరింగ్ కోర్సులో నాలుగేళ్ల డిగ్రీ కోర్సు ఉంటుంది. ఇందులో పోస్టు గ్రాడ్యుయేట్ మాస్టర్ ఆఫ్ టెక్నాలజీ కోర్సులను కూడా అందిస్తారు. ఇన్‌ఫర్మేషన్ టెక్నాలజీ, ఇంజనీరింగ్‌లో బోధన, పరిశోధన విభాగంలో ప్రత్యేకించిన స్వయం ప్రతిపత్తి సంస్థల పరిధిలోకి ఎల్కతుర్తి ట్రిపుల్ ఐటీ ప్రాంగణం వస్తుంది.

ఏర్పాటయ్యే విభాగాలు

కెమికల్ ఇంజనీరింగ్, సివిల్ ఇంజనీరింగ్, కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్ ఇంజనీరింగ్, ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్, మెకానికల్ ఇంజనీరింగ్, మెటలర్జికల్ అండ్ మెటీరియల్స్ ఇంజనీరింగ్, బిజినెస్ మేనేజ్‌మెంట్, గణితం, భౌతిక శాస్త్రం, రసాయన శాస్త్రం విభాగాలు ఇందులో ఉంటాయి. ట్రిపుల్ ఐటీ ప్రాంగణంలో టీ హబ్ సెంటర్, ఆధునాతన కంప్యూటర్ ల్యాబ్, డిజిటల్ ఇన్నోవేషన్ ల్యాబ్ ఏర్పాటు చేయడంతో పాటు ఇందులో చదువుకునే ప్రతీ విద్యార్థికి ల్యాప్‌టాప్‌లు అందజేస్తారు. ఆధునాతన తరగతులను ఏర్పాటు చేస్తారు. ఇందులో చేరడానికి ఎటువంటి ప్రవేశ పరీక్ష ఉండదు. పదవ తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన వారిని ప్రతిభ ఆధారంగా తీసుకుంటారు. ఆర్‌జీయూకేటీ కింద ప్రస్తుతం తెలంగాణ ఆంధ్రలో మూడు ప్రాంగణాలు ఉన్నాయి. ఏపీలో శ్రీకాకుళం, ఇడుపులపాయ, నూజీవీడులో తెలంగాణలో ఆదిలాబాద్ జిల్లా బాసరలో పని చేస్తున్నాయి. ఈ ట్రిపుల్ ఐటీ ప్రాంగణాల వల్ల గ్రామీణ ప్రాంత విద్యార్థులకు ఎంతో మేలు జరుగుతుంది. ఉచితంగా ఐఐటీ విద్య అందుతుంది. కొత్తగా ఏర్పాటయ్యే క్యాంపస్‌లో వివిధ ఆధునాతన ఐటీ కోర్సుల్లో వెయ్యి సీట్లు అందుబాటులో ఉంటాయి.

సీనియర్ ఫెల్లోషిప్‌కు ఎంపికైన సుధీర్‌రావు



హనుమకొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ప్రముఖ నాట్య గురువు బోంపెల్లి సుధీర్‌రావు అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీనియర్ ఫెల్లోషిప్‌కు ఎంపికయ్యారు. నాట్యరంగంలో చేస్తున్న విశిష్టమైన సేవలకు గుర్తింపుగా సెంటర్ ఫర్ రిసోర్సెస్ అండ్ ట్రేనింగ్(సీసీఆర్‌టీ) ఆయనను ఈ ఫెల్లోషిప్‌నకు ఎంపిక చేసింది. సీసీఆర్‌టీ డైరెక్టర్ రాజీవ్‌కుమార్ ఈ మేరకు సుధీర్ కుమార్‌కు లేఖ రాశారు. కూచిపూడి నృత్యంపై లోతైన పరిశోధన చేసేందుకు గాను ఇచ్చే ఈ సీనియర్ ఫెల్లోషిప్‌కు దేశంలో సుధీర్‌రావు ఒక్కరే ఎంపికయ్యారు. ఈ ఫెల్లోషిప్ కింద నెలకు రూ.20వేల చొప్పున రెండేళ్ల పాటు ఇస్తారు. అవసరమైతే పరిశోధనను బట్టి మరికొంత కాలం పొడిగించే అవకాశం ఉంది. సుధీర్‌రావు 18 ఏళ్లలోనే కూచిపూడిలో సీనియర్ స్కాలర్‌షిప్, 2002లో సీనియర్ ఫెల్లోషిప్‌కు, తాజాగా ఇప్పుడు సీనియర్ ఫెల్లోషిప్‌నకు ఎంపికయ్యారు. సుధీర్‌రావు నాట్యంపై మక్కువతో బాల్యం నుంచే కూచిపూడిలో శిక్షణ పొందారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయంలో కూచిపూడి నాట్యంలో ఎంఏ, భరత నాట్యంలో బీఏ పూర్తిచేశారు. వరంగల్‌లో సద్గురు శ్రీ శివానంద నృత్యమాల అనే పేరుతో శాస్త్రీయ నృత్య శిక్షణ కేంద్రాన్ని స్థాపించి 40 సంవత్సరాలుగా ఎంతో మంది విద్యార్థులను తీర్చిదిద్దారు.

నేటి నుంచి ఎప్‌సెట్, నీట్ శిక్షణ తరగతులు

రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : నయీంనగర్ మోషన్ కళాశాలలో మంగళవారం నుంచి 45 రోజుల పాటు ఎప్‌సెట్, నీట్ శిక్షణ తరగతులను ప్రారంభిస్తున్నట్లు కళాశాల చైర్మన్ వడ్లకొండ వేణుగోపాల్ గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 90శాతం పైగా మార్కులు సాధించిన విద్యార్థులతో పాటు ప్రభుత్వ కళాశాలలు, గురుకులాల్లో చదువుకున్న విద్యార్థులకు ఫీజుల్లో 25శాతం రాయితీ ఇవ్వనున్నట్లు తెలిపారు. రాజస్థాన్ కోటా అధ్యాపకులచే తరగతులు నిర్వహించనున్నట్లు, మిగితా వివరాలకు 9703000850, 51 నెంబర్లకు సంప్రదించాలన్నారు.

నూతన ఆవిష్కరణలతోనే సమస్యల పరిష్కారం

హసన్‌పర్తి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): నూతన ఆవిష్కరణలతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని జెన్‌సీస్ ఇన్ఫోస్ సీటీవో డాక్టర్ పరికిపండ్ల శ్రీకాంత్ అన్నారు. మండలంలోని అనంతసాగర్ సుమతిరెడ్డి మహిళా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి అధ్యక్షతన ఎలక్ట్రానిక్స్ విభాగం సినర్జీ ఆధ్వర్యంలో నాస్కమ్ డిజిటల్ 101 ప్రోగ్రాం, ఐబీఎం స్కిల్ బిల్డ్ కృత్రిమ మేథస్సు అంశంపై జరిగే రెండు రోజుల సదస్సు ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నాస్కమ్ డిజిటల్ 101 ప్రోగ్రాంకు సంబంధించిన అంశాలలో విద్యార్థినులకు ఫండమెంటల్స్ నేర్చుకోవడానికి గల వివిధ అంశాలను మొదటి రోజు వివరించారు. రెండో రోజు ఐబీఎం స్కిల్స్ బిల్డ్ అంశాలపై ట్రైనింగ్, విద్యార్థినులకు సర్టిఫికెట్లు అందిస్తామని తెలిపారు. అనంతరం ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.రాజశ్రీరెడ్డి మాట్లాడుతూ విద్యార్థినులు కృత్రిమ మేథస్సుపై సమాజంలోని వివిధ రంగాలలో గల సమస్యల పరిష్కారానికి నూతన ఆవిష్కరణలను రూపొందించాలన్నారు. ఈ కార్యక్రమంలో వర్క్‌షాప్ కోఆర్డినేటర్ ఎస్.గోవర్ధన్, వివిధ విభాగాధిపతులు డాక్టర్ కె.మహెందర్, డాక్టర్ ఇ.సుదర్శన్, డాక్టర్ ఎస్.శ్రీవాణి, ఏవో వేణుగోపాలస్వామి, అధ్యాపక సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

రాంనగర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ మరమ్మతుల దృష్ట్యా మంగళవారం బాలసముద్రం సబ్‌స్టేషన్ పరిధిలోని భీష్మనగర్, శ్రీనివాసకాలనీ, బాలసముద్రం అపోలా ఆసుపత్రి ఏరియా, ఎల్ఐసీ ఆఫీస్ ఏరియా, కూరగాయల మార్కెట్ ఏరియాలో మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల విద్యుత్ సరఫరా జరగదని హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

డీఆర్‌సీసీ కేంద్రం సామర్థ్యాన్ని పెంచాలి

- వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి
- బాలసముద్రంలోని కంపోస్టు యార్డ్ ఆకస్మిక తనిఖీ



బాలసముద్రంలోని కోకాపిట్ సెంటర్‌ను తనిఖీ చేస్తున్న మేయర్

వరంగల్ కార్పొరేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండలోని డీఆర్‌సీసీ కేంద్రం సామర్థ్యాన్ని పెంచాలని వరంగల్ నగర మేయర్ గుండు సుధారాణి అన్నారు. సోమవారం హనుమకొండ భవన్ సమీపంలోలోని విండోకంపోస్ట్ యూనిట్, బాలసముద్రంలోని డీఆర్‌సీసీ సెంటర్, కోకాపిట్ యూనిట్, వర్మికంపోస్టు యార్డులను మేయర్ ఆకస్మికంగా తనిఖీచేశారు. ఈసందర్భంగా మేయర్ మాట్లాడారు. కొబ్బరిబోండాలను ప్రాసెస్ చేయడం వల్ల అనేక లాభాలు ఉన్నాయన్నారు. కొబ్బరి పీచు ద్వారా వర్మీకంపోస్టు ఎరువుతో పాటు సోఫాసెట్లు, దిండ్లు, పరుపులు, కుర్చీలు, ఎయిర్ కూలర్స్‌కు మెష్‌గా ఉపయోగించవచ్చని అన్నారు. ఇంకా రేకులపై చల్లదనం కోసం కొబ్బరి పీచును ఉపయోగిస్తారని అన్నారు. హనుమకొండలో కోకాపిట్ యూనిట్ ద్వారా పది మంది ఎస్‌హెచ్‌జీ మహిళలు ఉపాధి పొందుతున్నారని తెలిపారు. ఇంకా డీఆర్‌సీసీ సెంటర్‌కు ప్రతీ రోజు ఒక టన్ను పొడి చెత్తను చేరేలా చర్యలు చేపట్టాలని అన్నారు. బయోమెథనైజేషన్ ప్లాంటును వెంటనే అందుబాటులోకి తీసుకుని రావాలని అన్నారు. కార్యక్రమంలో సీఎంహెచ్‌వో డాక్టర్ రాజారెడ్డి, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సంపత్‌రెడ్డి, పోలెపాక అనిల్‌కుమార్, వావ్ ప్రతినిధుల బృందం పాల్గొన్నారు.

వరంగల్ నిట్‌ను సందర్శించిన హుస్సేన్ నాయక్

హనుమకొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జాతీయ ఎస్టీ కమిషన్ సభ్యుడు జాటోతు హుస్సేన్ నాయక్ సోమవారం వరంగల్ నిట్‌ను సందర్శించారు. నిట్‌లోని వివిధ విభాగాలను ఆయన సందర్శించారు. భోజన శాల, వసతి గృహాలు, లైబ్రరీ తదితర వాటిని పరిశీలించారు. విద్యార్థులతో మమేకం అయ్యారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వరంగల్ నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాదర్ సుబుధీ, వివిధ విభాగాల అధికారులతో, అలాగే ఎస్టీ అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థి సంఘాలతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. పేద, గిరిజన విద్యార్థులకు అందుతున్న విద్య, బోధన, బోధనేతర సిబ్బంది సమస్యలపై చర్చించారు.



నిట్ డైరెక్టర్, అధ్యాపకులు, సిబ్బందితో సమావేశమై వివిధ అంశాలను చర్చిస్తున్న హుస్సేన్ నాయక్

రైల్వేస్టేషన్‌లో క్షయవ్యాధిపై అవగాహన

కాజీపేట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాజీపేట రైల్వే స్టేషన్‌లో సోమవారం రైల్వే ప్రయాణీకులకు క్షయ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా స్టేషన్ మేనేజర్ అగ్గిరవీందర్ హాజరై కరపత్రాల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించి ఆయన మాట్లాడారు. క్షయవ్యాధిపై ప్రతీ ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. వ్యాధిపై ఎలాంటి సందేహాలు ఉన్నా సమీప ఆరోగ్యకేంద్రంలో పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. రైల్వే చీఫ్ హెల్త్ ఇన్‌స్పెక్టర్ రాజేశ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రైల్వే సిబ్బంది, ప్రయాణీకులు పాల్గొన్నారు.

నేడు రుమటాలజీలో ఉచిత వైద్య శిబిరం

హనుమకొండ టౌన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ కాకాజీ కాలనీలోని శ్రీపేషియన్ రుమటాలజీలో మంగళవారం ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సీనియర్ రుమటాలజిస్టు, ఇమ్యూనాలజిస్ట్ డాక్టర్ సునిల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మోకాళ్ల నొప్పులు, మెడ, నడుము నొప్పులతో బాధపడేవారు, ఈ శిబిరంలో ఎముకల సాంద్రత పటుత్వాన్ని తెలిపే బీఎండీ టెస్టు రూ. 3వేలు గల టెస్టును ఉచితంగా చేస్తున్నామని ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాల కోసం సెల్ నంబర్ : 99665 54455 లేదా 78935 88057లలో సంప్రదించాలని కోరారు.

బండి సంజయ్‌పై చర్యలు తీసుకోవాలి : బీఆర్‌ఎస్వీ

కేయూ క్యాంపస్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర మంత్రి, బీజేపీ కరీంనగర్ ఎంపీ బండి సంజయ్‌పై కేసు నమోదు చేసి చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని బీఆర్‌ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్ డిమాండ్ చేశారు. సోమవారం కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్‌లో మాజీ సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారని బండి సంజయ్‌పై బీఆర్‌ఎస్వీ నేతృత్వంలో పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్వీ కేయూ అధ్యక్షుడు ప్రశాంత్‌తో పాటు ఇతర నేతలు ఫిర్యాదు కాపీని మీడియాకు ప్రదర్శించారు. అనంతరం బీఆర్‌ఎస్వీ నేతలు బైరపాక ప్రశాంత్, మాచర్ల శరత్‌చంద్ర, కత్తెరపల్లి దామోదర్‌లు మాట్లాడారు.తెలంగాణ రాష్ట్ర సాధకుడు, తొలి సీఎం కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు, అసత్య ఆరోపణలు చేసిన కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్‌వి నిరాధారమైన ఆరోపణలని ఖండించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్వీ నేతలు జెట్టి రాజేందర్, లంక రాజగోపాల్, గొల్లపల్లి వీరాస్వామి, రసూరి రాజేశ్, అవినాశ్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమార్కులకు కొమ్ము కాస్తున్న ఆర్జేడీ

వరంగల్ ఎడ్యుకేషన్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : అవినీతి పరులు, అక్రమార్కులకు వరంగల్ పాఠశాల విద్యాశాఖ ఆర్జేడీ, ఆర్జేడీ కార్యాలయం సిబ్బంది పూర్తి స్థాయిలో కొమ్ము కాస్తున్నారని తెలంగాణ టీచర్స్ అసోసియేషన్(టీటీయూ) రాష్ట్ర అధ్యక్షుడు మునగాల మణిపాల్‌రెడ్డి ఆరోపించారు. కమలాపూర్ జడ్పీహెచ్ఎస్ హెడ్మాస్టర్ మీస రాజమల్లయ్య అక్రమాలకు కొమ్ముకాస్తున్న ఆర్జేడీ, ఆర్జేడీ కార్యాలయం తీరును నిరసిస్తూ టీటీయూ ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలోని ఆర్జేడీ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన మణిపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. హెడ్మాస్టర్ రాజమల్లయ్య అక్రమాలు, అవినీతితో పాటు ఇతర ఉపాధ్యాయులను ఇబ్బందులకు గురిచేసిన అన్ని అంశాలు వాస్తవాలని జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీఈవో నివేదికను అందజేసినా ఆర్జేడీ కాలయాపన చేస్తున్నారన్నారు. చేయితడిపితే శిక్షలు తగ్గించే దుస్థితికి ఆర్జేడీ, ఆర్జేడీ కార్యాలయం దిగజారిందని ఆయన విమర్శించారు. అక్రమార్కుడైన రాజమలయ్యను సస్పెండ్ చేయకుండా తాత్సారం చేస్తున్న వరంగల్ ఆర్జేడీపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. డూప్లికేటు మెమోల సృష్టికర్త రాజమల్లయ్యపై క్రిమినల్ కేసు పెట్టించి వెంటనే సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధానకార్యదర్శి పోలంపెల్లి ఆదర్శన్‌రెడ్డి, రాష్ట్ర మాజీ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఏరుకొండ నర్సింహస్వామి, టీపీటీఎఫ్ నాయకులు సుబ్బారావు, సత్యనారాయణ, బాధిత ఉపాధ్యాయులు రమేష్, మహిపాల్‌రెడ్డి, సుధాకర్, రమేష్, నాయకులు కృష్ణమూర్తి, రవి, నరేందర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



ధర్నాలో మాట్లాడుతున్న టీటీయూ రాష్ట్ర అధ్యక్షుడు మణిపాల్‌రెడ్డి

ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో పలువురికి ఉద్యోగ అవకాశాలు

- ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు

హసన్‌పర్తి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భీమారం ఎస్‌వీఎస్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్‌లో జరిగిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో 41 మంది ఉద్యోగ అవకాశాలు సాధించినట్లు ఎస్‌వీఎస్ విద్యా సంస్థల చైర్మన్ డాక్టర్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు వెల్లడించారు. ఈ సందర్భంగా భీమారం ఎస్‌వీఎస్ విద్యా సంస్థల ఆవరణలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఉద్యోగాలకుఎంపికైన విద్యార్థులకు నియామక పత్రాలను అందజేసి మాట్లాడారు. ఈసీఈ బ్రాంచి నుంచి 23 మంది, ట్రిపుల్ ఈ నుంచి 18 మంది ఇంజనీరింగ్ స్టూడెంట్స్ స్వింగర్ ఎంటర్ ప్రైజెస్ చెన్నై సంస్థలో ఉద్యోగాలు సాధించినట్లు తెలిపారు. ఇండస్ట్రీ ప్రోగ్రాం ద్వారా స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తూ విద్యార్థుల నైపుణ్యాలను పెంచుతూ ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. భవిష్యత్తులో మరిన్ని కంపెనీల ద్వారా ప్రాంగణ నియామకాలు చేపటనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని విద్యార్థులను కోరారు. అనంతరం ఉద్యోగాలు సాధించిన విద్యార్థులను అభినందిస్తూ వారిని స్ఫూర్తిగా తీసుకొని మరికొంత మంది విద్యార్థులు తమ నైపుణ్యాలను మరింత మెరుగుపర్చుకొని ఉన్నత అవకాశాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఎస్‌వీఎస్ విద్యాసంస్థల ప్రిన్సిపాళ్లు, డైరెక్టర్లు, ప్లేస్‌మెంట్ అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు నియామక పత్రాలు అందిస్తున్న ఎస్‌వీఎస్ విద్యాసంస్థల చైర్మన్ ఎర్రబెల్లి తిరుమల్‌రావు

ఎమ్మెల్సీ శ్రీపాల్‌రెడ్డికి సన్మానం

హసన్‌పర్తి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్, ఖమ్మం, నల్గొండ టీచర్స్ ఎమ్మెల్సీగా ఇటీవల విజయం సాధించిన పింగిళి శ్రీపాల్‌రెడ్డికి డైట్ కళాశాల 1992-93 క్లాస్‌మేట్స్ ఘనంగా సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. సోమవారం ఎర్రగట్టుగుట్టలోని ఓఫంక్షన్ హాలులో డాక్టర్ సంగని మల్లేశ్వర్ అధ్యక్షతన జరిగిన ఆత్మీయ సన్మాన కార్యక్రమానికి శ్రీపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. టీచర్ల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. డాక్టర్ సంగని మల్లేశ్వర్ మాట్లాడుతూ తన చిన్ననాటి మిత్రుడుశ్రీపాల్‌రెడ్డి పది సంవత్సరాల తన సర్వీస్‌ను తృణప్రాయంగా వదిలిపెట్టి ప్రజా క్షేత్రంలోకి రావడం చాలా సంతోషంగా ఉందన్నారు. అనంతరం తోటి మిత్రుడు ఆనందాచారి సన్మాన పత్రం చదివి శ్రీపాల్‌రెడ్డి, డాక్టర్ నవిత దంపతులను శాలువా, గజమాలతో సత్కరించి మెమోంటోను అందజేసారు. ఈ కార్యక్రమంలో సూపరింటెడెంట్ ఆఫ్ పోలీసు డి.రమేష్, తోటి మిత్రులు బిల్లా సుధీర్‌రెడ్డి, శ్రీనాథ్, డాక్టర్ సదయ్య, మల్లయ్య, సౌభాగ్యలక్ష్మి, కృష్ణవేణి, సరళ, శ్రీధర్, వసుందర, భానుప్రకాష్‌రెడ్డి, చల్లా రాజిరెడ్డి, గోలి నవీన్‌రెడ్డి, వెంకటేశ్వర్లు, రమేష్, కోల శంకర్, అలివేలు మంగ, శ్రీనివాస్, సరిత, లక్ష్మారెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, యాదగిరి పాల్గొన్నారు.

ప్రమాదాల నివారణకు సత్వర చర్యలు : టీటీఐ

హసన్‌పర్తి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు సత్వర చర్యలు తీసుకుంటామని ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. మండల కేంద్రంలోని హసన్‌పర్తి పెద్ద చెరువు కట్ట మూలమలుపు వద్ద ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాద ప్రదేశాన్ని ఆయన పరిశీలించారు. ప్రమాదాలకు దారితీసే అంశాలపై స్థానిక ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలును అడిగి తెలుసుకున్నారు. అనంతరం అనంతసాగర్ క్రాసు రోడ్డు నుంచి హసన్‌పర్తి పోలీసుస్టేషన్ వరకు ఇటీవలి జరిగిన ప్రమాదాల గురించి తెలుసుకున్నారు. ఈసందర్భంగా హసన్‌పర్తి నల్లగట్టుగుట్ట, హసన్‌పర్తి పెద్దచెరువు కట్ట మూలమలుపు, చెరువు కట్ట సమీపంలోని పెట్రోల్ పంపు, సీతంపేట క్రాసురోడ్డు, ఎల్లాపూర్ డివైడర్, బావుపేట క్రాసురోడ్డు అనంతసాగర్ పౌల్ట్రీ ఫాం ప్రాంతాలను ప్రమాదాలు జరిగే ప్రాంతాలుగా గుర్తించినట్లు పోలీసు సిబ్బంది తెలిపారు. ఈ ప్రమాద స్థలాల విషయంపై ఉన్నతాధికారులతో చర్చించి ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు తీసుకునేందుకు కృషి చేస్తామని ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రావు తెలిపారు. ఆయన వెంట ఎస్‌బీ ఎస్సై సిరాజ్, ఇంటెలిజెన్స్ సిబ్బంది శ్రీనివాస్‌రెడ్డి పోలీసు సిబ్బంది ఉన్నారు.

కొత్త ముసాయిదాను ఉపసంహరించుకోవాలి

కేయూ క్యాంపస్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : ఇటీవల కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త యూజీసీ ముసాయిదాను ఉపసంహరించుకోవాలని ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ కాలేజ్ టీచర్స్ ఆర్గనైజేషన్ (ఏఐఎఫ్ యూసీటీవో) జాతీయ కార్యవర్గ సభ్యులు డాక్టర్ ఎ.సంజీవయ్య డిమాండ్ చేశారు. సోమవారం హనుమకొండ కాకతీయ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించిన నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సంజీవయ్య మాట్లాడుతూ..ఉద్యోగుల పాత పెన్షన్ స్కీంను పునరుద్ధరించాలని, యూజీసీ డ్రాఫ్ట్ రెగ్యులరేషన్లను ఉపసంహరించుకోవాలని అన్నారు. ఏఐఎఫ్‌యూసీటీవో నేత డాక్టర్ ప్రవీణ్ సంఘం కార్యకలాపాలను వివరించారు. సొసైటీ ఫర్ చేంజ్ ఇన్ ఎడ్యుకేషన్ జనరల్ సెక్రటరీ ఎడమ శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. ఉన్నత విద్యలో ప్రైవేటైజేషన్, కమర్షలైజేషన్‌ను అధ్యాపక సంఘాలు నిరసించాలని కోరారు.

మెట్టుగుట్ట అక్రమాలపై విచారణ జరిపించాలి

వడ్డెపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : కాజీపేట మండలం మడికొండ మెట్టుగుట్ట రామలింగేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని రాష్ట్రీయ హిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు మండల భూపాల్ డిమాండ్‌చేశారు. సోమవారం హనుమకొండ బాలసముద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మెట్టు రామలింగేశ్వర స్వామి దేవాలయ ప్రధానార్చకులు రాగిచెడు అభిలాష్‌శర్మకు భక్తులు సమర్పించే నగదును నేరుగా అకౌంట్‌లోకి మార్చుకుంటున్నాడని ఆరోపించారు. భక్తులు సమర్పించే బంగారు, వెండి ఆభరణాలను దేవాలయ అధికారులకు ఇవ్వకుండా నేరుగా అతనే కాజేస్తున్నాడని అన్నారు. తమ సంస్థ ఆధ్వర్యంలో డీసీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఇప్పటికే అభిలాష్‌శర్మ 30 కిలోల వెండి కాజేశారని ఆరోపించారు. ఈ విషయం ఆలయ ఇన్‌చార్జి ఈవో శేషు భారతికి తెలుసునని ఆయన అన్నారు. ఈ తతంగంపై విచారణ జరిపించి అభిలాష్‌శర్మ కాజేసిన నగదుతో పాటు వెండి, బంగారు ఆభరణాలను రికవరీ చేయాలని మండల భూపాల్ డిమాండ్ చేశారు. సమావేశంలో హిందూ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు బండి సుజాత, వరంగల్ జిల్లా అధ్యక్షుడు మడిపెల్లి నాగరాజుగౌడ్, హనుమకొండ జిల్లా అధ్యక్షుడు సంతోష్, దేవాలయ పరిరక్షణ సమితి రాష్ట్ర కన్వీనర్ చీకటి రాజు, వరంగల్ ఉమ్మడి జిల్లా కన్వీనర్ పల్లపు అశోక్, ప్రధాన కార్యదర్శి హన్మంతు రామ్ శర్మ, రాంగోవింద్, రణధీర్ రెడ్డి, నీరటి రాజు తదితరులు పాల్గొన్నారు.



ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతున్న మండల భూపాల్

ఎంజీఎం ఆస్పత్రి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

- పదవీ బాధ్యతలు చేపట్టిన ఆర్‌ఎంవోలు



ఆర్‌ఎంవోను సన్మానిస్తున్న దృశ్యం

వరంగల్ మెడికల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఎంజీఎం ఆస్పత్రి ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని నూతనంగా ఆర్‌ఎంవోలుగా పదవీ బాధ్యతలు చేపట్టిన డాక్టర్ అంబి శ్రీనివాస్, డాక్టర్ శశికుమార్‌లు తెలిపారు. సోమవారం ఆర్‌ఎంవోలుగా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా పబ్లిక్ హెల్త్, మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ (ఐఎన్‌టీయూసీ) ఉమ్మడి జిల్లా చైర్మన్ బత్తిని సుదర్శన్‌గౌడ్ ఆధ్వర్యంలో డాక్టర్ అంబి శ్రీనివాస్, డాక్టర్ శశికుమార్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ నాయకులు ప్రీతి సజిని, సాల్మ, నార్ల వేణు, సుజాత, సరళారాణి, కార్తీక్, సంజీత, రజని, అనీస్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శాంతిదూత అవార్డుల ప్రదానం

హనుమకొండ కల్చరల్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లాశాఖ ఆధ్వర్యంలో సోమవారం జీఎంఆర్ బృందావన్ లాన్‌లో శాంతి దూతలుగా ఎంపిక చేసిన ముగ్గురికి అవార్డులను ప్రదానం చేశారు. వరల్డ్ పీస్ ఫెస్టివల్ సొసైటీ ఉమ్మడి వరంగల్ జిల్లా శాఖ మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి పగడాల సరళ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ టీవీ.రమణాకర్, నిట్ రిటైర్డ్ ప్రొఫెసర్లు ఆచార్య సైదులు, ఆచార్య సుబ్రహ్మణ్యంలకు ఈ అవార్డులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జీఎంఆర్ బృందావన్ అపార్ట్‌మెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వి.దయాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి స్వర్ణ కుమార్, కోశాధికారి డి.నవీన్ కుమార్, పొన్నాల సంయుక్త, ఆచార్య విజయబాబు, ఆచార్య వెల్దండి రవికుమార్, కాజీపేట పురుషోత్తం, విష్ణువర్ధన్, మండల పరశురాములు, ఎ.చంద్రమౌళి, పొన్నాల రాంమోహన్ తదితరులు పాల్గొన్నారు.



శాంతిదూత అవార్డు అందుకుంటున్న దృశ్యం

సీపీని కలిసిన ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్

వరంగల్ క్రైం, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): వరంగల్ పోలీస్ కమిషనర్ సన్‌ప్రీత్ సింగ్‌ను పబ్లిక్ ప్రాసిక్యూషన్ డిప్యూటీ డైరెక్టర్ సంతోషినితో పాటు పీపీలు సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ... నేరాలకు పాల్పడే నిందితులకు శిక్షపడేలా చేసి బాధితులకు న్యాయం అందించాలన్నారు. సీపీని కలిసిన వారిలో అసిస్టెంట్ డిప్యూటీ డైరెక్టర్ మురళీధర్‌రావు, పబ్లిక్ ప్రాసిక్యూటర్లు రవికిరణ్, బృంద, అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూ టర్లు పావని, దుర్గ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

హసన్‌పర్తి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందిన ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు కథనం ప్రకారం...ఎల్కతుర్తి మండలం గుంటూరుపల్లికి చెందిన పెనుముచ్చు రామారావు(49) వాణి దంపతులు కాజీపేట ప్రశాంత్‌నగర్ కాలనీలో చికెన్ సెంటర్, కిరాణ షాపు నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. ఆదివారం స్వగ్రామం గుంటూరుపల్లిలో పనులు ముగించుకొని తిరిగి తన ద్విచక్రవాహనంపై కాజీపేట వైపుగా వస్తున్నారు. ఈ క్రమంలో వారి ద్విచక్ర వాహనాన్ని బావుపేట క్రాసు రోడ్డు సమీపంలో హన్మకొండ కొత్తూరు జెండాకు చెందిన పన్నాటి రుత్విక్ తన ద్విచక్ర వాహనంతో ఢీకొట్టాడు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలైన రామారావును స్థానికులు 108 అంబులెన్స్‌లో ఎంజీఎంకు తరలించారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడ నుంచి నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రామారావు మృతి చెందినట్లు మృతుని భార్య వాణి తెలిపారు. రామారావు భార్య వాణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ వట్టె చేరాలు వెల్లడించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు కేయూ విద్యార్థుల ఎంపిక

కేయూ క్యాంపస్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : వికసిత్ భారత్ రాష్ట్ర స్థాయి పోటీలకు అత్యుత్తమ ప్రతిభ చూపిన 10 మంది విద్యార్థులను కాకతీయ యూనివర్సిటీ నుంచి ఎంపిక చేశారు. ఈ మేరకు కేయూ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల సెమినార్ హాల్‌లో కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రం, క్యాంపస్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ తాళ్ళపల్లి మనోహర్, కేయూ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ ప్రొఫెసర్ ఈసం నారాయణ, నెహ్రూ యువ కేంద్రం అధికారి అన్వేశ్‌తో పాటు జ్యూరీ కమిటీ నేతృత్వంలో ఎంపికలు జరిగాయి. ఎంపికైన వారిలో వన్ నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశంపై వినూత్న ఆవిష్కరణలు, ఆలోచనలను రేకెత్తించిన విద్యార్థులను ఎంపిక చేశారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన వారిలో బైరెడ్డి సంధ్య(కేయూ బయోటెక్నాలజీ), మహ్మద్ సహిన రజా(యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల సుబేదారి), శ్రీజ జాదవ్(బయో టెక్నాలజీ కేయూ), ఎం.శ్రావ్య (కేయూ ఇంజనీరింగ్ కళాశాల), ఎ.వినీల(పింగళి కళాశాల, వడ్డెపల్లి) ఇ.కాలజ్ఞ(బయోటెక్నాలజీ, కేయూ), రచన (ప్రభుత్వ డిగ్రీ కళాశాల, జయశంకర్ భూపాలపల్లి), సిద్ధార్థ కిట్స్ కళాశాల(హసన్‌పర్తి), కార్తీక్, (ఇంజనీరింగ్ కళాశాల, కేయూ)లు ఎంపికయ్యారు. కాగా, ఎంపిక జ్యూరీ కమిటీలో కేయూ జంతుశాస్త్ర విభాగం ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, ఇతర రంగాలకు చెందిన ప్రముఖులు డాక్టర్ రాధికా తిప్పాని, పరుశురాం, శ్రీధర్, హరిప్రసాద్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

హైకోర్టు ఉత్తర్వులు వెంటనే అమలు చేయాలి

వడ్డెపల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖలో జూనియర్ లైన్‌మెన్లుగా ఎంపికైన తమకు వెంటనే ఉద్యోగాలు ఇవ్వాలని హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను వెంటనే అమలు చేయాలని 2006 క్వాలీఫైడ్ జూనియర్ లైన్‌మెన్ల వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎం. ప్రవీణ్‌కుమార్ ఎన్పీడీసీఎల్ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డిని వేడుకున్నారు. సోమవారం హనుమకొండ పబ్లిక్ గార్డెన్‌లో నిర్వహించిన 2006 క్వాలిఫైడ్ జూనియర్ లైన్‌మెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీ సమావేశంలో ఆయనతో పాటు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. లక్ష్మీపతి, ఉపాధ్యక్షుడు బి. మల్లేశంలు మాట్లాడారు. ఎన్పీడీసీఎల్ పరిధిలో 1500 మందిని జూనియర్ లైన్‌మెన్లుగా ఎంపిక చేయగా అప్పటి యాజమాన్యం 1110 మంది జూనియర్ లైన్‌మెన్లకు ఉద్యోగాలు కల్పించి మిగతా వారికి ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినట్లు గుర్తు చేశారు. కొత్తగా నోటిఫికేషన్ విడుదల చేసి వాటి ద్వారా ఎంపిక చేస్తుండగా 128 మంది లైన్‌మెన్లు హైకోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. 2017లో హైకోర్టు వెంటనే జూనియర్ లైన్‌మెన్లకు ఉద్యోగావకాశాలు కల్పించాలని ఆదేశించిన ఎలాంటి చర్యలు లేకపోవడంతో తాము సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు వెల్లడించారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమకు జూనియర్ లైన్‌మెన్లుగా ఉద్యోగాలు కల్పించాలని సీఎండీ వరుణ్‌రెడ్డికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో 2006 క్వాలీఫైడ్ జూనియర్ లైన్‌మెన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా నాయకులు శ్రీనివాస్, తిరుపతి, సురేష్, నరసింహరాజు, రమేష్, సంజీవ్, భీమేష్, మల్లారపు సదానందం, అబ్దుల్ ఇబ్రహీం, తిరుపతి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



పబ్లిక్ గార్డెన్‌లో మాట్లాడుతున్న క్వాలిఫైడ్ లైన్‌మెన్‌ల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్

మీకు తెలుసా?



పచ్చిమిరప... 'రెండంచుల కత్తి'

పచ్చిమిరప లేనిదే తెలుగు భోజనం పూర్తి కాదు. కొందరికి నాలుకకు కారం చురుకు తగలనిదే భోజనం ఏమాత్రం రుచించదు. అలాగని ప్రతి కూరలో పచ్చిమిరపకాయలను దట్టిస్తే మాత్రం ఆరోగ్యానికి చేటే! ఎందుకో తెలుసుకుందాం!

సమతులాహారంలో ప్రతి కూరగాయకూ ప్రత్యేక పాత్ర ఉంటుంది. అయితే పచ్చిమిరపకు ఈ సూత్రం వర్తించదు. ఒక భోజనంలో ఒక పచ్చిమిరపకాయకు పరిమితమైతే, చర్మం నునుపుగా మారుతుంది. శరీరం శక్తిని ఖర్చు చేసుకునే వేగం పెరుగుతుంది. ఒక భోజనంలో ఒక పచ్చిమిరప, బరువు తగ్గడానికి కూడా కొంతమేరకు సహాయపడుతుంది. విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లను కలిగి ఉండే పచ్చిమిరపకాయలను తినడం ఆరోగ్యకరమే అయినప్పటికీ వాటిలోని క్యాప్సైసిన్ పరిమాణం ప్రభావం జీర్ణాశయం లోపలి పొరను దెబ్బతీయకుండా ఉండాలంటే, వాటిని పరిమితంగానే తీసుకోవాలంటున్నారు ముంబయిలోని అపోలో స్పెక్ట్రా సీనియర్ డైటీషియన్, ఫౌజియా అన్సారి. పచ్చిమిరపకాయలను అతిగా తినడం వల్ల ఛాతీలో మంట, అసిడిటీలు వేధిస్తాయని హెచ్చరిస్తున్నారామె. మరీ ముఖ్యంగా పొట్టలో అల్సర్లు ఉన్నవాళ్లు, పచ్చిమిరపకాయలను వీలైనంత తగ్గించాలనీ, లేదంటే పరిస్థితి మరింత దిగజారుతుందనీ అంటున్నారామె. ఒకవేళ పచ్చిమిరపకాయలను తినడాన్ని ఇష్టపడేవాళ్లైతే, ముదురు ఆకుపచ్చ, లేదా పండు మిరపకాయలకు బదులుగా లేత ఆకుపచ్చ రంగు మిరపకాయలు తినడం మేలని కూడా సూచిస్తున్నారామె.

డయాగ్నొసిస్

కాలేయం కథ చెప్పే... 'ఫైబ్రోస్కాన్'

కాలేయ ఆరోగ్యాన్ని కచ్చితంగా నిర్ధారించడం కోసం, వైద్యులు ఫైబ్రోస్కాన్ పరీక్ష మీదే ఆధారపడుతూ ఉంటారు. కోతతో పనిలేని ఈ అల్ట్రాసౌండ్ పరీక్ష ఎవరికి? ఈ పరీక్షతో కాలేయ స్థితిని ఏ మేరకు అంచనా వేయొచ్చు?

ఫైబ్రోస్కాన్ ఎందుకు?: కాలేయ డ్యామేజి, కాలేయంలోని ఇన్‌ఫ్లమేషన్‌ను తెలుసుకోవచ్చు

- కాలేయ జబ్బు చికిత్సను అంచనా వేయొచ్చు
- కాలేయం మీద ఏర్పడిన మచ్చలు లేదా ఫైబ్రోసిస్‌ను కనిపెట్టవచ్చు
- కాలేయంలోని కొవ్వుల్లో మార్పులను పసిగట్టవచ్చు

ఎవరికి?: ఐదేళ్లకు మించి క్రమం తప్పకుండా మద్యం తీసుకునేవారు

- ఊబకాయులు
- ఐదేళ్లకు మించి మధుమేహంతో బాధపడుతున్నవారు
- హెపటైటిస్ బి లేదా హెపటైటిస్ సి బారిన పడినవాళ్లు



పొట్టలో గడబిడ ఎందుకు?

మానసిక ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు లాంటి భావోద్వేగాలు కొందర్లో జీర్ణ వ్యవస్థను ప్రభావితం చేస్తాయి. ఈ సమస్య విరోచనాల రూపంలో ఉండవచ్చు, మలబద్ధకం వేధించవచ్చు. లేదా రెండూ కలిసి ఉండొచ్చు. ఇర్రిటబుల్ బోవెల్ సిండ్రోమ్ (ఐబిఎస్)గా పేర్కొనే ఈ సమస్యతో ఎలా వ్యవహరించాలో, ఈ అసౌకర్యం నుంచి ఎలా విముక్తి పొందాలో వైద్యులు వివరిస్తున్నారు.




కొందరు పరీక్షకు లేదా ఇంటర్వ్యూకు ముందు పొట్టలో అసౌకర్యానికి లోనవుతారు. ఇంకొందరు వృత్తి జీవితంలో ఎదుర్కొనే పని ఒత్తిడి వల్ల విరేచనాలతో బాధపడుతూ ఉంటారు. ఇంకొందరు మానసిక కుంగుబాటుకు గురైనప్పుడు డయేరియాతో ఇబ్బంది పడుతూ ఉంటారు. అలాగని ఈ సమస్యలున్న వాళ్లందరికీ ఐబిఎస్ ఉండాలనే నియమమేమీ లేదు. కానీ మానసిక భావోద్వేగాలకూ ఐబిఎస్‌కూ సంబంధం ఉండే వీలుంది. మరీ ముఖ్యంగా కుంగుబాటు, యాంగ్జయిటీ న్యూరోసిస్‌తో బాధపడేవారిలో ఐబిఎస్ తలెత్తే అవకాశాలు ఎక్కువ. అయితే మెదడులో ఆలోచనలు జీర్ణ వ్యవస్థను ప్రభావితం చేయడమన్నది కాస్త విచిత్రంగానే అనిపించవచ్చు. కానీ మెదడుకూ, పేగులకూ దగ్గరి సంబంధం ఉంటుంది. మెదడులో ఒత్తిడి పెరిగినప్పుడు నాడీ వ్యవస్థ, పేగుల్లోని కదలికలను ప్రేరేపిస్తుంది. లేదా పేగుల్లో కదలికలను తగ్గించేస్తుంది. ఫలితంగా విరోచనాలు లేదా మలబద్ధకం వేధిస్తాయి. కొందర్లో పేగుల కదలికలే నొప్పి రూపంలో బయల్పడే అవకాశం కూడా ఉంటుంది. ఇలా ఐబిఎస్... విరోచనాలు, మలబద్ధకం, నొప్పి రూపాల్లో బయటపడుతూ ఉంటుంది. కొందరికి విరోచనాలు, మలబద్ధకం కలిసి ఉండే అవకాశాలు కూడా ఉంటాయి. వీళ్లలో కొన్ని రోజులు వరుసగా విరోచనాలు వేధిస్తే, ఇంకొన్ని రోజులు మలబద్ధకం వేధిస్తుంది. ఇలా ప్రస్తుతం 20% నుంచి 30% పట్టణ జనాభా ఐబిఎస్‌తో బాధపడుతోంది.

నిర్ధారణ ఇలా...

ఆరోగ్యపరంగా ఎలాంటి సమస్యలూ లేవని నిర్ధారించుకున్న తర్వాతే లక్షణాలను బట్టి ఐబిఎస్‌ను నిర్ధారించాలి. కానీ ఐబిఎస్‌తో సంబంధం లేని జీర్ణవ్యవస్థ సమస్యలను ఇదే కోవలోకి తోసేస్తున్న పరిస్థితులు తాజాగా పెరుగుతున్నాయి. మన ఆహారపుటలవాట్ల వల్ల కూడా విరోచనాలు, మలబద్ధకం సమస్యల వేధించవచ్చు. మరీ ముఖ్యంగా నేటి యువతలో బయటి ఆహారం ఎక్కువగా తినడం, తీసుకునే ఆహారంలో మార్పుల వల్ల, సరిపడా పీచు లోపించడంవల్ల మల విసర్జన అసంపూర్తిగా జరుగుతూ పదే పదే కాలకృత్యాలు తీర్చుకునే అవసరం పడుతూ ఉండవచ్చు. లేదా రోజుల తరబడి మలబద్ధకం కూడా వేధిస్తూ ఉండవచ్చు. కొందరికి పొట్టలో ఇన్‌ఫెక్షన్స్ వల్ల విరోచనాలు వేధించవచ్చు. కానీ ఇవేవీ ఐబిఎస్ కోవలోకి రావు. అలాంటప్పుడు ఐబిఎస్‌ను నిర్ధారించడానికి వైద్యులు కొన్ని నియమాలు పాటిస్తారు. అవేంటంటే...

- **45 ఏళ్లు పైబడిన వాళ్లలో:** వీరిలో మొదటిసారి ఈ లక్షణాలు కనిపిస్తే, ఆ సమస్యను ఐబిఎస్‌గా నిర్ధారించడం సరి కాదు. వారంలో మూడు రోజుల పాటు కడుపు నొప్పితో పాటు, వరుసగా విరోచనాలు లేదా మలబద్ధకం వేధించడం లేదా రెండూ కలిసి ఉండడం (కొన్ని రోజులు విరోచనాలు, కొన్ని రోజులు మలబద్ధకం) ఉంటే ఐబిఎస్‌గా అనుమానించాలి. అలాగే మలంలో రక్తం ఉందా? బరువు తగ్గుతున్నారా? థైరాయిడ్, మధుమేహం అదుపు తప్పాయా? అన్నది కూడా గమనించాలి. అన్నీ సరిగానే ఉన్నట్లయితే, 'కొలనోస్కోపీ' ద్వారా పెద్దపేగులో పాలిప్స్, క్యాన్సర్లు కూడా లేవని నిర్ధారించుకుని, ఆ తర్వాతే ఐబిఎస్ ఉన్నట్టు నిర్ధారించాల్సి ఉంటుంది.
- **45 ఏళ్ల లోపు వారిలో:** మధుమేహం, థైరాయిడ్ సమస్యలు లేవని నిర్ధారించుకోవాలి. లక్షణాలు తీవ్రంగా ఉండి, రక్తహీనత, బలహీనతలు వేధిస్తుంటే ఐబిఎస్‌గా నిర్ధారించుకోవచ్చు. వీరికి కొలనోస్కోపీ అవసరం ఉండదు. అయితే ఇప్పటి యువతలో అస్తవ్యస్త ఆహారపుటలవాట్ల మూలంగా 'ఇన్‌ఫ్లమేటరీ బోవెల్ డిసీజ్' పెరుగుతోంది. పేగులో వాపు లేదా పూత ఉన్నప్పుడు ఫీకల్ కాల్‌ప్రొటెక్టిన్ అనే ప్రొటీన్ మలంలో ఎక్కువగా కనిపిస్తుంది. కాబట్టి ఈ పరిస్థితిని నిర్ధారించుకోవడం కోసం మలపరీక్ష చేయవలసి ఉంటుంది. ఈ పరీక్షలో ప్రొటీన్ కనిపించినప్పుడు కొలనోస్కోపీ చేయక తప్పదు.

ఇలా ఇతరత్రా కారణాలన్నిటినీ పరిశీలించిన తర్వాతే అంతిమంగా ఐబిఎస్‌గా నిర్ధారించుకోవాలి.





లక్షణాల ఆధారంగానే చికిత్స

ఐబిఎస్‌లో విరోచనాలు, మలబద్ధకం ప్రధాన లక్షణాలు కాబట్టి వాటి మీదే చికిత్సా విధానం ఆధారపడి ఉంటుంది. మానసిక ఒత్తిడి, ఆందోళన, కుంగుబాటు లాంటి మనసుతో ముడిపడిన సమస్యలకు చికిత్స తీసుకుంటూనే, అదనంగా ఐబిఎస్‌కు మందులు వాడుకోవాల్సి ఉంటుంది. మలబద్ధకం ఉన్న వారు ఆహారంలో పీచు పెంచుకోవడం కోసం తాజా పండ్లు, కూరగాయల మోతాదును పెంచాలి. అలాగే అదే తరహా సప్లిమెంట్లు కూడా వాడుకోవాల్సి ఉంటుంది. అలాగే కొందరి పేగులు కొన్ని పిండిపదార్థాలను శోషించుకోలేవు. దాంతో ఆ పదార్థాలు పేగుల్లో కుళ్లిపోతూ కడుపుబ్బరం, ఇతరత్రా జీర్ణసమస్యలను పెంచుతాయి. కాబట్టి ఆ పిండిపదార్థాలు కలిగిన పదార్థాలను మానుకుని, అవి లేని ఆహారాన్ని ఎంచుకోవలసిన అవసరం ఉంటుంది. ఇంకొందరికి లాక్టోజ్ ఇంటాలరెన్స్ వల్ల జీర్ణ సమస్యలు వేధిస్తాయి. కాబట్టి పాల ఉత్పత్తులను మానుకోవడం ద్వారా ఐబిఎస్ లక్షణాలను అదుపు చేసుకోవచ్చు. అలాగే ఒత్తిడి, మానసిక కుంగుబాట్లను తగ్గించుకోవడం కోసం క్రమం తప్పకుండా వ్యాయామం చేస్తూ ఉండాలి. అలాగే కడుపు నొప్పి ఉన్నవారికి కొన్ని మందులను కూడా వైద్యులు సూచిస్తారు. అలాగే డయేరియాకు కూడా మందులు వాడుకోవలసి ఉంటుంది. మానసిక సమస్యలు తీవ్రతను బట్టి మానసిక నిపుణులను కూడా సంప్రదించాల్సి ఉంటుంది.

> ఐబిఎస్‌కు, ఇన్‌ఫ్లమేటరీ ప్రక్రియ కూడా కారణమేనని తాజా పరిశోధనల్లో నిర్ధారించారు. పేగుల్లో ఉండే మంచి, చెడు బ్యాక్టీరియాల మధ్య సంతులనం దెబ్బతిన్నప్పుడు ఇన్‌ఫ్లమేషన్ పెరిగి, ఐబిఎస్‌కు దారి తీస్తుంది కాబట్టి మంచి బ్యాక్టీరియాను పెంచే పదార్థాలను తీసుకోవడం ద్వారా ఐబిఎస్‌ను అరికట్టవచ్చని పరిశోధకులు సూచిస్తున్నారు.

ఇబిఎస్‌ను నిర్ధారించే... 'రోమ్ 4 ప్రమాణాలు'

ఇరిటబుల్ బోవెల్ సిండ్రోమ్ జీర్ణాశయ సమస్యను కచ్చితంగా నిర్ధారించడం కోసం, యునైటెడ్ స్టేట్స్, నార్త్ కరలైనా, రాలీలో ఉన్న రోమ్ ఫౌండేషన్ అనే సంస్థ, 'రోమ్ 4 ప్రమాణాలను' నిర్దేశించింది. వీటినే ప్రపంచవ్యాప్త వైద్యులందరూ అనుసరిస్తూ ఉంటారు. ఈ సంస్థ సూచించిన మార్గదర్శకాలు ఏవంటే...

పెద్దల్లో...

అరు నెలల పాటు పొట్టలో నొప్పితో పాటు, కనీసం మూడు నెలలుగా వారంలో కనీసం ఒక రోజు ఈ క్రింది వాటిలో ఒకటి లేదా రెండు లక్షణాలతో ఆ నొప్పి ముడిపడి ఉండాలి.

- మలవిసర్జన
- మలవిసర్జన ఎక్కువ/తక్కువ
- మలం రూపం మారుతూ ఉండడం

పిల్లల్లో...

నెలలో కనీసం నాలుగు రోజులు కడుపు నొప్పి వేధిస్తూ, ఈ పరిస్థితి రెండు నెలలుగా కొనసాగుతూ, ఈ కింది లక్షణాలతో ముడిపడి ఉండాలి.

- మలవిసర్జన
- మలవిసర్జన ఎక్కువ/తక్కువ
- మలం రూపం మారుతూ ఉండడం.

డాక్టర్ కె. సోమశేఖర రావు
సీనియర్ కన్సల్టెంట్,
గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ అండ్ హెపటాలజిస్ట్,
యశోద హాస్పిటల్స్, హైటెక్ సిటీ,
హైదరాబాద్



వేసవి ఆహారం

ఎండ నుంచి అండ

ఎండ తీవ్రత రోజు రోజుకూ పెరిగిపోతోంది. ఇలాంటి వేడి వాతావరణంలో ఎవరు ఎలాంటి ఆహారం తీసుకోవాలో, ఎండదెబ్బకూ, డీహైడ్రేషన్‌కూ గురి కాకుండా ఉండడం కోసం ఎలాంటి ఆహారనియమాలు పాటించాలో వైద్యులు వివరిస్తున్నారు.

వేసవిలో ఎండ వేడి నుంచి ఉపశమనాన్ని అందించే చల్లని పదార్థాల కోసం గాలిస్తూ ఉంటాం. కానీ ఐస్‌క్రీమ్ ఇష్టంగా తింటాం తప్ప అంతకంటే మెరుగ్గా శరీరాన్ని చల్లబరిచే కీరా జోలికి వెళ్లం. దాహార్తిని తీర్చడంతో పాటు లవణాలను భర్తీ చేసే కొబ్బరినీళ్లకు బదులుగా ఫ్రీజర్‌లో చల్లబరిచిన శీతల పానీయాలను ఆబగా తాగేస్తూ ఉంటాం. నిజానికి శరీరంలో నీటి శాతాన్ని భర్తీ చేసి, డీహైడ్రేషన్ నుంచి రక్షణనిచ్చే ఆరోగ్యకరమైన ప్రత్యామ్నాయాలు కూడా మన చుట్టూరా ఎన్నో ఉన్నాయి. దాహార్తిని తీర్చే మజ్జిగ, రాగి జావ, పండ్ల రసాలు, కొబ్బరినీళ్లతో పాటు చలువ చేసే పెరుగు, కూరగాయలు, ఆకుకూరలు కూడా మనకు అందుబాటులో ఉంటున్నాయి. అయితే వేసవి ఎండకూ, వేడికీ బహిర్గతమయ్యే తీవ్రతలు పరిస్థితులను బట్టి మారుతూ ఉంటాయి. ఇంటిపట్టున ఉండే వారు, బడికెళ్లే పిల్లలు, ఎక్కువగా ప్రయాణాలు చేసేవారు ఈ కాలంలో భిన్నమైన ఆహార నియమాలను పాటించాల్సి ఉంటుంది.

ఎండదెబ్బ నుంచి రక్షణ కోసం ఆమ్ పన్నా తాగుతూ ఉండాలి. తయారీ కోసం...

పచ్చి మామిడి కాయ: 1
పుదీనా ఆకులు: 3 టేబుల్‌స్పూన్లు
యాలకుల పొడి: అర టీస్పూను
మిరియాల పొడి: అర టీస్పూను
చక్కెర: పావు టీస్పూను
జీలకర్ర పొడి: అర టీస్పూను
ఉప్పు: రుచికి సరిపడా
తయారీ ఇలా: మామిడి కాయకు నీళ్లు జోడించి కాయ మెత్తబడేవరకూ ఉడికించాలి. తర్వాత నీళ్లను తొలగించి, తొక్కు, విత్తనం వేరు చేసి, గుజ్జును మెత్తగా రుబ్బుకోవాలి. ఈ గుజ్జుకు పైన చెప్పిన దినుసులన్నీ కలిపి ఆమ్ పన్నాను సిద్ధం చేసుకోవాలి. ఈ మిశ్రమానికి నీళ్లు కలిపి, ఫ్రిజ్‌లో ఒక గంట పాటు చల్లబరుచుకుని తాగితే, వేసవి నుంచి ఉపశమనం, ఎండ వేడి నుంచి రక్షణ దక్కుతుంది.

ఇంటిపట్టున ఉంటే...

ఇంటిపట్టున ఉన్నంత మాత్రాన ఎండ ప్రభావం నుంచి తప్పించుకున్నాం అనుకోడానికి వీల్లేదు. ఇంట్లో ఉన్నప్పటికీ సాయంత్రానికి నీరసించిపోతుంటే, నీరు ఎక్కువగా ఉండే పుచ్చ, దోస, తర్బూజ లాంటి పండ్లు తింటూ ఉండాలి. తరచూ నీళ్లు తాగుతూ డీహైడ్రేషన్‌కు గురి కాకుండా చూసుకోవాలి. వంటల్లో కారం, ఉప్పు, మసాలాలు బాగా తగ్గించాలి. సలాడ్స్, కూరగాయలు, ఆకుకూరలు, పెరుగు, తేలికగా అరిగే వీలున్న పదార్థాలు తీసుకోవాలి. మాంసాహారం తగ్గించాలి. నీరు ఎక్కువగా ఉండే బీరకాయలు, సొరకాయలు, పొట్లకాయలు లాంటివి ఎక్కువగా తీసుకుంటూ ఉండాలి. కీరా, క్యారట్, లెట్యూస్‌లతో సలాడ్స్ చేసుకుని తింటూ ఉండాలి. అలాగే కొబ్బరినీళ్లు, పండ్లరసాలు, మజ్జిగ తరచూ తీసుకోవచ్చు. టీ, కాఫీలు తగ్గించి, హెర్బల్ టీ తీసుకోవాలి. ఉదయం అల్పాహారంలో కూడా నూనెలో వేయించిన పూరీలు, వడలకు బదులుగా ఇడ్లీలు, ఓట్స్ పోరిడ్జ్ లాంటివి తీసుకోవాలి. చికెన్, చేపలు తక్కువ మసాలాలతో వండుకుని తీసుకోవచ్చు.

బడికెళ్లే పిల్లల కోసం...

ఈ కాలంలో పిల్లలు కూల్‌డ్రింక్స్, ఐస్‌క్రీమ్స్ తినడానికి ఎక్కువగా ఇష్టపడుతూ ఉంటారు. కానీ వీటి తయారీలో ఉపయోగించే కలుషిత నీళ్లు, పాలపదార్థాలు, కృత్రిమ రంగుల వల్ల పిల్లల్లో టాన్సిల్స్, గొంతు ఇన్‌ఫెక్షన్లు వచ్చే అవకాశాలుంటాయి. కాబట్టి ఇంట్లో తయారుచేసి ఫ్రూట్ సలాడ్స్, కస్టర్డ్, పాయసం లాంటివి ఇవ్వాలి. చక్కెర కలపని పండ్ల రసాలు ఇవ్వాలి. సాధారణంగా పిల్లలు దాహాన్ని నిర్లక్ష్యం చేస్తూ ఉంటారు. డీహైడ్రేషన్‌కు గురైనా దాని గురించి పిల్లలకు అవగాహన లేక నీరసించిపోతూ ఉంటారు. కాబట్టి పెద్దలు అప్రమత్తంగా వ్యవహరిస్తూ, పిల్లలు సరిపడా నీళ్లు తాగేలా చూసుకోవాలి. అలాగే లంచ్ బాక్సుల్లో తప్పనిసరిగా సలాడ్స్, పండ్ల ముక్కలు, పెరుగు పెడుతూ ఉండాలి. ఇంట్లో రస్నా, కృత్రిమ పండ్లరసాలకు బదులుగా నిమ్మరసం, కొబ్బరినీళ్లు, మజ్జిగ, సబ్జా లాంటివి పిల్లలకు అలవాటు చేయాలి. పిల్లలు తరచూ స్నాక్స్‌లో భాగంగా ఉప్పని చిప్స్ తింటూ ఉంటారు. ఇలాంటి వాటి వల్ల శరీరం డీహైడ్రేషన్‌కు గురవుతుంది. కాబట్టి పిల్లలకు వీటిని అందుబాటులో ఉంచకూడదు. ఈ కాలంలో పిల్లలకు జీర్ణసమస్యలు రాకుండా, ఎలక్ట్రోలైట్స్ సంతులనం కోసం మామిడి, పుచ్చ, తర్బూజా లాంటి తాజా పండ్లు, సలాడ్స్ తినిపించాలి.



ఎండకు ఎక్కువగా బహిర్గతమయ్యేవారు...

మార్కెటింగ్ వృత్తిలో ఉన్నవారు, ఎక్కువగా ప్రయాణాలు చేసే వారు తప్పనిసరిగా నీళ్లు, మజ్జిగ, నిమ్మరసం వెంట తీసుకువెళ్లాలి. ఇంటిపట్టున ఉండే వారు రోజుకు 8 నుంచి 10 గ్లాసుల నీళ్లు తీసుకుంటే సరిపోతుంది. కానీ ఎక్కువగా బయట తిరిగేవాళ్లు అంతకంటే ఎక్కువ నీళ్లు తాగాలి. బయటి ఆహారం బాగా తగ్గించి, ఇంటి ఆహారానికే ప్రాధాన్యం ఇవ్వాలి. బయట తిరిగేవాళ్లు ఎప్పుడు డీహైడ్రేషన్‌కు గురవుతారో, ఎప్పుడు ఎండదెబ్బ బారిన పడతారో చెప్పలేం. కాబట్టి బయటకు వెళ్లే ముందు, బయటకు వెళ్లిన ప్రతి గంటకూ నీళ్లు తాగుతూనే ఉండాలి.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- కూల్ డ్రింక్స్ మానేయాలి
- కారం, మసాలాలతో తయారైన పదార్థాలు మానేయాలి
- చక్కెర డీహైడ్రేషన్‌కు గురి చేస్తుంది కాబట్టి తీయగా ఉండే పానీయాలు మానేయాలి
- ఉప్పు ఎక్కువగా ఉండే చిప్స్, ఊరగాయలు, వడియాలు లాంటివి మానేయాలి
- మాంసాహారం తగ్గించి, కూరగాయలు, ఆకుకూరలు ఎక్కువగా తీసుకోవాలి
- తక్షణ శక్తి కోసం బత్తాయి రసం, నిమ్మరసం తాగాలి

> ఫ్రిజ్‌లో చల్లబరిచిన గడ్డ కట్టేంత చల్లని నీళ్లు తాగడం సరి కాదు. బయటి వాతావరణం వేడిగా ఉన్నప్పుడు అత్యంత చల్లని నీళ్లు తాగడం శరీరానికి హానికరం. కాబట్టి ఫ్రిజ్ నీళ్లు సాధారణ గది ఉష్ణోగ్రతకు చేరుకున్న తర్వాత తాగాలి. చల్లదనం కోసం కుండలో నీళ్లు తాగొచ్చు.

డాక్టర్ సుజాత స్టీఫెన్
క్లినికల్ న్యూట్రిషనిస్ట్,
యశోద హాస్పిటల్స్,
మలక్ పేట, హైదరాబాద్

పీచుతోనే పక్కా ఆరోగ్యం

పీచు ఎక్కువగా ఉండే ఆహారంతో పలు తీవ్రమైన జబ్బుల నుంచి తప్పించుకోవచ్చని పలు అధ్యయనాలు సూచిస్తున్నాయి. కానీ శుద్ధి చేసిన పదార్థాలు, పిండిపదార్థాలతో నిండిన ఆధునిక ఆహారాల్లో పీచు కొరవడుతోంది. ఈ సమస్యను ఎలా పరిష్కరించుకోవచ్చో తెలుసుకుందాం!

ఆహారం ఆరోగ్యం



పేగుల ఆరోగ్యం పెరగడానికీ, రక్తంలో చక్కెర మోతాదులు స్థిరంగా ఉండడానికీ, గుండె పనితీరు మెరుగ్గా ఉండడానికీ పీచు తోడ్పడుతుంది. ఓట్స్, బీన్స్, అవిసె గింజల్లోని నీటిలో కరిగే పీచు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. తృణధాన్యాలు, విత్తనాలు, కూరగాయల్లోని నీటిలో కరగని పీచు జీర్ణ శక్తిని పెంచుతుంది. ఇన్ని ప్రయోజనాలున్నప్పటికీ ఆధునిక ఆహారంలో పీచు పాత్ర అంతంతమాత్రంగానే ఉంటోంది. అయితే పీచుతో ఒరిగే ప్రయోజనాలను సొంతం చేసుకోవాలంటే, తీసుకునే ఆహారంలో స్వల్ప మార్పులు చేసుకోవాలి. తెల్ల బ్రెడ్‌కు బదులుగా పొట్టు తీయని గోధుమలతో తయారైన బ్రెడ్ తినొచ్చు. తెల్ల బియ్యానికి బదులుగా దంపుడు బియ్యం ఎంచుకోవచ్చు. అలాగే శుద్ధి చేసిన, ఉప్పు జోడించిన స్నాక్స్‌కు బదులుగా నట్స్, సీడ్స్ తినొచ్చు. వంటకాల్లో అవిసెగింజల పొడిని చల్లుకుని తినడం ద్వారా సరిపడా పీచును భోజనంతో పాటు పొందవచ్చు. అంతే కాకుండా...

- సలాడ్స్‌లో, భోజనంలో తప్పనిసరిగా అరకప్పు బీన్స్ ఉండేలా చూసుకోవాలి
- పండ్లు, కూరగాయలు తొక్క తీయకుండా వాడుకోవాలి. బంగాళాదుంపలు, యాపిల్స్, క్యారట్‌లను తొక్కతీయకుండా తినొచ్చు
- వేయించిన వేరుశెనగలు, మఖనా, తాజా పండ్లను స్నాక్స్‌గా తినొచ్చు.

299 ఆస్తులు.. రూ.741 కోట్లు!

కేబీఆర్ పార్కు చుట్టూ ఆస్తుల సేకరణ వ్యయం.. సూత్రప్రాయంగా అంచనా వేసిన జీహెచ్ఎంసీ

- రూ.1376కోట్లకు ప్రాజెక్టు వ్యయం
- టీడీఆర్ ద్వారా 10 శాతం ఆస్తుల సేకరణ!

హైదరాబాద్ సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కాసు బ్రహ్మానందరెడ్డి (కేబీఆర్) పార్కు చుట్టూ వంతెనల నిర్మాణం ఖరీదైన ప్రాజెక్టుగా మారుతోంది. వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం కోసం ఆస్తుల సేకరణకే పెద్ద ఎత్తున నిధులు వెచ్చించాల్సిన పరిస్థితి నెలకొంది. ఆస్తుల సేకరణ వ్యయం.. తొలుత అంచనా వేసిన దానికన్నా 62శాతం పెరగనుంది. ఈ మేరకు జీహెచ్ఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు సూత్రప్రాయంగా ప్రతిపాదనలు సిద్ధం చేశారు. పార్కు చుట్టూ ఆరు ప్రాంతాల్లో వంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణం, బంజారాహిల్స్ రోడ్ నంబర్-12 విస్తరణ కోసం 299 ఆస్తులను సేకరించాల్సి ఉంటుందని గుర్తించారు. ఇందుకు రూ.741 కోట్లు అవసరమని సూత్రప్రాయంగా అంచనా వేశారు. అయితే ఈ మొత్తంలో హెచ్చుతగ్గులు ఉండవచ్చని చెబుతున్నారు. తొలుత.. మొత్తం ప్రాజెక్టు వ్యయంలో ఆస్తుల సేకరణకు రూ.455 కోట్లు అవసరమవుతాయని అంచనా వేయగా.. ప్రస్తుతం అది రూ.741 కోట్లకు పెరిగింది. ఇందుకు సంబంధించిన నివేదికను ప్రభుత్వానికి పంపినట్టు ఓ అధికారి తెలిపారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేటివ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ (హెచ్-సిటీ)లో భాగంగా.. సిగ్నల్ చిక్కులు లేని ప్రయాణం కోసం కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న ఆరు జంక్షన్లలో స్టీల్ వంతెనలు, అండర్‌పాస్‌లు నిర్మించనున్నారు. ఇందుకు రూ.1,090 కోట్ల ఖర్చవుతుందని ప్రాథమికంగా అంచనా వేశారు. ఇందులో నిర్మాణ వ్యయం రూ.635 కోట్లు కాగా, ఆస్తుల సేకరణకు రూ.455 కోట్లు ప్రతిపాదించారు. తాజాగా ఆస్తుల సేకరణకు పెరిగిన వ్యయంతో మొత్తం ప్రాజెక్టు వ్యయం రూ.1376 కోట్లకు పెరగనుంది. అయితే రూ.635కోట్లతో పనులకు ఫిబ్రవరిలో జీహెచ్ఎంసీ టెండర్ నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందుకోసం రూపొందించిన రహదారి అభివృద్ధి ప్రణాళిక (ఆర్‌డీపీ)లు ఇప్పటికే ఆమోదం పొందాయి. దీంతో ఏ మార్గంలో ఎన్ని ఆస్తులను సేకరించాలన్నది పట్టణ ప్రణాళికా విభాగం వర్గాలు గుర్తించాయి. బంజారాహిల్స్ విరించి ఆస్పత్రి నుంచి మహారాజా అగ్రసేన్ జంక్షన్ వరకు 3.1 కిలోమీటర్ల మేర, కేబీఆర్ పార్కు చుట్టూ ఉన్న ఇతర జంక్షన్ల వద్ద కలిపి 299 ఆస్తులను, సుమారు 56,621 చదరపు గజాల స్థలాన్ని సేకరించాల్సి ఉంటుందని నిర్ధారించారు. ఈ ప్రాంతాల్లో సబ్ రిజిస్ట్రార్ విలువ చదరపు గజానికి రూ.63వేల నుంచి రూ.93వేల వరకు ఉంది. భూసేకరణ చట్టం ప్రకారం దీనికి రెట్టింపు పరిహారం చెల్లించాల్సి ఉంటుంది. భవనాలు ఉంటే నిర్మాణ వ్యయం అదనంగా చెల్లించాలి. వీటిని పరిగణనలోకి తీసుకున్న అధికారులు.. రూ.741కోట్లు అవసరమవుతాయని సూత్రప్రాయంగా అంచనా వేశారు. అభివృద్ధి బదలాయింపు హక్కుల(టీడీఆర్) ద్వారా ప్రస్తుతానికి పది శాతం ఆస్తులను సేకరించే అవకాశముందని పట్టణ ప్రణాళికా విభాగం భావిస్తోంది. ఆర్‌డీపీలో భాగంగా ఆస్తుల సేకరణపై గతంలో జీహెచ్ఎంసీ ముసాయిదా నోటిఫికేషన్ విడుదల చేసింది. అయితే ఎలాంటి అభ్యంతరాలు, ఫిర్యాదులు రాలేదని ఆస్తుల సేకరణ విభాగం వర్గాలు పేర్కొన్నాయి. ఇదిలా ఉంటే.. ఆస్తుల యజమానులు మాత్రం తమ భూమికి చదరపు గజానికి రూ.4లక్షలు, నిర్మాణ విలువ రూ.8వేల చొప్పున ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అంత మొత్తం చెల్లించడం కుదరదన్న జీహెచ్ఎంసీ.. మధ్యే మార్గంగా సేకరణ వ్యయాన్ని అంచనా వేసింది.


పరీక్ష రాయనివ్వకపోతే చావే శరణ్యం

- నా తప్పేమీ లేదు.. అన్యాయంగా డీబార్ చేశారు: విద్యార్థిని ఝాన్సీరాణి
- కేసు దర్యాప్తు ముమ్మరం.. 14 మంది బాధ్యులుగా గుర్తింపు
- ఇప్పటికే మైనర్ సహా ఆరుగురి రిమాండ్
- ఎవరి కోసం ఫొటో తీశారనే అంశం తేలనివ్వకుండా ఒత్తిళ్లు?

నల్లగొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): వాట్సా‌ప్‌లో పదో తరగతి ప్రశ్నపత్రం ప్రత్యక్షమైన ఘటనలో విద్యార్థిని డీబార్ చేయగా, ఆమె చేసిన వ్యాఖ్యలు పరీక్షల నిర్వహణలో నిర్లక్ష్యాన్ని ఎత్తిచూపాయి. ఈ ఘటనలో పోలీసులు తమ దర్యాప్తును ముమ్మరం చేశారు. మొత్తం 14 మందిని దీనికి బాధ్యులుగా గుర్తించిన పోలీసులు ఇప్పటికే మైనర్ సహా మరో ఆరుగురిని రిమాండ్‌కు పంపారు. ఈ వ్యవహారంలో ఫొటో తీసేందుకు ప్రశ్నపత్రం చూపించిన విద్యార్థిని ఝాన్సీరాణిని ఘటన జరిగిన 21వ తేదీనే డీబార్ చేశారు. ఇందులో తన ప్రమేయమేమీ లేదని, తనను అన్యాయంగా డీబార్ చేశారని సదరు విద్యార్థిని ఝాన్సీరాణి కన్నీటిపర్యంతమయ్యింది. తనపై డీబార్ ఎత్తివేసి తనకు మళ్లీ పరీక్షలు రాసే అవకాశం కల్పించాలని అధికారులను వేడుకున్న వీడియో సోమవారం సోషల్‌మీడియాలో వైరల్ అయింది. తాను పరీక్ష రాస్తున్న హాల్ కిటికీ వద్దకు కొందరు గుర్తు తెలియని వ్యక్తులు వచ్చి, తమకు ప్రశ్నపత్రం చూపించాలని బెదిరించారని ఆమె వాపోయింది. పేపర్ చూపకపోతే రాయితో కొడతామని బెదిరించడం వల్లే తాను ప్రశ్నపత్రం చూపించాల్సి వచ్చిందని తెలిపింది. తాను తెలివైన విద్యార్థినినని, రాష్ట్రంలో ఎక్కడ పరీక్షా కేంద్రంలో పరీక్ష రాసే అవకాశమిచ్చినా రాస్తానని అధికారులను వేడుకుంది. పరీక్షలు రాయనివ్వకపోతే తనకు చావే శరణ్యమంటూ ఝాన్సీ విడుదల చేసిన వీడియో ప్రస్తుతం సోషల్‌మీడియా అంతటా చర్చనీయాంశంగా మారింది. ఈ ఘటనపై విచారణ నిర్వహిస్తున్న నకిరేకల్ పోలీసులు నిష్పక్షపాతంగా దర్యాప్తు చేయాలనే డిమాండ్లు వెలువడుతున్నాయి. ప్రశ్నాపత్రం ఎవరి కోసం ఫొటో తీశారనే అంశాన్ని ఇప్పటివరకు తేల్చలేకపోవడం వెనక రాజకీయ, అధికార ఒత్తిళ్లు పనిచేస్తున్నాయనే ఆరోపణలు వస్తున్నాయి. నకిరేకల్ సమీపంలోని మరో నియోజకవర్గానికి చెందిన ప్రైవేట్ స్కూళ్ల యాజమాన్యాలే ఇందులో కీలకమైన సూత్రధారులని, ఆ విషయం బయటకు రాకుండా ఆకతాయిల చేష్టగా చిత్రీకరించి, కేసుని పక్కదారి పట్టిస్తున్నారన్న వాదన వినిపిస్తోంది. ఈ కేసును పోలీసులు మరింత లోతుగా దర్యాప్తు చేయాలని పలువురు కోరుతున్నారు.







చిత్రజ్యోతి
SINCE 1965

ఇండో-కొరియన్ హారర్- కామెడీ



వరుణ్ తేజ్ హీరోగా మేర్లపాక గాంధీ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'వీటీ15(వర్కింగ్ టైటిల్)'. యూవీ క్రియేషన్స్, ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థలు నిర్మిస్తున్నాయి. హైదరాబాద్‌లో సోమవారం నిర్వహించిన పూజా కార్యక్రమాలతో ఈ చిత్రం ఘనంగా ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో వరుణ్ తేజ్‌తో పాటు కథానాయిక రితిక నాయక్ పాల్గొన్నారు. ఇండో-కొరియన్ హారర్- కామెడీగా రూపొందుతున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ కూడా నేటి నుంచే ప్రారంభిస్తున్నామని చిత్రబృందం తెలిపింది. కాగా, వరుణ్ తేజ్ చివరి సినిమా 'మట్కా' ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. 'ఎఫ్-3' తర్వాత సరైన హిట్ కోసం ఎదురుచూస్తున్న వరుణ్ తేజ్ ఈ సినిమాపై భారీ ఆశలు పెట్టుకున్నారు. మేర్లపాక గాంధీ 'వెంకటాద్రి ఎక్స్‌ప్రెస్', 'ఎక్స్‌ప్రెస్ రాజా', 'ఏక్ మినీ కథ' లాంటి హిట్ సినిమాలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు సంపాదించుకున్న విషయం తెలిసిందే. దాంతో 'వరుణ్ తేజ్- మేర్లపాక' కాంబినేషన్‌పై భారీ అంచనాలు నెలకొన్నాయి.

విజయ్ ఆఖరి చిత్రం అప్పుడే!



ఎప్పుడెప్పుడా అని అభిమానులు ఆసక్తిగా ఎదురుచూస్తున్న తమిళ నటుడు విజయ్ చిత్రం 'జన నాయగన్' విడుదల తేదీ వచ్చేసింది. హెచ్.వినోద్ దర్శకత్వంలో వస్తున్న ఈ సినిమాలో పూజా హెగ్డే కథానాయిక. కేవీఎన్ సంస్థ నిర్మిస్తోంది. మమితా బైజు, బాబీ డియోల్, ప్రియమణి తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ సినిమా విడుదల తేదీని చిత్రబృందం తాజాగా ప్రకటించింది. వచ్చే ఏడాది జనవరి 9న ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు సోషల్ మీడియా వేదికగా తెలిపింది. రాజకీయాల్లోకి వెళ్లిన విజయ్ ఆఖరి చిత్రం ఇదేనంటూ కోలీవుడ్‌లో కొంత కాలంగా ప్రచారం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో విజయ్‌కు ఘనంగా వీడ్కోలు పలుకుతూ ఒక పాటను సినిమాలో రూపొందించినట్లు సమాచారం. దర్శకులు లోకేశ్ కనగరాజ్, అట్లీ, నెల్సన్ దిలీప్‌తో పాటు ఓ హీరో అతిథి పాత్రలో సందడి చేయనున్నారని కోలీవుడ్‌లో టాక్ వినిపిస్తోంది.

'కన్నప్ప' ను ట్రోల్ చేస్తే శివుడి శాపం తప్పదు



'నేను మాములుగా ఆంజనేయ స్వామి భక్తుడిని. కానీ 'కన్నప్ప'తో ప్రయాణం మొదలయ్యాక శివ భక్తుడిగా మారిపోయా. ఈ ప్రయాణంలో చాలా నేర్చుకున్నా. కన్నప్ప చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది. ప్రభాస్ పాత్రను ఎంత ఊహించుకున్నా అంతకు మించి అనేలా ఉంటుంది' అని చెప్పారు మంచు విష్ణు. ఆయన నటిస్తున్న 'కన్నప్ప' చిత్రం వచ్చే నెల 25న విడుదలవుతోంది. ఈ సందర్భంగా రెడ్ లారీ ఫిల్మ్ ఫెస్టివల్‌లో 'కన్నప్ప' టీమ్ పాల్గొని, మీడియాతో ముచ్చటించింది. ఈ కార్యక్రమంలో మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నకు విష్ణు సమాధానం ఇస్తూ 'నేను మాట్లాడిన మాటల్లో ఏదన్నా వాక్యం కట్ చేసి వైరల్ చేసి వివాదం సృష్టించాలనుకుంటే పట్టించుకోవాల్సిన అవసరం లేదు. ప్రజలు చాలా స్మార్ట్.. కొంచెం వివాదమైనా పూర్తి వీడియో చూసి నిజానిజాలు తెలుసుకుంటున్నారు' అన్నారు. పక్కనే ఉన్న రఘుబాబు మైక్ అందుకుని 'ఈ సినిమా గురించి ఎవరైనా ట్రోల్ చేస్తే శివుడి ఆగ్రహానికి, శాపానికి గురవుతారు. వంద శాతం కచ్చితంగా చెబుతున్నా. ట్రోల్ చేస్తే ఇక ఫినిషే' అన్నారు. 'దర్శకుడు ముఖేశ్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ 'ఆ శివుడే నన్ను ఈ ప్రాజెక్ట్‌లోకి పంపించాడు. 'మహాభారత్' సీరియల్‌ను అందరూ ప్రేమించారు. అలాగే అదే స్థాయిలో కన్నప్పను ఆరాధిస్తారు, గౌరవిస్తారు' అని చెప్పారు.

థ్రిల్లింగ్ అంశాలతో...



నవీన్ చంద్ర, షాలినీ వడ్నికట్టి జంటగా నటించిన చిత్రం '28 డిగ్రీల సెల్సియస్'. 'పొలిమేర' ఫేమ్ డా.అనిల్ విశ్వనాథ్ తెరకెక్కించారు. సాయి అభిషేక్ నిర్మించిన ఈ చిత్రం ఏప్రిల్ 4న విడుదలవుతోంది. తాజాగా, సినిమా ట్రైలర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు డా.అనిల్ విశ్వనాథ్ మాట్లాడుతూ "ఇదో అందమైన ప్రేమకథ. థ్రిల్లింగ్ అంశాలు పుష్కలంగా ఉంటాయి" అని చెప్పారు. "నిజాయితీతో తీసిన చిత్రమిది. ప్రేక్షకులు తప్పక ఆదరిస్తారనే నమ్మకం ఉంది" అని హీరో నవీన్ చంద్ర చెప్పారు. "ఈ సినిమా మా చిత్రబృందానికి ఓ భావోద్వేగ ప్రయాణం" అని చిత్రనిర్మాత సాయి అభిషేక్ తెలిపారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం..



'ఆదిత్య', 'విక్కీస్ డ్రీమ్', 'డాక్టర్ గౌతమ్' వంటి బాలల చిత్రాలు నిర్మించి జాతీయ, అంతర్జాతీయ అవార్డులు పొందిన దర్శకనిర్మాత భీమగాని సుధాకర్ గౌడ్ రూపొందించిన మరో బాలల చిత్రం 'అభినవ్'. బాలల దినోత్సవం సందర్భంగా నవంబర్ 14న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నారు. ఈ సందర్భంగా సుధాకర్ గౌడ్ మాట్లాడుతూ 'డ్రగ్ మాఫియా విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని మన దేశాన్ని నిర్వీర్యం చేయాలని చూస్తోంది. స్వాతంత్ర్య సమరయోధుడైన తన తాతయ్య స్ఫూర్తితో అభినవ్ అనే బాలుడు ఈ గంజాయి మాఫియా ఆట ఎలా కట్టించాడన్నది ఈ చిత్ర కథ.' అన్నారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డ్రగ్స్ రహిత సమాజం కోసం సినిమా వాళ్లు ఓ చిన్న వీడియో చేయాలని కోరారనీ, తన వంతుగా ఈ సినిమాను తీశాననీ ఆయన తెలిపారు. సమ్మెట గాంధీ, సత్య ఎర్ర, మాస్టర్ గగన్,గీతా గోవింద్, అభినవ్, చరణ్, బేబి అక్షర తదితరులు ఈ చిత్రంలో నటిస్తున్నారు.

మా కెరీర్‌లోనే ఉత్తమ చిత్రమవుతుంది

- వెంకీ కుడుముల



'ఛలో', 'భీష్మ' చిత్రాల ఫేమ్ వెంకీ కుడుముల తెరకెక్కించిన చిత్రం 'రాబిన్‌హుడ్'. నితిన్, శ్రీలీల జంటగా మైత్రీమూవీ మేకర్స్ పతాకంపై యలమంచిలి రవిశంకర్, నవీన్ యెర్నేని నిర్మించారు. రాజేంద్రప్రసాద్, ఆస్ట్రేలియా క్రికెటర్ డేవిడ్ వార్నర్ కీలక పాత్రలు పోషించారు. ఈ నెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు దర్శకుడు వెంకీ కుడుముల. "భీష్మ' తర్వాత మెగాస్టార్ చిరంజీవితో ఓ సినిమా చేయాలనుకున్నాను. కానీ అది కార్యరూపం దాల్చలేదు. ఆ తర్వాత నితిన్‌తో కలిసి ఈ సినిమాను మొదలుపెట్టాను. ఇందులో హీరో పాత్ర చాలా విభిన్నంగా ఉంటుంది. మాటలతో సునాయసంగా మనుషుల్ని గారడీ చేసే రకం. ఈ సినిమాకు మొదటి 20 నిమిషాలు చాలా ముఖ్యం. సినిమా అద్భుతంగా వచ్చింది. నితిన్‌కూ, నాకూ కెరీర్ బెస్ట్ చిత్రం అవుతుంది. నితిన్, రాజేంద్రప్రసాద్, శ్రీలీల పాత్రల మధ్య వచ్చే సన్నివేశాలు చాలా ఆసక్తికరంగా ఉంటాయి. డేవిడ్ వార్నర్ పాత్ర చాలా కీలకంగా ఉంటుంది. అవసరం ఉన్న వారి పక్షాన నిలబడే వాడే 'రాబిన్‌హుడ్'. ఇదే ఈ సినిమా టైటిల్ ప్రధాన ఉద్దేశం. జీ.వి ప్రకాశ్ సంగీతం ప్రధానాకర్షణ. ఈ పూర్తి స్థాయి వినోదాత్మక చిత్రం అందరినీ ఆకట్టుకుంటుంది" అని చెప్పారు.

ఈ సారి రెండింతల వినోదం



యువతరాన్ని ఆకట్టుకున్న 'మ్యాడ్' చిత్రానికి సీక్వెల్‌గా తెరకెక్కింది 'మ్యాడ్ స్క్వేర్'. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్ ప్రధాన పాత్రలు పోషించారు. కల్యాణ్ శంకర్ దర్శకత్వం వహించారు. సూర్యదేవర నాగవంశీ సమర్పణలో హారికా సూర్యదేవర, సాయిసౌజన్య నిర్మించారు. ఈనెల 28న సినిమా విడుదలవుతోన్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు కథానాయకులు నితిన్, సంగీత్, రామ్. నార్నె నితిన్ మాట్లాడుతూ "మొదటి భాగంతో పోలిస్తే ఈసారి రెండింతల వినోదంతో వస్తున్నాం. ప్రేక్షకులకు మేము చేసే వినోదం విపరీతంగా నచ్చుతుందనే నమ్మకం ఉంది. మొదటి భాగమంతా కాలేజీలో సాగితే.. ఈ సినిమా ఒక పెళ్లి చుట్టూ సాగుతుంది. దర్శకుడు కల్యాణ్ శంకర్ ప్రతీ సన్నివేశాన్ని కడుపుబ్బా నవ్వుకునేలా తెరకెక్కించారు" అని చెప్పారు. సంగీత్ శోభన్ మాట్లాడుతూ "వినోదమే ఈ సినిమాకు హీరో. ఇందులోని పాత్రలకున్న ప్రధాన ఉద్దేశం నవ్వించడమే. ప్రతీ సన్నివేశం కొత్తగా ఉంటుంది" అని చెప్పారు. రామ్ నితిన్ మాట్లాడుతూ "ఇదో క్లీన్ కామెడీ. యువతరంతో పాటు కుటుంబ ప్రేక్షకులనూ అలరిస్తుంది. 'మ్యాడ్' సిరీస్‌ను కొనసాగించే ఆలోచన ఉంది" అని తెలిపారు.

అందమైన ప్రేమకథ



సుహాస్ కథానాయకుడిగా రామ్ గోదాల దర్శకత్వంలో తెరకెక్కుతోన్న రొమాంటిక్ కామెడీ 'ఓ భామ అయ్యో రామ'. 'జో' ఫేమ్ మాళవిక మనోజ్ హీరోయిన్‌గా హరీష్ నల్ల నిర్మిస్తున్నారు. రానా దగ్గుబాటి నిర్మాణ సంస్థ స్పిరిట్ మీడియా చిత్రాన్ని విడుదల చేయనుంది. తాజాగా, ఈ సినిమా టీజర్‌ను రిలీజ్ చేశారు మేకర్స్. ఈ సందర్భంగా హీరో సుహాస్ మాట్లాడుతూ "ప్రతీ సన్నివేశం కొత్తగా ఉండే అందమైన ప్రేమకథ ఈ చిత్రం. సినిమా అందరికీ నచ్చుతుంది" అని చెప్పారు. "సుహాస్, మాళవిక కెమిస్ట్రీ, పాటలు, విజువల్స్ సినిమాకు ప్రధానాకర్షణ" అని దర్శకుడు రామ్ గోదాల చెప్పారు. "ఈ సినిమా మీ అందరి హృదయాలను దోచుకుంటుంది" అని నిర్మాత హరీష్ నల్ల తెలిపారు.

బిజినెస్

బుల్ మార్చ్

23,600 ఎగువ స్థాయికి నిఫ్టీ



6 వారాల గరిష్ఠానికి సెన్సెక్స్

ఇంట్రాడేలో 78,000 పైకి..

6 రోజుల్లో రూ.27 లక్షల కోట్ల సంపద వృద్ధి ● 7 రోజుల్లో 160 పైసలు పెరిగిన రూపాయి విలువ

ముంబై: భారత స్టాక్ మార్కెట్లో వరుసగా ఆరో రోజూ బుల్ ర్యాలీ కొనసాగింది. సోమవారం ట్రేడింగ్‌లో సెన్సెక్స్ మరో 1,078.87 పాయింట్ల వృద్ధితో 77,984.38 వద్ద స్థిరపడింది. ఫిబ్రవరి 6 తర్వాత (6 వారాల) నమోదైన గరిష్ఠ ముగింపు స్థాయి ఇదే. ఒక దశలో సూచీ 1,201.72 పాయింట్ల లాభంతో 78,107.23 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. నిఫ్టీ సైతం ఒక దశలో 358.35 పాయింట్లు ఎగబాకి 23,708.75 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసినప్పటికీ, చివరికి 307.95 పాయింట్ల లాభంతో 23,658.35 వద్ద ముగిసింది. అమెరికా, ఐరోపా మార్కెట్ల సానుకూల సంకేతాలు, విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల పెట్టుబడులతోపాటు బ్యాంకింగ్, ఆయిల్ అండ్ గ్యాస్ రంగాల షేర్లలో జోరుగా కొనుగోళ్లు మార్కెట్‌ను మరింత ముందుకు నడిపించాయి. రూపాయి పుంజుకోవడమూ ట్రేడింగ్ సెంటిమెంట్‌ను మెరుగుపరిచిందని మార్కెట్ విశ్లేషకులు పేర్కొన్నారు. గడిచిన ఆరు రోజుల్లో సెన్సెక్స్ 4,155.47 పాయింట్లు (5.62 శాతం), నిఫ్టీ 1,260 పాయింట్లు (5.5 శాతం) పుంజుకోగా.. బీఎస్ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ విలువ రూ.27.10 లక్షల కోట్లు పెరిగి రూ.418.29 లక్షల కోట్లకు (4.87 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది. ఈ ఒక్క రోజే మార్కెట్ సంపద రూ.5 లక్షల కోట్ల మేర పెరిగింది.

- సెన్సెక్స్‌లోని 30 లిస్టెడ్ కంపెనీల్లో 23 రాణించాయి. ఎన్‌టీపీసీ షేరు 4.61 శాతం వృద్ధితో సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. కోటక్ బ్యాంక్ 4.51 శాతం ఎగబాకింది. ఎస్‌బీఐ, టెక్ మహీంద్రా, పవర్‌గ్రిడ్ స్టాక్స్ 3 శాతానికి పైగా పెరిగాయి. మార్కెట్ దిగ్గజాలైన రిలయన్స్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ 1.95 శాతం వరకు బలపడ్డాయి. ఇండస్‌ఇండ్ బ్యాంక్, టైటాన్, జొమాటో షేర్లు మాత్రం 2 శాతానికి పైగా క్షీణించాయి.
- ప్రధాన కంపెనీలతోపాటు చిన్న, మధ్య స్థాయి షేర్లలోనూ ట్రేడర్లు కొనుగోళ్లు పెంచారు. దాంతో బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.32 శాతం, స్మాల్‌క్యాప్ ఇండెక్స్ 1.17 శాతం వృద్ధి చెందాయి.
- బీఎస్ఈలోని రంగాలవారీ సూచీలన్నీ రాణించాయి. బ్యాంకెక్స్, యుటిలిటీస్, పవర్, ఇండస్ట్రియల్స్ ఇండెక్స్‌లు రెండు శాతానికి పైగా పెరిగాయి. బీఎస్ఈలో 4,298 కంపెనీల షేర్లు ట్రేడవగా.. 2,458 లాభపడ్డాయి. 1,689 నష్టపోగా.. 151 యథాతథంగా ముగిశాయి. 102 కంపెనీల షేర్లు సరికొత్త ఏడాది గరిష్ఠానికి ఎగబాకాయి.
- అంతర్జాతీయ మార్కెట్లో బ్రెంట్ రకం ముడిచమురు బ్యారెల్ ధర ఒకదశలో 0.83 శాతం పెరుగుదలతో 72.76 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.
- ఢిల్లీ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత బంగారం 10 గ్రాముల ధర రూ.700 తగ్గి రూ.90,550కి దిగివచ్చింది. కిలో వెండి మాత్రం రూ.200 పెరుగుదలతో రూ.1,00,500 ధర పలికింది. అంతర్జాతీయ మార్కెట్లో ఔన్స్ (31.10 గ్రాములు) బంగారం రేటు ఒకదశలో 0.22 శాతం పెరిగి 3,029 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

37 పైసలు పెరిగిన రూపాయి

ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌తో రూపాయి మారకం విలువ ఏకంగా 37 పైసలు పెరిగి రూ.85.61 వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్ల ర్యాలీతోపాటు విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు ఇందుకు దోహదపడ్డాయి. రూపాయి బలపడటం వరుసగా ఇది ఏడో రోజు. ఈ 7 రోజుల్లో మన కరెన్సీ విలువ 160 పైసలు పెరిగింది.

ఈ ఏడాది నష్టాలు భర్తీ

స్టాక్ మార్కెట్ సూచీలతో పాటు ఫారెక్స్ మార్కెట్లో రూపాయి కూడా ఈ ఏడాది ఏర్పడిన నష్టాల నుంచి పూర్తిగా తేరుకున్నాయి. ఈ ఫిబ్రవరిలో 4,302.47 పాయింట్లు (5.55 శాతం), జనవరిలో 638.44 పాయింట్లు (0.81 శాతం) నష్టపోయిన సెన్సెక్స్.. ఈ నెలలో ఇప్పటివరకు 4,786.28 పాయింట్లు (6.53 శాతం) పుంజుకుంది. గత కొన్ని నెలలుగా భారీగా అమ్మకాలకు పాల్పడుతూ వచ్చిన విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు (ఎఫ్‌పీఐ).. గడిచిన కొన్ని రోజుల్లో మళ్లీ కొనుగోళ్లు పెంచడం, పలు కంపెనీల షేర్లు ఆకర్షణీయ ధరలకు లభిస్తుండటంతో మదుపరులు వేల్యూ బైయింగ్‌కు పాల్పడడం, ఈ ఏడాదిలో మరో రెండు సార్లు వడ్డీ రేట్లు తగ్గించనున్నట్లు అమెరికా ఫెడరల్ రిజర్వ్ సంకేతాలివ్వడం, ట్రంప్ సుంకాల అమలు విషయంలో కాస్త మెత్తబడవచ్చన్న ఆశలు, రూపాయి బలోపేతం వంటి అంశాలు ఈక్విటీల ర్యాలీకి దోహదపడ్డాయని మార్కెట్ వర్గాలు పేర్కొన్నాయి. మన కరెన్సీ విషయానికొస్తే.. 2024 డిసెంబరు 31న రూ.85.64 వద్ద ముగిసిన డాలర్-రూపాయి మారకం విలువ.. గత నెలాఖరులో ఆల్‌టైం రికార్డు కనిష్ఠ స్థాయి రూ.87.59 స్థాయికి బలహీనపడింది. ఆ తర్వాత కాస్త తేరుకున్న రూపాయి.. గడిచిన వారం రోజుల్లో శరవేగంగా పుంజుకుంది. 160 పైసలు లాభంతో ఎక్స్ఛేంజ్ రేటు మళ్లీ రూ.85.61 వద్దకు చేరుకుంది. అంతర్జాతీయ మార్కెట్లో డాలర్ బలహీనపడటం, ఈక్విటీ మార్కెట్లో ర్యాలీ, విదేశీ ఇన్వెస్టర్ల కొత్త పెట్టుబడులు, ఆర్థిక సంవత్సరాంతం కావడంతో ఎగుమతిదారులు డాలర్లను విక్రయిస్తుండటం ఇందుకు దోహదపడిందని ఫారెక్స్ వర్గాలు పేర్కొన్నాయి.

కెనరాబ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా
ఎస్‌కె మజుందార్



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): కెనరా బ్యాంకు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా ఎస్‌కె మజుందార్ (56) సోమవారం బాధ్యతలు చేపట్టారు. మజుందార్ చార్టెర్డ్ అకౌంటెంట్, కాస్ట్ అకౌంటెంట్స్ విభాగంలో ప్రత్యేక అర్హతలు కలిగి ఉన్నారు. బ్యాంకింగ్ రంగంలోనూ సుదీర్ఘకాలం సేవలందించారు. 2000 నుంచి కెనరాబ్యాంకుతో సంబంధాలు కలిగి ఉన్నారు. సుదీర్ఘమైన కెరీర్‌లో వివిధ హోదాలలో ఆయన సేవలందించారు. ఆయన నాయకత్వంలో కెనరాబ్యాంకు మరిన్ని రంగాలలో రాణించనుందని బ్యాంకు ఒక ప్రకటనలో పేర్కొంది.

జీఎస్ఎంఏ బోర్డు కొత్త చైర్మన్‌గా
గోపాల్ విట్టల్



న్యూఢిల్లీ: భారతి ఎయిర్‌టెల్ మేనేజింగ్ డైరెక్టర్, వైస్ చైర్మన్ గోపాల్ విట్టల్ జీఎస్ఎంఏ డైరెక్టర్ల బోర్డు కొత్త చైర్మన్‌గా ఎన్నికయ్యారు. ఆయన ప్రస్తుతం ఈ బోర్డు తాత్కాలిక చైర్మన్‌గా ఉన్నారు. పరిశ్రమ సంఘం వ్యూహాత్మక దశను ఆయన పర్యవేక్షిస్తారు. సునీల్ భారతి విట్టల్ తర్వాత ఈ బోర్డు చైర్మన్‌గా ఎన్నికైన రెండో భారతీయుడు ఈయన. ప్రపంచంలోని వెయ్యి టెలికాం కంపెనీలకు ఈ ప్రతిష్ఠాత్మక సంఘంలో సభ్యత్వం ఉంది.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)

24వ తేదీ			
హైదరాబాద్	395	విజయవాడ	400
వరంగల్	397	గోదావరి	392
చిత్తూరు	470	విశాఖపట్నం	400
		డజను గుడ్లు రూ.	60

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్

హైదరాబాద్	94	విజయవాడ	95
వరంగల్	94	గుంటూరు	100
కరీంనగర్	94	ఒంగోలు	100
మహబూబ్‌నగర్	94	చిత్తూరు	89
కర్నూలు	94	నెల్లూరు	94
విశాఖపట్నం	89	అనంతపురం	94
గోదావరి	95		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	89,620 ▼	82,150 ▼	1,10,000 ▼
విజయవాడ	90,600 ▼	85,000 ▼	1,00,000 ▼
విశాఖపట్నం	88,090 ▼	80,750 ▼	98,300 ▲
రాజమండ్రి	89,620 ▼	82,150 ▼	1,00,600 ▲
ప్రొద్దుటూరు	90,000 ▲	83,340 ▲	99,600 ▲
ముంబై	87,720 ▼	80,350 ▼	97,410 ▼

ఎఫ్‌పీఐలకు సెబీ ఊరట

- వివరాల వెల్లడి పరిమితి రెట్టింపు
- రూ.50,000 కోట్లు మించితే మరిన్ని వివరాలు

ముంబై: సెబీ కొత్త చీఫ్ తుహిన్ కాంత పాండే కార్యాచరణకు దిగారు. సోమవారం ఆయన అధ్యక్షతన జరిగిన తొలి సమావేశంలోనే సెబీ డైరెక్టర్ల బోర్డు పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. ముఖ్యంగా ఎఫ్‌పీఐల పెట్టుబడుల వెల్లడి పరిమితిని రూ.25,000 కోట్ల నుంచి రూ.50,000 కోట్లకు పెంచింది. ఇంకా ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు, రీసెర్చ్ అనలిస్టుల ముందస్తు ఫీజు వసూలు కాలపరిమితిని విస్తరించింది. మారుతున్న మార్కెట్ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయాలు తీసుకున్నట్టు సెబీ చీఫ్ చెప్పారు.

సెబీ బోర్డు తీసుకున్న కీలక నిర్ణయాలు.

- ఈక్విటీ మార్కెట్‌లో రూ.50,000 కోట్లకు మించిన పెట్టుబడులున్న ఎఫ్‌పీఐ, తమ అసలు మదుపరులకు సంబంధించి మరిన్ని వివరాలు వెల్లడించాలి. ఇంతకు ముందు ఈ పరిమితి రూ.25,000 కోట్లు.
- ఏదైనా ఒక ఎఫ్‌పీఐ తన నిర్వహణలోని ఆస్తుల విలువలో (ఏయూఎం) సగానికి మించి, ఏదైనా ఒక కంపెనీ లేదా పారిశ్రామిక గ్రూపు నిర్వహణలోని కంపెనీల షేర్లలో మదుపు చేసినా మరిన్ని వివరాలు వెల్లడించాలి.
- ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్లు మదుపరుల నుంచి వసూలు చేసే ముందస్తు ఫీజు కాల పరిమితిని ప్రస్తుత ఆరు నెలల నుంచి ఏడాదికి పెంచారు.
- రెసెర్చ్ అనలిస్టులు వసూలు చేసే ముందస్తు ఫీజు కాల పరిమితి కూడా ప్రస్తుత మూడు నెలల నుంచి ఏడాదికి పెంచారు.
- ఫీజుల పరిమితి, చెల్లింపుల విధానం, రిఫండ్స్, బ్రేకేజీ ఫీజులు వ్యక్తిగత మదుపరులు, అవిభక్త హిందూ కుటుంబాలకు మాత్రమే వర్తిస్తాయి.
- కేటగిరి 2కు చెందిన ఆల్టర్‌నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్) 'ఏ' లేదా అంతకంటే తక్కువ రేటింగ్ ఉన్న లిస్టెడ్ రుణ పత్రాల్లో మదుపు చేసినా ఇక ఆ పెట్టుబడులను అనిలిస్టెడ్ సెక్యూరిటీలుగానే పరిగణిస్తారు.
- సెబీ బోర్డు సభ్యుల పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశాల వెల్లడిని సమగ్రంగా సమీక్షించేందుకు ఒక ఉన్నతాధికార కమిటీ ఏర్పాటు చేశారు.

సెబీ వద్ద నమోదైన ఫిన్‌ఫ్లుయెన్సర్లు 2 శాతమే: సీఎఫ్ఏ

న్యూఢిల్లీ: ఆన్‌లైన్‌లో స్టాక్ రికమెండేషన్స్‌తోపాటు ఇతర ఆర్థిక సలహాలిచ్చే ఫైనాన్షియల్ ఇన్‌ఫ్లుయెన్సర్లలో (ఫిన్‌ఫ్లుయెన్సర్లు) 2 శాతం మంది మాత్రమే సెబీ వద్ద రిజిస్టర్ చేసుకున్నారని సీఎఫ్ఏ ఇన్‌స్టిట్యూట్ తాజా అధ్యయన నివేదిక వెల్లడించింది. కానీ, ఫిన్‌ఫ్లుయెన్సర్లలో 33 శాతం మంది ప్రత్యక్షంగా ఆయా కంపెనీల షేర్లను సిఫారసు చేస్తున్నారని తెలిపింది. వ్యక్తుల పెట్టుబడి నిర్ణయాలపై ఫిన్‌ఫ్లుయెన్సర్ల ప్రభావం పెరుగుతుండటంపై ఆ నివేదికలో ఆందోళన వ్యక్తం చేశారు. ఫిన్‌ఫ్లుయెన్సర్లపై నియంత్రణ కొరవడిందని, వారిలో జవాబుదారీతనం లోపించిందని పేర్కొన్నారు. 63 శాతం మంది ఫిన్‌ఫ్లుయెన్సర్లు తమ స్పాన్సర్ల వివరాలను, వారితో తమకున్న ఆర్థిక అనుబంధాన్ని పూర్తిగా బహిర్గతం చేయడం లేదని సీఎఫ్ఏ అధ్యయనంలో తేలింది. ఇది ఫిన్‌ఫ్లుయెన్సర్లు-స్పాన్సర్ల మధ్య పరస్పర ప్రయోజనాలున్నాయన్న సందేహాలకు తావివ్వడంతోపాటు ఇన్వెస్టర్లను ఉద్దేశపూర్వకంగా తప్పుదోవ పట్టిస్తున్నారనే అనుమానాలు రేకెత్తిస్తోందని సీఎఫ్ఏ అభిప్రాయపడింది.

టాటా ఆటోకాంప్ గూటికి స్వీడన్ కంపెనీ

న్యూఢిల్లీ: ఇంటర్నేషనల్ ఆటోమోటివ్ కాంపొనెంట్స్ గ్రూప్ స్వీడన్ ఏబీని (ఐఏసీ స్వీడన్) కొనుగోలు చేస్తున్నట్లు టాటా ఆటోకాంప్ సిస్టమ్స్ లిమిటెడ్ సోమవారం ప్రకటించింది. ఎంతకు కొనుగోలు చేయనున్న విషయాన్ని మాత్రం వెల్లడించలేదు. టాటా ఆటోకాంప్ ఐరోపా ఆటోమోటివ్ రంగంలో బలపడేందుకు ఈ డీల్ దోహదపడనుంది. 80 కోట్ల డాలర్ల టర్నోవర్ కలిగిన ఐఏసీ స్వీడన్.. వాహన రంగానికి అవసరమైన ఇంటీరియర్ సిస్టమ్స్, విడిభాగాలను తయారు చేస్తుంది.

ఆర్థిక కార్యదర్శిగా అజయ్ సేథ్

న్యూఢిల్లీ: ఆర్థిక శాఖ కార్యదర్శిగా సీనియర్ అధికారి అజయ్ సేథ్‌ను నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసింది. అజయ్ సేథ్ 1987 బ్యాచ్, కర్ణాటకకు చెందిన ఐఏఎస్ అధికారి. ఆయన ప్రస్తుతం ఆర్థిక వ్యవహారాల శాఖలో కార్యదర్శిగా పనిచేస్తున్నారు. ఇదివరకు ఆర్థిక కార్యదర్శిగా ఉన్న తుహిన్‌కాంత్ పాండేను ఇటీవల సెబీ చైర్మన్‌గా నియమించడంతో ఏర్పడిన ఖాళీని ప్రభుత్వం అజయ్ సేథ్ నియామకంతో భర్తీ చేసింది.

స్పోర్ట్స్

అరుంధతికి వార్షిక కాంట్రాక్ట్

'ఏ'లోనే హర్మన్, మంధాన, దీప్తి



న్యూఢిల్లీ: భారత మహిళల క్రికెట్‌కు సంబంధించి ఈ ఏడాది సెంట్రల్ కాంట్రాక్ట్ జాబితాను బీసీసీఐ సోమవారం వెల్లడించింది. మూడు గ్రూపుల్లో మొత్తంగా 16 మందికి చోటు దక్కగా, ఆరుగురిపై వేటు పడింది. కొత్తగా ఐదుగురికి అవకాశం కల్పించారు. 2022-23 తర్వాత బోర్డు వార్షిక కాంట్రాక్టులను ప్రకటించడం మళ్లీ ఇప్పుడే. వీరిలో గ్రేడ్ ఎ ప్లేయర్లకు మ్యాచ్ ఫీజులు కాకుండా రూ. 50 లక్షలు, బి గ్రేడ్ వారికి రూ. 30 లక్షలు, సి గ్రేడ్‌కు రూ 10 లక్షలు లభిస్తాయి. ఇందులో తెలుగు పేసర్ అరుంధతి రెడ్డికి గ్రేడ్ 'సి'లో చోటు దక్కింది. మరోవైపు గ్రేడ్ 'ఎ'లో కెప్టెన్ హర్మన్‌ప్రీత్, స్మృతి మంధాన, దీప్తి శర్మ స్థానాల్లో మార్పు లేదు. గ్రేడ్ 'బి'లో రాజేశ్వరి గైక్వాడ్ చోటు కోల్పోగా.. రేణుకా సింగ్, జెమీమా, షఫాలీ, రిచా ఘోష్ కొనసాగుతున్నారు. ఇక గ్రేడ్ 'సి'లో అరుంధతి, శ్రేయాంక పాటిల్, టిటాస్ సాధు, అమన్‌జోత్ కౌర్, ఉమా ఛెత్రిలకు తొలిసారి అవకాశం ఇవ్వగా.. యాస్తిక భాటియా, రాధా యాదవ్, పూజా వస్త్రాకర్, స్నేహ్ రాణా తమ చోటును కాపాడుకున్నారు. అయితే ఈ గ్రేడ్ నుంచి ఆంధ్ర క్రికెటర్ సబ్బినేని మేఘన, హర్లీన్ డియోల్, దేవికా వైద్య, అంజలి శర్వాణి, మేఘనా సింగ్‌లకు ఉద్వాసన పలికారు.

షట్లర్ సుమిత్ రిటైర్



న్యూఢిల్లీ: బ్యాడ్మింటన్ డబుల్స్ క్రీడాకారుడు బి. సుమిత్ రెడ్డి ఆటకు వీడ్కోలు పలికాడు. ఇకనుంచి పూర్తిగా కోచింగ్‌పైనే దృష్టి సారించాలనుకుంటున్నానని హైదరాబాద్‌కు చెందిన 33 ఏళ్ల సుమిత్ సోషల్ మీడియాలో ప్రకటించాడు. 2022 కామన్వెల్త్ క్రీడల మిక్స్‌డ్ టీమ్ రజత పతక విజేత అయిన సుమిత్.. డబుల్స్ షట్లర్ సిక్కిరెడ్డి భర్త. సిక్కితో పాటు అశ్వినీ పొన్నప్పలాంటి స్టార్ షట్లర్లతో కలిసి ఎన్నో మిక్స్‌డ్ మ్యాచ్‌లు ఆడిన సుమిత్.. పురుషుల డబుల్స్‌లో మను అత్రి జతగా అంతర్జాతీయస్థాయిలో రాణించాడు. 2015లో మెక్సికో సిటీ గ్రాండ్ ప్రీ, 2016లో కెనడా ఓపెన్ డబుల్స్ టైటిళ్లు నెగ్గిన సుమిత్.. 2015లో యూఎస్, డచ్ ఓపెన్ టోర్నీల్లో రన్నరప్‌గా నిలిచాడు. 2016 రియో ఒలింపిక్స్‌లోనూ పాల్గొన్న సుమిత్.. కెరీర్‌లో అత్యుత్తమంగా 17వ ర్యాంక్ అందుకున్నాడు. 2021లో భార్య సిక్కిరెడ్డితో కలిసి హైదరాబాద్‌లో బ్యాడ్మింటన్ అకాడమీ ఏర్పాటు చేసిన సుమిత్.. చిన్నారులకు శిక్షణ ఇస్తున్నాడు.

ధోనీ.. 0.12 సెకన్లలోనే



చెన్నై: వికెట్ల వెనకాల ఎంఎస్ ధోనీ ఉంటే క్రీజులో బ్యాటర్లు ఎంత జాగ్రత్తగా ఉండాలో మరోసారి తెలిసొచ్చింది. ఆదివారం ముంబైతో మ్యాచ్‌లో 43 ఏళ్ల ధోనీ మెరుపు స్టంపింగ్ చూసి క్రికెట్ ప్రేమికులు మంత్రముగ్ధులయ్యారు. 11వ ఓవర్‌లో స్పిన్నర్ నూర్ అహ్మద్ వేసిన బంతిని సూర్యకుమార్ షాట్ ఆడాలని చూసినా విఫలమయ్యాడు. అటు ధోనీ కేవలం 0.12 సెకన్లలోనే ఆ బాల్‌ను అందుకుని బెయిల్స్ గిరాటేశాడు.

తమీమ్‌కు గుండెపోటు



ఢాకా: బంగ్లాదేశ్ మాజీ కెప్టెన్ తమీమ్ ఇక్బాల్ (36) తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. ఢాకా ప్రీమియర్ డివిజన్ క్రికెట్ లీగ్‌లో ఆడుతుండగా అతడికి గుండెపోటు రావడంతో హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు. వైద్యులు తమీమ్‌కు స్టెంట్ వేసి రక్తనాళాల్లో ఉన్న అడ్డంకిని తొలగించారు. ప్రస్తుతం అతని పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు చెప్పారు. షైన్‌పుకార్ క్రికెట్ క్లబ్‌తో మ్యాచ్‌లో మహ్మడెన్ స్పోర్ట్స్ క్లబ్‌కు సారథ్యం వహిస్తున్న తమీమ్ ఫీల్డింగ్ చేస్తుండగా ఛాతీలో అసౌకర్యంగా ఉండడంతో మ్యాచ్ మధ్యలోనే ఆసుపత్రికి తీసుకెళ్లి పరీక్షలు నిర్వహించారు. ఎయిర్ అంబులెన్స్‌లో మరో ఆసుపత్రికి తరలించాలనుకొనేలోపు మరోసారి తీవ్రమైన గుండెపోటు రావడంతో విపత్కర పరిస్థితుల్లో అక్కడే ఉంచి సర్జరీ చేయించారు. తమీమ్ స్పృహలోకి వచ్చాడని బీసీబీ చీఫ్ ఫిజీషియన్ దేబాశిష్ చౌదరి తెలిపాడు. బంగ్లా తరఫున తమీమ్ 70 టెస్టులు, 243 వన్డేలు, 78 టీ20లు ఆడాడు.

ఢిల్లీ వదల్లేదు

అశుతోష్, విప్రజ్ మెరుపు ఇన్నింగ్స్

లఖ్‌నవూపై ఉత్కంఠ విజయం ● పూరన్, మార్ష్ అర్ధ సెంచరీలు

ఢిల్లీ ముందు 210 పరుగుల లక్ష్యం.. తొలి ఓవర్‌లోనే రెండు వికెట్లు ఫట్.. ఓ దశలో స్కోరు 65/5. ఇంకేం.. లఖ్‌నవూ విజయం నల్లేరుపై నడకే అనుకున్నారంతా. కానీ మిడిలార్డర్ పట్టు వదల్లేదు. ఆశలు లేని స్థితిలో అరంగేట్ర బ్యాటర్ విప్రజ్ నిగమ్ అనూహ్య ఆటతీరుతో ఢిల్లీ అనూహ్యంగా పోటీలోకొచ్చింది. కీలక దశలో అతను నిష్క్రమించినా చివర్లో అశుతోష్ విధ్వంసానికి విశాఖ స్టేడియం హోరెత్తింది. దీంతో ఆఖరి ఓవర్‌లో మరో మూడు బంతులుండగానే మ్యాచ్‌కు ఢిల్లీ అద్భుతమైన ముగింపునిచ్చింది. అటు లఖ్‌నవూకు మాత్రం నిరాశే మిగిలింది.



అశుతోష్ (31 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 66 నాటౌట్)

విశాఖపట్నం: ఐపీఎల్-18లో ఢిల్లీ క్యాపిటల్స్ అదిరే బోణీ చేసింది. సోమవారం సాగర తీరాన అత్యంత ఉత్కంఠభరితంగా సాగిన ఈ మ్యాచ్‌లో లఖ్‌నవూ సూపర్ జెయింట్స్‌పై వికెట్ తేడాతో ఢిల్లీ నెగ్గింది. చివర్లో ఇరు జట్ల మధ్య విజయం దోబూచులాడినా అశుతోష్ శర్మ (31 బంతుల్లో 5 ఫోర్లు, 5 సిక్సర్లతో 66 నాటౌట్) తుదికంటా నిలిచి ఢిల్లీని గట్టెక్కించాడు. అతడికి విప్రజ్ నిగమ్ (15 బంతుల్లో 5 ఫోర్లు, 2 సిక్సర్లతో 39), స్టబ్స్ (22 బంతుల్లో 1 ఫోర్, 3 సిక్సర్లతో 34) సహకరించారు. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ 20 ఓవర్లలో 8 వికెట్లకు 209 పరుగులు చేసింది. నికోలస్ పూరన్ (30 బంతుల్లో 6 ఫోర్లు, 7 సిక్సర్లతో 75), మిచెల్ మార్ష్ (36 బంతుల్లో 6 ఫోర్లు, 6 సిక్సర్లతో 72) తుఫాన్ ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నారు. స్టార్క్‌కు మూడు, కుల్దీప్‌నకు రెండు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఢిల్లీ 19.3 ఓవర్లలో 9 వికెట్లకు 211 పరుగులు చేసి నెగ్గింది. శార్దూల్, సిద్దార్థ్, దిగ్వేష్, బిష్ణోయ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా అశుతోష్ నిలిచాడు. కాగా, ఐపీఎల్‌లో ఢిల్లీకిదే అత్యధిక ఛేదన కావడం విశేషం.

దంచేసిన 'మిడిల్': భారీ ఛేదనలో ఢిల్లీని ఓటమి అంచుల నుంచి మిడిలార్డర్ బ్యాటర్లు విజయతీరాలకు చేర్చారు. విప్రజ్, అశుతోష్ అదుర్స్ ఆటతీరుతో ఎల్ఎస్‌జీ బౌలర్లను ఆడేసుకున్నారు. అయితే తొలి ఓవర్‌లోనే ఓపెనర్ మెక్‌గుర్క్ (1), అభిషేక్ పోరెల్ (0)లను పేసర్ శార్దూల్ పెవిలియన్‌కు చేర్చాడు. తర్వాతి ఓవర్‌లోనే సమీర్ రిజ్వీ (4)ని స్పిన్నర్ సిద్దార్థ్ అవుట్ చేయడంతో 7 పరుగులకు ఢిల్లీ మూడు వికెట్లు కోల్పోయింది. ఈ దశలో అక్షర్ (22), డుప్లెసి (29) నాలుగో వికెట్‌కు 43 పరుగులు జత చేశారు. స్వల్ప వ్యవధిలోనే ఈ ఇద్దరూ పెవిలియన్‌కు చేరడంతో 65/5 స్కోరుతో ఢిల్లీ మరింత ఇబ్బందుల్లో పడింది. కానీ ఆ తర్వాత బ్యాటర్లు ఎదురుదాడికి దిగి లఖ్‌నవూకు ఓటమి భయాన్ని రుచి చూపించారు. ముందుగా స్టబ్స్ భారీ షాట్లతో చెలరేగి ఆరో వికెట్‌కు అశుతోష్‌తో కలిసి 48 పరుగులు జత చేశాడు. 13వ ఓవర్‌లో స్టబ్స్ రెండు సిక్సర్లు బాది వెంటనే అవుటయ్యాడు. అనంతరం అశుతోష్‌కు జత కలిసిన విప్రజ్ అనూహ్య రీతిలో చెలరేగాడు. ప్రతీ బంతిని బాదేస్తూ వేగంగా పరుగులు రాబట్టాడు. 14వ ఓవర్‌లో 4,4,6తో 17 రన్స్ అందించాడు. 16వ ఓవర్‌లో అశుతోష్ 6,4.. విప్రజ్ 4,4తో 20 రన్స్ వచ్చాయి. దీంతో ఒక్కసారిగా లఖ్‌నవూ శిబిరంలో ఆందోళన నెలకొంది. అయితే 4 ఓవర్లలో 42 పరుగులు కావాల్సి ఉన్న దశలో విప్రజ్ వెనుదిరగడంతో లఖ్‌నవూ పోటీలోకొచ్చింది. కానీ అశుతోష్ 18వ ఓవర్‌లో 6,4,6తో 17 రన్స్ అందించడంతో మళ్లీ సీన్ మారింది. 19వ ఓవర్‌లో కుల్దీప్ (5) రనౌటైనా అశుతోష్ 6,4తో 16 రన్స్ వచ్చాయి. ఇక ఆరు బంతుల్లో ఆరు పరుగులు కావాల్సిన వేళ అశుతోష్ సిక్సర్‌తో మ్యాచ్‌ను ముగించాడు.



ఆరంభం బాగున్నా..: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన లఖ్‌నవూ ఆరంభంలో మెరుపు బ్యాటింగ్ కనబర్చగా.. డెత్ ఓవర్లలో తడబడింది. ఓపెనర్ మిచెల్ మార్ష్, నికోలస్ పూరన్‌ల విధ్వంసానికి 250+ స్కోరు ఖాయమనుకున్న చోట అతికష్టంగా 200 రన్స్ చేరగలిగింది. మూడో ఓవర్‌లోనే మార్ష్ 6,4,6,4తో పేసర్ స్టార్క్‌కు చుక్కలు చూపించాడు. మరో ఓపెనర్ మార్‌క్రమ్ (15) ఐదో ఓవర్‌లో వెనుదిరిగినా.. పవర్‌ప్లేలో జట్టు 64/1 స్కోరుతో నిలిచింది. అటు 21 బంతుల్లోనే మార్ష్ హాఫ్ సెంచరీ పూర్తయ్యింది. ఇక వన్‌డౌన్‌లో బరిలోకి దిగిన పూరన్ సైతం ఎదురుదాడికి దిగి ఏడో ఓవర్‌లో మూడు సిక్సర్లతో చెలరేగాడు. అయితే అతడి సులువైన క్యాచ్‌ను రిజ్వీ వదిలేశాడు. ఈ ఓవర్‌లో 25 పరుగులు రావడం విశేషం. ఈ ఇద్దరి దూకుడుతో లఖ్‌నవూ జట్టు పదో ఓవర్‌లోనే 108 రన్స్ సాధించింది. అయితే 12వ ఓవర్‌లో మార్ష్ క్యాచ్‌ను లాంగాన్‌లో స్టబ్స్ పట్టేయడంతో రెండో వికెట్‌కు 87 పరుగుల భాగస్వామ్యం ముగిసింది. అటు పూరన్ మాత్రం తర్వాతి ఓవర్‌లోనే వరుసగా 6,6,6,6,4తో ఏకంగా 28 పరుగులు రాబట్టాడు. అలాగే 24 బంతుల్లోనే అతడి హాఫ్ సెంచరీ పూర్తయ్యింది. అయితే పంత్ లఖ్‌నవూ అరంగేట్రం డకౌట్‌తో ముగిసింది. లీగ్‌లోనే అత్యంత ఖరీదైన ఈ ఆటగాడిని 14వ ఓవర్‌లో కుల్దీప్ దెబ్బతీశాడు. ఆ వెంటనే ప్రమాదకర పూరన్‌ను స్టార్క్ బౌల్డ్ చేయడంతో లఖ్‌నవూ బ్యాటింగ్ లయ తప్పింది. చివరి ఐదు ఓవర్లలో 39 పరుగులే చేసి నాలుగు వికెట్లు కోల్పోయింది. ఇందులో ఆఖరి ఓవర్‌లోనే మిల్లర్ (27 నాటౌట్) రెండు సిక్సర్లతో 15 రన్స్ ఉండడం గమనార్హం.

నేటి మ్యాచ్

గుజరాత్ x పంజాబ్ — వేదిక: అహ్మదాబాద్ — రా.7.30 నుంచి

స్కోరుబోర్డు

లఖ్‌నవూ: మార్‌క్రమ్ (సి) స్టార్క్ (బి) విప్రజ్ 15, మిచెల్ మార్ష్ (సి) స్టబ్స్ (బి) ముకేశ్ 72, పూరన్ (బి) స్టార్క్ 75, పంత్ (సి) డుప్లెసి (బి) కుల్దీప్ 0, మిల్లర్ (నాటౌట్) 27, బదోని (సి) స్టబ్స్ (బి) కుల్దీప్ 4, శార్దూల్ (రనౌట్) 0, షాబాజ్ (సి/సబ్) విజయ్ (బి) స్టార్క్ 9, బిష్ణోయ్ (బి) స్టార్క్ 0, దిగ్వేశ్ రాఠి (నాటౌట్) 0, **ఎక్స్‌ట్రాలు: 7; మొత్తం: 20 ఓవర్లలో 209/8; వికెట్ల పతనం:** 1-46, 2-133, 3-161, 4-169, 5-177, 6-177, 7-194, 8-194; **బౌలింగ్:** స్టార్క్ 4-0-42-3, అక్షర్ పటేల్ 3-0-18-0, విప్రజ్ నిగమ్ 2-0-35-1, ముకేశ్ కుమార్ 2-0-22-1, కుల్దీప్ యాదవ్ 4-0-20-2, మోహిత్ శర్మ 4-0-42-0, స్టబ్స్ 1-0-28-0.

ఢిల్లీ: మెక్‌గుర్క్ (సి) బదోని (బి) శార్దూల్ 1, డుప్లెసి (సి) మిల్లర్ (బి) బిష్ణోయ్ 29, అభిషేక్ పోరెల్ (సి) పూరన్ (బి) శార్దూల్ 0, సమీర్ రిజ్వీ (సి) పంత్ (బి) సిద్దార్థ్ 4, అక్షర్ (సి) పూరన్ (బి) రాఠి 22, స్టబ్స్ (బి) సిద్దార్థ్ 34, అశుతోష్ శర్మ (నాటౌట్) 66, విప్రజ్ నిగమ్ (సి) సిద్దార్థ్ (బి) రాఠి 39, మిచెల్ స్టార్క్ (సి) పంత్ (బి) బిష్ణోయ్ 2, కుల్దీప్ (రనౌట్) 5, మోహిత్ (నాటౌట్) 1, **ఎక్స్‌ట్రాలు: 8; మొత్తం: 19.3 ఓవర్లలో 211/9; వికెట్ల పతనం:** 1-2, 2-2, 3-7, 4-50, 5-65, 6-113, 7-168, 8-171, 9-192; **బౌలింగ్:** శార్దూల్ ఠాకూర్ 2-0-19-2, సిద్దార్థ్ 4-0-39-2, దిగ్వేశ్ రాఠి 4-0-31-2, రవి బిష్ణోయ్ 4-0-53-2, ప్రిన్స్ యాదవ్ 4-0-47-0, షాబాజ్‌తి అహ్మద్ 1.3-0-22-0.

హెచ్‌సీయూ భూములను ముట్టుకోం

» కబ్జాలను నిలువరించేందుకే హైడ్రా: శ్రీధర్ బాబు

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ భూములను ఒక్క అంగుళం కూడా తీసుకోబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. శాసనసభలో మజ్లిస్ ఎమ్మెల్యే అక్బరుద్దీన్ లేవనెత్తిన అంశంపై మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడారు. అక్కడున్న రెండు చెరువులు, రాక్ హిల్స్‌ను సర్కారు పరిరక్షిస్తుందని వెల్లడించారు. హెచ్‌సీయూ భూములను ప్రొటెక్టు చేస్తామన్నారు. రియల్ ఎస్టేట్ మందగమనానికి, హైడ్రాకు ఏమాత్రం సంబంధం లేదన్నారు. ప్రభుత్వ భూముల ఆక్రమణలకు సంబంధించి ప్రజావాణిలో 9,078 ఫిర్యాదులు వచ్చాయని, కబ్జాలను నిలువరించేందుకే హైడ్రాను ఏర్పాటు చేశామన్నారు. హైడ్రా కార్యాలయం వద్ద ఉదయం ఆరు గంటల నుంచే ప్రజలు వేచి ఉంటున్నారని, కబ్జాలతో పాటు ఇతర సమస్యలపై ఫిర్యాదులు చేస్తున్నారని చెప్పారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం: తుమ్మల



అకాల వర్షాలు, వడగళ్ల వానలకు పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం అందిస్తామని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. జీరో అవర్‌లో పలువురు సభ్యులు మాట్లాడుతూ.. అకాల వర్షాలతో నష్టపోయిన రైతుల్ని ఆదుకోవాలని కోరారు. దీనిపై మంత్రి తుమ్మల కలుగజేసుకుని.. నష్టపోయిన రైతుల్ని ఆదుకుంటామని, పంట నష్టం అంచనాలకు అధికారుల్ని ఆదేశించామని చెప్పారు. ఇదే విషయమై మంత్రి ప్రకటన కూడా విడుదల చేశారు. నష్టపోయిన పంటలపై ప్రాథమిక నివేదిక వచ్చిందని పూర్తిస్థాయిలో సర్వే నివేదిక రాగానే రైతులకు నష్ట పరిహారం పంపిణీ చేస్తామని తెలిపారు. ప్రాథమిక నివేదిక మేరకు.. 13 జిల్లాల్లో 64 మండలాల్లో 11,298 ఎకరాల్లో పంట నష్టం జరిగిందన్నారు. రైతుల వారీగా సర్వే చేసి తుది నివేదిక రూపొందించాలని అధికారులను ఆదేశించామన్నారు.

నేను మీ స్నేహితుడ్ని.. కాదు అన్నవి!

» సభలో కూనంనేని వ్యాఖ్యలకు సీతక్క బదులు



హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో పద్దులపై చర్చ సందర్భంగా పంచాయతీ కార్మికుల సమస్యలు, ఇతర అంశాలపై సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు మాట్లాడారు. పంచాయతీ కార్మికులకు గత నాలుగైదు నెలలుగా జీతాలు అందడం లేదన్నారు. సభలో ఉన్న మంత్రి సీతక్క కల్పించుకుని అలాంటిదేమీ లేదని, చెల్లింపులు చేశామని చెప్పారు. అయితే తనకు సమాచారం ఉన్నంతవరకు ఆదివారం ఉదయం వరకు జీతాలు రాలేదని.. ఒకవేళ వస్తే సంతోషిస్తానని కూనంనేని చెప్పారు. 'నేను మీ స్నేహితుడ్ని.. వారికి వేతనాలు వస్తే సంతోషం' అని వ్యాఖ్యానించారు. మంత్రి సీతక్క కల్పించుకుని 'కాదు.. అన్నవి' అంటూ బదులిచ్చారు.

వివేక్-బాల్క సుమన్.. మధ్యలో కేటీఆర్!

అసెంబ్లీ లాబీల్లో సోమవారం ఆసక్తికర సన్నివేశం చోటుచేసుకుంది. చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్, ప్రస్తుత ఎమ్మెల్యే వివేక్‌లు కొద్దిసేపు ముచ్చటించుకున్నారు. వారి మధ్య సరదా సంభాషణ కొనసాగుతుండగా, అటుగా వచ్చిన బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అది చూసి ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సర్‌ప్రైజ్.. అంటూ ఆయన వారిని పలకరించారు.

మిగిలిన పంటలైనా దక్కేలా చూడండి: పల్లా

జనగామ ప్రాంతానికి సరిగ్గా నీరు అందకపోవడంతో పంటలు ఎండిపోతున్నాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ జీరో అవర్‌లో ఆయన మాట్లాడుతూ.. సమ్మక్క సాగర్ నుంచి మొదలు భీంఘన్‌పూర్ నుంచి చలివాగు ద్వారా ధర్మసాగర్ చేరి నాలుగు పంపుల ద్వారా నీళ్లు అందుతాయని.. ప్రస్తుతం రోజూ ఒక్క పంపు మాత్రమే నడుస్తుండటంతో సగం పంటలు ఎండిపోయాయని చెప్పారు. నాలుగు పంపుల్ని ఆన్ చేస్తే మిగిలిన 50 శాతం పంటలైనా దక్కుతాయన్నారు.

బీఆర్ఎస్ పాలనలో 50% చెరువుల కబ్జా

» బాధ్యులపై చర్యలు తీసుకోవాలి: మల్‌రెడ్డి రంగారెడ్డి

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో హైదరాబాద్ పరిధిలోని 50శాతం చెరువులు, కుంటలు కబ్జాకు గురయ్యాయని కాంగ్రెస్ సభ్యుడు మల్‌రెడ్డి రంగారెడ్డి ఆరోపించారు. చెరువులు, కుంటల్లో నిర్మాణాలకు యథేచ్ఛగా అనుమతులిచ్చారని విమర్శించారు. ధరణి పోర్టల్ ద్వారా ఇష్టారాజ్యంగా భూరికార్డులను మార్చేసి, పెద్దఎత్తున ప్రభుత్వ భూములను కబ్జా చేశారని మండిపడ్డారు. రంగారెడ్డి కలెక్టరేట్ ఎదుట 94ఎకరాల రికార్డులు మార్చి, భూములు కబ్జా చేశారన్నారు. కబ్జాకు గురైన చెరువులతోపాటు ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకోవడంతో బాధ్యులపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్‌చేశారు.

ఫిషరీస్, ఎర్త్ సైన్స్ వర్సిటీలను ఏర్పాటు చేయాలి

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): జుక్కల్‌లో ఫిషరీస్ యూనివర్శిటీని ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు విజ్ఞప్తి చేశారు. ఏజెన్సీ ప్రాంతమైన భద్రాద్రి జిల్లాలో ఎర్త్ సైన్స్ యూనివర్శిటీ ఏర్పాటు చేయాలని పినపాక ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. తన నియోజకవర్గం పరిధిలోని ఆళ్లపల్లి నుంచి కొత్తగూడెం వరకు రెండు లేన్ల రోడ్డును నిర్మించాలన్నారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ.. గత ప్రభుత్వ హయాంలో ఎర్రజొన్న, పసుపు రైతులు గిట్టుబాటు ధర కోసం ధర్నాలు చేయడంతో కేసులు పెట్టారని, వాటిని ఎత్తివేయాలని కోరారు. నిజామాబాద్ జిల్లాలో వ్యవసాయ కళాశాల ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

రుణమాఫీపై బీఆర్ఎస్, బీజేపీ సభ్యుల నిరసన

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రుణ మాఫీ హామీని ప్రభుత్వం విస్మరించిందంటూ బీఆర్ఎస్, బీజేపీ సభ్యులు అసెంబ్లీలో నిరసన వ్యక్తం చేశారు. సభ ప్రారంభం కాగానే బీఆర్ఎస్ సభ్యులు నల్లబ్యాడ్జీలు ధరించి.. సభలోకి వచ్చారు. ప్లకార్డులు పట్టుకొని, రూ.2 లక్షలపైన రుణమాఫీ చేయాల్సిందేనంటూ నినాదాలు చేశారు. దీనికి బీజేపీ సభ్యులు మద్దతు తెలుపుతూ కలిసి నినాదాలు చేశారు.ఇచ్చిన మాట ప్రకారం రూ.2లక్షల్లోపు పంట రుణాలను మాఫీ చేశామని, రూ.2లక్షల పైన ఉన్న రుణాల మాఫీ ఉండదని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం శాసనసభలో చేసిన ప్రకటనకు నిరసనగా రెండు పార్టీలు ఆందోళనలో పాల్గొన్నాయి. కాగా, రూ.2లక్షల రుణ మాఫీని సంపూర్ణంగా చేయాలని హరీశ్‌రావు ఇచ్చిన వాయిదా ప్రతిపాదనను తిరస్కరిస్తున్నట్టు స్పీకర్ ప్రకటించారు.

ఓవర్సీస్ స్కాలర్‌షిప్ దుర్వినియోగం: అక్బరుద్దీన్

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థులకు అందాల్సిన ఓవర్సీస్ స్కాలర్‌షిప్ పథకం దుర్వినియోగమవుతోందని, పెద్దపెద్ద భవంతులున్న ధనికులు సైతం ఈబీసీల పేరిట ఓవర్సీస్, ఇతర స్కాలర్‌షిప్‌లు పొందుతున్నారని మజ్లిస్ శాసనసభ పక్ష నేత అక్బరుద్దీన్ పేర్కొన్నారు. ఈ పథకానికి అర్హులెవరన్న అంశాన్ని తేల్చాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడ్డారు. దీనిపై అఖిల పక్ష సమావేశాన్ని ఏర్పాటు చేసి, విధివిధానాలపై చర్చించాలని డిమాండ్ చేశారు. హైడ్రా వల్ల హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ దెబ్బతిన్నదని, దీనిపై సమీక్షించాలని సూచించారు. హెచ్‌సీయూ భూములను అమ్మవద్దని కోరారు.

నా సస్పెన్షన్‌పై బులెటిన్ ఇవ్వండి: జగదీశ్‌రెడ్డి

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తన సస్పెన్షన్‌పై అధికారిక బులెటిన్ ఇవ్వాలని బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను కోరారు. వారం రోజులుగా బులెటిన్ గురించి అడుగుతున్నా స్పందన లేదని చెప్పారు. జగదీశ్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, హరీశ్, గంగుల కమలాకర్, కౌశిక్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి, పల్లా రాజేశ్వర్‌రెడ్డి తదితరులు సోమవారం స్పీకర్‌ను ఆయన ఛాంబర్‌లో కలిశారు. తనను అన్యాయంగా, ఏకపక్షంగా సభ నుంచి సస్పెండ్ చేశారని పేర్కొంటూ జగదీశ్ రెడ్డి.. స్పీకర్‌కు లేఖ అందజేశారు. తన సస్పెన్షన్‌పై బులెటిన్ విడుదల చేయడంతో పాటు అసెంబ్లీ వెబ్‌సైట్‌లో పెట్టాలని లేఖలో కోరారు. కాగా, సోమవారం ఉదయమే జగదీశ్‌రెడ్డి బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయానికి చేరుకోగా.. కొంతమంది మార్షల్స్ ఆయన్ను అడ్డుకున్నారు.

ప్రజా సమస్యలే 'ఆంధ్రజ్యోతి' ఎజెండా

» నిర్భయంగా రాయడం పత్రిక ప్రత్యేకత
» మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి
» నల్లగొండలో కార్ అండ్ బైక్ రేస్ డ్రా తీసిన మంత్రి
» ఖమ్మం, నిజామాబాద్‌లో డ్రా తీసిన కలెక్టర్లు

నల్లగొండ/ఖమ్మం కలెక్టరేట్/డిచ్‌పల్లి, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భయం లేకుండా, ప్రజా సమస్యలే ఎజెండాగా 'ఆంధ్రజ్యోతి' పత్రిక ముందుకు సాగుతోందని రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. తెలుగు రాష్ట్రాల్లో ఈ పత్రిక అగ్రస్థానానికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ప్రభుత్వంలో, ప్రతిపక్షంలో ఎవరున్నా భయపడకుండా.. ఉన్నది ఉన్నట్లు రాయడం 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకత అని కొనియాడారు. ఆంధ్రజ్యోతి 22వ వార్షికోత్సవం సందర్భంగా సోమవారం నల్లగొండ యూనిట్ కార్యాలయంలో జరిగిన కార్ అండ్ బైక్ రేస్ డ్రా కార్యక్రమానికి వెంకట్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేశారు. ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుతులకు సంబంధించి డ్రా తీశారు. విజేతలు కార్తీక్, వెంకటేశం, శంకర్‌రావుకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం వెంకట్‌రెడ్డి మాట్లాడారు. 'ఆంధ్రజ్యోతి' దినపత్రిక ఏటా అక్కా చెల్లెమ్మలకు సంక్రాంతి పండుగ సందర్భంగా ముగ్గుల పోటీలను నిర్వహించడంతో పాటు తెలుగు రాష్ట్రాల్లోని పాఠకులకు రూ.కోటి బహుమతులు అందజేయడం హర్షించదగిన విషయమన్నారు. ఈ సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ఎండీ రాధాకృష్ణకు శుభాకాంక్షలు తెలిపారు. విశ్వసనీయ వార్తలతోనే పత్రికలను ప్రజలు ఆదరిస్తారని.. పత్రికలు ప్రజలకు సమాచార వేదికలుగా పనిచేయాలని ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. సమాజంలో విలువలు, విశ్వసనీయత, నిజాయితీని ఆంధ్రజ్యోతి పత్రిక కాపాడుతోందని అభినందించారు.



నల్లగొండ 'ఆంధ్రజ్యోతి' కార్యాలయంలో డ్రా తీసి మొదటి బహుమతి విజేతకు ఫోన్‌లో అభినందనలు తెలుపుతున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

ఖమ్మంలోని ఆంధ్రజ్యోతి యూనిట్ కార్యాలయంలో సోమవారం ఆంధ్రజ్యోతి జిల్లా స్థాయి లక్కీడ్రా కార్యక్రమంలో కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. విజేతలు తాటి రాజశేఖర్, వెలిశాల శివరాణి, కొమ్ము భవానిరాజ్‌కు ఫోన్ చేసి అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. అధికారులకు మార్గదర్శకంగా పత్రికలు పనిచేయాలని సూచించారు. సమాజంలో తనదైన పాత్రను పోషిస్తున్న ఆంధ్రజ్యోతికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. దమ్మున్న వార్తలు 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేకమని నిజామాబాద్ జిల్లా అడిషనల్ కలెక్టర్ కిరణ్ కుమార్ అన్నారు. నిజామాబాద్ జిల్లా డిచ్‌పల్లి మండలం ధర్మారం (బి) శివారులోని 'ఆంధ్రజ్యోతి' యూనిట్ కార్యాలయంలో 'ఆంధ్రజ్యోతి కార్ అండ్ బైక్ రేస్' కూపన్ల డ్రా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా వేలాదిగా వచ్చిన కూపన్ల నుంచి మొదటి బహుమతి విజేతను ఎంపిక చేశారు. ఎడపల్లికి చెందిన తిరునగరి వెంకటరమణకు ఫోన్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కిరణ్ కుమార్ మాట్లాడారు. నిజాలను నిర్భయంగా రాస్తూ దమ్మున్న పత్రికగా 'ఆంధ్రజ్యోతి'కి పేరు ఉందన్నారు. పాఠకులకు బహుమతులు ఇచ్చే గొప్ప సంప్రదాయాన్ని 'ఆంధ్రజ్యోతి' కొనసాగించడం అభినందనీయమన్నారు.

2లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం

అవన్నీ త్వరలోనే వాస్తవరూపం దాలుస్తాయి.. యువతకు 91 వేల ఉద్యోగాలు లభిస్తాయి

» బీఆర్ఎస్ హయాంలో పడిపోయిన ఐటీ ఎగుమతులు.. మేం వచ్చాక పెరిగాయి
» మూసీ సుందరీకరణ కాదు.. పునరుజ్జీవం
» శాసనసభలో మంత్రి శ్రీధర్‌బాబు

హైదరాబాద్, మార్చి 24, (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పారిశ్రామిక, ఐటీ రంగంలో రూ.2 లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షించామని ఆ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. అవన్నీ వాస్తవరూపం దాల్చనున్నాయని, ఫలితంగా దాదాపు 91 వేల ఉద్యోగాలు కల్పించనున్నామని చెప్పారు. టీజీ-ఐపాస్ గణాంకాల ప్రకారం ఇప్పటికే కొత్తగా 2,332 పరిశ్రమలకు అనుమతులు ఇచ్చామన్నారు. వీటి ద్వారా రూ.23,608 కోట్ల పెట్టుబడులు రాగా, 69,900 ఉద్యోగ అవకాశాలు అభిస్తాయని పేర్కొన్నారు. సోమవారం శాసనసభలో పరిశ్రమలు, ఐటీ, పురపాలక శాఖలకు సంబంధించి చర్చలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానమిచ్చారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం హయాంలో ఐటీ ఎగుమతులు 31 శాతం నుంచి 11 శాతానికి పడిపోయాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో ఎగుమతులు ఎంత ఉన్నాయనేది త్వరలో రాబోయే ప్రగతి నివేదికలో తెలుస్తుందన్నారు. ప్రస్తుతం ఐటీ ఎగుమతులు 26 శాతంగా ఉన్నాయని వెల్లడించారు. లైఫ్ సైన్సెస్ రంగంలో ఏడాదిలో రూ.36 వేల కోట్ల పెట్టుబడులతో దాదాపు 140కి పైగా కొత్త ప్రాజెక్టులను ఆకర్షించామని తెలిపారు. వీటిలో రూ.17 వేల కోట్లతో పలు ఫార్మా సంస్థలతో ఒప్పందాలు కూడా చేసుకున్నామని చెప్పారు.

కలెక్టర్‌ను చంపాలనుకున్నారు



రాష్ట్రానికి పెట్టుబడులు రావాలని తాము ప్రయత్నిస్తుంటే.. బీఆర్ఎస్ వాళ్లు మాత్రం కలెక్టర్‌నే చంపించేందుకు ప్రయత్నించారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. మూసీపై తమ ప్రభుత్వం చేపట్టిందని సుందరీకరణ కాదని, పునరుజ్జీవం అని చెప్పారు. హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్న 11 జిల్లాల్లోని 72 గ్రామాలను కలిపి హెచ్ఎండీఏ పరిధిని విస్తరించామని మంత్రి తెలిపారు. ఇక మెట్రో రైల్ రెండో దశ డీపీఆర్‌ను కేంద్రం అనుమతి కోసం పంపామన్నారు. ఇక మునిసిపల్ శాఖ ద్వారా జీఐఎస్ హబ్‌ను నెలకొల్పామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. దీని ద్వారా జీహెచ్ఎంసీ పరిధిలోని ఆస్తులు, సమగ్ర బేస్ రిపోర్టు, ఇంటింటి సర్వే నిర్వహించనున్నామన్నారు. నగరంలో ఆధునిక లైటింగ్ వ్యవస్థను, ఆధునిక టెక్నాలజీతో కూడిన సిగ్నలింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకురాబోతున్నట్లు తెలిపారు. రూ.17,212 కోట్ల వ్యయంతో నగరంలో 7,444 కి.మీ మేర మురుగునీటి పారుదల వ్యవస్థ ఏర్పాటుకు సమగ్ర ప్రణాళికలను సిద్ధం చేశామని మంత్రి శ్రీధర్‌బాబు చెప్పారు. రూ.1,964 కోట్లతో గోదావరి తాగునీటి సరఫరా ప్రాజెక్టు-1ని ప్రారంభించడం, రూ.1,700 కోట్లతో జీహెచ్ఎంసీ పరిధిలో నీటి సరఫరాకు అవసరమైన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. రూ.1,500 కోట్లతో రాష్ట్రంలో మిస్సింగ్ లింకు రహదారులను నిర్మించనున్నట్లు తెలిపారు. వరంగల్ అభివృద్ధి కోసం కూడా ప్రత్యేక చర్యలు తీసుకున్నామన్నారు.

మునిసిపాలిటీల ఏర్పాటు బిల్లుల ఆమోదం

ములుగు జిల్లాలో ములుగు, ఖమ్మం జిల్లాలో కల్లూరు, మేడ్చల్ జిల్లాలోని అలియాబాద్, మూడుచింతలపల్లి, ఎల్లంపల్లి, కామారెడ్డి జిల్లాలోని బిచ్కుందను కలిపి మొత్తం 6 కొత్త మునిసిపాలిటీలను ఏర్పాటు చేసే బిల్లును శాసనసభ సోమవారం ఆమోదించింది. దీంతోపాటు కొత్తగూడెం నగరపాలక సంస్థను ఏర్పాటుచేసే బిల్లుకూ ఆమోదం తెలిపింది. మరోవైపు తెలంగాణ పంచాయతీరాజ్ చట్టంలోని 12,848 గ్రామ పంచాయతీల్లో నుంచి 79 పంచాయతీలను తొలగించి మునిసిపాలిటీల్లో కలిపే బిల్లునూ ఆమోదించింది.

రియల్ ఎస్టేట్ కంపెనీలా ఐఐసీ: ఏలేటి

టీజీఐఐసీ రియల్ ఎస్టేట్ కంపెనీలా వ్యవహరిస్తున్నట్లు కనిపిస్తోందని బీజేపీఎల్పీ నేత ఏలేటి మహేశ్వరరెడ్డి ఆరోపించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టడానికి ప్రభుత్వం ఎంచుకున్న మార్గమేంటో తెలియడంలేదన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక సుమారు 6లక్షల పెళ్లిళ్లయ్యాయని, వారందరికీ తులం బంగారం ఎప్పుడిస్తారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి ప్రశ్నించారు. ఎమ్మెల్యేలకు సాంస్కృతిక కార్యక్రమాలు, క్రీడా పోటీలు నిర్వహించాలని కాంగ్రెస్ ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కోరారు.

కేసీఆర్ విషయంలో మౌనమేల..?

» ఆయన దొంగనోట్లు ముద్రిస్తున్నారని.. ధర్నాలు చేసింది కాంగ్రెస్ నేతలే కదా
» కేంద్ర మంత్రి బండి సంజయ్



హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): దొంగ నోట్ల కేసుతో సంబంధమున్నట్లు ఆరోపణలు వచ్చిన మాజీ సీఎం కేసీఆర్‌పై చర్యలు తీసుకోకుండా ఎందుకు మౌనంగా ఉన్నారని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్.. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీశారు. కేసీఆర్‌పై మౌనం.. కాంగ్రెస్ బీఆర్ఎస్‌ల మధ్య ఉన్న అవగాహనకు నిదర్శనమని స్పష్టం చేశారు. నాడు టీడీపీ ప్రభుత్వంలో రవాణా శాఖ మంత్రిగా కేసీఆర్ పనిచేసినప్పుడు.. "దొంగ నోట్ల మంత్రిని సాగనంపుదాం" అంటూ కాంగ్రెస్ నాయకులు ధర్నాలు కూడా చేశారని గుర్తుచేశారు. బీఆర్ఎస్ అధినేతకు బీదర్‌లో దొంగ నోట్లు ముద్రించే ప్రింటింగ్ ప్రెస్ ఉందని, ఎన్నికలప్పుడు బీఆర్ఎస్ నాయకులు పంచినవన్నీ దొంగ నోట్లే అంటూ బండి సంజయ్ ఆదివారం కరీంనగర్‌లో చేసిన ఆరోపణపై బీఆర్ఎస్ నాయకులు మూకుమ్మడిగా ఎదురుదాడి చేశారు. కొన్ని పోలీసు స్టేషన్లలో ఆయనపై ఫిర్యాదులు కూడా చేశారు. ఈ నేపథ్యంలో సంజయ్ సోమవారం ఎక్స్ వేదికగా స్పందించారు. కేసీఆర్ దొంగ నోట్ల వ్యవహారం తాను కొత్తగా చెప్పింది కాదని.. 1997లోనే కాంగ్రెస్ నాయకులు పెద్దఎత్తున ఆందోళనలు చేశారని పేర్కొన్నారు. మరోవైపు, బండి సంజయ్ వ్యాఖ్యలు ముమ్మాటికీ నిజమేనని, అందుకు తగిన ఆధారాలు తమ వద్ద ఉన్నాయని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ ప్రకాశ్‌రెడ్డి, అధికార ప్రతినిధి ఎన్.వి.సుభాష్, జాతీయ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి కుమార్ స్పష్టం చేశారు. "1996-99 మధ్య కేసీఆర్ రవాణా శాఖ మంత్రిగా ఉన్న సమయంలోనే ప్రతాని రామకృష్ణ గౌడ్‌తో కలిసి దొంగ నోట్లను ముద్రించారు" అని వారు పేర్కొన్నారు.

బెట్టింగ్ ఇక్కడే.. లొకేషన్ ఎక్కడో..!!

» బెట్టింగ్ యాప్ నిర్వాహకుల వ్యూహం
» వినియోగదారులతో.. ఫేక్ జీపీఎస్ ఇన్‌స్టాల్ చేయించి దందా
» సెలబ్రిటీల విచారణలో వెల్లడి



హైదరాబాద్ సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): 'మాకేపాపం తెలియదు. ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌కు సిద్ధమయ్యే కస్టమర్ల జీపీఎస్ లొకేషన్ స్థానికంగా ఉండదని యాప్‌ల నిర్వాహకులు చెప్పారు. బెట్టింగ్ అనుమతి గల రాష్ట్రాల లొకేషన్‌నే వారు వాడతారన్నారు. దీంతో బెట్టింగ్ యాప్‌ల తరఫున ప్రచారం చేసినా.. చట్టపరమైన సమస్యలు ఎదురు కావని మాకు భరోసా ఇచ్చారు' అని బెట్టింగ్ యాప్‌ల ప్రమోషన్ కేసులో పలువురు సెలబ్రిటీలు/ఇన్‌ఫ్లూయెన్సర్లు చెప్పినట్లు తెలిసింది. బెట్టింగ్ యాప్‌ల్లో కస్టమర్లు నమోదు కాగానే.. వారి లొకేషన్ మార్చేలా యాప్స్ ఇన్‌స్టాల్ చేయిస్తారని దర్యాప్తు అధికారులకు చెప్పినట్లు సమాచారం. మన దేశంలో పలు రాష్ట్రాల్లో ఆన్‌లైన్ బెట్టింగ్ నిషేధించగా.. మరికొన్ని చోట్ల అనుమతి ఉంది. బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు తమ దందాకు అనుమతి ఉన్న రాష్ట్రాల లొకేషన్లతో.. ఇతర రాష్ట్రాల కస్టమర్లకూ గాలమేస్తున్నారు. బెట్టింగ్ ఆడే కస్టమర్లూ.. తమ రాష్ట్రంలో నిషేధం ఉందని తెలిసీ.. నిర్వాహకులు చెప్పినట్లు ఫేక్ లొకేషన్లు వాడి ఉన్నదంతా పోగొట్టుకుంటున్నారు.

ఫేక్ జీపీఎస్‌తో..

యూజర్లు బెట్టింగ్ యాప్‌ల్లో రిజిస్టర్ కాగానే.. వాటి ప్రతినిధులు ఏయే రాష్ట్రాల్లో నిషేధం ఉందో వివరిస్తారు. "మీ రాష్ట్రంలో నిషేధం ఉన్నా.. మీరు ఈ యాప్ వాడొచ్చు కానీ మీరు ఫేక్ జీపీఎస్ యాప్ ఇన్‌స్టాల్ చేసుకుని, లొకేషన్ మార్చుకోవాలి' అని సూచిస్తారు. లేదా.. వర్చువల్ ప్రైవేట్ నెట్‌వర్క్(వీపీఎన్) ప్రీమియం సేవలను వాడాలని, అందుకు రూ.500 ఖర్చు పెట్టుకోవాలని సలహా ఇస్తారు. ఈ చర్యలతో బెట్టింగ్ యాప్‌లకు అనుమతి ఉన్న రాష్ట్రాలతోపాటు.. విదేశాల లొకేషన్లూ ఎంచుకునే అవకాశం ఉంటుందని, దాన్ని గుర్తించడం సాధ్యం కాదని దర్యాప్తు అధికారులు తెలిపారు.

సెల్ ఆపరేటర్ల సహకారం!

సెల్‌ఫోన్ ఆపరేటర్లూ బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులకు పరోక్షంగా సహకరిస్తున్నారని దర్యాప్తు అధికారులు అనుమానిస్తున్నారు. "బెట్టింగ్ యాప్ ఉన్న వారు వైఫైతో ఇంటర్నెట్‌కు కనెక్టైతే.. ఫేక్ జీపీఎస్ యాప్‌లు పనిచేయవు. వాస్తవ లొకేషన్ మాత్రమే కనిపిస్తుంది. అందుకే బెట్టింగ్ చేసేవారు మొబైల్ డాటా వాడతారు. నిజానికి సెల్‌ఫోన్ ఆపరేటర్లు ఫేక్ జీపీఎస్, వీపీఎన్‌లు కట్టడి చేయొచ్చు. కానీ, బెట్టింగ్ ఆడేవారు గంటల కొద్దీ డాటా వాడడంతో ఆపరేటర్లకు రూ.కోట్లలో అదనపు ఆదాయం వస్తుంది. కొన్ని సెల్ సంస్థలైతే డాటా ప్యాకలనూ ప్రకటించాయి. అంటే.. సెల్ సంస్థలు ఆదాయం కోసం బెట్టింగ్ యాప్‌లకు పరోక్ష సహకారం అందిస్తున్నట్లవుతోంది. ఈ లొసుగును బెట్టింగ్ యాప్‌ల నిర్వాహకులు తమ దందాకు యథేచ్ఛగా వాడుకుంటున్నారు" అని కేసు దర్యాప్తులో పాలుపంచుకుంటున్న ఓ అధికారి 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

యాంకర్ శ్యామల విచారణ

» విదేశాలకు ఇమ్రాన్‌ఖాన్, హర్ష సాయి!
» మియాపూర్ కేసులోనూ వేగం
» మెట్రో రైల్‌లో బెట్టింగ్ యాడ్స్‌పై.. సర్కారును నిలదీస్తున్న నెటిజన్లు
» షారుఖ్, సచిన్, కోహ్లీపైనా కేసు పెట్టాలి
» హైదరాబాద్ గ్రీన్స్ అధ్యక్షుడు అర్జున్



మీడియాతో మాట్లాడుతున్న శ్యామల

హైదరాబాద్ సిటీ/పంజాగుట్ట/మియాపూర్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్ కేసులో పంజాగుట్ట పోలీసులు యాంకర్ శ్యామలను 4 గంటలు విచారించారు. ఇప్పటికే ఆమె హైకోర్టు ద్వారా అరెస్టు నుంచి రక్షణ పొందగా.. పోలీసులు నోటీసులు జారీ చేయడంతో సోమవారం ఉదయం తన న్యాయవాదితో కలిసి విచారణకు హాజరయ్యారు. డీఐ శ్రావణ్‌కుమార్ నేతృత్వంలో ఓ మహిళా ఎస్సై ఆమెను ప్రశ్నించారు. విచారణ తర్వాత శ్యామల మీడియాతో మాట్లాడుతూ పోలీసుల ప్రశ్నలకు జవాబులిచ్చానని, ఎప్పుడు విచారణకు పిలిచినా హాజరవుతానని చెప్పారు. బెట్టింగ్ యాప్స్ కేసులో అసలు నేరస్థులను పట్టుకోవడంలో పోలీసులకు సహకరిస్తానన్నారు. కాగా, బెట్టింగ్ యాప్స్ ప్రమోషన్స్ కేసులో 11 మందిపై పంజాగుట్ట పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. యూట్యూబర్లు ఇమ్రాన్‌ఖాన్, హర్షసాయి విదేశాలకు వెళ్లినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటి వరకు శ్యామల సహా.. టేస్టీ తేజ, కిరణ్, విష్ణుప్రియ, రీతూచౌదరిని పోలీసులు విచారించి, వారి వాంగ్మూలాన్ని నమోదు చేశారు. విష్ణుప్రియ, రీతూచౌదరిని మంగళవారం మరోమారు విచారిస్తారు. విగతా నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

మియాపూర్‌లో కేసులో..

19 బెట్టింగ్ యాప్‌లకు సంబంధించి 25 మందిపై మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేశారు. వీరిలో జంగిల్‌రమ్మీ, యోలో 247, ఎయిర్‌ప్లే, జీత్‌విన్, ధనీబుక్ 365, మామ-247, తెలుగు-365, ఎస్-365, జే-365, జడ్ఎక్స్‌ప్యారీ, మ్యాచ్‌తాజ్-777బుక్, ఆంధ్ర-365 యాప్‌ల నిర్వాహకులున్నారు. వీరికి నోటీసులిచ్చి, విచారించడానికి పోలీసులు సిద్ధమవుతున్నారు.

మెట్రోకు మినహాయింపా..?

కాగా, హైదరాబాద్ మెట్రోరైల్‌లో వారం క్రితం ఇలాంటి యాడ్స్ రావడంపై నెటిజన్లు సోషల్ మీడియాలో మండిపడుతున్నారు. మూడేళ్ల క్రితం ఆన్‌లైన్ రమ్మీ, మైజాక్‌పాట్‌రీడ్స్, ప్లే క్రికెట్, పోకర్, తీన్‌పత్తీ, రూట్లీ బెట్టింగ్ యాప్స్‌పై మెట్రోలో యాడ్స్ వచ్చాయి. అప్పట్లోనే వీటిపై విమర్శలు రాగా.. "మరోమారు ఇలాంటి యాడ్స్ రాకుండా జాగ్రత్తపడతాం" అని మెట్రో అధికారులు వివరణిచ్చారు. నాలుగేళ్ల క్రితం బెట్టింగ్ యాప్స్‌పై ప్రకటన చేసిన సెలబ్రిటీలపై కేసు పెట్టిన పోలీసులు మెట్రోకు ఎలా మినహాయింపులిస్తారని నెటిజన్లు నిలదీస్తున్నారు.

షారుఖ్, సచిన్ కోహ్లీపైనా..


బెట్టింగ్ యాప్‌లను ప్రమోట్ చేసిన బాలీవుడ్ నటుడు షారుఖ్‌ఖాన్, క్రికెటర్లు సచిన్, కోహ్లీపై సోమవారం పంజాగుట్ట పోలీసులకు హైదరాబాద్ గ్రీన్స్ అధ్యక్షుడు అర్జున్‌గౌడ్ ఫిర్యాదు చేశారు. వీరిపైనా కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

బెట్టింగ్ రాజాలు!

» ఏపీలో జోరుగా పందేలు.. పార్టీలకతీతంగా నేతల పాత్ర
» సూత్రధారి గత ప్రభుత్వంలో ముఖ్య నేత సన్నిహితుడు
» కొమ్ముకాస్తున్న ముగ్గురు.. వారిలో ఇద్దరు రాష్ట్ర స్థాయి నేతలే

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

ఆంధ్రప్రదేశ్‌లో బెట్టింగ్ దందా కోసం పార్టీలకతీతంగా నలుగురు ఏకమయ్యారు. గత ప్రభుత్వంలో ముఖ్య నేత సన్నిహితుడికి, రెండు పార్టీలకు చెందిన ముగ్గురు కీలక నేతలు తోడయ్యారు. ఉభయ గోదావరి, విశాఖ జిల్లాల్లో విశృంఖలంగా సాగిపోతున్న బెట్టింగ్ దందా.. ఇప్పుడు రాష్ట్రమంతా విస్తరిస్తోంది. పోలీసులు బెట్టింగ్ భూతం ఆనవాళ్లను ఒకవైపు నరుక్కుంటూ వస్తుంటే.. ముగ్గురు నేతలు దీన్ని ప్రోత్సహిస్తూ ఇతర ప్రాంతాలకు విస్తరింపజేస్తున్నారు. బెట్టింగ్ రాయుళ్ల జోలికి రావద్దంటూ హుకుం జారీ చేస్తున్నారు. ముఖ్యనేత సన్నిహితుడికి క్రికెట్ అన్నా, పందేలన్నా మహా ఇష్టం. ఆయన వెంటే ఉండే మరో వ్యక్తి ఈ వ్యవహారాలను చూసుకునేవారు. గతంలో ఐపీఎల్ మ్యాచ్‌లు, ఇతర టోర్నమెంట్ల సందర్భంగా ఉభయ గోదావరి జిల్లాలు, విశాఖ, రాయలసీమ, విజయవాడతో పాటు ప్రధాన నగరాల్లో దర్జాగా బెట్టింగ్‌లు నిర్వహించారు. రాజకీయ అండ ఉండటంతో గత ఐదేళ్లలో రాష్ట్రంలో బెట్టింగ్ ముఠాలను పట్టుకున్న సందర్భాలు లేవు. ప్రభుత్వం మారినా సదరు వ్యక్తి అడ్డూఅదుపూ లేకుండా బెట్టింగ్ జోరు పెంచారు. రాయలసీమకు చెందిన ఒకరిని, గోదావరి జిల్లాలోని మరో వ్యక్తిని ముందు ఉంచి దందా నడిపిస్తున్నారు. చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా ఈ ముఠా రెచ్చిపోయింది. ఈ ఇద్దరూ ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో మకాం వేసి వేలాది మందితో బెట్టింగ్ నిర్వహించారు.



దీనిపై కీలక సమాచారం అందుకున్న పోలీసులు రాజానగరం, మండపేట ప్రాంతాల్లో ప్రత్యేక ఆపరేషన్ నిర్వహించి పంటర్స్(జూద నిర్వాహకులు)ను పట్టుకున్నారు. వారిని విచారించగా కర్ణాటక ముఠాగా తేలింది. వీరి వెనక సదరు వ్యక్తి, ఆయన వెంటే ఉండే సహాయకుడి పాత్ర ఉన్నట్టు బయటపడింది. ఆయన ఇద్దరు అనుచరుల్లో పేరు మోసిన ఓ బెట్టింగ్ రాయుడు పోలీసుల కళ్లు గప్పి పరారయ్యాడు. పోలీసులు విచారించగా ఇద్దరి మధ్య సంబంధాలు వెల్లడయ్యాయి. గతంలో ఈ బెట్టింగ్ రాయుడు పలు కేసుల్లో సైబరాబాద్, హైదరాబాద్ పోలీసులకు మోస్ట్ వాంటెడ్‌గా ఉన్నాడు. అయితే నాడు ముఖ్యనేత అండతో పోలీసులకు చిక్కలేదు. ప్రభుత్వం మారినా ఇప్పుడు అదే ధైర్యంతో బెంగళూరు, రాయలసీమతో పాటు ఉభయ గోదావరి, విశాఖ జిల్లాల కేంద్రంగా క్రికెట్ బెట్టింగ్ నిర్వహిస్తున్నాడని పోలీసుల విచారణలో తేలింది. బెట్టింగ్ దందాలో రెండు పార్టీలకు చెందిన ముగ్గురు కీలక నేతల పాత్ర ఉన్నట్లు తెలిసింది. అందులో ఓ నేత గోదావరి జిల్లాలకే చెందిన వారు. ఆయన తమ్ముడి పాత్ర కూడా ఉన్నట్లు వెలుగులోకి వచ్చింది. బెట్టింగ్ కేసుల్లో సదరు వ్యక్తి అనుచరులు అరెస్ట్ కాకుండా, కేసుల విచారణ ముందుకు సాగకుండా రెండు పార్టీల్లోని ముగ్గురు నేతలు రక్షణ కవచంలా నిలిచారని తెలుస్తోంది. పోలీసులు బెట్టింగ్ రాయుళ్ల విషయంలో సీరియస్‌గా ఉండటంతో వారిపై రాజకీయ ఒత్తిళ్లు తీసుకొచ్చి ముందడుగు వేయకుండా అడ్డుకున్నారని సమాచారం. నిజానికి మండపేట, రాజానగరం కేసుల్లో ఓ గోదావరి జిల్లా స్థాయి ప్రతినిధి, ఆయన సోదరుడి పాత్ర స్పష్టంగా బయటపడింది. అయితే, కేసుల విచారణ సాగకుండా, అరెస్టులు జరగకుండా చేశారు. దీంతో చాంపియన్స్ ట్రోఫీ సందర్భంగా పంటర్స్ వందల కోట్లు వెనకేసుకున్నారు. ఇప్పుడు ఐపీఎల్ మ్యాచ్‌లు దాదాపు రెండు నెలల పాటు ఉంటాయి. రాష్ట్రంలోని ప్రధాన నగరాలు, పట్టణాలు, మున్సిపాలిటీల స్థాయిలోనూ భారీగా బెట్టింగ్ కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారని తెలిసింది. పోలీసుల చర్యలు తగ్గించేలా ఈ నేతలు ప్రయత్నిస్తున్నట్లు తెలిసింది.

మే నెలలో మిస్ వరల్డ్ పోటీలు

- 10న గచ్చిబౌలి స్టేడియంలో ప్రారంభం.. 31న ఫినాలే
- 120 దేశాల నుంచి పోటీదారుల ఆగమనం

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): 'ప్రపంచ సుందరి(మిస్ వరల్డ్)' పోటీలకు హైదరాబాద్ వేదిక సిద్ధమవుతోంది. మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ నిర్వహించే ఈ పోటీలకు రాష్ట్ర పర్యాటక శాఖ అన్ని రకాలుగా సహాయ సహకారాలను అందిస్తోంది. పోటీదారులు, న్యాయ నిర్ణేతలు, మీడియా తదితర ప్రతినిధులకు సకల ఏర్పాట్లు చేస్తోంది. ఈమేరకు కార్యక్రమానికి సంబంధించి అధికారిక షెడ్యూల్‌ను వెల్లడించారు. మే 7 నుంచి 31 వరకు 28 రోజుల పాటు ప్రపంచ సుందరి పోటీల కార్యక్రమం ఉంటుందని మిస్ వరల్డ్ ఆర్గనైజేషన్ తెలిపింది. మే 31న మిస్ వరల్డ్ ఫినాలే ఉంటుంది. ఇందులో విజేతలైనవారు రాష్ట్ర అవతరణ దినోత్సవం రోజైన జూన్ 2న రాజ్‌భవన్‌లో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, సీఎం రేవంత్‌రెడ్డిలతో మర్యాదపూర్వకంగా భేటీ అవుతారు. ఆ రోజుతో పోటీలు ముగుస్తాయి. మే 6, 7 తేదీల్లో 120 దేశాల నుంచి పోటీదారులు, ప్రతినిధుల రాక ఉంటుంది. మే 10న గచ్చిబౌలి స్టేడియంలో కార్యక్రమం ప్రారంభమవుతుంది. పోటీదారులు నాలుగు బృందాలుగా విడిపోయి మే 12 నుంచి రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో పర్యటిస్తారు. బుద్ధవనం, చార్మినార్, లాడ్ బజార్, చౌమహల్లా ప్యాలెస్, రామప్ప దేవాలయం, కాళోజీ కళా క్షేత్రం, యాదగిరి గుట్ట, పోచంపల్లి గ్రామం, శిల్పారామం, తెలంగాణ పోలీస్ కమాండ్ కంట్రోల్ సెంటర్, ట్యాంక్‌బండ్, అంబేద్కర్ విగ్రహ సందర్శన..ఏషియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ గ్రాస్ట్రో ఎంట్రాలజీ, యశోద, అపోలో ఆస్పత్రులను సందర్శిస్తారు. మే17న గచ్చిబౌలి స్టేడియంలో క్రీడల ఫైనల్స్ ఉంటుంది. మే 22న శిల్పా కళా వేదికలో ట్యాలెంట్ ఫైనల్స్.. 23న ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్‌లో హెడ్ టు హెడ్ ఫైనల్స్. 24న టాప్ మోడల్ అండ్ ఫ్యాషన్‌షో ఫైనల్స్. మే31న మిస్‌వరల్డ్ ఫైనల్స్ ఉంటాయి.

హైడ్రా పేరిట సెటిల్‌మెంట్లు చేస్తే కేసులు పెడతాం

- అధికారులైతే ఉద్యోగం నుంచి తొలగిస్తాం: రంగనాథ్

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): హైడ్రా పేరుతో ఎవరు సెటిల్‌మెంట్లు చేసినా కేసులు నమోదు చేస్తామని హైడ్రా కమిషనర్ రంగనాథ్ స్పష్టం చేశారు. ఇలాంటివి ఎవరి దృష్టికి వచ్చినా ఫిర్యాదు చేయాలని కోరారు. సెటిల్‌మెంట్లు చేసేవారిలో అధికారులు ఉంటే.. వారిని ఉద్యోగం నుంచి తొలగిస్తామని చెప్పారు. సోమవారం అసెంబ్లీ లాబీల్లో మీడియాతో చిట్‌చాట్ చేశారు. వంశీరామ్ బిల్డర్స్‌పైన ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి ఎవరికి ఫిర్యాదు చేశారో తనకు తెలియదని వెల్లడించారు. అయితే ఆయన తనను కలిశారని, ఫిర్యాదు కాపీ తనకు వాట్సాప్‌లో పంపాలని సూచించానన్నారు. మ్యాన్‌హట్టన్, వంశీరామ్, ఆదిత్య, రాజ్‌పుష్ప వంటి నిర్మాణ సంస్థలు.. ఎఫ్‌టీఎల్ పరిధిలో చెత్తను డంపింగ్ చేసినట్లుగా గుర్తించి.. తొలగించాలంటూ ఆదేశించామని చెప్పారు. తాము సెటిల్‌మెంట్లు చేసేది ఉంటే.. హైడ్రాకు ప్రజలు ఎందుకు భయపడతారని ప్రశ్నించారు.

బీసీలకు 42% రిజర్వేషన్ల అమలుకు సర్కారు సిద్ధం

- బీజేపీకి చిత్తశుద్ధి ఉంటే 9వ షెడ్యూల్‌లో చేర్చాలి: అద్దంకి
- చట్టసభల్లో బీసీలకు 50% రిజర్వేషన్‌ఉండాలి: కృష్ణయ్య

పంజాగుట్ట, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థలు, విద్యా, ఉద్యోగ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లను రాష్ట్రంలో అమలు చేస్తుందని, త్వరలోనే ప్రభుత్వం జీవో తెస్తుందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్ అన్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయానికి సీఎం రేవంత్‌రెడ్డికి కట్టుబడి ఉన్నారని, త్వరలోనే అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్తారని తెలిపారు. బీసీలకు చట్టసభల్లో రిజర్వేషన్ల కోసం రాహుల్ గాంధీ పోరాడుతున్నారన్నారు. ప్రధాని మోదీ నిజమైన ఓబీసీ అయితే పార్లమెంటులో రిజర్వేషన్ల బిల్లును పెట్టి ఆమోదించి 9వ షెడ్యూల్‌లో చేర్చాలని డిమాండ్ చేశారు. సోమవారం బీసీ రాజ్యాధికార సమితి ఆధ్వర్యంలో సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో అఖిలపక్ష రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్ సాధించాలని, పార్లమెంటులో బిల్లు పెట్టే దాకా పోరాటం కొనసాగాలని పిలుపునిచ్చారు.

బీఆర్‌ఎస్ బహిరంగ సభ స్థలం మార్పు?

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి) : పార్టీ స్థాపించి 25 ఏళ్లు పూర్తిచేసుకున్న నేపథ్యంలో ఏప్రిల్ 27న వరంగల్‌లో భారీ బహిరంగ సభ ఏర్పాటు చేసేందుకు బీఆర్‌ఎస్ పార్టీ సిద్ధమైన విషయం విదితమే. పార్టీ అధినేత కేసీఆర్ సూచన మేరకు సభను నిర్వహించే స్థలాన్ని మార్చుతున్నట్లు గులాబీ శ్రేణులు చెబుతున్నాయి. మేడ్చల్ పరిధిలోని ఘట్‌కేసర్ సమీపంలో బహిరంగ సభ నిర్వహించేందుకు అనువైన ప్రదేశాన్ని చూడాలని మల్లారెడ్డికి బీఆర్‌ఎస్ అధినేత సూచించినట్లు తెలుస్తోంది. దీనిపై తుది నిర్ణయం ప్రకటించాల్సి ఉంది.

తెలంగాణ వైద్య శాఖకు జాతీయ స్థాయి గుర్తింపు

- టీబీ ముక్త్ భారత్'లో మంచి పనితీరుకు అవార్డు

హైదరాబాద్, మార్చి 24(ఆంధ్రజ్యోతి): తెలంగాణ వైద్య, ఆరోగ్య శాఖకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. వంద రోజుల టీబీ ముక్త్ భారత్ కార్యక్రమంలో భాగంగా టీబీ నాట్ టెస్టింగ్(న్యూక్లిక్ యాసిడ్ అంప్లిఫికేషన్ టెస్ట్)లో రాష్ట్ర వైద్య శాఖ మంచి పనితీరును కనబరిచింది. దాంతో రాష్ట్ర వైద్య శాఖను కేంద్రం అభినందించింది. ప్రపంచ క్షయ(టీబీ) దినోత్సవాన్ని పురస్కరించుకొని సోమవారం ఢిల్లీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర జాతీయ ఆరోగ్య మిషన్ ఎండీ కర్ణన్‌కు కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి జేపీ నడ్డా అవార్డు అందజేశారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ అధికారులను రాష్ట్ర మంత్రి దామోదర అభినందించారు.

తెలంగాణ అప్పులు రూ.4.42 లక్షల కోట్లు

- ఏపీ తీసుకున్న రుణం రూ.5.62 లక్షల కోట్లు
- లోక్‌సభలో కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి

న్యూఢిల్లీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది మార్చి 31 నాటికి తెలంగాణ అప్పు రూ.4,42,298 కోట్లు, ఆంధ్రప్రదేశ్ అప్పు రూ.5,62,557 కోట్లు ఉందని కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి తెలిపారు. ఏపీ అప్పులో స్థూల దేశీయోత్పత్తి(జీఎస్‌డీపీ) 34.7 శాతం ఉందని, తెలంగాణ అప్పులో జీఎస్‌డీపీ 26.2శాతం ఉందని వెల్లడించారు. సోమవారం లోక్‌సభలో కాంగ్రెస్ ఎంపీ మనీశ్ తివారీ అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఈ వివరాలు తెలిపారు. అన్ని రాష్ట్రాల కంటే అత్యధికంగా తమిళనాడు అప్పు రూ.9,55,691 కోట్లు కాగా.. తర్వాతి స్థానంలో ఉత్తర్‌ప్రదేశ్(రూ.8,57,844 కోట్లు), మహారాష్ట్ర (రూ.8,12,068 కోట్లు), కర్ణాటక (రూ.7,25,456 కోట్లు), పశ్చిమ బెంగాల్ (రూ.7,14,196కోట్లు) ఉన్నాయని ఆయన తెలిపారు. ఆర్బీఐ అంచనా ప్రకారం 2025 మార్చి 31 నాటికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల సమష్టి అప్పు రూ.2,67,35,462 కోట్లు ఉంటుందని కేంద్ర మంత్రి తెలిపారు.

ఎక్కువ ధరకు జొన్నలు అమ్మి నష్టాలు తగ్గిస్తాం!

- డిస్పోజల్ కమిటీ ఆదేశాలమేరకు ప్రభుత్వానికి నివేదిక
- 'ఆంధ్రజ్యోతి' కథనంపై మార్క్‌ఫెడ్ ఎండీ వివరణ

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఆదేశాలు, మార్కెట్ ఇంటెలిజెన్స్ నివేదిక ప్రకారం వీలైనంత ఎక్కువ ధరకు జొన్నలు విక్రయించి నష్టాలను తగ్గించుకునేందుకు ప్రాధాన్యమిస్తున్నామని మార్క్‌ఫెడ్ ఎండీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆరుగురు సభ్యులతో కూడిన డిస్పోజల్ కమి టీ నిర్ణయం ప్రకారం మూడుసార్లు టెండర్లు పిలువగా గుత్తేదారులు నమోదుచేసిన ధరలు, ప్రస్తుత మార్కెట్ ధరలపై సమగ్ర నివేదిక రూపొందించి ప్రభుత్వానికి పంపినట్లు వెల్లడించారు. "మార్క్‌ఫెడ్ జొన్నలు అగ్గువకు!" శీర్షికతో 'ఆంధ్రజ్యోతి' ప్రధాన సంచికలో సోమవారం ప్రచురితమైన కథనంపై శ్రీనివాస్‌రెడ్డి వివరణ ఇచ్చారు. మొదటిసారి టెండరు పిలిస్తే గుత్తేదారులు టన్నుకు రూ.18,587.66 కోట్ చేయగా తక్కువ ధర వచ్చిందని టెండరు రద్దు చేసినట్లు తెలిపారు. రెండోసారి టెండరులో టన్నుకు రూ.18,799.91 నమోదు చేసినా రద్దు చేశామన్నారు. మూడోసారి టెండరులో టన్నుకు రూ.18,801.41 ధర రాగా, డిస్పోజల్ కమిటీ ఆదేశాలమేరకు జొన్నలు విక్రయించడానికి రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసినట్లు వివరించారు. 10నెలలుగా గోదాముల్లో జొన్నలు ఉండటంతో నాణ్యత తగ్గిపోతోందని, కొత్త పంట వస్తున్నందున పాత పంట ధర గణనీయంగా తగ్గుతోందని ఎండీ వివరించారు. టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తామన్నారు.

కేసీఆర్ శాసనసభ్యత్వం రద్దుపై దృష్టి పెడతాం

- మల్లన్నసాగర్ నిర్వాసితులను ఆదుకుంటాం
- గజ్వేల్ కాంగ్రెస్ నేతలతో సీఎం రేవంత్

గజ్వేల్/హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం కేసీఆర్ శాసనసభ్యత్వం రద్దు చేసేందుకు న్యాయపరంగా దృష్టి పెడతామని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలపై దర్యాప్తు జరిపిస్తున్నామని చెప్పారు. అసెంబ్లీకి హాజరు కాని గజ్వేల్ ఎమ్మెల్యే కేసీఆర్‌ను బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ సిద్దిపేట డీసీసీ అధ్యక్షుడు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఆంక్షారెడ్డి ఆధ్వర్యంలో పార్టీ శ్రేణులు సిద్దిపేట కలెక్టరేట్ నుంచి రాజ్‌భవన్ వరకు పోరుబాట పాదయాత్ర చేపట్టారు. సోమవారం హైదరాబాద్‌లోని సీఎం నివాసానికి చేరుకుని వారు ఆయనకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మల్లన్నసాగర్, కొండపోచమ్మ రిజర్వాయర్ నిర్వాసితుల సమస్యలను సీఎం దృష్టికి తీసుకువెళ్లారు. స్పందించిన సీఎం.. నెల రోజుల్లో నిర్వాసితులతో సమావేశం ఏర్పాటు చేసి చర్చిద్దామని, వారిని అన్ని రకాల ఆదుకునేందుకు చర్యలు తీసుకుంటామని హామీనిచ్చారు. గజ్వేల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న పనులకు నిధులను మంజూరు చేస్తానని స్పష్టం చేశారు. ముఖ్యంగా నర్సారెడ్డి ఆరోగ్యం బాగా లేనప్పటికీ పాదయాత్ర చేపట్టడం పట్ల కార్యకర్తల్లో నూతన ఉత్సాహం నింపిందన్నారు. అంతకుముందు సిద్దిపేట కలెక్టర్‌కు కూడా గజ్వేల్ నేతలు వినతిపత్రం ఇచ్చారు. సీఎంను కలిసిన అనంతరం రాజ్‌భవన్‌కు వెళ్లి గవర్నర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు.



గజ్వేల్ కాంగ్రెస్ నేతలతో మాట్లాడుతున్న సీఎం రేవంత్

24వ తానా మహాసభలకు రండి..

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): అమెరికాలోని మిషిగాన్‌లో ఉత్తర అమెరికా తెలుగు సంఘం (తానా) నిర్వహించే 24వ మహాసభలకు హాజరు కావాలంటూ సీఎం రేవంత్‌రెడ్డిని ఆ సంఘం ప్రతినిధులు ఆహ్వానించారు. సోమవారం హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లోని నివాసంలో ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి వారు ఆహ్వాన పత్రికను అందజేశారు.

భూముల విలువలు పెరుగుతాయ్

భూ భారతి అమల్లోకి వచ్చాక పెంచుతాం.. సాదా బైనామాల కొత్త దరఖాస్తులు తీసుకోం

- ఎల్‌ఆర్‌ఎస్ రాయితీ గడువు పెంచం
- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డితో గొడవల్లేవు
- ఇష్టాగోష్ఠిలో మంత్రి పొంగులేటి



హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): భూ భారతి చట్టం అమల్లోకి వచ్చాక రాష్ట్రంలో భూముల విలువలు పెంచుతామని రెవెన్యూశాఖ మంత్రి పొంగులేటి శ్రీనివా‌స్‌రెడ్డి తెలిపారు. భూ భారతి దాదాపు పూర్తయిందని, త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తామని అన్నారు. ధరణి సమస్యలు దాదాపుగా పరిష్కారమయ్యాయన్నారు. సాదా బైనామా విషయంలో ఇకపై కొత్త దరఖాస్తులను స్వీకరించేది లేదని చెప్పారు. ఎల్ఆర్ఎస్ విషయంలో ప్రభుత్వం ఇచ్చిన రాయితీ గడువును ఈ నెల తరువాత పొడగించే ఆలోచన లేదన్నారు. పార్టీలో తనకు ఎవరితోనూ విభేదాలు లేవన్నారు. సోమవారం అసెంబ్లీ ఆవరణలో మీడియాతో మంత్రి పొంగులేటి ఇష్టాగోష్ఠిగా మాట్లాడారు. సాదా బైనామాకు సంబంధించి రాష్ట్రంలో 13 లక్షల దరఖాస్తులను గత ప్రభుత్వం తిరస్కరించిందని తెలిపారు. తిరస్కరణకు గురైనవారు అప్పీలేట్ అథారిటీని ఆశ్రయించవచ్చని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదై ఉన్న 12 లక్షల దరఖాస్తులను మాత్రమే తాము పరిష్కరిస్తామని, కొత్తవి చెల్లుబాటు కావని స్పష్టం చేశారు. ఇక అసైన్డ్ భూములను అమ్ముకునే అవకాశం లేదన్నారు. రిజిస్ట్రేషన్ శాఖలో త్వరలో స్లాట్ విధానాన్ని అందుబాటులోకి తెస్తామని మంత్రి తెలిపారు. ఆధార్‌తో అనుసంధానం చేసి 15 నుంచి 20 నిమిషాల వ్యవధిలో రిజిస్ట్రేషన్ పూర్తయ్యేలా చర్యలు తీసుకోబోతున్నట్లు పేర్కొన్నారు. పైలట్ ప్రాజెక్టు కింద రాష్ట్ర వ్యాప్తంగా 15 రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో దీనిని అమలు చేయబోతున్నామని, అక్కడ తలెత్తే ఇబ్బందులను అధిగమించాక రాష్ట్ర వ్యాప్తంగా అమల్లోకి తీసుకొస్తామని వివరించారు. రిజిస్ట్రేషన్‌కు సర్వే మ్యాప్ అవసరమని, మ్యాప్ లేనివారికి కూడా సర్వే చేయిస్తామని తెలిపారు. రాష్ట్రంలో వెయ్యి మంది సర్వేయర్లను నియమిస్తున్నామని, ప్రతి మండలానికి ఒక సర్వేయర్, ఒక డిప్యూటీ సర్వేయర్ ఉండేలా చూస్తున్నామని అన్నారు. వీరితోపాటు 6వేల మంది లైసెన్స్‌డ్ సర్వేయర్లను నియమించి, వారికి శిక్షణ ఇస్తామన్నారు. ఇంటర్మీడియట్ అర్హతగా 10,956 మంది గ్రామ స్థాయి రెవెన్యూ సిబ్బందిని నియమిస్తున్నామని వెల్లడించారు.

ఎల్‌ఆర్‌ఎస్ గడువు పొడిగించే ఆలోచన లేదు..

ఎల్‌ఆర్‌ఎస్ పథకానికి మంచి స్పందన ఉందని మంత్రి పొంగులేటి తెలిపారు. ఈ నెల 31 వరకు అందుబాటులో ఉండే 25 శాతం రాయితీని దరఖాస్తుదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రాయితీ గడువును పొడగించే ఆలోచన లేదన్నారు. దరఖాస్తుదారులు ఫీజు చెల్లించాక ఒక్క కేసు కూడా మిస్ అయ్యే ప్రసక్తే లేదన్నారు. గతంలో 10 శాతం రిజిస్ట్రేషన్ అయి.. అమ్మకం కాని 90 శాతం ప్లాట్లు ఉన్న లేఅవుట్లకు కూడా ఎల్ఆర్ఎస్ అనుమతులు ఇస్తున్నామని తెలిపారు. ఎల్ఆర్ఎస్ చేయకుండా ఇష్టానుసారం వ్యవహరించే కొంతమంది సబ్ రిజిస్ట్రార్లు సస్పెండ్ అవుతున్నారని పేర్కొన్నారు. ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డితో తనకు ఎలాంటి విభేదాలు లేవని పొంగులేటి స్పష్టం చేశారు. అభిమన్యరెడ్డి ఎవరో తనకు తెలియదన్నారు. రోజూ వివిధ సమస్యల మీద వందకు పైగా అర్జీలు వస్తుంటాయని, అందులో సక్రమంగా ఉన్నవాటిని పరిష్కరిస్తున్నామని అన్నారు. పార్టీలకతీతంగా సక్రమంగా ఉండే అర్జీలకు ఎవరి సిఫారసులు లేకుండానే పని అయిపోతుందన్నారు. సక్రమంగా లేని పనులు చేయమంటే తాను చేయనని మంత్రి తేల్చిచెప్పారు. కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద పట్టణ ప్రాంతాల్లో 1,13,000 ఇళ్లను మంజూరు చేసిందన్నారు. పట్టణ ప్రాంతంలో నిర్మించే ఇళ్లకు కేంద్రం రూ.1.50 లక్షలు ఇస్తుందని, మిగిలిన మొత్తం రాష్ట్ర ప్రభుత్వం చెల్లిస్తుందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పేరులో ఎలాంటి మార్పు లేదన్నారు.

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ 9.5 కిలోమీటర్లు పెండింగ్ ఉంది

ఎస్ఎల్‌బీసీ టన్నెల్ మొత్తం 41.6 కిలోమీటర్లు కాగా, అందులో ఇంకా 9.5 కిలోమీటర్లు మాత్రమే తవ్వాల్సి ఉందని మంత్రి పొంగులేటి తెలిపారు. పెండింగ్ ఉన్న ప్రాంతంలో టీబీఎం ద్వారా కాకుండా మనుషులతో పనులు చేయాల్సి ఉందన్నారు. ప్రమాద ఘటనలో ఇరుక్కున్న మృతదేహాలను వెలికితీస్తామని, ప్రత్యేకాధికారుల పర్యవేక్షణలో రెస్క్యూ ఆపరేషన్ కొనసాగుతోందని చెప్పారు.

ఏటా భూముల విలువ పెంపు!

అప్పుడే ఎక్కువ లావాదేవీలు జరిగేచోట అదనపు ఆదాయం

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): "ఏటా భూముల విలువలను పెంచాలి. ఈ చర్య వల్ల ఎక్కువ రిజిస్ట్రేషన్లు జరిగే ప్రాంతాల నుంచి సర్కారుకు అదనపు ఆదాయం వస్తుంది." అని రిజిస్ట్రేషన్ల శాఖ నియమించిన థర్డ్‌పార్టీ సంస్థ నివేదిక స్పష్టం చేసింది. విలువల పెంపు శాస్త్రీయంగా ఉండాలని.. భూముల వాస్తవ విలువ, పుస్తక విలువకు మధ్య వ్యత్యాసాన్ని జాగ్రత్తగా సవరించాలని సూచించింది. బాగా అభివృద్ధి చెందిన ప్రాంతాల్లోనూ తక్కువగా భూవిలువలు ఉన్నాయని, వాటిని కూడా శాస్త్రీయంగా సవరించాల్సిన అవసరముందని పేర్కొంది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం తర్వాత ఏడేళ్ల వరకు.. అంటే 2021 వరకు ప్రభుత్వం భూముల విలువలను పెంచలేదు. 2021లో 20%.. 2022లో 33% మేర పెంచారు. ఆ తర్వాత మూడేళ్లు అవుతున్నా.. పెంపు దిశలో ప్రభుత్వం చర్యలు తీసుకోలేదు. అయితే.. ఆదాయం పెరగాలంటే.. భూవిలువల పెంపులో జాప్యం ఉండకూడదని థర్డ్‌పార్టీ ఏజెన్సీ నివేదిక పేర్కొంది. ఇందుకోసం మహారాష్ట్ర మాదిరిగా(ఏటా 2%) పెంపు తప్పనిసరి అని సూచించింది.

పొంతన లేని ధరలు

హెచ్ఎండీఏ పరిధిలో పలు ప్రాంతాల్లో జరిగిన అభివృద్ధికి, అక్కడి భూముల విలువకు పొంతన ఉండడం లేదని, అలాంటి ప్రాంతాల్లో అధ్యయనం చేసి, ధరలను శాస్త్రీయంగా సవరించాలని థర్డ్‌పార్టీ ఏజెన్సీ నివేదిక ప్రభుత్వానికి సూచించింది. పంజాబ్, తమిళనాడు రాష్ట్రాల్లోనూ శాస్త్రీయంగా భూముల విలువలను పెంచడం వల్ల కలుగుతున్న ప్రయోజనాలను వివరించింది. తెలంగాణలోనూ ఇలాంటి విధానాన్ని అమలు చేస్తే సత్ఫలితాలు వస్తాయని పేర్కొంది. ఉదాహరణకు శేరిలింగంపల్లి, కొండాపూర్‌లలో పుస్తక విలువ ప్రకారం గజం భూమి ధర రూ.26,700. కానీ, అక్కడ బహిరంగ మార్కెట్ ధర రూ.లక్షకు పైగా ఉంది. 10-15 ఏళ్ల క్రితం వరకు మారుమూల ప్రాంతంగా ఉండే మోకిలలో ఇప్పటికీ గజం ధర రూ.2,300గా ఉంది. ఫోర్త్ సిటీగా అభివృద్ధి చెందుతున్న మహేశ్వరంలో ఈ ధర రూ.2,100గా ఉంది. ఇక్కడ వాస్తవ మార్కెట్ ధరలు ఇంకా ఎక్కువగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. శాస్త్రీయంగా ధరలు పెంచాలని ఆ నివేదిక ప్రతిపాదించింది. ప్రస్తుతం ఉన్న భూముల విలువలను కనిష్ఠంగా 30%.. గరిష్ఠంగా 50% పెంచాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు తెలుస్తోంది. ఈ పెంపు ఒకే సారి కాకుండా.. దశల వారీగా ఉంటుందని సమాచారం. తొలుత 30% వరకు పెంచి.. ఆ తర్వాత మార్కెట్ పుంజుకునే తీరును బట్టి 50శాతంగా చేసే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ప్రభుత్వం తన నిర్ణయాన్ని ఎప్పుడు అమలు చేస్తుందనే దానిపై అధికార వర్గాలు ఇంకా స్పందించాల్సి ఉంది. అయితే.. ఉగాది లేదా స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత ఈ పెంపు ఉంటుందని సూత్రప్రాయంగా తెలిసింది. నిజానికి రిజిస్ట్రేషన్ల శాఖకు 65% ఆదాయం అపార్ట్‌మెంట్లలో ఫ్లాట్ల రిజిస్ట్రేషన్ రూపంలో వస్తోంది. మిగతా 35శాతం వాటాలో ఓపెన్ ప్లాట్లు, గృహాలు, వ్యవసాయ భూములు ఉన్నాయి. ఈ నేపథ్యంలో.. ప్రభుత్వం ప్రతి చదరపు అడుగుకు ప్రస్తుతం ఉన్న ఫ్లాట్ల రిజిస్ట్రేషన్ విలువపైనా దృష్టిసారించనున్నట్లు సమాచారం.

గజ్వేల్‌పై రేవంత్‌ది సవతితల్లి ప్రేమ

- మాజీ మంత్రి హరీశ్‌రావు



గజ్వేల్, హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గజ్వేల్ నియోజకవర్గంపై మాజీ సీఎం కేసీఆర్‌కు కన్నతల్లి ప్రేమ ఉంటే.. ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డిది సవతితల్లి ప్రేమ అని మాజీ మంత్రి హరీశ్‌రావు విమర్శించారు. గజ్వేల్‌లోని మదీనా మసీదులో సోమవారం జరిగిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. గజ్వేల్‌పై రేవంత్‌రెడ్డికి ప్రతిపక్ష నాయకుడిగా ఉన్నప్పుడూ... ముఖ్యమంత్రి అయ్యాక కూడా ఏడుపే ఉందన్నారు. గతంలో తమ ప్రభుత్వం ఇచ్చిన రూ.181 కోట్ల పనులను రద్దు చేశారని, గతంలో తాము మల్లన్నసాగర్ భూనిర్వాసితులకు రూ.1200కోట్లు ఇచ్చామని, గతంలో భూనిర్వాసితుల కోసం దీక్ష చేసిన రేవంత్‌రెడ్డి 15 నెలలుగా ఒక్క రూపాయి ఇవ్వలేదని, నాడు దీక్ష చేసింది.. నిజమా? లేక నటనా? చెప్పాలని ప్రశ్నించారు. నిజమైన దీక్ష అయితే వెంటనే మిగిలిపోయిన పరిహారం, ప్యాకేజీ ఇవ్వాలన్నారు. కాగా, రేవంత్ రెడ్డి ఫ్లైట్ మోడ్ సీఎం అని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత విమర్శించారు. గత 15 నెలల్లో 40సార్లు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ రెడ్డి.. తెలంగాణకు సాధించుకొచ్చింది ఏమీ లేదన్నారు.

మూడు రంగుల్లో ఉపాధి హామీ కార్డులు

- కేటగిరీల వారీగా జాబ్ కార్డులు జారీ

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లోని వ్యవసాయ కూలీలకు ఉపాధి కల్పించేందుకు అమలు చేస్తున్న జాతీయ ఉపాధి హామీ జాబ్ కార్డులు ఇప్పటి వరకూ అందరికీ ఒకే రంగులో ఉండేవి. ఉపాధి హామీ కూలీల కేటగిరీలకు అనుగుణంగా మూడు రంగుల్లో ఉపాధి హామీ జాబ్ కార్డులను జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. వయొలెట్ రంగులో సాధారణ కూలీ కుటుంబాలకు, స్కై బ్లూ రంగులో దివ్యాంగులకు, ఏజెన్సీ ప్రాంతాల్లో ప్రధానంగా గిరిజన కూలీ కుటుంబాలకు ఆకుపచ్చ రంగులో ఉపాధి హామీ జాబ్ కార్డులు కొత్తగా ముద్రించనున్నారు. 2026 మార్చి లోపు కేటగిరీల వారీగా ఉపాధి హామీ కూలీలకు కొత్త జాబ్ కార్డుల ముద్రణ పూర్తి చేయాలని సర్కార్ భావిస్తోంది. గతంలో మాదిరిగా కాకుండా ప్రస్తుత సాంకేతికతకు అనుగుణంగా జాబ్ కార్డులపై క్యూఆర్ కోడ్ ముద్రిస్తారు. ఐఈసీ (ఇన్‌ఫర్మేషన్, ఎడ్యుకేషన్ అండ్ కమ్యూనికేషన్) టూల్ పద్ధతిలో ఉపాధి హామీ జాబ్ కార్డులు ముద్రిస్తారని సమాచారం. ఉపాధి హామీ కూలీలు, వారి కుటుంబాల సమగ్ర సమాచారం తెలిగ్గా అందుబాటులోకి వచ్చేలా కొత్త ఉపాధి హామీ జాబ్ కార్డులు రూపొందించనున్నారు.

తెలంగాణలో మరో ఎమ్మెల్సీ ఎన్నిక

హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ .. ఎన్నికకు షెడ్యూలు విడుదల చేసిన ఈసీ

న్యూఢిల్లీ/హైదరాబాద్/హైదరాబాద్ సిటీ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో మరో ఎమ్మెల్సీ స్థానానికి ఎన్నికకు రంగం సిద్ధమైంది. హైదరాబాద్ స్థానిక సంస్థల కోటా ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదలైంది. ఏప్రిల్ 23న ఈ ఎన్నిక నిర్వహించనున్నట్టు కేంద్ర ఎన్నికల సంఘం సోమవారం ప్రకటించింది. ఇందుకు సంబంధించి ఈ నెల 28న నోటిఫికేషన్ ఇవ్వనున్నట్టు తెలిపింది. హైదరాబాద్ స్థానానికి ప్రస్తుతం ఎమ్మెల్సీగా ఉన్న ఎంఎస్ ప్రభాకర్ రావు పదవీకాలం మే 1తో ముగియనున్న నేపథ్యంలో ఏప్రిల్ 29లోపు ఎన్నికల ప్రక్రియను ముగించనున్నట్టు ఈసీ పేర్కొంది. ఏప్రిల్ 4 వరకు నామినేషన్ల స్వీకరణ, ఏప్రిల్ 7న నామినేషన్ల పరిశీలన ఉంటుందని తెలిపింది. నామినేషన్ల ఉపసంహరణకు ఏప్రిల్ 9 వరకు గడువు ఇవ్వనున్నట్టు వెల్లడించింది. అనంతరం ఏప్రిల్ 23న ఉదయం 8 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ జరుగుతుందని, 25న ఓట్ల లెక్కింపు ఉంటుందని తెలిపింది. కాగా, ఎమ్మెల్సీ ఎన్నికకు షెడ్యూల్ విడుదల కావడంతో జీహెచ్ఎంసీ అధికారులు.. హైదరాబాద్ జిల్లా ప్రజాప్రతినిధుల(ఓటర్ల) లెక్కలు తేల్చేందుకు కసరత్తు చేస్తున్నారు. రాజ్యసభ/లోక్‌సభ సభ్యులు, ఎమ్మెల్యేలు, కార్పొరేటర్ల విషయంలో ఇబ్బంది లేనప్పటికీ.. ఎంత మంది ఎమ్మెల్సీలు హైదరాబాద్ జిల్లాను ఆప్షన్‌గా ఎంచుకున్నారన్న దానిపై అస్పష్టత నెలకొంది. ఇందుకోసం బల్దియాలోని ఎన్నికల విభాగం, కార్యదర్శి కార్యాలయ అధికారులు సోమవారం అసెంబ్లీకి వెళ్లారు. అయితే శాసనసభ సమావేశాలు జరుగుతున్నందున మంగళవారం రావాల్సిందిగా వారికి సూచించినట్టు సమాచారం.

ఓటర్లుగా 115 మంది ప్రజాప్రతినిధులు?

జీహెచ్‌ఎంసీలో ప్రస్తుతం 146 మంది కార్పొరేటర్లు ఉండగా.. హైదరాబాద్ జిల్లా పరిధిలోని కార్పొరేటర్ల సంఖ్య 84. వీరిలో గుడిమల్కాపూర్, ఎర్రగడ్డ కార్పొరేటర్లు మరణించారు. ఎంఐఎంకు చెందిన శాస్త్రిపురం, మెహిదీపట్నం కార్పొరేటర్లు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. దీంతో ప్రస్తుతం జిల్లా పరిధిలో 80 మంది కార్పొరేటర్లున్నారు. ఇద్దరు ఎంపీలు (హైదరాబాద్, సికింద్రాబాద్), నలుగురు రాజ్యసభ సభ్యులు, 15 మంది ఎమ్మెల్యేల లెక్క తేలింది. ఎమ్మెల్సీల సంఖ్యపై స్పష్టత రానప్పటికీ.. జీహెచ్‌ఎంసీ ఎన్నికల విభాగం వర్గాలు మాత్రం 14 మంది ఉండవచ్చని సూత్రప్రాయంగా చెబుతున్నాయి. ప్రస్తుత అంచనా ప్రకారం జిల్లాలో ఓటర్లుగా ఉన్న ప్రజాప్రతినిధుల సంఖ్య 115గా ఉంది. ఇక ఇటీవల ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీలుగా ఎన్నికైన వారిలో ఇద్దరు హైదరాబాద్ జిల్లా పరిధిలోకి వచ్చే అవకాశముందని సమాచారం. దీంతో మొత్తం ఓటర్ల సంఖ్య మారే అవకాశం లేకపోలేదు. సూత్రప్రాయ ఓటర్లలో అత్యధికంగా ఎంఐఎం బలం-52గా ఉంది. బీజేపీ కార్పొరేటర్లు -17, బీఆర్ఎస్-14, కాంగ్రెస్-7 ఉన్నారు. బీజేపీకి ఒక ఎంపీ, ఎమ్మెల్యే ఉండగా.. బీఆర్‌ఎస్ నుంచి ఐదుగురు ఎమ్మెల్యేలు, కాంగ్రెస్‌కు ఇద్దరు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఎమ్మెల్సీల లెక్క తేలిన అనంతరం ఏ పార్టీ బలం ఎంతన్న దానిపై స్పష్టత వస్తుందని ఎన్నికల విభాగం వర్గాలు చెబుతున్నాయి. ప్రస్తుత రాజకీయ పరిణామాల నేపథ్యంలో హైదరాబాద్ స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నిక ప్రాధాన్యం సంతరించుకుంది.

యాసంగి ధాన్యం కొనుగోళ్లకు శ్రీకారం!

- రాష్ట్రవ్యాప్తంగా 8,128 కొనుగోలు కేంద్రాలు



నల్లగొండలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

హైదరాబాద్, నల్లగొండ, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లకు రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. రాష్ట్ర రోడ్లు, భవనాలశాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సోమవారం నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఆర్జాల బావి కొనుగోలు కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. రాష్ట్రవ్యాప్తంగా 8,128 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని రాష్ట్రప్రభుత్వం నిర్ణయించింది. వ్యవసాయ, పౌరసరఫరాలశాఖల అధికారులు ఇచ్చే నివేదికలకు అనుగుణంగా ఎక్కడికక్కడ ధాన్యం కొనుగోలు కేంద్రాల ప్రారంభానికి జిల్లా కలెక్టర్‌లకు అధికారం ఇచ్చింది. యాసంగి (2024-25) సీజన్‌లో 137 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని రాష్ట్ర వ్యవసాయశాఖ అంచనా వేసింది. అందులో 60/ 70 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం.. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలకు వస్తుందని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే, కేంద్ర ప్రభుత్వం యాసంగిలో 52 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం సేకరణకు మాత్రమే అనుమతి ఇచ్చింది. ఏ-గ్రేడ్ రకం క్వింటాల్ ధాన్యానికి రూ.2,320 కాగా, సాధారణ రకం క్వింటాల్ ధాన్యానికి రూ.2,300 కనీస మద్దతు ధర ఉంది. సన్నరకం ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.500 బోనస్ కలిపి చెల్లిస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ నేపథ్యంలో రైతులు తీసుకొచ్చిన ధాన్యం మొత్తం కొనుగోలు చేయడానికి ఏర్పాట్లు పూర్తి చేసింది. రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన 8,128 కొనుగోలు కేంద్రాల్లో.. ప్రాథమిక సహకార సంఘాల (పీఏసీఎస్) ఆధ్వర్యంలో 4,455, స్వయం సహాయ సంఘాలు 3,084, మెప్మా 679 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేస్తుంది. ధాన్యం కొనుగోళ్లలో నల్లగొండ జిల్లాను రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలుపుతామని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. నల్లగొండలోని ఆర్జాల బావి వద్ద ఏర్పాటైన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సోమవారం ఆయన ప్రారంభిస్తూ ధాన్యం విక్రయాల్లో రైతులు ఇబ్బంది పడొద్దన్నారు. ప్రతి ధాన్యపు గింజను ప్రభుత్వమే కొనుగోలు కేంద్రాల వద్ద కొనుగోలు చేస్తామని తెలిపారు.

వారంలో విస్తరణ!

(మొదటిపేజీ తరువాయి)

వర్గానికి చెందిన వాకాటి శ్రీహరి, ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన సుదర్శన్‌రెడ్డిల పేర్లు ప్రధానంగా చర్చకు వచ్చినట్టు తెలిసింది. సుదర్శన్ రెడ్డికి అవకాశం ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పట్టుబట్టినట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. సుదీర్ఘంగా చర్చించిన తర్వాత నెలకొన్న పరిస్థితిలో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి, గడ్డం వివేక్, వాకాటి శ్రీహరి ముదిరాజ్, సుదర్శన్ రెడ్డి పేర్లు ముందు వరసలో ఉన్నట్టు ఆ పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. రాష్ట్ర మంత్రివర్గంలో మొత్తం ఆరుగురికి చోటు కల్పించే అవకాశం ఉన్నప్పటికీ ప్రస్తుతానికి నలుగురికే చోటు కల్పించాలని నిర్ణయించినట్లు తెలుస్తోంది. మరో రెండు మంత్రి పదవుల భర్తీపై ఎలాంటి చర్చా జరగలేదని పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. మంత్రివర్గంలో ఎస్టీకి అవకాశం కల్పించాలనే డిమాండ్ కీలకంగా వినిపిస్తోంది. దీనిపైనా చర్చ జరిగినట్టు సమాచారం. మంత్రివర్గంలో ఎస్టీ లంబాడా సామాజిక వర్గానికి అవకాశం కల్పించలేని పక్షంలో డిప్యూటీ స్పీకర్‌గా అవకాశం ఇస్తారని జోరుగా ప్రచారం జరుగుతోంది. పీసీసీ, కార్పొరేషన్ పదవులపైనా చర్చ జరిగినట్టు తెలిసింది. మంత్రివర్గ విస్తరణ విషయంలో కాంగ్రెస్ అధిష్ఠానానిదే తుది నిర్ణయమని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. విస్తరణ, పీసీసీ పదవులు, సంక్షేమ పథకాలపై అధిష్ఠానం పెద్దలతో చర్చించామన్నారు. అన్ని విషయాలను వారికి వివరించామని అన్నారు. ఏఐసీసీ బయట ఆయన మీడియాతో మాట్లాడారు. ఏడాదిన్నర పాలనలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ వివరాలు అడిగి తెలుసుకున్నారని చెప్పారు. ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని రాహుల్ చెప్పారన్నారు. రాష్ట్రంలో ఆ రెండూ అమలు అవుతున్న తీరును ఆరా తీశారని చెప్పారు. సమీకృత గురుకులాల గురించి అడిగి తెలుసుకున్నారని చెప్పారు. కార్పొరేషన్ ఛైర్మన్లు, బోర్డుల నియామకంపై కూడా చర్చ జరిగిందని వెల్లడించారు. త్వరలోనే అధిష్ఠానం నిర్ణయం తీసుకుంటుందన్నారు. మంత్రివర్గ విస్తరణ, పీసీసీ కార్యవర్గాలపై అధిష్ఠానంతో ఇదే చివరి సమావేశమని ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు.

అపోలో ఆస్పత్రికి సీఎస్‌సీ సర్టిఫికెట్

హైదరాబాద్ సిటీ, మార్చి 24(ఆంధ్రజ్యోతి): జూబ్లీహిల్స్‌లోని అపోలో ఆస్పత్రిలో పక్షవాత బాధితులకు అందిస్తున్న సేవలను గుర్తించి కాంప్రెహెన్సివ్ స్ట్రోక్ సెంటర్ (సీఎస్‌సీ) సర్టిఫికెట్‌ను అమెరికన్ హార్ట్ అసోసియేషన్(ఏహెచ్‌ఏ) అందజేసింది. దేశంలో ఈ తరహా సర్టిఫికెట్ పొందిన మొదటి ఆస్పత్రిగా నిలిచినట్లు అపోలో ఆస్పత్రుల గ్రూప్ జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ సంగీతారెడ్డి తెలిపారు. ఈ సర్టిఫికెట్ పొందడం తమ బాధ్యతను మరింత పెంచిందన్నారు. పక్షవాత లక్షణాలు కనిపించిన నాటి నుంచి రీ హాబిలిటేషన్, స్ట్రోక్ తర్వాత రికవరి అయ్యేంత వరకు రోగులకు సేవలు అందించడం కీలకమన్నారు.

గ్రూప్-1... పునఃమూల్యాంకనం చేయాలి

- హైకోర్టులో పిటిషన్.. టీజీపీఎస్సీకి నోటీసులు జారీ

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): గ్రూప్-1 మెయిన్స్ పరీక్ష పత్రాలను పునఃమూల్యాంకనం చేసేలా ఆదేశాలు జారీచేయాలని కోరుతూ హైకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఎస్.నరేశ్ మరో 22 మంది అభ్యర్థులు ఈ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్ నామవరపు రాజేశ్వర్‌రావు ధర్మాసనం విచారణ చేపట్టింది. పేపర్లు దిద్దడానికి టీజీపీఎస్సీ నియమించిన ఇవాల్యుయేటర్లు ఆయా సబ్జెక్టుల్లో విషయ నిపుణులు కాదని పిటిషనర్ల తరఫు న్యాయవాది పేర్కొన్నారు. మూల్యాంకనకర్తలకు అటు తెలుగు గానీ ఇటు ఉర్దూ కానీ రాదని.. వారు ఇక్కడి విషయ నిపుణులు కాదని తెలిపారు. టీజీపీఎస్సీ మార్చి 13న ఇచ్చిన పత్రికా ప్రకటనలో దేశవ్యాప్తంగా 12 సబ్జెక్టుల్లో నిపుణులైన 351 మూల్యాంకనకర్తలను నియమించినట్లు తెలిపిందని, కానీ పరీక్షల్లో మొత్తం 18 సబ్జెక్టులు ఉన్నాయని పేర్కొన్నారు. దీనిపై టీజీపీఎస్సీ న్యాయవాది పీఎస్ రాజశేఖర్ వాదిస్తూ.. ఫలితాలు ఇంకా విడుదలే కాలేదని.. ఈ దశలో పిటిషన్ వేయడం తొందరపాటు చర్య అవుతుందని పేర్కొన్నారు. వాదనలు విన్న ధర్మాసనం.. వివరణ ఇవ్వాలని పేర్కొంటూ రాష్ట్ర ప్రభుత్వం, టీజీపీఎస్సీకి నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణ ఏప్రిల్ 21కి వాయిదా పడింది.

ఐపీఎస్ అభిషేక్ మహంతికి హైకోర్టులో ఊరట

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ, తెలంగాణ మధ్య అఖిల భారత అధికారుల క్యాడర్ వివాదంలో ఉన్న ఐపీఎస్ అభిషేక్ మహంతికి సోమవారం హైకోర్టులో ఊరట లభించింది. సెంట్రల్ అడ్మినిస్ట్రేటివ్ ట్రిబ్యునల్ (క్యాట్)లో కేసులో తుది తీర్పు వెలువడే వరకు ఆయన తెలంగాణ సర్వీసుల్లోనే కొనసాగవచ్చని ఆదేశాలు జారీచేసింది. ఏపీ క్యాడర్‌లో చేరాలని కేంద్ర ప్రభుత్వం జారీచేసిన ఉత్తర్వులను అభిషేక్ మహంతి క్యాట్‌లో సవాల్ చేశారు. తెలంగాణలోనే ఉండే విధంగా క్యాట్ మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వకపోవడంతో హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. వాదనలు విన్న ధర్మాసనం.. ఈ మేరకు తీర్పునిచ్చింది.

ప్రభాకర్‌రావు బెయిల్‌పై స్పందన ఏంటి?

ఫోన్ ట్యాపింగ్ కేసులో ప్రధాన నిందితుడు, ఎస్ఐబీ మాజీ చీఫ్ ప్రభాకర్‌రావు దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌లో స్పందన తెలియజేయాలని ఆదేశిస్తూ హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వానికి నోటీసులు జారీచేసింది. తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ప్రభాకర్‌రావు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ శ్రీనివాసరావు ధర్మాసనం.. ప్రభుత్వ వివరణ తెలియజేయాలని ఆదేశించింది.

జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువు పెంపు

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జిల్లా జర్నలిస్టుల అక్రిడిటేషన్ కార్డుల గడువును ప్రభుత్వం మరో 3 నెలల పాటు పొడిగించింది. ఈమేరకు సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్ ఎస్.హరీశ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇదివరకు జర్నలిస్టు కార్డులకు పొడిగించిన గడువు ఈ నెల 31తో ముగియనుంది. ఈ మేరకు కార్డుల గడువును ఏప్రిల్ 1 నుంచి జూన్ 30 వరకు పొడిగిస్తున్నామని తెలిపారు. వీటి ఆధారంగా బస్ పాస్‌లు జారీ చేయాలని ఆర్టీసీని కోరారు. ప్రభుత్వ మార్గదర్శకాలు వచ్చాక కొత్త అక్రిడిటేషన్ కార్డులు ఇస్తామన్నారు.

ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్‌లో ఇక డ్రిల్లింగ్.. బ్లాస్టింగ్!

సొరంగం తవ్వకాన్ని కొనసాగించేందుకు, ప్రస్తుత సహాయక చర్యలకు ఇదే విధానం

- సీఎం రేవంత్‌కు అధికారుల ప్రతిపాదన
- నిపుణుల కమిటీని నియమించి, కేంద్రం అనుమతి పొందాలన్న సీఎం

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమగట్టు కాలువ (ఎస్‌ఎల్‌బీసీ) టన్నెల్‌లో ఇకపై డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానం అనుసరించాలని ప్రభుత్వం సూత్రప్రాయంగా నిర్ణయించింది. సొరంగం తవ్వకం కొనసాగింపుతోపాటు ప్రస్తుతం టన్నెల్ ప్రమాదస్థలి వద్ద చేపడుతున్న సహాయక చర్యల్లో కూడా ఈ విధానాన్ని అమలు చేయాలన్న నిర్ణయానికి వచ్చింది. సోమవారం ఎస్‌ఎల్‌బీసీ టన్నెల్ సహాయక చర్యలపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అసెంబ్లీ కమిటీ హాలులో మంత్రులు ఉత్తమ్‌కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిలతో కలిసి సమీక్ష నిర్వహించారు. టన్నెల్ లోపల చిక్కుకున్న వారిని బయటికి తీసుకొచ్చేందుకు అవసరమైన సహాయక చర్యలు కొనసాగించాలని అధికారులను ఆదేశించారు. వీటిని నిరంతరం దగ్గరుండి పర్యవేక్షించేందుకు ఐఏఎస్ అధికారి శివ శంకర్ లోతేటిని ప్రత్యేకాధికారిగా నియమించాలని సీఎస్ శాంతికుమారికి సూచించారు. ఈ సందర్భంగా ప్రమాదస్థలిలో నెల రోజులుగా కొనసాగుతున్న సహాయక చర్యల పురోగతిని రెవెన్యూ (విపత్తు నిర్వహణ విభాగం) ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అర్వింద్‌కుమార్, ఆర్మీ కల్నల్ పరీక్షిత్ మెహ్రా.. ముఖ్యమంత్రికి వివరించారు. మొత్తం 700 మంది సిబ్బంది ఆపరేషన్‌లో నిమగ్నమైనట్లు తెలిపారు.

పవర్ పాయింట్ ప్రజెంటేషన్..

టన్నెల్‌లో ప్రమాదం జరిగిన నాటి పరిస్థితి, ప్రస్తుత పరిస్థితి, రెస్క్యూ ఆపరేషన్ జరుగుతున్న తీరుపై అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. శ్రీశైలం (ఇన్‌లెట్) నుంచి సొరంగంలో 14 కిలోమీటర్ల దూరంలో ప్రమాదం జరిగినందున.. గాలి, వెలుతురు తక్కువగా ఉండటంతో సహాయక చర్యలు చేపట్టడం సంక్లిష్టంగా మారిందని సీఎంకు తెలిపారు. ప్రమాదం జరిగిన ప్రాంతంలో 30 మీటర్ల మేర ప్రదేశాన్ని అత్యంత ప్రమాదకర జోన్‌గా గుర్తించినట్లు నివేదించారు. అయితే ప్రమాదంలో చిక్కుకున్న కార్మికుల ఆచూకీ తెలుసుకోవడానికి అత్యంత ప్రాధాన్యం ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు సూచించారు. ఇన్‌లెట్ వైపు నుంచి టీబీఎంను పూర్తిగా తొలగిస్తున్నందున.. ఇకపై డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానంలో టన్నెల్ తవ్వకం చేపట్టడం ఉత్తమమని అధికారులు నివేదించగా.. ఇందుకోసం అవసరమైన చర్యలు తీసుకోవాలని సీఎం నిర్దేశించారు. ఒక ఉన్నతస్థాయి నిపుణుల కమిటీ నివేదికతో కేంద్ర మంత్రిత్వశాఖల నుంచి డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానానికి అనుమతి తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.



సమీక్ష నిర్వహిస్తున్న సీఎం రేవంత్, మంత్రి ఉత్తమ్, జూపల్లి, పొంగులేటి

ఏప్రిల్ 10 కల్లా రెస్క్యూ ఆపరేషన్ పూర్తి..

టన్నెల్ ప్రమాదంలో చిక్కుకున్న వారిలో ఇప్పటికి ఒక్కరి మృతదేహం మాత్రమే లభ్యమైన నేపథ్యంలో.. మిగిలిన ఏడుగురి ఆచూకీ కనుగొనేందుకు ఎంత సమయం పడుతుందని సీఎం రేవంత్ ఆరా తీశారు. దీంతో ఏప్రిల్ 10వ తేదీ కల్లా రెస్క్యూ ఆపరేషన్ పూర్తవుతుందని అధికారులు తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్‌కు కూడా డ్రిల్లింగ్, బ్లాస్టింగ్ విధానమే మేలు అని అధికారులు చెప్పగా.. వెంటనే నిపుణుల కమిటీని వేసి అనుమతులు సాధించాలని సీఎం అన్నారు. ఇదిలా ఉండగా.. ఇన్‌లెట్ టీబీఎంపైనే టన్నెల్ పైకప్పు కూలడంతో ఇప్పటికే అది దాదాపుగా ధ్వంసమయిందని అధికారులు తెలిపారు. దాని భాగాలను కట్ చేస్తున్నామని చెప్పారు. ఆ స్థానంలో కొత్త టీబీఎం కాకుండా ఇన్‌లెట్ వైపు పూర్తిగా సొరంగం తవ్వకానికి డ్రిల్లింగ్ అండ్ బ్లాస్టింగ్ విధానం అనుసరించాలని అన్నారు. ఔట్‌లెట్ వైపు మాత్రమే టీబీఎంకు త్వరలో బేరింగ్‌ను అమర్చి వినియోగించాలని నివేదించగా.. సీఎం అంగీకరించారు. ఈ సమావేశంలో తెలంగాణ, ఆంధ్రా సబ్ ఏరియా జనరల్ ఆఫీసర్ కమాండింగ్ అజయ్ మిశ్రా, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్యనాథ్ దాస్, సింగరేణి సీఎండీ ఎన్.బలరాం, ఎన్డీఆర్ఎఫ్, ఎస్డీఆర్ఎఫ్, ఎన్జీఆర్ఐ, జీఎస్ఐ, సింగరేణి, హైడ్రా, ఫైర్ సర్వీసెస్ ప్రతినిధులు, ఎస్‌ఎల్బీసీ పనులు చేపడుతున్న కాంట్రాక్టు కంపెనీ జేపీ అసోసియేట్స్ ఎండీ పంకజ్‌గౌర్, నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్, ఎస్పీ పాల్గొన్నారు.

కరువు ప్రాంతాలకు ఒక్క పంట నీరివ్వండి

- 811 టీఎంసీల్లో 575 టీఎంసీలు కేటాయించాలి
- కృష్ణా ట్రైబ్యునల్‌లో తెలంగాణ వాదన

హైదరాబాద్, మార్చి 24 (ఆంధ్రజ్యోతి): కరువు పీడిత ప్రాంతాల్లో ఒక్క పంటకు నీరు ఇవ్వాలని తెలంగాణ కోరింది. ఏపీలాగా రెండో, మూడో పంటకు నీరు కావాలనడం లేదని గుర్తు చేసింది. ఉమ్మడి ఏపీకి బచావత్ ట్రైబ్యునల్ (కృష్ణా ట్రైబ్యునల్-1) కేటాయించిన 811 టీఎంసీల్లో 575 టీఎంసీలను తెలంగాణకు న్యాయమైన వాటా కింద కేటాయించాలని నివేదించింది. కృష్ణా జలాల కేటాయింపు విషయమై సోమవారం కృష్ణా ట్రైబ్యునల్-2 (జస్టిస్ బ్రిజేష్ కుమార్ ట్రైబ్యునల్) ముందు తెలంగాణ న్యాయవాదులు ఎస్ఓసీ దాఖలు చేశారు. ఈ విషయమై సోమవారం మొదలైన తుది వాదనలు ఈ నెల 26న ముగుస్తాయి. ఏపీలో కృష్ణా నదీ జలాల్లో 323 టీఎంసీలను బేసిన్ ఆవలి ప్రాంతాలకు తరలిస్తున్నారని తెలంగాణ వాదించింది. తెలంగాణ 1,12,077 చదరపు కి.మీ విస్తీర్ణంలో ఉండగా, అందులో 52,232 చదరపు కి.మీ కృష్ణా బేసిన్ పొడవునే ఉందని గుర్తు చేసింది. తెలంగాణలో కృష్ణా బేసిన్ వెంట రెండు కోట్ల మంది నివసిస్తుండగా, ఏపీలో 76లక్షల మందే నని పేర్కొంది. ఏపీ 36.45 లక్షల హెక్టార్ల భూమి సాగవుతుంటే.. 15.3 లక్షల హెక్టార్లలో మాత్రమే కరువు పీడిత ప్రాంతం ఉందని ట్రైబ్యునల్‌కు తెలంగాణ న్యాయవాదులు నివేదించారు. కృష్ణా నదీ పరివాహక ప్రాంతంలోని పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుల్లో నీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు తెలిపారు. బేసిన్ అవసరాలు తీరిన తర్వాతే అవతలి ప్రాంతాలకు తరలించాలని స్పష్టం చేశారు. ఏపీలో 40 బేసిన్‌లు ఉన్నాయని.. అందులో పెన్నా బేసిన్‌కు 344 టీఎంసీల నీటి లభ్యత ఉన్నా కృష్ణా బేసిన్ నుంచి 332 టీఎంసీల నీటిని తరలిస్తున్నదని పేర్కొన్నారు. బచావత్ ట్రైబ్యునల్ ప్రకారం ఏపీలో తలసరి నీటి లభ్యత 1892 క్యూబిక్ మీటర్లు ఉంటే, తెలంగాణలో 422 క్యూబిక్ మీటర్లేనని తెలిపారు. కనుక అంతర్జాతీయ ప్రమాణాల ప్రకారం తెలంగాణకు 575 టీఎంసీల నీటిని కేటాయించాలని వాదించారు. తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది సీఎస్ వైద్యనాథన్, ఏపీ నుంచి జయదీప్ గుప్తా వాదించారు.

స్పీకర్ తేల్చాకే..!

(మొదటిపేజీ తరువాయి)

అసంబద్ధమైనవని వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని పదో షెడ్యూలులోని క్లాజు 6 కింద స్పీకర్‌కు ఫిరాయింపులపై నిర్ణయం తీసుకునేందుకు పూర్తి అధికారాలున్నాయని పేర్కొన్నారు. పిటిషనర్లు తమ ఇష్టానుసారం చట్టాన్ని అన్వయించే ప్రయత్నాలు చేయడాన్ని గమనించాలని అసెంబ్లీ కార్యదర్శి కోర్టుకు విజ్ఞప్తి చేశారు. అసెంబ్లీ సమావేశమై 15 నెలలు కూడా పూర్తి కాలేదని, అసెంబ్లీ పదవీకాలం ముగిసేలోపు అనర్హత పిటిషన్లపై నిర్ణయం తీసుకోబోరన్న ఆరోపణల్లో పసలేదని స్పష్టం చేశారు. ఫిరాయించిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలని స్పీకర్‌ను ఆదేశించాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై జస్టిస్ గవాయి, జస్టిస్ జార్జి మైస్‌లతో కూడిన సుప్రీంకోర్టు ధర్మాసనం ఇటీవల స్పందించి, ఎప్పట్లోగా స్పీకర్ నిర్ణయం తీసుకుంటారో చెప్పాలంటూ నోటీసులు పంపింది. ఈ కేసు మంగళవారం సుప్రీంకోర్టులో విచారణకు రానుంది.

విశేషాధికారాలున్నాయి

స్పీకర్‌కు విశేషాధికారాలు ఉన్నాయంటూ గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన పలు తీర్పులను అసెంబ్లీ కార్యదర్శి ఉటంకించారు. మణిపూర్ ఎమ్మెల్యే ఫిరాయింపు కేసులో 1992లో సుప్రీంకోర్టు ఇచ్చిన చరిత్రాత్మక తీర్పులో స్పీకర్‌కే నిర్ణయం తీసుకునే విశేషాధికారాలున్నాయని పేర్కొన్నారని గుర్తు చేశారు. స్పీకర్ నిర్ణయం తీసుకునేలోపు ఏ న్యాయపరమైన పరిష్కారానికి తావు లేదని సుప్రీంకోర్టు ఇప్పటికే తీర్పునిచ్చిందని ప్రస్తావించారు. స్పీకర్ అనర్హతలపై నిర్ణయం తీసుకున్న తర్వాతే న్యాయ పరిష్కారానికి అవకాశం ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. గోవా అసెంబ్లీ స్పీకర్ అనుసరించిన పరిష్కార ప్రక్రియను సవాలు చేస్తూ దాఖలైన స్పెషల్ లీవ్ పిటిషన్‌ను ఇదే సుప్రీంకోర్టు కొట్టేసిందని గుర్తు చేశారు. అసాధారణ పరిస్థితుల్లో తప్ప ఫిరాయింపులపై స్పీకర్‌దే తుది నిర్ణయమని సుభాష్ దేశాయ్ కేసులో ఇచ్చిన తీర్పును కూడా ప్రస్తావించారు. స్పీకర్ నిర్ణయం ఆలస్యం కావడంపై ఏం చేయాలన్న దానిపై రాజ్యాంగ బెంచ్‌కు నివేదించాలని కాలె యాదయ్య ఫిరాయింపు కేసులో సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చిన విషయాన్ని కూడా ఉటంకించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే, దురుద్దేశంతో బీఆర్ఎస్ నేతలు హైకోర్టును, సుప్రీంకోర్టును ఆశ్రయించారని, వాస్తవాలను కోర్టు ముందు దాచి పెట్టారని చెప్పారు. ఆర్టికల్ 136 కింద సుప్రీంకోర్టు ప్రత్యేకాధికారాలు ఉపయోగించి జోక్యం చేసుకోదగ్గ కారణాలను వేటినీ పిటిషనర్లు న్యాయస్థానం ముందు ఉంచలేక పోయారని తెలిపారు. 2024 మార్చిలో దానం నాగేందర్‌పై పాడి కౌశిక్ రెడ్డి, ఏప్రిల్‌లో కడియం శ్రీహరి, వెంకటరావుపై కేపీ వివేకానంద స్పీకర్ దగ్గర ఫిర్యాదు చేశారన్నారు. అదే నెలలో వారు హైకోర్టును కూడా ఆశ్రయించారని చెప్పారు. నాలుగు వారాల్లో నిర్ణయం తీసుకోవాలని సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పుపై తాము డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా.. హేతుబద్ధమైన సమయంలో నిర్ణయం తీసుకోవాలని స్పీకర్‌ను ఆదేశించిందని ప్రస్తావించారు. అనంతరం ముగ్గురు ఎమ్మెల్యేలకు జనవరి 16న, ఏడుగురు ఎమ్మెల్యేలకు ఫిబ్రవరి 4న నోటీసులు పంపారని తెలిపారు. వారంతా సమయం కోరుతూ లేఖలు రాశారన్నారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda press, Sy no.1054, Andhrajyothi Building, Madikonda Village, Khazipet Mandal, Hanamkonda (Dist), Pin. 506142, Editor: **N.Rahul Kumar.** Ph. No. (0870) 2100480/84, RNI No:APTEL/2003/9741, **Managing Director : Vemuri Radha Krishna** Founder: K.L.N.Prasad.